సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 262

శుక్రవారం 13-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో గురువారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఏడు గంటలపాటు సాగిన హోరాహోరీ కాల్పుల్లో ఇద్దరు మహిళలు సహా ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు.

- వివరాలు 6లో



పార్లమెంట్‌లో అదే రగడ

పార్లమెంట్ ఉభయ సభల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య రగడ కొనసాగింది. వాగ్వాదాలు, నిరసనలు, నినాదాలతో రాజ్యసభ, లోక్‌సభ గురువారం పలుమార్లు వాయిదా పడ్డాయి.

- వివరాలు 6లో

జమిలి బిల్లుకు సై

'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' ముసాయిదా బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర

రాజ్యాంగ సవరణ బిల్లుకు సైతం మంత్రివర్గం ఆమోదం

జమిలి నుంచి ప్రస్తుతానికి స్థానిక సంస్థలకు మినహాయింపు

శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంట్ ముందుకు జమిలి బిల్లు

- జాయింట్ పార్లమెంటరీ కమిటీకి సిఫార్సు చేయనున్న ప్రభుత్వం
- రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లతో పాటు మేధావులు, నిపుణుల నుంచి అభిప్రాయ సేకరణ
- భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా విస్తృతస్థాయిలో సంప్రదింపులు
- వచ్చే ఏడాది పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బిల్లుపై ఓటింగ్ జరిగే అవకాశం
- జమిలిపై ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రులకు ప్రధాని మోదీ సూచన
- 2027లో ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని కేంద్రం యోచన



దేశంలో జమిలి ఎన్నికల దిశగా మరో ముందడుగు పడింది. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' ముసాయిదా బిల్లుకు కేంద్ర మంత్రివర్గం గురువారం ఆమోద ముద్ర వేసింది. జమిలి ఎన్నికల నిర్వహణకు వీలుగా రాజ్యాంగ సవరణకు ఉద్దేశించిన 'రాజ్యాంగ 129 (సవరణ) బిల్లు'ను సైతం ఆమోదించింది. ఈ రెండు బిల్లులను ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి జేపీసీ పరిశీలనకు పంపించనున్నారు. భాగస్వామ్యపక్షాలతో సంప్రదింపులు, అభిప్రాయ సేకరణ తర్వాత వచ్చే ఏడాది పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో జమిలి ఎన్నికల బిల్లుపై ఓటింగ్ జరిగే అవకాశం ఉంది.

- వివరాలు 6లో

ప్రజాధనం ఆదా: బీజేపీ | **జనం దృష్టి మళ్లింపునకే: కాంగ్రెస్**

ఆ ఉత్తర్వులు, తీర్పులు వద్దు

'ప్రార్థనా స్థలాల యథాతథ స్థితి' కేసులపై దేశంలోని అన్ని కోర్టులకు సుప్రీంకోర్టు కీలక సూచన

- మేం తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ప్రార్థనా స్థలాల చట్టంపై పిటిషన్లు తీసుకోవద్దు
- పెండింగ్ కేసులపై మధ్యంతర ఉత్తర్వులొద్దని స్పష్టీకరణ

6లో



'భరణం' నిర్ణయానికి 8 సూత్రాలు

విడాకుల కేసు నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు

- దేశవ్యాప్తంగా కోర్టులకు దిశానిర్దేశం
- ఓ విడాకుల కేసులో భరణం కింద రూ.5 కోట్లు చెల్లించాలని భర్తకు ఆదేశం
- బెంగళూరు టెకీ ఆత్మహత్యతో కీలకంగా మారిన 'భరణం'

వివరాలు 6లో▶

'లగచర్ల' రైతుకు బేడీలు!



గురువారం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో చేతికి బేడీలతో హీర్యానాయక్

జైలులో ఛాతీనొప్పితో అస్వస్థతకు గురైన హీర్యానాయక్.. చేతులకు బేడీలు వేసి, గొలుసుతో కట్టి సంగారెడ్డి ఆస్పత్రికి తరలించిన పోలీసులు

- మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలింపు.. ఆరోగ్యం బాగోలేని రైతుకు సంకెళ్లు వేయడం ఏమిటనే విమర్శలు
- ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్.. జైలర్ సంజీవరెడ్డి సస్పెన్షన్.. సంగారెడ్డి జైలు సూపరింటెండెంట్‌పై విచారణకు ఆదేశం

గుండెనొప్పి వచ్చిన రైతుకు బేడీలా?
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు 2లో

సంగారెడ్డి/ సంగారెడ్డిటౌన్/దుద్యాల్/ సాక్షి, హైదరాబాద్: 'లగచర్ల'కేసులో అరెస్టయి జైలులో ఉన్న రైతు ఛాతీలో నొప్పితో అస్వస్థతకు గురైతే.. చేతులకు సంకెళ్లు వేసి, గొలుసుతో కట్టి ఆస్పత్రికి తరలించిన ఘటన కలకలం రేపింది. ఆరోగ్యం బాగోలేని రైతుకు బేడీలు వేయడం ఏమిటన్న ఆగ్రహం వ్యక్తమైంది. సంగారెడ్డి జైలులో అస్వస్థతకు గురైన రైతు హీర్యానాయక్‌ను జైలు అధికారులు, పోలీసులు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మరోవైపు రైతుకు బేడీల ఘటనపై సీఎం రేవంత్ సీరియస్‌గా స్పందించి, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదిక

మిగతా 2వ పేజీలో ▶



జగజ్జేత మన గుకేశ్

ప్రపంచ చెస్ రారాజుగా దొమ్మరాజు గుకేశ్

18 ఏళ్లకే వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన భారత గ్రాండ్‌మాస్టర్

విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన భారత ఆటగాడిగా గుర్తింపు

చివరి గేమ్‌లో డింగ్ లిరెన్‌పై గెలుపు

7.5-6.5 పాయింట్ల తేడాతో టైటిల్ కైవసం

పుష్కరకాలం నిరీక్షణ ముగిసింది. భారత చదరంగం మురిసింది. ప్రపంచ చెస్ సామ్రాజ్యానికి భారత్ నుంచి కొత్త రారాజు వచ్చాడు. ఆంధ్రప్రదేశ్ మూలాలు ఉన్న తమిళనాడు యువ తార దొమ్మరాజు గుకేశ్ క్లాసికల్ చెస్ ఫార్మాట్‌లో కొత్త ప్రపంచ చాంపియన్‌గా అవతరించాడు.

డిఫెండింగ్ చాంపియన్, 32 ఏళ్ల డింగ్ లిరెన్ (చైనా)తో సింగపూర్‌లో జరిగిన ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో 18 ఏళ్ల గుకేశ్ 7.5-6.5 పాయింట్లతో విజయాన్ని అందుకున్నాడు. ఇద్దరి మధ్య మొత్తం 14 గేమ్‌లు జరగ్గా.. గుకేశ్ 3 గెలిచి 2 ఓడాడు. మరో 9 'డ్రా'గా ముగిశాయి.

గురువారం జరిగిన చివరిదైన 14వ గేమ్‌లో గుకేశ్ 58 ఎత్తుల్లో డింగ్ లిరెన్‌ను ఓడించి వరల్డ్ టైటిల్‌ను ఖరారు చేసుకున్నాడు. తద్వారా పిన్న వయస్సులో ప్రపంచ చెస్ చాంపియన్ అయిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించడంతోపాటు విశ్వనాథన్ ఆనంద్ (చివరిసారి 2012లో) తర్వాత వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన రెండో భారతీయ చెస్ ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. విజేతగా నిలిచిన గుకేశ్‌కు 13 లక్షల 50 వేల డాలర్లు (రూ. 11 కోట్ల 45 లక్షలు), రన్నరప్ డింగ్ లిరెన్‌కు 11 లక్షల 50 వేల డాలర్లు (రూ. 9 కోట్ల 75 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

17లో

కేంద్రం సాయం చేసేలా సహకరించండి

రూ.1.63 లక్షల కోట్ల ప్రాజెక్టులపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో సీఎం రేవంత్

- రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులపై చర్చ
- ఆర్ఆర్ఆర్, మెట్రో ఫేజ్–2 తదితరాల ప్రస్తావన
- కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, ధర్మేంద్ర ప్రధాన్‌లతోనూ భేటీ



గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో వివిధ రకాల అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం సహకరించేలా కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి సంబంధించి మొత్తం రూ.1,63,559.31 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్రం నుంచి కావల్సిన చేయూతపై కిషన్‌రెడ్డితో చర్చించారు. ట్రిపుల్ ఆర్, హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2తో పాటు హైదరాబాద్, వరంగల్‌లో సీవరేజీ, భూగర్భ డ్రైనేజీ, సింగరేణి సంస్థకు బొగ్గు గనుల కేటాయింపు సహా పలు అంశాలను ప్రస్తావించారు. రాజస్తాన్‌లోని జైపూర్‌లో ఓ వివాహ కార్యక్రమానికి హాజరై ఢిల్లీ వచ్చిన సీఎం..గురువారం సాయంత్రం కిషన్‌రెడ్డితో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర

మిగతా 8వ పేజీలో ▶

క్లుప్తంగా...

రైల్వే స్టేషన్లను ఆధునీకరించండి

రైల్వే మంత్రికి ఎంపీ వంశీకృష్ణ విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అమృత్ భారత్ స్కీమ్‌లో పలు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ విజ్ఞప్తి చేశారు. తన పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి రైల్వే స్టేషన్ల ఆధునీకరణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈ మేరకు గురువారం వంశీకృష్ణ పార్లమెంటులో కేంద్రమంత్రిని కలిసి పలు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచిర్యాలలో వందేభారత్ రైలుకు హాల్టింగ్ కల్పించాలని కేంద్రమంత్రిని కోరినట్లు తెలిపారు. తాజా విజ్ఞప్తులపై అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. కాగా, గత బడ్జెట్ సమావేశాల్లో చేసిన విజ్ఞప్తులకు కేంద్రం సానుకూలంగా స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపానన్నారు.

తెలంగాణకు విపత్తు నిధులు ఇవ్వండి

లోక్‌సభలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, న్యూఢిల్లీ: విపత్తు సంభవించిన తర్వాత రాష్ట్రాలకు ఇచ్చే ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధుల విడుదల విషయంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం తగ్గించాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కోరారు. గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో జరిగిన ప్రకృతి విపత్తు కారణంగా తెలంగాణలో రూ.10 వేల కోట్ల నష్టం వాటిల్లగా.. అందులో రూ.2,300 కోట్ల విలువైన రహదారులున్నాయని తెలిపారు. కానీ ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదన్నారు. ప్రకృతి విపత్తు కారణంగా మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని తెలిపారు. తెలంగాణకు నిధుల విడుదలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన వినతిని పరిష్కరించేలా కేంద్ర మంత్రి బండి సంజయ్ చర్యలు చేపట్టి తెలంగాణకు న్యాయం జరిగేలా చూడాలని అసదుద్దీన్ కోరారు. తెలంగాణలో గత ప్రభుత్వం రూ.1,300 కోట్లు ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు వాడని కారణంగా ప్రస్తుత సీఎం చేతులు కట్టుకొని కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గురువారం లోక్‌సభలో విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లు–2024 చర్చలో ఒవైసీ మాట్లాడుతూ బిల్లును వ్యతిరేకించారు.

‘లగచర్ల’ రైతుకు బేడీలు!

▶ మొదటి పేజీ తరువాయి

ఇవ్వాలని ఆదేశించారు.

బుధవారమే అస్వస్థతకు గురైన రైతు

వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలంలో ఫార్మా విలేజీ వద్దని, తమ భూములు ఇవ్వబోమని గిరిజన రైతులు ఆందోళనకు దిగడం.. ‘లగచర్ల’గ్రామంలో కలెక్టర్ ఇతర అధికారులపై దాడి చేయడం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో అరెస్టయిన 45 మంది రైతులు సుమారు నెల రోజులుగా సంగారెడ్డి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వారిలో దుద్యాల్ మండలం పులిచర్లకుంట తండాకు చెందిన గిరిజన రైతు హీర్యానాయక్ బుధవారం సాయంత్రం ఛాతీలో నొప్పితో అస్వస్థతకు గురయ్యారు. ప్రాథమిక పరీక్షలు చేసిన జైలు వైద్యులు, అధికారులు.. చికిత్స కోసం గురువారం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే రైతును పోలీసు జీపులో.. చేతులకు బేడీలు వేసి, గొలుసుతో కట్టి తీసుకువచ్చారు. అలాగే బేడీలు, గొలుసుతో ఆస్పత్రి లోపలికి నడిపించుకుని తీసుకువెళ్లారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కలకలం చెలరేగింది.

మెరుగైన చికిత్స కోసం నిమ్స్ ఆస్పత్రికి...

సంగారెడ్డి ఆస్పత్రి వైద్యులు హీర్యానాయక్‌కు పలు వైద్య పరీక్షలు చేశారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. హీర్యానాయక్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని రిఫర్ చేశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. అక్కడి అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ఈ మేరకు జైలు అధికారులు, పోలీసులు హీర్యానాయక్‌ను నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. నిమ్స్ ఎమర్జెన్సీ యూనిట్‌లో కార్డియాలజీ వైద్యుల బృందం ఆయనకు చికిత్స అందిస్తున్నట్టు నిమ్స్ అధికారులు తెలిపారు. హీర్యానాయక్ వెంట ఆయన భార్య దేవిబాయి, ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారని వెల్లడించారు.



హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు హీర్యానాయక్

ఛాతీలో నొప్పి వస్తోందని రోదిస్తూ..

జైలులో ఉన్న హీర్యానాయక్ బుధవారం రాత్రి తండ్రి రూప్లానాయక్, తల్లి జెమినీబాయి, భార్య దేవిబాయిలతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ సమయంలో తనకు ఆరోగ్యం బాగోలేదని, ఛాతీలో నొప్పి వస్తోందని చెప్పాడని కుటుంబ సభ్యులు వెల్లడించారు. తనను ఎలాగైనా తీసుకెళ్లాలని, అక్కడే ఉంటే చనిపోయేలా ఉన్నానని రోదించాడని తెలిపారు. దీనితో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు గురువారం ఉదయం సంగారెడ్డికి బయలుదేరారు. అప్పటికే ఆయనను ఆస్పత్రికి తరలించారని తెలిసి, అక్కడికి వెళ్లారు. అయితే హీర్యానాయక్‌ను చూసేందుకు పోలీసులు చాలాసేపు అనుమతించలేదని కుటుంబ సభ్యులు మండిపడ్డారు. ఆయనను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. గుండె పోటుకు గురైన వ్యక్తికి ఇలా బేడీలు వేయడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు.

నా కొడుక్కి ఏం జరిగినా సీఎం బాధ్యత వహించాలి..



నా కొడుకును అనవసరంగా కేసులు పెట్టి జైలులో పెట్టారు. నా కొడుక్కి ఏమైనా జరిగితే సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలి. హీర్యాను వెంటనే విడుదల చేయాలి. ఆరోగ్యం బాగోలేనివారికి బేడీలు వేయడం ఏమిటి?

– రూప్లానాయక్, హీర్యానాయక్ తండ్రి

గుండె నొప్పి వచ్చిన రైతుకు బేడీలా?

రైతుల రాజ్యాంగ హక్కులు హరిస్తున్న సర్కారు: కేటీఆర్

- గిరిజన రైతులు జైళ్లలో ఉంటే.. సీఎం విందుల్లో
- హీర్యానాయక్‌కు బేడీలు వేయటంపై విచారణ జరపాలి
- రేవంత్ భూ దాహంతోనే జైళ్లలో అన్నదాతలు

సాక్షి, హైదరాబాద్: రిమాండ్ ఖైదీగా ఉన్న వికారాబాద్ జిల్లా లగచర్లకు చెందిన గిరిజన రైతు హీర్యానాయక్ చేతికి బేడీలు వేసి పోలీసులు ఆసుపత్రికి తీసుకురావటంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీ రామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. బంజారాహిల్స్ నందినగర్‌లోని తన నివాసంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గుండె నొప్పి వచ్చిన రైతుకు బేడీలు వేయడం అమానవీయమని, సీఎం రేవంత్ రెడ్డి క్రూర మనస్తత్వానికి ఈ ఘటన అద్దం పడుతోందని మండిపడ్డారు. సంగారెడ్డి జైలులో ఉన్న హీర్యానాయక్‌కు గుండె నొప్పి వచ్చినా వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించిందని విమర్శించారు. ఈ అంశాన్ని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని, రాష్ట్ర గవర్నర్ విచారణకు ఆదేశించాలని కోరారు. ‘రైతు గుండె నొప్పితో బాధపడుతున్న విషయాన్ని ప్రభుత్వం దాచిపెట్టే ప్రయత్నం చేసింది. జైలులో హీర్యా నాయక్‌తో పాటు రాఘవేంద్ర, బసప్ప అనే రైతులు కూడా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. బీఆర్‌ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డికి అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. అనారోగ్యంతో బాధపడుతున్న రైతును అంబులెన్సులో తీసుకురాకుండా బేడీలు వేసి మరీ ఆసుపత్రికి తెచ్చారు. రాజ్యాంగంలోని 14, 16, 19 ఆర్టికల్స్ ప్రకారం నిందితులకు బేడీలు వేయడం వారి హక్కులను హరించడమే. నూతన క్రిమినల్ చట్టం బీఎన్ఎస్‌తో పాటు పోలీసు, జైలు మాన్యువల్స్ ప్రకారం విచారణ ఖైదీల హక్కులను హరించడమే’అని కేటీఆర్ మండిపడ్డారు.



రైతు చేతికి బేడీలున్న చిత్రాన్ని మీడియాకు చూపుతున్న కేటీఆర్

రైతులు జైళ్లలో.. సీఎం రేవంత్ విందుల్లో..

తాము చెప్పిందే సాగాలనే రీతిలో సీఎం రేవంత్, ఆయన సోదరులు గిరిజనుల ప్రాణాలు తీస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ‘ఓ వైపు గిరిజన రైతులు జైళ్లలో ప్రాణాపాయ స్థితిలో ఉంటే, సీఎం మాత్రం జైపూర్‌లో విందు వినోదాలతో జల్సాలు చేసుకుంటూ చిందులు వేస్తున్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి మానవత్వం ఉంటే గిరిజనులపై కేసులు రద్దు చేయాలని సీఎంను ఆదేశించాలి. ప్రభుత్వానికి చేతకాకుంటే జైలులో ఉన్న గిరిజన రైతులకు బీఆర్‌ఎస్ తరఫున వైద్య సాయం అందిస్తాం. సీఎం అహం దెబ్బతిని మా పార్టీ నాయకుడు పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేయించారు. రైతులను పోలీసులు చిత్రహింసలకు గురి చేశారు. తన అల్లుడు, అదానీ కోసమే రేవంత్ ప్రభుత్వం రైతుల భూములు గుంజుకుంటోంది. రేవంత్ భూ దాహం, అహంకారంతో రైతులు నెల రోజులుగా జైళ్లలో మగ్గుతున్నారు’అని కేటీఆర్ మండిపడ్డారు. మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి భార్య శ్రుతి, పట్నం అవినాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుకు బేడీలపై సీఎం సీరియస్

ఇలాంటి చర్యలను సహించబోమని అధికారులకు హెచ్చరిక

ఘటనపై విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్/సంగారెడ్డి టౌన్: ‘లగచర్ల’ఘటనలో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న రైతు హీర్యానాయక్‌ను చికిత్స కోసం సంగారెడ్డి ఆస్పత్రికి బేడీలు వేసి తీసుకెళ్లిన ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. దీనిపై అధికారులతో మాట్లాడి వివరాలను ఆరాతీశారు. రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజాప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించబోదని పేర్కొన్నారు.

జైలుకు వెళ్లి సమీక్షించిన ఐజీ

జైలులో రైతుకు గుండెపోటు, బేడీలు వేసి ఆస్పత్రికి తరలించిన అంశం వివాదాస్పదం కావడంతో మల్టీజోన్ ఐజీ సత్యానారాయణ గురువారం సంగారెడ్డి సెంట్రల్ జైలుకు వెళ్లి సమీక్షించారు. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలన్న సీఎం ఆదేశాల మేరకు పూర్తి వివరాలు తెలుసుకున్నారు.

జైలర్ సస్పెన్షన్.. సూపరింటెండెంట్‌పై విచారణ

లగచర్ల రైతుకు బేడీలు వేసిన ఘటనలో సంగారెడ్డి సెంట్రల్ జైలు జైలర్ సంజీవరెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఆయనను సస్పెండ్ చేస్తూ జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా గురువారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. అలాగే, జైలు సూపరింటెండెంట్ సంతోష్ రాయ్‌పై విచారణకు ఆదేశించారు.

జైలు సిబ్బంది తప్పిదం వల్లే రైతుకు బేడీలు

జైలులో విచారణ అనంతరం ఐజీ సత్యనారాయణ వెల్లడి

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి సెంట్రల్ జైలు సిబ్బంది తప్పిదం వల్లే రైతుకు బేడీలు వేసిన ఘటన జరిగిందని ఐజీ సత్యనారాయణ తెలిపారు. ఈ ఘటనపై సెంట్రల్ జైలులో వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల ఎస్పీలతో కలసి సుమారు నాలుగు గంటల పాటు విచారణ చేశారు. జైలు సిబ్బందిని ప్రశ్నించి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హీర్యానాయక్‌ను జైలు నుంచి ఆస్పత్రికి తరలించే క్రమంలో జైలు అధికారులు ముందస్తుగా వికారాబాద్ పోలీసులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఐజీ చెప్పారు. నేరుగా సైబరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఇక ‘లగచర్ల’కేసులో ఏ2గా ఉన్న సురేశ్ జైలు నుంచి ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడారని, హీర్యానాయక్ గుండె నొప్పి అని చెబితే బెయిల్ వస్తుందని సురేశ్ చెప్పారని పేర్కొన్నారు. సురేశ్ ఎవరితో మాట్లాడారనే దానిపై ఆరా తీస్తున్నామని తెలిపారు.

లగచర్ల కేసు నాంపల్లి కోర్టుకు బదిలీ

దుద్యాల్: లగచర్ల ఘటనకు సంబంధించిన కేసు కొడంగల్ నుంచి నాంపల్లి కోర్టుకు బదిలీ అయింది. వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలం లగచర్లలో నవంబర్ 11న అధికారులపై జరిగిన దాడి కేసు బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 153/2024గా నమోదైంది. ఈ కేసులో 71 మందిపై పీడీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ఏ–1గా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి ఉన్నారు. ఈ కేసుపై గురువారం విచారణ చేపట్టిన కొడంగల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఈ కేసును కొడంగల్ కోర్టు నుంచి నాంపల్లి కోర్టుకు బదిలీ చేసింది. దీంతో లగచర్ల కేసు విచారణ ఇక నుంచి నాంపల్లి కోర్టులో సాగనుంది.

142 జలవనరుల పునరుజ్జీవ ప్రాజెక్టులకు ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: అమృత్ 2.0 పథకంలో భాగంగా తెలంగాణలో 142 జలవనరుల పునరుజ్జీవ ప్రాజెక్టులు ఆమోదించినట్లు కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు తెలిపారు. ఈ ప్రాజెక్టులకు రూ.380.11 కోట్లు కేటాయించామన్నారు. బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, గోడం నగేశ్, కాంగ్రెస్ ఎంపీ సురేశ్ షెట్కార్ అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి గురువారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

కేంద్రం నుంచి నిధులు తెండి

బకాయిల కోసం కేంద్ర మంత్రులను కలవండి

- పార్టీ ఎంపీలకు భట్టి విక్రమార్క దిశానిర్దేశం
- మంత్రివర్గ విస్తరణపై అధిష్టానానిదే తుది నిర్ణయం: భట్టి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో ప్రధానంగా దృష్టి సారించాలని రాష్ట్ర ఎంపీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు. పలు కేంద్ర సంస్థల ఏర్పాటు, వివిధ పథకాలకు కేంద్ర ప్రభుత్వ సహకారంపై సీఎం రేవంత్‌రెడ్డి, తాను ఇప్పటికే పలుమార్లు కేంద్ర మంత్రులను కలిసిన విషయాన్ని గుర్తుచేశారు. వాటి పురోగతిపై కేంద్ర మంత్రులను కలిసి నిధులు మంజూరయ్యేలా చూడాలని చెప్పారు. గురువారం ఢిల్లీలో అందుబాటులో ఉన్న పార్టీ ఎంపీలతో భట్టి తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్, రఘువీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న రుణమాఫీ, గృహలక్ష్మి, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ తదితర పథకాలపై ఎంపీలకు భట్టి అవగాహన కల్పించారు.

రాష్ట్రంలో మాదే మెరుగైన పాలన: భట్టి

గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనతో పోల్చితే.. రాష్ట్రంలో తామే మెరుగైన పాలన అందిస్తున్నామని భట్టి అన్నారు. ఎంపీలతో భేటీ అనంతరం ఆయన విలేకరులతో చిట్‌చాట్ చేశారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్టానానిదే తుది నిర్ణయమన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఎంతో కొంత వ్యతిరేకత సహజమని, అయితే.. ఏడాది పాలనలో 100% ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. హైడ్రాకు ధనిక, పేద అనే తేడా లేదని, చెరువులను ఎవరు ఆక్రమించినా హైడ్రా చర్యలు తీసుకుంటుందన్నారు. రైతు భరోసా, రుణమాఫీ కన్నా తాము ఇవ్వనున్న బోనస్ రైతులకు ఎక్కువగా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అప్పులకు 11 నెలల్లో రూ. 64 వేల కోట్ల అసలు, వడ్డీ కట్టామని, తమ ప్రభుత్వం పాలనపై దృష్టిసారించింది కాబట్టే ప్రచారంలో వెనకబడ్డామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టబోతున్నామని తెలిపారు. పదేళ్ల తరువాత హాస్టళ్లకు ఇచ్చే డైట్ చార్జీలు పెంచామని, డిసెంబర్ 14 నుంచి రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లలో ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు.. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారని భట్టి వెల్లడించారు.



ఢిల్లీలో డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన ఎంపీలు బలరాంనాయక్, చామల, కావ్య, మల్లు రవి, రఘువీర్ రెడ్డి

విపక్షాలు విషం కక్కుతున్నాయి: ఎంపీలు

ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్, బలరామ్ నాయక్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు తదితర అంశాలపై భట్టి అవగాహన కల్పించారని చెప్పారు. ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన తమపై విపక్షాలు విషం కక్కుతున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీకి కూడా రానివారు తమకు సూక్తులు చెప్పడమా? అంటూ ఎద్దేవా చేశారు.

- **దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే ప్రధాని మోదీ ఆలోచన ఆచరణ సాధ్యం కాదని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అభిప్రాయపడ్డారు.**

వచ్చే ఎన్నికల్లో మోదీని గద్దె దించుతాం!

- బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు, మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్
- ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఓబీసీల మహాధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: ‘వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన మంత్రిగా ఉన్న నరేంద్ర మోదీని గద్దె దించుతాం. మోదీ కూడా బీసీ వర్గానికి చెందిన వ్యక్తే. బీసీల సత్తా ఎలా ఉంటుందో మోదీకి కచ్చితంగా చూపిస్తాం’ అని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హెచ్చరించారు. కులగణనను వెంటనే చేపట్టి పార్లమెంటులో ఓబీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఇంటలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నాయకులు మధుసూదనాచారి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తిని కీర్తిలత గౌడ్‌లు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ.. బీసీ ప్రధానిగా ఉన్న ఆయన కేబినెట్‌లో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఎన్నికలప్పుడు ఓబీసీల ఓట్లు కావాలి కానీ రాజ్యాధికారంలో సముచిత స్థానం కల్పించరా అంటూ నిలదీశారు. దేశవ్యాప్తంగా కులగణనను వెంటనే చేపట్టి పార్లమెంటులో ఓబీసీ బిల్లు ప్రవేశపెట్టాలని బీఆర్‌ఎస్‌పక్ష నాయకుడు మధుసూదనాచారి డిమాండ్ చేశారు.



గురువారం ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో వద్దిరాజు, మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు

ఇదండీ సంగతి



అలా అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేద్సార్!

ప్రభుత్వ ఆస్పత్రుల్లో తనిఖీకి టాస్క్‌ఫోర్స్

- పరికరాలు, మందుల లభ్యత, ఫైర్ సేఫ్టీ తదితరాల తనిఖీ
- నిర్లక్ష్య అధికారులపై కొరడా
- నిర్దేశిత సమయంలో పరికరాలకు రిపేర్లు చేయకపోతే కాంట్రాక్టర్‌పై చర్యలు
- మంత్రి రాజనర్సింహ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరికరాలు, మందుల లభ్యత, ఫైర్ సేఫ్టీ తదితరాలను తనిఖీ చేసేందుకు ప్రత్యేకంగా పది టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ బృందాలు క్రమం తప్పకుండా ఆస్పత్రులను సందర్శించి నివేదిక ఇవ్వాలన్నారు. గురువారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో ఆయన శాఖ ఉన్నాధికారులతో సమావేశం నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ బృందాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఆస్పత్రుల తీరు ను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా సెంట్రలైజ్డ్ ఇంటిగ్రేటెడ్ మానిటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయిలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు పర్యవేక్షణ సాగేలా నూతన వ్యవస్థ అందుబాటులోకి తేవాలని చెప్పారు. దీనిపై త్వర లో సెంట్రల్ పోర్టల్‌ను అందుబాటులోకి తేనున్న ట్లు పేర్కొన్నారు. ఎక్విప్‌మెంట్ స్థాయిని బట్టి రెండు నుంచి నాలుగు రోజుల్లో రిపేర్లు పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన సమయంలో పరికరాలకు రిపేర్లు చేయకపోతే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు.

జిల్లాకో బయోమెడికల్ ఇంజనీర్

రాష్ట్ర విభజన సమయంలో బయోమెడికల్ ఇంజనీర్ పోస్టులు ఏపీకి వెళ్లాయని, ఈ పదేళ్లలో బయోమెడికల్ ఇంజనీర్లనునియమించకపోవడంతో చిన్న చిన్న రిపేర్ల కోసమూ ప్రైవేటు వ్యక్తులపై ఆధారపడాల్సి వస్తోందని అధికారులు రాజనర్సింహకు వివరించారు. రాష్ట్రస్థాయిలో చీఫ్ బయోమెడికల్ ఇంజనీర్ పోస్ట్ క్రియేట్ చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతీ జిల్లాకు కనీసం ఒక బయోమెడికల్ ఇంజనీర్‌ను తాత్కాలిక పద్ధతిలో నియమించుకోవాలన్నారు. కొంతమంది సిబ్బంది ఉద్దేశపూర్వకంగా మిషన్లను రిపేర్‌లో పెడుతున్నారని అధికారులు వివరించగా... అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మందుల సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారిపై కొరడా ఝుళిపించాలన్నారు. ఎక్స్‌పైరీ తేదీ కంటే 3 నెలల ముందే మెడిసిన్‌ను వినియోగించాలని, లేని పక్షంలో వెనక్కి పంపించాలన్నారు. సెంట్రల్ మెడిసినల్ స్టోర్లు, హాస్పిటల్ ఫార్మసీ స్టోర్లలో రెగ్యులర్‌గా తనిఖీలు చేయాలన్నారు. పలు హాస్పిటల్స్‌లో ఫైర్ అలారమ్స్, స్మోక్ డిటెక్టర్స్ సరిగా లేవని గుర్తించామని, నాలుగైదు సంవత్సరాలుగా నిర్వహణ సరిగా లేదని అధికారులు వివరించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో అజాగ్రత్త వద్దని, ప్రతి హాస్పిటల్‌లో అవసరమైనమేర అలారమ్, స్మోక్ డిటెక్టర్స్, మంటలను ఆర్పే యంత్రాలను అందుబాటులో ఉంచాలని రాజనర్సింహ ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్య,ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి సేవలకు బ్రేక్

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ సేవలు మూడు రోజులపాటు నిలిచిపోనున్నాయి. డేటాబేస్ వెర్షన్ అప్‌గ్రెడేషన్ కారణంగా గురువారం సాయంత్రం 5 గంటల నుంచి సోమవారం ఉదయం వరకు వెబ్ సైట్ సేవలు నిలిచిపోనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ధరణి పోర్టల్ డేటాబేస్ వెర్షన్ అప్‌గ్రేడ్ ప్రక్రియ సోమవారం ఉదయం కల్లా పూర్తికావచ్చని అధికారులు చెప్తున్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి: ఉద్యోగుల జేఏసీ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక శాఖలోని ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి చేసింది. జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో ప్రతినిధుల బృందం గురువారం సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించింది. 2022–23 నుంచి ట్రెజరీ, అకౌంట్స్ విభాగాల ఆమోదం పొందిన బిల్లులు ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రూ.10 లక్షల లోపు ఉన్న జీపీఎఫ్, లీవ్ శాల రీ, సరెండర్ లీవ్, సప్లమెంటరీ, ఏరియర్స్, మెడి కల్ రీ యింబర్స్‌మెంట్, వాహనాల అద్దె, ఎన్నికల బిల్లు లు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థికంగా ఇబ్బందిపడాల్సి వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్షం పాల్గొన్నారు.

ఇంట్లో దూరి ఏకాగ్రతను భగ్నం చేస్తే ఏం చేయాలి?

- జర్నలిస్టుపై దాడి అంశంలో మోహన్‌బాబు ఆడియో సందేశం
- నా నోట్లో మైక్ పెట్టబోతే కంటి కింద తగిలింది, కన్నుపోయే పరిస్థితి వచ్చింది.. ఎవరైనా పగబట్టి మీడియా ముసుగులో వచ్చారేమోనని సందేహం కలిగింది
- జర్నలిస్టును కొట్టినందుకు చింతిస్తున్నానని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: కుటుంబ సమస్యల్లో అనుమతి లేకుండా ఇతరులు జోక్యం చేసుకోవచ్చా.. ఎవరైనా తన ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఏకాగ్రతను భగ్నం చేస్తే ఏం చేయాలని సినీ నటుడు మంచు మోహన్‌బాబు ప్రశ్నించారు. తన నోటిలో మైక్ పెట్టి కన్నుపోయే పరిస్థితి తీసుకువచ్చారని పేర్కొన్నారు. తనపై పగ బట్టి మీడియా ముసుగులో వచ్చారేమోనని సందేహం కలిగిందని, జర్నలిస్టును కొట్టినందుకు తాను చింతిస్తున్నానని తెలిపారు. హైదరాబాద్ శివార్లలోని జల్‌పల్లిలో మంచు టౌన్ వద్ద జర్నలిస్టుపై దాడి ఘటనపై వివరణ ఇస్తూ మోహన్‌బాబు గురువారం సాయంత్రం 11 నిమిషాల నిడివితో ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. అందులోని కీలక అంశాలు ఆయన మాటల్లోనే.. ''నాలుగు రోజులుగా ఏమేం జరుగుతున్నాయో అందరికీ తెలిసిందే. కుటుంబ సమస్యల్లో అనుమతి లేకుండా ఇతరులు జోక్యం చేసుకోవచ్చా? 95 శాతం ఇళ్లలో సమస్యలు ఉంటాయి. అయితే నటులు, రాజకీయ నాయకులకు సంబంధించిన వాటిలో కొందరు ఉన్నవీ లేనివీ చెప్తుంటారు. రాత్రిపూట గేటు తోసుకుని నా బిడ్డ మనోజ్‌కుమార్ వచ్చాడు. అది రైటా? రాంగా? అనేది తర్వాత మాట్లాడుకుందాం. మీడియా వాళ్లు రోజుల తరబడి వ్యాన్లతో నా ఇంటి ముందు ఉండటం ఎంతవరకు న్యాయం? మీడియా సోదరులు కల్పితాలు చెప్తున్నారు. రాత్రిపూట గేటు పగలకొట్టి అనుమతి లేకుండా ఇంట్లోకి రావచ్చా? వచ్చినవాళ్లు అందరూ మీడియా సోదరులా? పగబట్టి మీడియా ముసుగులో వచ్చారేమో అని సందేహం కలిగింది. ఇంట్లో దూరి ఏకాగ్రతను భగ్నం చేస్తే ఊరుకుంటారా? నేను నమస్కారం పెట్టా. మైక్ తెచ్చి నోట్లో పెట్టబోయారు. కంటి కింద తగిలింది. కొంచెం ఉంటే కన్ను పోయేది. నా జీవితం గుడ్డిది అయ్యేది. గేటు బయట నేను అసభ్యకరంగా కొడితే కేసులు పెట్టి అరెస్టు చేయ వచ్చు. నా ఇంట్లోకి వచ్చిన మీడియా మన శ్శాంతి లేకుండా చేసింది. నేను చేసిన సేవలన్నీ మర్చి పోయి కొట్టిందే మాట్లాడుతున్నారు. అతన్ని కొట్టి నందుకు చింతిస్తున్నా.. చింతించి లాభమేంటి? అంటే ఇంకేం చేయాలి? మీరు చేసింది ఏం చేయాలి? అసలు అతను జర్నలిస్టా? కాదా? అనేది చీకట్లో నాకు ఎలా తెలుస్తుంది?'' అని ప్రశ్నించారు.

సత్యాన్ని తిరస్కరించిన వారికి వినాశం తప్పదు.
మరియు (అల్లాహ్) వారి కర్మలు వ్యర్థం చేస్తాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 13 డిసెంబర్ 2024

'వేధింపుల' చట్టానికి కళ్లెం?

మానసిక ఒత్తిళ్లకు ఒక్కొక్కరు ఒక్కోలా స్పందిస్తారని హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాన్ కెస్లర్ చాన్నాళ్ల క్రితం ఒక అధ్యయనం సందర్భంగా తేల్చారు. మహిళలు ఆ ఒత్తిళ్ల పర్యవసానంగా విషాదంలో మునిగితే మగవాళ్లూ, పిల్లలూ ఆగ్రహావేశాలకు లోనవుతారని చెప్పారు. ఒత్తిళ్లకు స్పందించే విషయంలో పిల్లలూ, మగవాళ్లూ ఒకటేనని ఆమె నిశ్చితాభిప్రాయం. ఈ ధోరణికామె 'ఇరిటబుల్ మేల్ సిండ్రోమ్' అని పేరు పెట్టారు. అయితే ప్రతి ఒక్కరూ ఇలాగే ఉంటారని చెప్పలేం. బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అతుల్ సుభాష్ తన భార్యతో వచ్చిన తగాదాకు సంబంధించిన కేసుల్లో తనకూ, తన తల్లిదండ్రులకూ ఎదురైన చేదు అనుభవాలను ఏకరువు పెడుతూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. దానికి ముందు విడుదల చేసిన 90 నిమిషాల వీడియో, 24 పేజీల లేఖ ఇప్పుడు న్యాయవ్యవస్థలో సైతం చర్చనీయాంశమయ్యాయి. తనపైనా, తనవాళ్లపైనా పెట్టిన 8 తప్పుడు కేసుల్లో, వాటి వెంబడి మొదలైన వేధింపుల్లో యూపీలోని ఒక ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి ఉన్నారన్నది ఆ రెండింటి సారాంశం.

బలహీనులకు జరిగే అన్యాయాలను నివారించటానికీ, వారిని కాపాడటానికీ కొన్ని ప్రత్యేక చట్టాలూ, చర్యలూ అవసరమవుతాయి. అలాంటి చట్టాలు దుర్వినియోగమైతే అది సమాజ పురోగతికి ఆటంకం కలిగిస్తుంది. ఎందుకంటే ఆ వంకన అసలైన బాధితులకు సకాలంలో న్యాయం దక్కదు సరికదా... బలవంతులకు ఆయుధంగా మారే ప్రమాదం ఉంటుంది. మహిళలపై గృహహింస క్రమేపీ పెరుగుతున్న వైనాన్ని గమనించి 1983లో భారతీయ శిక్షాస్మృతిలో సెక్షన్ 498ఏ చేర్చారు. అనంతర కాలంలో 2005లో గృహహింస చట్టం వచ్చింది. 498ఏ సెక్షన్ గత ఏడాది తీసుకొచ్చిన భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్)లో సెక్షన్ 84గా ఉంది. అయితే అటుతర్వాత కుటుంబాల్లో మహిళలపై హింస ఆగిందా? లేదనే చెప్పాలి. సమాజంలో కొనసాగే ధోరణులకు స్పందనగానే ఏ చట్టాలైనా వస్తాయి. ఎన్నో ఉదంతాలు చోటుచేసుకున్నాక, మరెన్నో ఉద్యమాలు జరిగాక, నలుమూలల నుంచీ ఒత్తిళ్లు పెరిగాక మాత్రమే ఎంతో ఆలస్యంగా ఇలాంటి చట్టాలు వస్తాయి. బలహీనులకు ఉపయోగపడే అటువంటి చట్టాల్ని దుర్వినియోగం చేసే వారుండటం నిజంగా బాధాకరమే.

జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం 498ఏ వంటి చట్టాలు ఈమధ్యకాలంలో దుర్వినియోగమవుతున్న ఉదంతాలు పెరగటంపై ఆందోళన వ్యక్తం చేసింది. వ్యక్తిగత కక్షతో అత్తింటివారిపైనా, భర్తపైనా తప్పుడు కేసులు పెట్టే తీరువల్ల వివాహ వ్యవస్థ నాశనమవుతున్నదని వ్యాఖ్యానించింది. ఇప్పుడే కాదు... 2014లో కూడా సుప్రీంకోర్టు ఒక సందర్భంలో ఇలాంటి వ్యాఖ్యానమే చేసింది. 'భర్తలపై అలిగే భార్యలకు సెక్షన్ 498ఏ రక్షణ కవచంగా కాక ఆయుధంగా ఉపయోగపడుతోంద'ని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇకపై శిక్షాస్మృతిలోని సెక్షన్ 41కి అనుగుణంగా వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకున్నాకే తదుపరి చర్యలకు ఉపక్రమించాలని కూడా సూచించింది. నిజమే... ఎలాంటి చట్టాలైనా నిజమైన బాధితులకు ఉపయోగపడినట్టే, అమాయకులను ఇరికించడానికి కూడా దోహదపడతాయి. చట్టాన్ని వినియోగించేవారిలో, అమలు చేసేవారిలో చిత్తశుద్ధి కొరవడితే జరిగేది ఇదే. ఆ తీర్పు తర్వాత గత పదేళ్లుగా వేధింపుల కేసులు నత్తనడక నడుస్తున్నాయి. అందులో నిజమైన కేసులున్నట్టే అబద్ధపు కేసులు కూడా ఉండొచ్చు. మనది పితృస్వామిక సమాజం కావటంవల్ల పుట్టినప్పటి నుంచి పెరిగి పెద్దయి కుటుంబ బాధ్యతలు మీద పడేవరకూ ఏ దశలోనూ ఆడవాళ్లపై హింస మటుమాయమైందని చెప్పలేం. వాస్తవానికి ఇందులో చాలా రకాల హింసను మన చట్టాలు అసలు హింసగానే పరిగణించవు. ఆర్థిక స్తోమత, సమాజంలో హోదా వంటివి కూడా మహిళలను ఈ హింస నుంచి కాపాడలేకపోతున్నాయన్నది వాస్తవం. ఒకనాటి ప్రముఖ నటి జీనత్ అమన్, భారత్‌లో మొట్టమొదటి లేడీ ఫిట్‌నెస్ ట్రైనర్‌గా గుర్తింపు సాధించిన నవాజ్ మోదీలు ఇందుకు ఉదాహరణ. వీరిద్దరూ తమ భర్తల నుంచి తీవ్రమైన గృహహింసను ఎదుర్కొన్నారు. జీనత్‌కు కంటి కండరాలు దెబ్బతిని కనుగుడ్డు బయటకు రాగా, దాన్ని యథాస్థితిలో ఉంచటానికి గత నలభైయేళ్లలో ఎన్ని సర్జరీలు చేయించుకున్నా ఫలితం రాలేదు. నూతన శస్త్ర చికిత్స విధానాలు అందుబాటులోకొచ్చి నిరుడు ఆమెకు విముక్తి దొరికింది.

ఒకప్పుడు కట్టుబాట్లకు జడిసి, నలుగురిలో చులకనవుతామన్న భయంతో ఉండే మహిళలు ఉన్నత చదువుల వల్లా, వృత్తి ఉద్యోగాల్లో స్థిరపడే అవకాశం రావటం వల్లా మారారు. వరకట్న వేధింపులు, ఇతర రకాల హింసపై కేసులు పెడుతున్నారు. ప్రశ్నిస్తున్నారు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. అయితే అదే సమయంలో కొందరు దుర్వినియోగం చేస్తున్న మాట కూడా వాస్తవం కావొచ్చు. అలాంటివారిని గుర్తించటానికీ, వారి ఆట కట్టించటానికీ దర్యాప్తు చేసే పోలీసు అధికారుల్లో చిత్తశుద్ధి అవసరం. ఈ విషయంలో న్యాయస్థానాల బాధ్యత కూడా ఉంటుంది. లోటుపాట్లు తప్పనిసరిగా సరిచేయాల్సిందే. కానీ ఆ వంకన అలాంటి కేసుల దర్యాప్తులో జాప్యం చోటు చేసుకోకుండా ఇతరేతర మార్గాలపై దృష్టి సారించాలి. ఎందుకంటే ఏటా ప్రతి లక్షమంది మహిళల్లో దాదాపు ముగ్గురు వరకట్న హింసకు ప్రాణాలు కోల్పోతున్నారని నేషనల్ క్రైమ్ రికార్డుల బ్యూరో గణాంకాలు చెబుతున్నాయి. ఇది ఎంతో ఆందోళన కలిగించే విషయం. వరకట్న నిషేధ చట్టం వచ్చి 63 ఏళ్లవుతున్నా ఇదే స్థితి ఉన్న నేపథ్యంలో ప్రస్తుత చట్టాలను నీరగార్చకుండానే ఎలాంటి జాగ్రత్తలు అవసరమో ఆలోచించాలి.

కళ్లెదుటి ఫలితాలకు కారణమేంటి?

సమీక్ష



తెంపల్లి వేణుగోపాలరావు

గడచిన సార్వత్రిక ఎన్నికలు అన్ని పక్షాలనూ సమంగా ఆశ్చర్యపరిచాయి. మునుపటికన్నా ఎక్కువ మెజారిటీ సీట్లు సాధిస్తామని ఆశించిన బీజేపీ కలలు కల్లలుకాగా, అందలం అందుకోవటమే ఆలస్యమన్నట్టు పొంగిపోయిన ఇండియా కూటమికి భంగపాటు తప్పలేదు. ఈ ఫలితాల ఆంతర్యమేమిటి... ఎవరెవరు ఎలా, ఎందుకు దెబ్బతిన్నారన్న అంశాలపై సీనియర్ పాత్రికేయుడు, టీవీ న్యూస్ ప్రెజెంటర్ రాజ్‌దీప్ సర్దేశాయి వెలువరించిన తాజా పుస్తకం '2024 ది ఎలక్షన్ దట్ సర్‌ప్రైజ్‌డ్ ఇండియా'. ఈ అసమ సమాజంలో నిత్యం దగా పడుతున్న సగటు మనిషి మౌనంగా, ప్రశాంతంగా ఉన్నట్టు కనబడుతూనే నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా ఇచ్చిన తీర్పు ఇది అంటారు రాజ్‌దీప్. అందుకే ఈ ఎన్నికల అసలు విజేత సగటు వోటరేనని చెబుతారు.


పార్లమెంటరీ రాజకీయాలపై ఎంతో ఆసక్తి ఉన్నవారికి సైతం వెగటుపుట్టించే విధంగా మన ఎన్నికల తంతు తయారైంది. ఇంతటి రణగొణ ధ్వనులమధ్య కూడా నాయకులతో చర్చించటం, సాధారణ పౌరులను కలవటం, ఎవరివైపు మొగ్గ ఉందో అంచనావేయటం వివిధ చానెళ్ల చేస్తున్న పని. దీన్ని ఎంతో నిష్ఠగా, దీక్షగా నెరవేర్చే కొద్దిమంది పాత్రికేయుల్లో రాజ్‌దీప్ సర్దేశాయ్ ఒకరు.

ఉత్తేజాన్నివ్వని హ్యాట్రిక్!

రాజ్‌దీప్ తాజా పుస్తకం '2024 ది ఎలక్షన్ దట్ సర్‌ప్రైజ్‌డ్ ఇండియా' 528 పేజీల సమగ్ర గ్రంథం. ఇప్పుడే కాదు... '2014 ది ఎలక్షన్ దట్ ఛేంజ్‌డ్ ఇండియా' మొదటి పుస్తకంగా, 2019 'హౌ మోదీ వన్ ఇండియా' రెండో పుస్తకంగా వచ్చాయి. తాజా పుస్తకం మూడోది. దీనికి 'హ్యాట్రిక్ 2024' అన్న శీర్షిక పెడదామనుకున్నారట. కానీ ఫలితాలు విశ్లేషించాక పునరాలోచనలో పడ్డారట. రచయిత దృక్పథమేమిటో పుస్తకం శీర్షికే వెల్లడిస్తుంది. స్వతంత్ర భారతంలో నెహ్రూ తర్వాత వరసగా మూడోసారి అందలం అందుకున్నది మోదీ మాత్రమే! ఆ రకంగా ఆయనకైనా, బీజేపీకైనా ఇది ఘనవిజయం కిందే లెక్క. కానీ 272 అనే 'మేజిక్ మార్క్' ఎక్కడ? కనీసం దాని దరిదాపుల్లోకి కూడా రాలేక 240 దగ్గరే బీజేపీ ఆగిపోయింది. అందుకే 'హ్యాట్రిక్' విజయోత్సవ హోరు లేదు. 2024 ఎన్నికలు అందరినీ సమంగా ఆశ్చర్యపరిచాయి. 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' అని ప్రధాని నరేంద్ర మోదీ నినాదమిచ్చి తమ శ్రేణుల్ని ముందుకురికించారు. అందరం కలిశాం గనుక, 'ఇండియా' అన్న సంక్షిప్తీకరణ పదం దొరికింది గనుక విజయం ఖాయమన్న భ్రమలో ప్రతిపక్ష కూటమి నాయకులున్నారు. లాక్‌డౌన్‌తో జనం ఆర్థిక అగచాట్లు, వేలాది కిలోమీటర్ల నడక, ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం, పీఎమ్ కేర్స్ ఫండ్, సాగుచట్టాల వ్యతిరేక ఉద్యమం, సీఏఏ, విపక్ష సర్కార్ల కూల్చివేతలు, విద్వేష పూరిత ప్రసంగాలు... ఇవన్నీ ఎన్డీయే ప్రభుత్వంపై ఏవగింపు కలిగించాయని 'ఇండియా' కూటమి నమ్మింది. విపక్ష నేతలపై ఈడీ, ఐటీ దాడులు, అరెస్టులు విపక్ష వ్యూహాన్ని ఏదో మేర దెబ్బతీసిన మాట వాస్తవమే. కానీ ఇందుకే మెజారిటీ సాధనలో 'ఇండియా' విఫలమైందని చెప్పటం కష్టమంటారు రాజ్‌దీప్. బిహార్ సీఎం నితీష్‌కుమార్‌ను చేజార్చుకోవటం, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ విషయంలో తప్పటడుగుల వంటివి దెబ్బతీశాయన్నది ఆయన విశ్లేషణ. ఇలాంటివి చోటుచేసుకోనట్టయితే బీజేపీకి ఇప్పుడొచ్చిన 240 స్థానాల్లో మరో 40 వరకూ కోతపడేవని రాజ్‌దీప్ అభిప్రాయం. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఎన్డీయేగా బరిలోకి దిగినా బీజేపీ సొంతంగానే మెజారిటీ సాధించుకుంది. కేవలం మిత్ర ధర్మాన్ని పాటించి మాత్రమే భాగస్వామ్య పక్షాలకు పదవులిచ్చింది. ఇప్పుడలా కాదు... నిలకడలేని టీడీపీ, జేడీ(యూ) వంటి పార్టీల దయాదాక్షిణ్యాలపై నెట్టుకురాక తప్పదు.

ఒక్కటైన దళిత, ముస్లిం వర్గాలు

గతంలో ఇతర వర్గాలతోపాటు వెన్నుదన్నుగా నిలిచిన దళిత ఓటుబ్యాంకు 2024 ఎన్నికల్లో బీజేపీకి దూరమైందని రాజ్‌దీప్ చెబుతారు. బీజేపీకి భారీ మెజారిటీ వస్తే రిజర్వేషన్లు రద్దవుతాయని





రాజ్‌దీప్ సర్దేశాయి

ఆ వర్గాలు భయపడ్డాయి. కంచుకోట అనదగ్గ యూపీలో 2022లో 'బుల్డోజర్ మ్యాండేట్' వస్తే రెండేళ్ల గడిచేసరికల్లా 'మండలైజ్డ్ కుల స్పృహ' పెరిగి దళిత ఓటుబ్యాంకుకు అక్కడ 10 శాతం కోతపడిందని ఆయన విశ్లేషణ. వీరికి ముస్లింల ఓటు బ్యాంకు తోడైందంటారు. 2015–16 నుంచి 2022–23 మధ్య సంఘటిత రంగంలో 63 లక్షలు, అసంఘటిత రంగంలో కోటీ 60 లక్షల ఉద్యోగాలు ఆవిరయ్యాయన్న ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఐఆర్ఆర్) సంస్థ గణాంకాలను రాజ్‌దీప్ ఉటంకిస్తారు. రాజ్‌దీప్ పుస్తకం కళ్ల ముందు జరిగిన అనేక పరిణామాల వెనకున్న కారణాలేమిటో, నాయకుల అతి విశ్వాసంలోని అంతరార్థమేమిటో విప్పిచెబుతుంది.

మనమంతా చూస్తున్నట్టు ఇప్పుడేలుతున్నది నిజంగా బీజేపీయేనా? రాజ్‌దీప్ లెక్కలు చూస్తే క్షణకాలమైనా ఆ ప్రశ్న రాకమానదు. ఈసారి ఎన్నికల్లో ఏకంగా 114 మంది కాంగ్రెస్ నుంచి ఫిరాయించిన నేతలకు బీజేపీ టిక్కెట్లు వచ్చాయట. బీజేపీ 'కాంగ్రెస్ ముక్త భారత్' నినాదం కాస్తా 'కాంగ్రెస్ యుక్త బీజేపీ' అయిందంటారాయన. అసలు జాతీయ రాజకీయాల్లో మోదీ ఆగమనానికి ముందే ఒక పార్టీగా కాంగ్రెస్ మతాన్ని పులుముకోవడం, వ్యవస్థల్ని దుర్వినియోగం చేయడం, నిలదీసిన సొంత పార్టీ నేతలపై సైతం అక్రమ కేసులు మోపి జైళ్లపాలు చేయడం వగైరాలు పెంచింది. ఆ రకంగా మోదీ రాకకు ముందే 'మోదీయిజాన్ని' పరిచయం చేసింది. ఆ నొప్పి ఎలా ఉంటుందో దశాబ్దకాలం నుంచి చవిచూస్తోంది.

ఫలిస్తున్న 'ప్రచారయావ'

ప్రచారం విషయంలో మోదీ తీసుకునే శ్రద్ధను రాజ్‌దీప్ వివరిస్తారు. గుజరాత్‌లో బీజేపీ కార్యక్రమాలపై సింగిల్ కాలమ్ వార్త ఇవ్వటానికి కూడా మీడియా సిద్ధపడని రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని 182 నియోజకవర్గాల నుంచీ ప్రచార రథాలను తరలించి అహ్మదాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించాలని ఆయన ప్రతిపాదించారట. ఇందువల్ల డబ్బు ఖర్చుతప్ప ఒరిగేదేమీ లేదని పార్టీ నాయకులు గుసగుసలు పోగా, ర్యాలీ జరిగిన మర్నాడు ఎప్పుడూ లేనట్టు మీడియాలో అది ప్రముఖంగా వచ్చిందట. ప్రచారం భారీ స్థాయిలో చేయటం అప్పటినుంచీ మోదీకి అలవాటు. 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' వెనకా ఈ వ్యూహమే ఉంది.

'గోదీ మీడియా' ప్రస్తావన

అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, రాహుల్ గాంధీ, శరద్ పవార్, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ తదితరుల తీరుతెన్నులపై రాజ్‌దీప్ వివరంగానే ప్రస్తావించారు. సద్విమర్శలను వ్యక్తిగతంగా తీసుకుని బెదిరించటంలో, అమర్యాదగా ప్రవర్తించటంలో అమిత్ మాలవీయ వంటి కొందరు బీజేపీ నేతల ప్రవర్తన ఎలా ఉంటుందో చెప్పారు. మరోపక్క మీడియా మొత్తాన్ని చాలామంది ఒకే గాటనకట్టి 'గోదీ మీడియా'గా ముద్రేయటంపై విచారిస్తూనే కొన్ని ప్రధాన చానెళ్ల, పత్రికల తీరుపై ఈ గ్రంథంలో నిశితమైన విమర్శ వుంది. తాను ఈసారి ఎన్డీయే ఓడుతుందని భావించకపోయినా 'మేజిక్ ఫిగర్' దాటుతుందని గుడ్డిగా నమ్మిన వైనాన్ని వివరిస్తారు. అదే సమయంలో ఎప్పుడూ అంచనాలు తప్పని ప్రదీప్ గుప్తా వంటి ప్రఖ్యాత సెఫాల జిస్టు సైతం ఎన్డీయేలో ఒక్క బీజేపీకే 322–340 మధ్య వస్తాయని చెప్పడాన్ని వెల్లడిస్తారు. సుదీర్ఘకాలం ఢిల్లీలో పాత్రికేయుడిగా పని చేసిన అనుభవం, ఉన్నత స్థానాల్లోని వారితో కలిగిన పరిచయాలు పుస్తక రచనలో రాజ్‌దీప్‌కు బాగా అక్కరకొచ్చాయి.

'ఈవీఎంల గారడీ' ఎక్కడ?

అయితే ఒక విమర్శ – ఈవీఎంల వ్యవహారంపై అసోసియేషన్ ఆఫ్ డెమాక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) ఏకరువు పెట్టిన అంశాల గురించి ప్రస్తావించినా ఆ ఎపిసోడ్‌ను లోతుగా చర్చించకపోవటం లోటనే చెప్పాలి. వాస్తవానికి దానిపై విడిగా పుస్తకమే రావాలి. మొత్తం 543 నియోజకవర్గాలకుగాను 537 చోట్ల ఈవీఎంలలో పోలైన ఓట్లకూ, లెక్కించిన ఓట్లకూ పొంతన లేదని ఏడీఆర్ బయటపెట్టింది. 'ఇది కేవలం సాంకేతిక లోపమే... దీనివల్ల అంతిమ ఫలితం తారుమారు కాబోద'ని వాదించటానికి ముందు కనీసం అందుకు హేతుబద్ధమైన సంజాయిషీ ఇవ్వాల్సిన బాధ్యతని ఎన్నికల సంఘం గుర్తించక పోవటం విచారించదగ్గది. మొదలుపెడితే చివరి వరకూ చదివించే శైలితో, ఆశ్చర్యపరిచే సమాచారంతో ఈ పుస్తకం అందరినీ ఆకట్టుకుంటుంది. ఇలాంటి గ్రంథం ఇంగ్లిష్‌లో మాత్రమే సరి పోదు. ప్రాంతీయ భాషల్లో సైతం వస్తేనే ప్రజల అవగాహన పెరుగుతుంది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు
venujourno@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇదా న్యాయం?



ఒక క్రిమినల్ కేసులో బెయిల్ ఇవ్వడం కోసం ఒక సెషన్స్ జడ్జ్ (మహారాష్ట్ర) ఆరు లక్షల లంచం అడిగారని పొద్దున్నే వార్త చదివాను. ఇలాంటి అవినీతిమయ న్యాయమూర్తులకు ఏ శిక్షా పడకపోవడం దురదృష్టకరం. జవాబుదారీతనమే లేదు.

– శేఫాలీ వైద్య, పాత్రికేయురాలు

ఎందుకు హిందీ?



'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్ట్, 1934' స్థానంలో వచ్చిన 'భారతీయ వాయుయాన్ విధేయక్, 2024' రాష్ట్రపతి ఆమోదం పొందింది. భారతీయులందరికీ వర్తించే చట్టాలను ఇలా హిందీకరణ చేయడం చిరాగ్గా ఉంది. హిందీయేతర ఎంపీలు దీన్ని ఎలా అనుమతిస్తున్నారు? ఇది రాజ్యాంగ విరుద్ధమే కాదు; దీనిలో విభజించే, వెలివేసే స్వభావం ఉంది.

– అనూషా రవి సూద్, జర్నలిస్ట్

ఉండాల్సిన చట్టమా?



ఒక చట్టం వల్ల ఒక మనిషికి ఇబ్బంది ఎదురవుతుంటే దాన్ని వెంటనే తొలగించాలి. 'ఉపా' కేసుల్లో శిక్షలు పడే రేటు 3 శాతానికంటే తక్కువగా ఉంటోంది. అయినా దాన్ని మార్చాలని ఎవరూ అనుకోవడం లేదు. ఇది ఎలాంటి కపటత్వం?

– దారాబ్ ఫారూఖీ, సినీరచయిత

గుడ్లు గుడ్!



రెండేళ్లుగా నేను బ్రేక్‌ఫాస్ట్ కోసం రెండు ఉడికించిన కోడిగుడ్లు, ఒక కప్పు టీ తీసుకుంటున్నాను. దీనివల్ల చాలా మాంసకృత్తులు, పరిహరించదగిన పిండిపదార్థం, మూడు నాలుగు గంటలపాటు మంచి శక్తి వస్తాయి. ఎప్పుడూ గుడ్లను తినడం ఆనందించండి.

– సందీప్ మనుధానె, విద్యావేత్త

ఒకటే!



నేను వేరు, నువ్వు వేరు! ఈ వేరు అనే భావన ఒక వ్యక్తిని భయం, వెలివేత, గర్వం, అవమానం మొదలైన భావాలకు గురిచేసి తద్వారా అనారోగ్యానికి, జీవితంలో అసంతృప్తికి పురిగొల్పుతుంది.

– శ్రీకాంత్ మిర్యాల, సైకియాట్రిస్ట్

ఇన్ బాక్స్

ఇదేమి సంస్కారం!

'సాక్షి' దినపత్రికలో 8-12-2024 ఆదివారం నాడు ప్రచురితమైన కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు రాసిన 'కులదూషణ ఏ సంస్కృతికి ప్రతీక?' వ్యాసాన్ని చూశాను. అదే పార్టీ ప్రభుత్వం తెలంగాణలో చేపట్టిన 'కులగణన' అనే హేతు రహిత కార్యక్రమం నేపథ్యంలో వ్యాసాన్ని అర్థం చేసుకోవలసి ఉంది.

వేల సంవత్సరాల సంస్కృతితో విలసిల్లుతూ వస్తున్న మహోంద్ర జాతి కోవిడ్ మహమ్మారి కన్నా వికృత పోకడలు సంతరించుకున్న 'కులం' అనే జబ్బుతో వినాశనం వైపు పరుగులు తీస్తున్నట్టుగా ఉంది. ఉమ్మడి తెలుగు రాష్ట్ర పునర్విభజన కారణంగా... 13 జిల్లాలతో చీలిపోయిన తెలుగు రాష్ట్ర భాగం 'మూడు కులాల' మధ్య రగిలిన కుంపటితో ప్రతిదినమూ తగలబడుతూ ఉన్న విషాద అధ్యాయాన్ని చూస్తూనే ఉన్నాం. ఇక 10 జిల్లాలతో చీలిపోయిన తెలుగు రాష్ట్రాన్ని ఉద్ధరించడానికి కంకణం కట్టుకున్నానని ప్రకటించి, కులరహిత సమాజ నిర్మాణం దిశగా ఆదర్శాలు వల్లించి కాంగ్రెస్ పార్టీ తరఫున ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించిన వ్యక్తి... తెలుగు సమాజాన్ని చీలికలు పీలికలతో విచ్ఛిన్నం చేసే విధంగా చేపట్టిన 'కుల గణన' అనే అనాగరిక కార్యక్రమం ఎంత అనర్థదాయకమైనదో అవగతమవుతూనే ఉంది.

మేధావులు సమాజ విచ్ఛిన్నం వైపు దారితీసే వినాశకర కుల గణన విషయంలో ప్రతినిత్యం హెచ్చరిస్తున్న నేపథ్యంలో... అదే పార్టీకి చెందిన ఒక అనాగరిక రాజకీయ నాయకుడు అత్యంత హేయమైన రీతిలో ఒక వర్గం గుర్తింపుతో కొనసాగుతున్న ప్రజాస్వామ్య సమాజ పౌరులకు 'కులము' అనే ఒక ఊహాజనిత భావనను ఆపాదించి వారిని అవమానకరంగా దూషించిన తరువాత కూడా ఆశ్చర్యకరంగా ఆ పార్టీలో కొనసాగుతూనే ఉన్నాడు. ఇది అతడు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీ సంస్కారానికి ప్రతీకగా సభ్య సమాజం భావించే ఆస్కారం ఉంది!

– కంభంమెట్టు త్రినాథ్ రెడ్డి, తెలంగాణ హైకోర్టు న్యాయవాది

ఇది మాయ కాక మరేమిటి?

విశ్లేషణ



దిలీప్ రెడ్డి

నిరూపించ లేనంత మాత్రాన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రా(ఈవీఎం)ల వినియోగ ప్రక్రియలో తప్పులే లేవనో, తప్పిదాలకు ఆస్కారమే లేదనో ధ్రువీకరించినట్టు కాదు. అభియోగాలు మోపే వారు అందుకు హేతువును, తమ సందేహాలకు కారణాలను, తగు సాక్ష్యాధారాలను సంబంధిత వ్యవస్థల దృష్టికి తీసుకురావాలి. వాటిని స్వీకరించి బాధ్యులైన వ్యక్తులు, సంస్థలు లోతుగా పరిశీలన జరపాలి. అభియోగాలకు ఆధారాలున్నాయో లేదో, అవి తప్పో, కాదో తేల్చాలి. ఈ మొత్తం ప్రక్రియలో పారదర్శకత, జవాబు దారీతనం ముఖ్యం. అది జరగటం లేదు.

అయిందానికి, కానిదానికి నిత్యం పరస్పరం విమర్శించుకునే రాజకీయ పార్టీలు ఈవీఎంల విషయంలో అనుసరించే ద్వంద్వ వైఖరి వారి ఆరోపణలకు పస లేకుండా చేస్తోంది. దాంతో వివాదం ప్రాధాన్యత లేకుండా పోతోంది. కానీ, కొన్ని రాజకీయేతర తటస్థ సంఘాలు, సంస్థలు కూడా అభ్యంతరాలు లేవనెత్తాయి. పోలింగ్ శాతాల సమాచారంలో వ్యత్యాసాలను ఎత్తిచూపుతూ, బహిరంగ ప్రజాభిప్రాయానికి విరుద్ధ ఫలితాలనూ... ఈవీఎంల దుర్వినియోగానికి గల ఆస్కారాన్నీ అవి ఎన్నికల సంఘం దృష్టికి తెచ్చినా... తగిన స్పందన లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఓట్ ఫర్ డెమాక్రసీ (వీఎఫ్‌డీ), అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), సిటిజన్ కమిషన్ ఆన్ ఎలక్షన్ (సీసీఈ) వంటి పౌర సంఘాలు నిర్దిష్టంగా ఫిర్యాదులు చేసినా వాటిని పరిగణనలోకి తీసుకుంటున్న దాఖలాలు లేవు. రాజకీయ పక్షాల నుంచే కాక ప్రజాసంఘాలు, సంస్థల నుంచి నిర్దిష్ట ఆరోపణలు చేసినప్పుడు కూడా 'నిరాధారం', 'దురుద్దేశ పూర్వకం' అంటూ, కనీస విచారణైనా జరుపకుండానే ఎన్నికల సంఘం కొట్టిపారేస్తోందన్నది వారిపై ప్రధాన అభియోగం!

ఓటు వ్యత్యాసాలపైనే సందేహాలు

సాయంత్రం వరకు పోలింగ్ సరళి ఒక విధంగా ఉండి, ముగింపు సమయాల్లో అనూహ్య, అసాధారణ ఓటింగ్ శాతాలు నమోదు కావడం, అలా ఎన్నికల అధికారి రాత్రి ఇచ్చిన గణాంకాలకు భిన్నంగా ఓట్ల లెక్కింపు ముందరి 'లెక్క'తేలడం పట్ల సందేహాలున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఈ ఓట్ల వ్యత్యాసం భారీగా ఉంటోంది. ఇది సార్వత్రిక ఎన్నికల్లోనే కాకుండా హరియాణా, జార్ఖండ్, మహారాష్ట్ర అసెంబ్లీల ఎన్నికల సందర్భంగానూ వెల్లడయిందనేది



విమర్శ. గణాంకాలు వారి వాదనకు బలం చేకూర్చేవిగానే ఉన్నాయి. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఇలా... ఆఖరు నిమిషపు ఓట్ల వ్యత్యాసం పది శాతానికి పైగా ఉన్న పది జిల్లాల్లోని 44 అసెంబ్లీ స్థానాల్లో 37 ఎన్డీయే పక్షాలు గెలిచాయి. కానీ వ్యత్యాసం 10 శాతం కన్నా తక్కువగా ఉన్న 12 జిల్లాల్లోని 46 సీట్లలో ఎన్డీయే కూటమి 11 సీట్లు మాత్రమే గెలువ గలిగింది. ఇటువంటి పరిస్థితి సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ ప్రతిబింబించిందని విమర్శకులంటారు. ఆఖరు నిమిషపు పోలింగ్ శాతపు పెరుగుదల వరుసగా ఐదు విడతల్లో 0.21%, 0.34%, 0.23%, 0.01%, 0.25% నామమాత్రంగానే ఉండటంతో ఎన్డీయే కూటమికి రాజకీయంగా ఇదేమీ లాభించలేదనేది విశ్లేషణ! అందుకే, అక్కడ లోక్‌సభ స్థానాల సంఖ్య 62 నుంచి ఈ సారి 36కి పడిపోయింది. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తొలివిడతలో 'ఆఖరు నిమిషపు ఓటింగ్ శాతం' పెరుగుదల 1.79% నమోదుకాగా బీజేపీ 43లో 17 అసెంబ్లీ స్థానాలు నెగ్గింది. కానీ, రెండో విడత పోలింగ్ సందర్భంగా ఓటింగ్ శాతం పెరుగుదల 0.86%కి పరిమితం అయినందునేమో, 38లో 7 సీట్లు మాత్రమే గెలువగలిగింది. ఇదంతా ఈవీఎంల మాయాజాలం కాదా అని విమర్శకులంటారు.

కళ్లకు కట్టినట్టు గణాంకాలు

మహారాష్ట్రలోని అకోట్ అసెంబ్లీ నియోజకవర్గంలో రాష్ట్ర ఎన్నికల ముఖ్యాధికారిచ్చిన సమాచారం ప్రకారం, పోలింగ్ ప్రక్రియ అన్ని విధాలుగా ముగిసేటప్పటికి ఈవీఎంల ద్వారా 2,12,690 ఓట్లు పోలయ్యాయి. లెక్కింపు రోజున ఈవీఎం నుంచి రాబట్టిన ఓట్ల సంఖ్య 2,36,234. అంటే, వ్యత్యాసం 23.544 ఓట్లు. గెలిచిన బీజేపీ అభ్యర్థికి దక్కిన ఆధిక్యత 18,851 ఓట్లు! ఇలా రాష్ట్రవ్యాప్తంగా గమనిస్తే, పోలింగ్ రోజు రాత్రి పొద్దుపోయిన తర్వాత ఎన్నికల సంఘం వారి 'యాప్' ద్వారా వెల్లడైన గణాంకాల కన్నా ఓట్ల లెక్కింపు రోజున రమారమి పెరిగిన సంఖ్య ఉన్న నియోజకవర్గాలు తక్కువలో తక్కువ 95 ఉన్నాయనేది వారి వాదన. ఒకే విడత పోలింగ్ జరిగిన నవంబరు 20, సాయంత్రం 6.15 గంటలకు ఒకసారీ, రాత్రి 11.45 గంటలకు ఒకసారీ ఎన్నికల సంఘం అధికారికంగా ఓటింగ్ శాతాలను వెల్లడించింది. సాయంత్రం సమాచారం వెల్లడించే సమయానికి ఇంకా కొన్ని పోలింగ్ స్టేషన్లలో గడువు లోపల 'క్యూ'లో చేరిన వారందరూ ఓటువేసే వరకు, ఎంత సమయమైనా ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది గణాంకాలు రాత్రి ప్రకటించిన సమాచారంలో పేర్కొన్నారు. 288 నియోజకవర్గాల్లో సాయంత్రానికి 58.22% (5,64,88,024 ఓట్లు) పోలయినట్టు తెలిపిన అధికారులు రాత్రి అయ్యేటప్పటికి 65.02% (6,30,85,732 ఓట్లు) నమోదైనట్టు చెప్పారు. అంటే, వ్యత్యాసం 65,97,708 ఓట్లన్నమాట! నవంబరు 22న ఓట్ల లెక్కింపునకు కొన్ని గంటలు ముందు, 'యాప్' వెల్లడించిన సమాచారం ప్రకారం, రాష్ట్రమంతటా నమోదైన ఓట్ల సంఖ్య 6,40,85,095. అప్పుడు పోలింగ్ శాతం 66.05%కి చేరింది. ఏమిటీ వ్యత్యాసాలన్న ప్రశ్న ఈవీఎంలపై శంకకు తావిస్తోంది. 288 నియోజకవర్గాల్లోని 1,00,186 పోలింగ్ బూత్‌లలో సగటున 76 ఓట్ల చొప్పున 76 లక్షల ఓటర్లు, ఎలా గడువు తర్వాత 'క్యూ'ల్లో నిలుచొని ఓటు వేసి ఉంటారనే ప్రశ్న తలెత్తడం సహజం!

చైతన్యమే దారిదీపం

మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా మాల్‌శిరాస్ తాలూకా మార్కడ్‌వాడి అనే చిన్న గ్రామంలో జనం తిరగబడ్డారు. రీపోలింగ్ జరపాలన్నారు. కానీ, ఫలితం లేకపోయింది. 13 వేల ఓట్ల ఆధిక్యతతో ఎన్సీపీ (శరద్ పవార్) అభ్యర్థి ఉత్తమ్‌రావ్ జన్‌కర్ ఎమ్మెల్యేగా ఎన్నికయి కూడా... ఆ గ్రామంలో ఈవీఎం అవకతవకలతో నష్టం జరిగిందని ఆరోపించారు. కులాల వారిగా, విధేయత పరంగా చూసినా గ్రామంలో తనకు ఆధిక్యత ఉండగా, తన ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి రామ్ సత్పుతే (బీజేపీ)కి 160 ఓట్లు ఎక్కువ రావటం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. రీపోల్ నిర్వహణకు ప్రేరణ కల్పించారు. తమ ఫిర్యాదుకు ఎన్నికల సంఘం స్పందించనందునే రీపోల్ ఆలోచనని గ్రామ ముఖ్యులు పేర్కొన్నారు. రాజకీయ పార్టీల కార్యకర్తలు పోలింగ్ ఏజెంట్లుగా పోలింగ్ ముగిసే సమయంలో, కౌంటింగ్ ఏజెంట్లుగా ఓట్ల లెక్కింపు మొదలెట్టేప్పుడు ఆ యా కేంద్రాల్లో ఉంటారు. వారి లెక్కలు సరి చూసుకుంటే ఏ ఇబ్బందీ ఉండదనే వాదనొకటుంది.

ఈవీఎంలలో మాయ ఉందంటే... దానికి సాక్ష్యాలు, ఆధారాలు కావాలి. అనుమానాలు, గణాంకాల్లో సందేహాలున్నాయంటే దానికి బాధ్యుల నుంచి సమాధానాలు రావాలి. ప్రజలకు కావాల్సింది... పారదర్శక పాలనా వ్యవస్థలూ, పాలకుల నుంచి జవాబుదారీతనం... దట్సాల్!

వ్యాసకర్త పొలిటికల్ ఎనలిస్ట్, పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ డైరెక్టర్

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.త్రయోదశి సా.6.16 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** భరణి ఉ.6.50 వరకు, తదుపరి కృత్తిక తె.5.29 వరకు (తెల్లవారితే శనివారం), **వర్జ్యం:** సా.6.09 నుండి 7.38 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.35 నుండి 9.21 వరకు, తదుపరి ప.12.15 నుండి 1.01 వరకు, **అమృత ఘడియలు:** రా.3.11 నుండి 4.41 వరకు, హనుమద్వ్రతం; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.25, **సూర్యాస్తమయం:** 5.24.



హరీశ్ తల్లిదండ్రులకు డిపాజిట్ బాండ్ అందజేస్తున్న ఎస్సైలు

ఎస్సై హరీశ్ కుటుంబానికి రూ.16 లక్షల ఆర్థిక సాయం

రేగొండ: ములుగు జిల్లా వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ కుటుంబానికి సహచర పోలీసులు అండగా నిలిచారు. 2020 బ్యాచ్‌కు చెందిన ఎస్సైలంతా కలిసి రూ.16.15 లక్షలు డిపాజిట్ చేసి హరీశ్ తల్లిదండ్రులకు గురువారం అందజేశారు. కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లిలోని వారి నివాసానికి వెళ్లి హరీశ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఎస్సైతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. కార్యక్రమంలో 2020 బ్యాచ్ ఎస్సైలు శ్రీకర్, ప్రశాంత్, అశోక్, రాజుకుమార్, కమలాకర్, శరత్, తాజొద్దీన్, శ్రావణ్, అనిల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో 9వ తరగతి విద్యార్థిని మృతి

- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన



భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో గుండెపోటు తో 9వ తరగతి విద్యార్థిని మృతి చెందింది. మృతురాలి సోదరుడు తెలిపిన వివరాల మేరకు.. గ్యార స్వామి, యాదమ్మ దంపతుల కుమార్తె నవ్య (16) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కాగా మంగళవారం పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన కావ్య జ్వరంతో అస్వస్థతకు గురికాగా తల్లిదండ్రులు అదే రోజు రాత్రి స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించగా తగ్గింది. బుధవారం సాయంత్రం తిరిగి జ్వరం రావడంతో బీబీనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చూపించారు. అక్కడ పరీక్షించిన వైద్యుడు జ్వరం, బీపీ ఎక్కువ ఉందని చెప్పడంతో మేడ్చల్ జిల్లా మేడిపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి.. అనంతరం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. అయితే నవ్య మార్గమధ్యలోనే గుండెపోటుతో మృతి చెందిందని యశోద ఆసుపత్రి డాక్టర్లు తెలిపారు. ఆడపిల్ల కావాలనే కోరికతో స్వామి, యాదమ్మ దంపతులు రెండు నెలల వయసున్న నవ్యను బంధువుల నుంచి దత్తత తీసుకుని ఎంతో గారాబంగా పెంచుకున్నారు.

యాసంగిలో 42.48 లక్షల ఎకరాల ఆయకట్టు!

- పంటలకు 354 టీఎంసీల సాగునీటి సరఫరా
- నీటిపారుదల శాఖలోని స్కివం కమిటీ ప్రతిపాదన
- గత ఏడాది 28.95 లక్షల ఎకరాల ఆయకట్టే..



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పుష్కలంగా ఉండడంతో యాసంగి సీజన్‌లో సిరుల పంట పండనుంది. 2024–25 యాసంగి సీజన్‌లో రాష్ట్రంలోని భారీ, మధ్యతరహా, చిన్న నీటి ప్రాజెక్టులతో పాటు చెరువులు, ఎత్తిపోతల కింద ఏకంగా 42,48,780 ఎకరాల ఆయకట్టుకు మొత్తం 354.88 టీఎంసీల సాగునీటిని సరఫరా చేయాలని నీటిపారుదల శాఖలోని రాష్ట్ర స్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (స్కివం) రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఇందులో 24,54,429 ఎకరాల తడి (వెట్), 17,94,351 ఎకరాల పొడి (డ్రై/మెట్ట) పంటలున్నాయి. వర్షాభావంతో ప్రాజెక్టుల్లో నీళ్ల లేక గతేడాది యాసంగిలో కృష్ణా బేసిన్‌లోని నాగార్జునసాగర్‌తో పాటు కల్వకుర్తి, బీమా, పాలేరు, వైరా, మల్లూరు, లంకాసాగర్, గొల్లవాగు ప్రాజెక్టుల కింద పంటల విరామం ప్రకటించాల్సి వచ్చింది. అప్పట్లో 28.95 లక్షల ఎకరాల ఆయకట్టును మాత్రమే స్కివం కమిటీ ప్రతిపాదించింది. మొత్తం మీద గత మూడేళ్లతో పోల్చితే 2024–25 యాసంగిలో ప్రాజెక్టుల కింద గణనీయంగా సాగు విస్తీర్ణం పెరగనుంది.

ఎస్సారెస్పీ స్టేజీ–1,2 కింద 11.36లక్షల ఎకరాలకు నీళ్లు

ఎస్సారెస్పీ స్టేజీ–1 కింద 4,40,903 ఎకరాల తడి, 3,58,569 ఎకరాల పొడి పంటలు కలిపి మొత్తం 7,99,472 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. స్టేజీ–2 కింద 2,59,230 ఎకరాల తడి, 77,400 ఎకరాల పొడి పంటలు కలిపి మొత్తం 3,36,630 ఎకరాల ఆయకట్టును కమిటీ ప్రతిపాదించింది. ఇక నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా ఉండగా, సాగర్ ఎడమ కాల్వ కింద 6,38,385 ఎకరాలను కమిటీ ప్రతిపాదించింది. ఇందులో 4,75,890 ఎకరాల తడి, 475890 ఎకరాల పొడి పంటలున్నాయి.

కాళేశ్వరం కింద 93 వేల ఎకరాలకు నీళ్లు!

కాళేశ్వరం ప్రాజెక్టు కింద 93 వేల ఎకరాల ఆయకట్టును స్కివం కమిటీ ప్రతిపాదించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు దెబ్బతిని ఉండడంతో వాటిలో నీళ్లను నిల్వ చేయడం లేదు. అయితే ఈ ప్రాజెక్టు కింద సాగుకు 34.86 టీఎంసీల జలాలు లభ్యతగా ఉన్నాయని స్కివం కమిటీ అంచనా వేసింది. మల్లన్నసాగర్, కొండపాచమ్మసాగర్ తదితర జలాశయాల్లో ఉన్న నిల్వలకు తోడుగా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోయనున్న నీళ్లతో కాళేశ్వరం ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ప్రాజెక్టుల వారీ ఆయకట్టు వివరాలు (సాక్షి ఈ- పేపర్‌లో)

విద్యార్థులకు తగ్గట్టు టాయిలెట్లు ఉండాలి

- రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లలో వసతులపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. అవసరమైతే సైకియాట్రిస్ట్‌ను అందుబాటులో ఉంచాలని హితవు

సాక్షి, హైదరాబాద్: సర్కార్ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న వారంతా పేద కుటుంబాలకు చెందిన చిన్నారులని, వారి కోసం మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేసింది. వసతి గృహాల్లో పరుపులు, బెడ్‌షీట్లు, టవల్స్ అందించాలని, పాఠశాలల్లో కూడా విద్యార్థుల సంఖ్యకు తగినట్లు టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు నిర్మించాలని సూచించింది. వీటన్నింటిపై జనవరి 22లోగా స్థాయీనివేదిక అందజేయాలంటూ విచారణను వాయిదా వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో



అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతాప్రమాణాలు పాటించడం లేదని, ప్రైవేట్ బడుల్లో ఫీజు నియంత్రణకు కమిటీని నియమించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కీతినీడి అఖిల్ శ్రీ గురు తేజ 2023లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులు ఖైదీలుగా ఉంటున్నారన్నారు. వారికి అందించే సౌకర్యాల విషయంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని చెప్పారు. విద్యార్థులకు కల్పించాల్సిన వసతులపై ఆయన ఓ చార్ట్‌ను ధర్మాసనానికి సమర్పించారు. దీనికి ధర్మాసనం న్యాయవాదిని అభినందిస్తూ, వీటిని వీలైనంత త్వరగా కల్పించేలా చూడాలని అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్‌కు సూచించింది. ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పిల్లలకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏఏజీ చెప్పారు.

ధర్మాసనం పేర్కొన్న అంశాలివీ...

- ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు పరుపులు, దుప్పట్లు, బెడ్‌షీట్‌లు, దిండు, దోమతెర, కాటన్ టవల్స్ అందించాలి.
- విద్యార్థులకు శుద్ధి చేసిన తాగునీటిని మాత్రమే సరఫరా చేయాలి.
- నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ గైడ్‌లైన్స్ ప్రకారం మెనూ ఇవ్వాలి.
- విద్యార్థులకు సైకియాట్రిస్ట్/కౌన్సిలర్ అందుబాటులో ఉండాలి.

టీజీ ఫుడ్స్ కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వండి

- నాణ్యతలేని సరుకుల పంపిణీపై మంత్రి సీతక్క సీరియస్



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకుల్లో నాణ్యత పట్ల కఠినంగా వ్యవహరిస్తామని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో తెలంగాణ ఫుడ్స్ విభాగంపై ఆమె సమీక్ష నిర్వహించారు. తెలంగాణ ఫుడ్స్‌కు సరఫరా చేస్తున్న సరుకుల్లో నాణ్యత లేదంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఫుడ్స్‌కు సరఫరా చేస్తున్న పప్పు, నూనె తదితరాల సరఫరాకు నామినేటెడ్ పద్ధతిలో కాంట్రాక్టర్లను ఎంపిక చేయడంపైనా మంత్రి మండిపడ్డారు. ప్రతి అంశాన్ని టెండర్ ప్రాతిపదికనే చేపట్టాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసినప్పటికీ వైఖరి మార్చుకోకపోవడాన్ని తప్పుబడుతూ సంబంధిత అధికారులను మంత్రి సీతక్క మందలించారు. అదేవిధంగా టీజీఫుడ్స్ విభాగంలో కారుణ్య నియామకాలు, పదోన్నతుల విషయంలోనూ అవకతవకలు జరిగాయనే అంశం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవల భువనగిరిలో బాలామృతం దారి మళ్లింపు ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అనంతరం మహిళా సమాఖ్య సభ్యులకు యూనిఫాం చీరలకు సంబంధించి డిజైన్లను పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా 63 లక్షల మంది సభ్యులకు ఈ చీరలు ఉచితంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రాంచంద్రన్, కమిషనర్ కాంతివెస్లీ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయండి..

తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సచివాలయంలో వారు మంత్రి సీతక్కను కలిశారు. అంగన్‌వాడీ టీచర్ల వేతనాలను రూ.18 వేలకు పెంచాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ అమలు చేయాలని కోరారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా అభివృద్ధి చేసినప్పటికీ ఆ మేరకు వేతనాలు చెల్లించలేదని, దాదాపు ఏడు నెలల బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు యూనియన్ ప్రతినిధులు వెల్లడించారు.

రైతు కుటుంబాలకు పరిహారమెందుకు ఇవ్వలేదు?

- నాలుగు జిల్లాల కలెక్టర్లకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: పంటనష్టం కారణంగా ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం ఎందుకు ఇవ్వలేదని జిల్లా కలెక్టర్లను హైకోర్టు ప్రశ్నించింది. తాము ఉత్తర్వులు జారీ చేసినా పరిహారం ఇవ్వకపోవడాన్ని తప్పుబడుతూ.. వివరణ ఇవ్వాలని యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాల్‌పల్లి, జనగాం, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. పంటనష్టం కారణంగా ఆత్మహత్య చేసుకున్న రైతులకు రూ.6 లక్షలు పరిహారంగా చెల్లించాలని ప్రభుత్వం 2014లో జీవోలు 173, 194 జారీచేసింది. పలు జిల్లాల్లో దాదాపు 100 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటూ స్థానిక పోలీసులు జిల్లా కలెక్టర్లకు నివేదికలు సమర్పించారు. స్పష్టమైన నివేదికలున్నా ఆ రైతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదని సిద్దిపేటకు చెందిన సామాజిక కార్యకర్త బి.కొండల్‌రెడ్డి హైకోర్టులో 2022లో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం.. బాధిత కుటుంబాలకు నాలుగు నెలల్లో పరిహారం ఇవ్వాలని 2023, నవంబర్‌లో తీర్పునిచ్చింది. ఏడాది అయినా అధికారులు తీర్పును అమలు చేయడం లేదంటూ కొండల్‌రెడ్డి తాజాగా ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది.

16 నుంచి యాదగిరిగుట్టలో ధనుర్మాస ఉత్సవాలు

- నెల రోజులపాటు ఉదయం ఆలయ వేళల్లో మార్పులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఈనెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో భాస్కర్‌రావు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా వేకువజామున ఆలయ పూజ వేళల్లో మార్పులు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు రోజూ వేకువజామున 3.30 గంటలకు ఆలయాన్ని తెరిచి, 3.30 నుంచి 4 గంటల వరకు సుప్రభాతం, 4 గంటల నుంచి 5 గంటల వరకు తిరువారాధన, బాలభోగం ఆరగింపు నిర్వహిస్తారని వివరించారు. ఉదయం 5 గంటల నుంచి 5.45 వరకు తిరుప్పావై సేవాకాలం, తీర్థ ప్రసాదాల గోష్టి జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 5.45 నుంచి 6.45 గంటల వరకు శ్రీస్వామి వారికి నిజాభిషేకం, 6.45 నుంచి 7.15 గంటల వరకు సహస్రనామార్చన, 7.15 గంటల నుంచి సర్వ దర్శనాలు ఉంటాయని తెలిపారు. రోజూ 5 గంటల నుంచి 5.45 గంటల వరకు శ్రీస్వామి వారి ఆలయ ముఖమండపంపైన ఉత్తర భాగంలో ఉన్న హాల్‌లో అమ్మవారిని వేంచేపు చేసి తిరుప్పావై కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ధనుర్మాస ఉత్సవంలో భాగంగా జనవరి 13వ తేదీ రాత్రి 7 గంటలకు గోదా కల్యాణం, 14న ఉదయం 11.30 గంటలకు ఒడి బియ్యం సమర్పించే కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

సీఎం కప్ పోటీల్లో ఇద్దరు విద్యార్థినులకు అస్వస్థత

- ఒకరి పరిస్థితి విషమం

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారంలో బుధవారం మండల స్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభమయ్యాయి. 400 మీటర్ల పరుగుపందెంలో పాల్గొన్న రామన్నగూడెం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని గోపిక, కేజీబీవీ విద్యార్థిని అనిత వాంతులు చేసుకొని అపస్మారక స్థితికి చేరుకున్నారు. దీంతో వారిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి ఎంపీఓ కుమార్ తరలించి చికిత్స చేయించారు. అయితే గోపిక పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వారు తిన్న ఆహారం కలుషితం అయ్యిందా? లేదా ఒకే రోజు ఆటలు ముగిసిపోవాలని విద్యార్థులను ఒత్తిడికి గురి చేసి క్రీడలు నిర్వహించారా? అనే చర్చ జరుగుతోంది. ఇదే విషయంపై ఎంపీఓ కుమార్‌ను వివరణ కోరగా ఇద్దరు అస్వస్థతకు గురవగా ఆస్పత్రికి తరలించామని, ఎంజీఎంకు తరలించిన గోపిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించారు.



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న గోపిక

29 నుంచి కొమురవెల్లి మల్లన్న కల్యాణం

- జనవరి 19 నుంచి పది వారాలపాటు జాతర
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం కొమురవెల్లిలో మల్లికార్జున స్వామివారి కల్యాణోత్సవాలు ఈ నెల 29వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. స్వామివారి కల్యాణం, జాతరలను తెలంగాణ ఆధ్యాత్మిక సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వైభవోపేతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆమె.. సిద్దిపేట జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. 29న ఉదయం 10.45 గంటలకు మల్లికార్జున స్వామి కల్యాణాన్ని, జనవరి 19 నుంచి మార్చి 23 వరకు 10 వారాలపాటు జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. కొమురవెల్లి మల్లన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కిరీటాల తయారీ పనులపై ఆరా తీశారు.

విస్తృత ప్రచారం చేయండి: మల్లన్న కల్యాణం, జాతర ఉత్సవాలపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. ఎల్లమ్మ దేవాలయంలో మొక్కులు సమర్పించుకునే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు ఈ ఉత్సవాలకు తరలి వచ్చేలా ప్రచారం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి పాల్గొన్నారు.

ఐజేఎస్ఓలో నారాయణ విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ (ఐజేఎస్ఓ)–2024లో తమ విద్యార్థులు సత్తాచాటారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1 నుంచి 11వ తేదీ వరకు రొమేనియాలోని బుకారెస్ట్‌లో జరిగిన 21వ ఇంటర్నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ ఐజేఎస్ఓ ఫైనల్స్‌లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించి తమ అద్భుత ప్రతిభతో భవ్య గున్వాల్, శ్వేతాంక్ అగర్వాల్ గోల్డ్ మెడల్స్ సాధించారని వెల్లడించారు. నారాయణ విద్యార్థులు సాధించిన ఈ ఘనవిజయం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఈ విజయం ప్రపంచ వైజ్ఞానిక రంగాల్లో దేశ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఐజేఎస్ఓ 16 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న విద్యార్థుల కోసం అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పోటీ.

జమిలి బిల్లుకు సై

'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' ముసాయిదా బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర


న్యూఢిల్లీ: దేశంలో జమిలి ఎన్నికల దిశగా నరేంద్ర మోదీ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' ముసాయిదా బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ గురువారం సమావేశమైంది. జమిలి ఎన్నికల నిర్వహణకు వీలుగా రాజ్యాంగ సవరణకు ఉద్దేశించిన 'రాజ్యాంగ 129 (సవరణ) బిల్లు'ను సైతం ఆమోదించింది. కేంద్ర న్యాయశాఖ రూపొందించిన ఈ రెండు బిల్లులను ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభకు, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి ముసాయిదా బిల్లును కేబినెట్ ఆమోదించినట్లు తెలియజేశాయి. బిల్లుకు సంబంధించిన సాంకేతిక అంశాలను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మంత్రివర్గ సహచరులకు వివరించారు. 'ఒకే దేశం .. ఒకే ఎన్నిక' వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, వారిని చైతన్యపర్చాలని ప్రధాని మోదీ సూచించారు. నిజానికి లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలతోపాటు దేశవ్యాప్తంగా మున్సిపాలిటీలు, పంచాయతీలకు సైతం ఎన్నికలు ఏకకాలంలో నిర్వహించాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను కేంద్ర కేబినెట్ గతంలోనే ఆమోదించింది. కానీ, జమిలి ఎన్నికల్లో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రస్తుతానికి చేర్చకూడదని కేంద్రం నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం రాజ్యాంగ సవరణ బిల్లు రూపొందించారు. ఈ బిల్లు ఆమోదం పొందాలంటే లోక్‌సభ, రాజ్యసభలో మూడింట రెండొంతుల మెజారిటీతోపాటు కనీసం 50 శాతం రాష్ట్రాల అసెంబ్లీలు అంగీకారం తెలియజేయాలి. కేబినెట్ భేటీ అజెండాలో 'రాజ్యాంగ 129 (సవరణ) బిల్లు' తొలుత లేదని అమిత్ షా చెప్పారు. అయినప్పటికీ దానిపై చర్చించి, ఆమోదించామని అన్నారు.

వచ్చే ఏడాదే ఓటింగ్

లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీతోపాటు శాసనసభలు ఉన్న మూడు కేంద్ర పాలిత ప్రాంతాలు పుదుచ్చేరి, ఢిల్లీ, జమ్మూకశ్మీర్‌లో జమిలి ఎన్నికల నిర్వహణకు మూడు చట్టాల్లో సవరణలు చేయాల్సి ఉంది. గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ యాక్ట్–1991, గవర్నమెంట్ ఆఫ్ యూనియట్ టెరిటరీస్ యాక్ట్–1963, జమ్మూకశ్మీర్ రీఆర్గనైజేషన్ యాక్ట్–2019లో సవరణ చేయడానికి బిల్లు సిద్ధం చేశారు. ఈ మూడు చట్టాలను సవరించే బిల్లు సాధారణమైందే . దీనికి రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు. లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదిస్తే సరిపోతుంది. మరోవైపు జమిలి ఎన్నికల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తర్వాత జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) పరిశీలనకు పంపించనున్నారు. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్ల అభిప్రాయాలను ఈ కమిటీ ద్వారా స్వీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. మేధావులు, నిపుణులు, పౌర సమాజ సభ్యులతోపాటు సాధారణ ప్రజల అభిప్రాయాలు సైతం తెలుసుకోవాలని నిర్ణయానికొచ్చినట్లు సమాచారం. బిల్లుపై భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా విస్తృతస్థాయిలో సంప్రదింపులు జరగాలన్నదే ప్రభుత్వ యోచన. అందరి అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత బిల్లుపై వచ్చే ఏడాది జరిగే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఓటింగ్ జరిగే అవకాశం ఉంది.

బిల్లు ఆమోదం పొందాలంటే?

జమిలి ఎన్నికల బిల్లు ప్రత్యేకమైంది. ఇది రాజ్యాంగ సవరణలతో ముడిపడిన వ్యవహారం. బిల్లు నెగ్గాలంటే పార్లమెంట్ ఉభయ సభల్లోనూ మూడింట



రెండొంతుల మెజారిటీ అవసరం. రాజ్యసభలో మొత్తం ఎంపీల సంఖ్య 243. ప్రస్తుతం కొన్ని స్థానాలు ఖాళీగా ఉన్నాయి. బిల్లు ఆమోదం పొందాలంటే 164 మంది సభ్యులు మద్దతు పలకాలి. ఎన్డీయేకు 122 మంది సభ్యులున్నారు. ఎగువ సభలో ఖాళీల భర్తీ తర్వాత ఎన్డీయే బలం పెరుగనుంది. లోక్‌సభలో ప్రస్తుతం 542 మంది ఎంపీలున్నారు. ఒక స్థానం ఖాళీగా ఉంది. బిల్లుకు అనుకూలంగా కనీసం 361 ఓట్లు రావాలి. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం సాధారణ మెజారిటీతోనే మనుగడ సాగిస్తోంది. ఎన్డీయేకు 293 మంది ఎంపీలున్నారు. విపక్ష ఇండియా కూటమికి 235 మంది ఎంపీలున్నారు. బిల్లు ఆమోదం పొందడానికి బీజేపీ కూటమి మరో 68 మంది ఎంపీల మద్దతు కూడగట్టాల్సి ఉంది. అది అంత కష్టం కాకపోవచ్చు. జమిలి ఎన్నికల విషయంలో రామ్‌నాథ్ కోవింద్ కమిటీ 47 రాజకీయ పార్టీల అభిప్రాయాలు స్వీకరించగా, 32 పార్టీలు మద్దతిచ్చాయి. 15 పార్టీలు వ్యతిరేకించాయి.

కోవింద్ కమిటీ కీలక సిఫార్సులు

కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు రామ్‌నాథ్ కోవింద్ కమిటీ 2023 సెప్టెంబర్ 2న తమ కార్యాచరణ ప్రారంభించింది. రాజకీయ పార్టీలు, భాగస్వామ్యపక్షాలతో సుదీర్ఘంగా సంప్రదింపులు జరిపింది. అందరి అభిప్రాయాలు సేకరించింది. 191 రోజుల కసరత్తు అనంతరం నివేదికను సిద్ధం చేసింది. 18,626 పేజీల ఈ నివేదికను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఈ ఏడాది మార్చి నెలలో సమర్పించింది. కోవింద్ కమిటీ సిఫార్సులను ఈ ఏడాది సెప్టెంబర్‌లో కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఈ సిఫార్సులు ఏమిటంటే..

- దేశంలో గతంలో అమలైన జమిలి ఎన్నికలను పునరుద్ధరించడానికి ప్రభుత్వం చట్టపరమైన కట్టుదిట్టాలు చేయాలి. పటిష్టమైన చట్టం తీసుకురావాలి.
- జమిలి ఎన్నికల్లో భాగంగా తొలి అంచెలో లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలి.
- రెండో అంచెలో మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఒకేసారి ఎన్నికలు జరపాలి. లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు పూర్తయిన తర్వాత 100 రోజుల్లోగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలి.
- జమిలి ఎన్నికలు పూర్తయ్యాక లోక్‌సభ మొదటి సమావేశానికి తేదీని(అపాయింటెడ్ డే) రాష్ట్రపతి నోటిఫై చేయాలి. ఆ రోజు నుంచే లోక్‌సభ గడువు మొదలవుతుంది.
- అపాయింటెడ్ డే ప్రకారమే రాష్ట్రాల అసెంబ్లీలు కొలువుదీరుతాయి. ఆ రోజు నుంచి వాటి గడువు ప్రారంభమవుతుంది. లోక్‌సభ గడువుతోపాటే అసెంబ్లీల గడువు కొనసాగుతుంది. గడువు ముగిసిన తర్వాత మళ్లీ జమిలి ఎన్నికలు చేపట్టాలి.
- లోక్‌సభలో హంగ్ లేదా అవిశ్వాస తీర్మానం వల్ల ప్రభుత్వం పడిపోతే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి. కొత్త లోక్‌సభను ఎన్నుకోవాలి.
- ఈ కొత్త సభ పూర్తి ఐదేళ్ల మనుగడలో ఉండదు. దీని కంటే ముందున్న సభ కాలపరిమితి ముగిసే తేదీ వరకే కొత్త సభ గడువు కొనసాగుతుంది. అంటే పాత సభ గడువే కొత్త సభకు సైతం వర్తిస్తుంది.
- రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మధ్యలోనే కూలిపోతే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి. కొత్తగా కొలువుదీరిన శాసనసభ కాలపరిమితి ఆ సమయంలో ఉన్న లోక్‌సభ గడువు ముగిసే వరకే కొనసాగుతుంది. అనంతరం లోక్‌సభతోపాటే ఆ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలి.
- జమిలి ఎన్నికలకు వీలుగా కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రాల ఎన్నికల సంఘాలతో సంప్రదింపులు జరిపి ఒకే ఓటర్ల జాబితా రూపొందించాలి.
- వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌కు కేంద్ర ఎన్నికల సంఘం తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలి. తగిన సంఖ్యలో ఈవీఎంలు, వీవీప్యాట్లు సమకూర్చుకోవాలి.

ఎప్పుడు జరగొచ్చు?

ప్రస్తుత 18వ లోక్‌సభ గడువు 2029 దాకా ఉంది. 2029 కంటే ముందు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో శాసనసభల గడువు ముగియనుంది. 2027లో గోవా, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్ తదితర కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. అదే సమయంలో జమిలి ఎన్నికలు నిర్వహించడానికి మోదీ సర్కారు ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

→ **2025లో ఎన్నికలు జరిగే రాష్ట్రాలు**
ఢిల్లీ, బిహార్

→ **2026లో..**
అస్సాం, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి, తమిళనాడు, కేరళ

→ **2027లో..**
గోవా, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్

→ **2028లో..**
త్రిపుర, మేఘాలయా, నాగాలాండ్, కర్ణాటక, మిజోరాం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ

→ **2029లో..**
అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జమ్మూకశ్మీర్, హరియాణా, జార్ఖండ్, మహారాష్ట్ర



ప్రజాధనం ఆదా: బీజేపీ

ఒకే దేశం.. ఒకే ఎన్నికను ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. ప్రతిఏటా దేశంలో ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుండడంతో అభివృద్ధికి విఘాతం కలుగుతోందని ఆయన చెబుతున్నారు. ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి పనులు ఆపేయాల్సి వస్తోందని, ఇది మంచి పరిణామం కాదని అంటున్నారు. దేశమంతటా ఒకేసారి ఎన్నికలు ముగించేస్తే పరిపాలనపై దృష్టి పెట్టడానికి, అభివృద్ధిని పరుగులు పెట్టించడానికి ఎలాంటి అవరోధాలు ఉండవని అభిప్రాయపడుతున్నారు. జమిలి ప్రతిపాదనను మోదీ 2016 డిసెంబర్‌లో తొలిసారిగా తెరపైకి తెచ్చారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రత్యేకంగా హామీ ఇచ్చారు. బీజేపీ మిత్రపక్షాలు జమిలికి మద్దతు ఇస్తున్నాయి. ఒకేసారి ఎన్నికలతో ఎన్నికల నిర్వహణ ఖర్చు భారీగా తగ్గుతుందని, ప్రజాధనం ఆదా అవుతుందని బీజేపీ వర్గాలు వాదిస్తున్నాయి.

జనం దృష్టిని మళ్లించడానికే జమిలి జపం: కాంగ్రెస్

జమిలి ఎన్నికల ప్రతిపాదనను కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యతిరేకించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో నేడు ఎన్నికల సమగ్రతపై తలెత్తుతున్న ప్రశ్నల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే మోదీ సర్కారు జమిలి జపం చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆరోపించారు. జమిలి ఎన్నికల బిల్లు పార్లమెంట్‌లో చర్చకు వచ్చినప్పుడు జేపీసీ పరిశీలనకు పంపించాలని కోరుతామని అన్నారు. జమిలి ఎన్నికలు దేశ సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తాయని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ స్పష్టంచేశారు. కనీసం మూడు నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించలేని ప్రభుత్వం జమిలి ఎన్నికలు ఎలా నిర్వహించగలదని ప్రశ్నించారు. జమిలి బిల్లును కేంద్ర కేబినెట్ ఆమోదించడాన్ని తమిళనాడు సీఎం స్టాలిన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తదితరులు తప్పుపట్టారు. బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం, సమాఖ్య వ్యతిరేకమని తేల్చిచెప్పారు. క్రూరమైన ఈ బిల్లును పార్లమెంట్‌లో కచ్చితంగా వ్యతిరేకిస్తామని స్పష్టంచేశారు.

ఏయే ఆర్టికల్స్ సవరించాలి?

దేశంలో వివిధ ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులు, మార్గదర్శకాలకు ఉద్దేశించిన 1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయాల్సి ఉంటుంది. దీనితోపాటు పలు కీలక రాజ్యాంగ సవరణలకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేయాల్సి ఉంటుంది. జమిలి ఎన్నికలకు ప్రధానంగా కొన్ని రాజ్యాంగ సవరణలు అవసరం.

- లోక్‌సభ, రాజ్యసభల కాలపరిమితికి సంబంధించిన ఆర్టికల్ 83కు సవరణ
- రాష్ట్రాల అసెంబ్లీలకు ఐదేళ్ల గడువును నిర్దేశించే ఆర్టికల్ 172(1)కు సవరణ
- అత్యయిక పరిస్థితుల సమయంలో సభ కాల పరిమితిని ఏడాదికి మించకుండా పార్లమెంటు చట్టం ద్వారా వీలు కల్పించే ఆర్టికల్ 83(2)కు సవరణ
- రాష్ట్రపతికి లోక్‌సభను రద్దు చేసే అధికారాలిచ్చే ఆర్టికల్ 85(2)(బి)కు సవరణ.
- రాష్ట్ర అసెంబ్లీల రద్దు అధికారం గవర్నర్‌కు దఖలు పరిచే ఆర్టికల్ 174(2)(బి)కు సవరణ
- రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలనకు వీలు కల్పించే ఆర్టికల్ 356కి సవరణ
- ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన ఆర్టికల్ 324కి సవరణ

నేపథ్యం

పార్లమెంట్‌తో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకూ ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం మన దేశంలో కొత్తేమీ కాదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక.. 1951 నుంచి 1967 దాకా దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు జరిగాయి. తర్వాత వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కూలడం వల్ల మధ్యంతర ఎన్నికలొచ్చాయి. ఆయా రాష్ట్రాల అసెంబ్లీల గడువులు మారాయి. ప్రస్తుత పరిస్థితుల్లో జమిలి ఎన్నికలు చేపట్టాలంటే కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల గడువును పెంచడం, మరికొన్నింటిని తగ్గించడం చేయాలి. లోక్‌సభ ముందస్తు ఎన్నికలకు వెళ్లినా ఈ మార్పులు తప్పవు.

ఏయే దేశాల్లో జమిలి?

జమిలి ఎన్నికలు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో అమల్లో ఉన్నాయి. దక్షిణాఫ్రికా, స్వీడన్, బెల్జియం, జర్మనీ, జపాన్, ఇండోనేసియా, ఫిలిప్పైన్స్ తదితర దేశాల్లో జమిలి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఆయా దేశాల్లో ఎన్నికల తీరును రామ్‌నాథ్ కోవింద్ కమిటీ అధ్యయనం చేసింది. జమిలితో మంచి ఫలితాలు వస్తున్నట్లు గుర్తించింది.

పెద్దల మాదిరిగానే పదేళ్ల పిల్లలకూ జైలు శిక్షలు

కఠిన చట్టం తీసుకొచ్చిన ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ ప్రభుత్వం

క్వీన్స్‌ల్యాండ్: హత్య, తీవ్ర దాడి, దోపిడీల వంటి 13 నేరాలకు పాల్పడినట్లు రుజువైతే 10 ఏళ్ల బాలలకు సైతం పెద్దలకు మాదిరిగానే శిక్షలు వేసేందుకు ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ రాష్ట్రం చట్టం చేసింది. హత్య నేరానికైతే కనీసం 20 ఏళ్ల ఎటువంటి పెరోల్ లేకుండా జీవితకాల జైలు శిక్ష పడే అవకాశముంది. గతంలో ఇది గరిష్టంగా పదేళ్లే ఉండేది. క్వీన్స్‌ల్యాండ్‌లో గత 14 ఏళ్లలో పిల్లల నేరాలు సగానికి సగం తగ్గినట్లు గణాంకాలు చెబుతు న్నాయి. 2022 నుంచి నేరాల రేటు స్థిరంగా కొనసా గుతోంది. అయితే, దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే క్వీన్స్‌ల్యాండ్ జైళ్లలోనే ఎక్కువ మంది పిల్లలుండటం గమనార్హం. పిల్లలు కూడా నేరాలకు పాల్పడుతుండటంపై ప్రజాగ్రహం వ్యక్తమవు తున్నందు వల్లే చట్టాలను కఠినతరం చేశామని, దీనివల్ల నేరాలు తగ్గుతాయని ఆశిస్తు న్నామని ప్రభుత్వం అంటోంది. అయితే, నేరాలు తగ్గడం అటుంచి పెరిగే ప్రమాదముందని నిపుణు లు ఆందోళన చెందుతున్నారు. ఇది చిన్నారుల మానవ హక్కులు, అంతర్జాతీయ చట్టాలకు భంగకరమని ఐరాస పేర్కొంది.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఏడుగురు మావోయిస్టులు మృతి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవుల్లో గురువారం మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నారాయణపూర్ –దంతెవాడ –బీజాపూర్ జిల్లాల సరిహద్దులోని దట్టమైన అడవుల్లో ఇంద్రావతి –మాడ్ ఏరియాలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో మంగళవారం నుంచి బలగాలు కూంబింగ్ చేపట్టాయి. గురువారం తెల్లవారు జామున ఇరువర్గాలు ఎదురుపడటంతో పరస్పరం మొదలైన కాల్పులు దాదాపు ఏడు గంటలపాటు కొనసాగాయి. అనంతరం ఘటనా స్థలంలో మాడ్ డివిజన్ ఏరియా కమిటీకి చెందిన ఇద్దరు మహిళలు సహా ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలు లభించాయని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. గాలింపు కొనసాగుతోందని వెల్లడించారు. ఈ సెర్చ్ ఆపరేషన్‌లో వెయ్యి మంది జవాన్లు పాల్గొన్నారని, వీరెవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదని వివరించారు.

15న అమిత్ షా పర్యటన..

బస్తర్ ప్రాంతంలోని దండకారణ్యంపై మావోయిస్టుల ఆధిపత్యానికి భద్రతా దళాలు చెక్ పెడుతున్నాయి. ఇప్పుడు మాడ్‌పైనా పట్టు సాధిస్తూ మావోయిస్టుల ఉనికికే సవాల్ విసురు తున్నాయి. అక్టోబర్ 4న జరిగిన ఎదురుకాల్పుల్లో 38 మంది మావోయిస్టులు చనిపోయారు. ఈ ఘటన నుంచి ఇంకా ఆ పార్టీ తేరుకోకముందే మరో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. బస్తర్ ఏరియాలో ఈనెల 15న కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్ పర్య టిస్తున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

మేం చెప్పేదాకా సర్వేలపై ఉత్తర్వులు, తీర్పులు ఆపండి

- తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏ కోర్టులోనూ ప్రార్థనా స్థలాల చట్టంపై పిటిషన్లు తీసుకోకండి
- పెండింగ్ కేసులపై మధ్యంతర ఉత్తర్వులొద్దు
- 'ప్రార్థనాస్థలాల యథాతథ స్థితి' కేసులపై సుప్రీంకోర్టు కీలక సూచన

న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం సిద్ధించిన నాటికి ఉన్న ప్రార్థనాస్థలాలను యథాతథ స్థితిలోనే కొనసాగించాలని నిర్దేశించే 1991నాటి చట్టంలోని సెక్షన్లను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం కీలకమైన సూచనలు చేసింది. ప్రార్థనాస్థలాల్లో సర్వేలపై వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంగానీ, తీర్పులు చెప్పడంగానీ చేయొద్దని సుప్రీంకోర్టు సూచించింది. ఈ కేసులపై తమ తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా తమ ఆదేశాలే అమల్లో ఉంటాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం స్పష్టంచేసింది. ప్రార్థనాస్థలాలు ముఖ్యంగా మసీదులు, దర్గాల వద్ద సర్వేలు చేపట్టడాన్ని సవాల్ చేస్తూ, సమర్థిస్తూ కొత్తగా ఎలాంటి ఫిర్యాదులు, కేసులను తీసుకోవద్దని ధర్మాసనం దేశంలోని అన్ని కోర్టులకు సూచించింది. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలోని జ్ఞానవాపి మసీదు, మథురలోని షాహీ ఈద్గా మసీదు, సంభాల్‌లోని షాహీ జామా మసీదు, ఢిల్లీలోని కుతుబ్ మినార్ దగ్గర్లోని ఖ్వాత్–ఉల్–ఇస్లామ్ మసీదు, మధ్యప్రదేశ్‌లోని కమల్ మౌలా మసీదు సహా 10 మసీదులు ఉన్న ప్రాంతాల్లో గతంలో హిందూ ఆలయాలు ఉండేవని, ఆయా స్థలాల్లో సర్వే చేపట్టి ఆ ప్రాంతాల వాస్తవిక మత విశిష్టతను తేల్చాలంటూ 18 కేసులు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. వీటిని విచారించిన సందర్భంగా గురువారం సుప్రీంకోర్టు పై విధంగా స్పందించింది. ప్రార్థనాస్థలాల(ప్రత్యేక అధికారాల)చట్టం, 1991లోని 2, 3, 4వ సెక్షన్ల చట్టబద్ధతను సవాల్‌చేస్తూ న్యాయవాది అశ్వినీ వైష్ణవ్ తదితరులు దాఖలుచేసిన ఆరు పిటిషన్లనూ ఈ స్పెషల్ బెంచ్ గురువారమే విచారించింది. 1947 ఆగస్ట్ 15నాటికి ఉన్న ప్రార్థనాస్థలాల యథాతథస్థితిని మార్చడానికి వీల్లేదంటూ 1991 చట్టంలో పలు సెక్షన్లు పొందుపరిచారు. ఈ సెక్షన్లు అయోధ్యలోని రామజన్మభూమి–బాబ్రీ మసీదు వివాదానికి వర్తించవంటూ గతంలో సుప్రీంకోర్టు ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు చెప్పి ఆ స్థలాన్ని హిందూవర్గానికి కేటాయించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే వారణాసి, మథుర, సంభాల్ తదితర ప్రాంతాల్లో దశాబ్దాల నాటి మసీదులు, దర్గాలున్న స్థలాల వాస్తవిక మత లక్షణాన్ని తేల్చాలని కొత్తగా పిటిషన్లు పుట్టుకొచ్చిన విషయం విదితమే.

కేంద్రానికి 4 వారాల గడువు

'' ఉత్తర్వులను నిలుపుదలచేస్తూ అన్ని కోర్టులను ఆదేశించడానికి ముందే సంబంధిత కేసుల్లో కక్షిదారుల వాదనలను సుప్రీంకోర్టు వినాలి'' అని హిందువుల తరఫున హాజరైన సీనియర్ లాయర్ జే.సాయి దీపక్ కోరారు. దీనిపై సీజేఐ '' కింది కోర్టులు సుప్రీంకోర్టు కంటే పెద్దవైతే కాదుకదా. ఈ అంశంపై సుప్రీంకోర్టు విస్తృతస్థాయిలో పరిశీలిస్తున్నపుడు కింది కోర్టులకు ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం సహజమే. అయినా ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వం స్పందన లేకుండా ముందుకు వెళ్లలేం. నాలుగు వారాల్లోపు కేంద్రం తన స్పందనను తెలియజేయాలి. కేంద్రం స్పందన తెలిపాక మరో నాలుగు వారాల్లోపు సంబంధిత కక్షిదారులు వారి స్పందననూ కోర్టుకు తెలియజేయాలి'' అని సూచించారు. ఈ అంశానికి సంబంధించి 2022 సెప్టెంబర్‌లో దాఖలైన ప్రధాన పిటిషన్ విషయంలో కోర్టు కేంద్రానికి నోటీసులు పంపింది. 1991 చట్టాన్ని సవాల్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ జ్ఞానవాపి మసీదు మేనేజ్‌మెంట్ కమిటీ తదితర సంస్థలు ముస్లింల తరఫున కేసులు వేశాయి. 1991 చట్టాన్ని తప్పుబట్టి తద్వారా మసీదుల ప్రాచీన ఉనికిని ప్రశ్నార్థకం చేయాలని చూస్తున్నారని మసీదు కమిటీలు వాదిస్తున్నాయి.



భరణం నిర్ణయించడానికి 8 సూత్రాలు

- విడాకుల కేసు నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు
- దేశవ్యాప్తంగా కోర్టులకు దిశానిర్దేశం
- బెంగళూరు టెకీ ఆత్మహత్యతో కీలకంగా మారిన 'భరణం'

న్యూఢిల్లీ: విడాకుల అనంతరం మహిళకు ఇచ్చే 'భరణం' విషయమై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ప్రవీణ్ కుమార్ జైన్, అంజు జైన్ దంపతుల విడాకుల కేసును విచారించిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న వి వర్లేలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రవీణ్ కుమార్ జైన్ తన భార్యకు భరణం కింద రూ.5 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఈ సందర్భంగా మహిళకు జీవనభృతిని నిర్ణయించడానికి ముందు ఎనిమిది అంశాలను రూపొందించింది. దేశవ్యాప్తంగా అన్ని కోర్టులు భరణం కోసం తమ ఆదేశాలను ప్రాతిపదికగా తీసుకోవాలని సూచించింది.

కోర్టు సూచించిన ఎనిమిది సూత్రాలు

1. భార్యాభర్తల సామాజిక, ఆర్థిక స్థితిగతులు
2. భవిష్యత్తులో భార్యాపిల్లల ప్రాథమిక అవసరాలు
3. ఇరుపక్షాల అర్హత, ఉద్యోగం
4. ఆదాయ మార్గాలు, ఆస్తులు
5. అత్తవారింట్లో ఉంటూ భార్య జీవన ప్రమాణాలు
6. కుటుంబ పోషణ కోసం ఆమె ఉద్యోగాన్ని వదిలేసిందా?
7. ఉద్యోగం చేయని భార్యకు న్యాయపోరాటానికి సహేతుకమైన మొత్తం
8. మెయింటెనెన్స్ అలవెన్స్‌తో పాటు భర్త ఆర్థిక స్థితి, అతని సంపాదన, ఇతర బాధ్యతలు

కుమారుడి కోసం కోటి రూపాయలు

ప్రవీణ్ – అంజు జైన్ విడాకుల కేసులో తీర్పు వెలువరించిన ధర్మాసనం తన పెద్ద కుమారుడి పోషణ, ఆర్థిక భద్రత కోసం కోటి రూపాయలు కేటాయించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. పెళ్లయిన తర్వాత ఆరేళ్ల పాటు కలిసి ఉన్న ఈ జంట ఆ తర్వాత 20 ఏళ్లు విడివిడిగా ఉంటున్నారు. వీరిద్దరి మధ్య విభేదాలు, విభేదాలు తలెత్తాయనే ఆరోపణలు వీరి పెళ్లికి కారణమయ్యాయి. అంజు హైపర్ సెన్సిటివ్ అని, ఆమె తన కుటుంబంతో నిర్లక్ష్యంగా వ్యవహరించేదని ప్రవీణ్ ఆరోపించారు. మరోవైపు ప్రవీణ్ ప్రవర్తన తన పట్ల సరిగా లేదని అంజు ఆరోపించింది. ఇంతకాలం విడివిడిగా ఉంటున్న ఈ జంట కేసులో పెళ్లికి అర్థం, అనుబంధం, బంధం పూర్తిగా తెగిపోయాయని కోర్టు అభిప్రాయపడింది. ఆ తర్వాత షరతులను పేర్కొంటూ కోర్టు విడాకులకు ఆమోదం తెలిపింది. భార్య తనపై తప్పుడు కేసు పెట్టిందంటూ బెంగళూరు టెక్కీ అతుల్ సుభాష్ ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఈ భరణం ఆర్డర్ చర్చనీయాంశమైంది.

పార్లమెంట్‌లో అదే రగడ

- రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదాలు, నినాదాలు
- పలుమార్లు వాయిదా పడిన ఎగువ సభ
- లోక్‌సభలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్(సవరణ) బిల్లుపై విపక్షాల అభ్యంతరం

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఉభయ సభల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య రగడ యథాతథంగా కొనసాగింది. ప్రధానంగా రాజ్యసభలో గురువారం వాగ్వాదాలు, నిరసనలు, నినాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో సభ పలుమార్లు వాయిదా పడింది. రాజ్యసభలో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మాన నోటీసు ఇవ్వడం పట్ల అధికార బీజేపీ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అమెరికా బిలియనీర్ జార్జి సోరోస్‌తో కాంగ్రెస్ పెద్దలకు సంబంధాలు ఉన్నాయని, దేశాన్ని అస్థిరపర్చడానికి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ సభ్యుల ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము లేవనెత్తిన అంశాలపై సభలో వెంటనే చర్చ ప్రారంభించాలని కోరుతూ విపక్షాలు ఇచ్చిన ఆరు నోటీసులు చైర్మన్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. సభలో కేంద్ర మంత్రి జె.పి.నడ్డా మాట్లాడారు. ధన్‌ఖడ్ బీజేపీ ప్రతినిధిగా పని చేస్తున్నారంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన ఆరోపణలను ఖండించారు. చైర్మన్ ఇచ్చిన రూలింగ్‌ను విమర్శించడం సభా మర్యాదను ఉల్లంఘించడమే, సభాధ్యక్ష స్థానాన్ని అగౌరవపర్చడమే అవుతుందని అన్నారు. చైర్మన్‌ను చీర్‌లీడర్ అనడం ఏమిటని కాంగ్రెస్ నేతలపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్యం అంటే, పార్లమెంటరీ సంప్రదాయాలు అంటే గౌరవం లేదని ఆక్షేపించారు. జార్జి సోరోస్‌కు, సోనియా గాంధీకి సంబంధాలు ఏమిటని నిలదీశారు. దీనిపై దేశ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మన దేశాన్ని ముక్కలు చేయడానికి సోరోస్ కోట్లాది డాలర్లు పెట్టుబడులు పెడుతున్నాడని నడ్డా ధ్వజమెత్తారు. నడ్డాపై వ్యాఖ్యలపై సభలో మల్లికార్జున ఖర్గే స్పందిస్తుండగా, బీజేపీ సభ్యులు పెద్ద ఎత్తున నినదాలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు డెరెక్ ఓ బ్రెయిన్ మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై హింసాకాండపై ప్రధాని మోదీ స్పందించాలని, సభకు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో బీజేపీ సభ్యులు నినాదాలు ప్రారంభించారు. సభ ఎంతకీ అదుపులోకి రాకపోవడంతో శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ధన్‌ఖడ్ ప్రకటించారు.

ముఖం దాచుకోవడానికి ప్రయత్నిస్తున్నా: గడ్కరీ

దేశంలో రోజురోజుకూ రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ప్రమాదాల నివారణపై ఆయన లోక్‌సభలో గురువారం సమాధానం ఇచ్చారు. ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. విదేశాల్లో జరిగే సమావేశాలకు వెళ్లినప్పుడు మన దేశంలో రోడ్డు ప్రమాదాల ప్రస్తావన వస్తే తన ముఖాన్ని దాచుకునేందుకు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. అయితే రోడ్డు ప్రమాదాలు తగ్గాలంటే ప్రజల్లో మార్పు రావాల్సిందేనని తేల్చిచెప్పారు. మరోవైపు డిజాస్టర్ మేనేజ్‌మెంట్(సవరణ) బిల్లు–2024ను లోక్‌సభలో విపక్ష సభ్యులు వ్యతిరేకించారు. వాతావరణ మార్పులను ఎలా ఎదుర్కొంటారో ఈ బిల్లులో ప్రస్తావించలేదని విమర్శించారు. ఈ బిల్లు గురువారం లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది.



'టైమ్స్' ఈ ఏటి మేటి వ్యక్తి ట్రంప్

వాషింగ్టన్: కాబోయే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రఖ్యాత టైమ్ మేగజైన్ ఈ ఏటి మేటి వ్యక్తిగా గుర్తించింది. ఈ గౌరవం ఆయనకు దక్కడం ఇది రెండోసారి. 2016లోనూ ట్రంప్ 'పర్సన్ ఆఫ్ ఇయర్' అయ్యారు. '2024 పర్సన్ ఆఫ్ ఇయర్ ట్రంప్' అని టైమ్స్ ఎడిటర్ ఇన్ చీఫ్ శామ్ జాకోబ్ చెప్పారు. ఈ సందర్భంగా ట్రంప్ గురువారం ఉదయం న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఓపెనింగ్ బెల్ మోగించారు.

39 మందికి బైడెన్ క్షమాభిక్ష

1,500 మందికి శిక్ష తగ్గింపు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా పదవీకాలం మరికొద్ది రోజుల్లో ముగుస్తుండటంతో బైడెన్ క్షమాభిక్ష, శిక్షాకాలం తగ్గింపుల జోరు పెంచారు. అమెరికా చరిత్రలో ఎన్నడూలేనంతగా ఒకేసారి ఒకేరోజు 1,500 మంది ఖైదీలకు శిక్షాకాలం తగ్గించారు. మాదకద్రవ్యాల వినియోగం, స్వలింగ సంపర్కాలు తదితర నేరాలుచేసిన వాళ్లు వీరిలో ఉన్నారు. హింసాత్మకంకాని నేరాల్లో దోషులుగా తేలి శిక్ష అనుభవిస్తున్న మరో 39 మంది ఖైదీలకు బైడెన్ ఏకంగా క్షమాభిక్ష ప్రసాదించారు. ఆధునిక అమెరికాలో ఒక అధ్యక్షుడు ఒకే రోజులో ఇంతమంది ఖైదీల పట్ల దయ చూపడం ఇదే తొలిసారి కావడం విశేషం. కోవిడ్ సంక్షోభకాలంలో కారాగారాల్లో కరోనా విజృంభించి ఎక్కువ మంది ఖైదీలు వైరస్‌బారిన పడి మృతిచెందడం కంటే విడిగా దూరం దూరంగా ఉంటే మంచిదని భావించి ఆనాడు చాలా మందిని బైడెన్ సర్కార్ విడిచిపెట్టింది. అలా స్వస్థలాలకు వెళ్లిన ఖైదీలను కొని నెలలపాటు గృహనిర్బంధంలో ఉంచింది. గురువారం వీళ్లంతా శిక్షాకాలం తగ్గింపు ఉపశమనం పొందారు.

'దోస్త్' కటీఫ్!

డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్లకు సర్కార్ స్వస్తి చెప్పే యోచన

- భారీగా మిగిలిపోతున్న సీట్లు.. ముందే జాగ్రత్త పడుతున్న ప్రైవేటు కాలేజీలు
- దీంతో వచ్చే సంవత్సరం నుంచి పాత పద్ధతిలోనే ప్రవేశాలు
- దోస్త్‌పై ఉన్నత విద్యామండలి మనోగతం
- త్వరలో ప్రభుత్వానికి నివేదిక

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ప్రస్తుతమున్న 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్– తెలంగాణ (దోస్త్)' విధానాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. డిగ్రీ ప్రవేశాలను పాత విధానంలోనే చేపట్టాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీంతో ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు పూర్తి స్వేచ్ఛ లభించే వీలుంది. ఎవరికి సీటివ్వాలి? ఎవరికి ఇవ్వకూడదనేది కాలేజీలే నిర్ణయించేందుకు ఇది అవకాశం కల్పిస్తుంది. ఉన్నత విద్యామండలి దీనిపై ఇప్పటికే చేపట్టిన అధ్యయనం తుది దశకు చేరుకోగా, త్వరలో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. దీన్ని ఆమోదిస్తే, వచ్చే విద్యా సంవత్సరం (2025–26) నుంచి దోస్త్‌ను ఎత్తివేసినట్టేనని మండలి వర్గాలు చెబుతున్నాయి. 'దోస్త్'ను కొన్ని కాలేజీలు కొన్నేళ్లుగా వ్యతిరేకిస్తున్నాయి. అవి ఇప్పటికీ దోస్త్ జాబితాలో చేరలేదు. ఆయా కాలేజీల ఒత్తిడి మేరకే దోస్త్‌కు స్వస్తి చెప్పబోతున్నట్లు విద్యాశాఖలో చర్చ జరుగుతోంది. దీనిపై అన్నివర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి.

ఏమిటీ దోస్త్?

రాష్ట్రవ్యాప్తంగా 1,055 ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీలున్నాయి. గతంలో డిగ్రీ సీటు కోసం ప్రతీ కాలేజీలోనూ రుసుం చెల్లించి దరఖాస్తు చేయాల్సిన పరిస్థితి ఉండేది. సీటు ఎక్కడ వచ్చిందో తెలుసుకునేందుకు ప్రతీ కాలేజీకి వెళ్లాల్సి వచ్చేది. సీటు రాకపోతే మరో కౌన్సెలింగ్ పెట్టే వరకూ అన్ని కాలేజీలూ తిరగాలి. విభిన్న కోర్సుల కోసం వివిధ దరఖాస్తులు చేయాల్సి వచ్చేది. ఈ విధానం వల్ల విద్యార్థులు వ్యయ ప్రయాసలకు గురయ్యేవాళ్లు. దీనిపై జాతీయస్థాయిలో విస్తృత చర్చ జరగ్గా, ఆన్‌లైన్‌లో ఏకీకృత ప్రవేశాలు ఉండాలంటూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 2015లో ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో 2016 నుంచి దోస్త్ ద్వారా ప్రవేశాలు చేపడుతున్నారు. మారుమూల గ్రామాల్లో ఉన్న విద్యార్థి కూడా ఆన్‌లైన్‌లో అన్ని కాలేజీలకు, అన్ని కోర్సులకు దరఖాస్తు చేసే అవకాశం వచ్చింది. ఎక్కడికీ వెళ్లకుండానే సెల్‌ఫోన్‌లోనే ఎక్కడ? ఏ కోర్సులో? సీటు వచ్చిందనే సమాచారం వచ్చే వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది.

అభ్యంతరాలేంటి?

దోస్త్ ద్వారా కొంతమంది విద్యార్థులకు నష్టం జరుగుతోందని ఉన్నత విద్యామండలి వర్గాలు అంటున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థులకు స్థానికంగా కాకుండా, మెరిట్ ప్రకారం ఎక్కడో సీట్లు వస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. దీనివల్ల ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు వచ్చినా విద్యార్థులు చేరడం లేదని అధికారులు అంటున్నారు. మరోవైపు ప్రైవేటు కాలేజీలు దోస్త్‌లో విద్యార్థుల చేత ఆప్షన్లు ఇప్పించుకునేందుకు పోటీ పడుతున్నారని చెబుతున్నారు. దీనివల్ల కొన్ని ప్రాంతాల్లో దోస్త్ ప్రవేశాలు ఎక్కువగా ఉంటున్నాయని, కొన్నిచోట్ల తక్కువగా ఉంటున్నాయనే విమర్శలు వస్తున్నాయి. దోస్త్ పేరుతో మండలి ఆధిపత్యం చేస్తోందని, ఫలితంగా కాలేజీలు కొత్త కోర్సులతో విద్యార్థులను ఆకర్షించలేకపోతున్నాయని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. పాత విధానం వల్ల కాలేజీలపై ప్రభుత్వ అజమాయిషీ తగ్గుతుందని, ఇష్టానుసారం ఫీజులు వసూలు చేసే అవకాశం వస్తుందని విద్యార్థి సంఘాలు అంటున్నాయి. లోపాలుంటే సరిచేయాలి తప్ప, వ్యవస్థనే రద్దు చేయడం ప్రైవేటు సంస్థలకు మేలు చేయడమేనని చెబుతున్నాయి.

అధ్యయనం చేస్తున్నాం



దోస్త్‌పై భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి. కొంతమంది ఉండాలంటున్నారు. కొంతమంది ఉపయోగం లేదంటున్నారు. అన్నివైపుల నుంచి పరిశీలన జరుపుతున్నాం. మార్పులు అనివార్యమనిపిస్తే తప్పకుండా చేస్తాం.

– ప్రొ. వి.బాలకిష్టారెడ్డి
(ఉన్నత విద్యామండలి చైర్మన్)

దోస్త్ వల్లే పారదర్శకత



సాంకేతికత అభివృద్ధి చెందిన ఈ కాలంలో దోస్త్ వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. పేద, ధనిక తారతమ్యం లేకుండా, వ్యయ ప్రయాసలు లేకుండా సీట్లు పొందుతున్నారు. ఇంట్లో కూర్చుని ఖర్చు లేకుండా ఎక్కడైనా సీటు వచ్చే పారదర్శకత దోస్త్ వల్లే సాధ్యం. దీన్ని ఎత్తివేస్తే విద్యార్థులకు ఇబ్బంది అవుతుంది.

– ప్రొ. ఆర్.లింబాద్రి
(ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్)

కార్పొరేట్ కాలేజీల కొమ్ముగాస్తారా?

దోస్త్ వల్లనే ప్రైవేటు కాలేజీల దోపిడీకి అడ్డుకట్ట పడుతోంది. ఇప్పుడు దాన్ని ఎత్తివేస్తే గతంలో మాదిరిగా ప్రైవేటు కాలేజీలు దోచుకుంటాయి. పేద వర్గాల ప్రయోజనాలను తాకట్టు పెట్టే ఇలాంటి చర్యలను ఆమోదించం. అవసరమైతే విద్యార్థి ఉద్యమాలకూ వెనుకాడం.

– నాగరాజు
(ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి)

ఆమోదయోగ్యం కాదు

దోస్త్‌లో లోపాలుంటే సరిచేయాలి. ఎందుకు మార్పులు చేస్తున్నామో చెప్పాలి. అంతేతప్ప ప్రైవేటు కాలేజీల ఒత్తిడి మేరకు దోస్త్‌ను రద్దు చేస్తే విద్యార్థులకు నష్టం జరుగుతుంది. ఇది ఆమోదయోగ్యం కాదు.

– చింతకాయల ఝాన్సీ రాణి
(ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి)

డిగ్రీలో కొత్తగా వైమానిక కోర్సు

ఉన్నత విద్యామండలి కసరత్తు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా డిగ్రీ స్థాయిలో వైమానిక కోర్సులు తేవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి తెలిపారు. దీనిపై కసరత్తు ప్రారంభించామని, కోర్సు, సిలబస్, బోధన సిబ్బందిపై చర్చిస్తున్నామని చెప్పారు. నల్సార్ యూనివర్సిటీలో ఇప్పటికే ఈ కోర్సును ప్రవేశపెట్టారు. ఏవియేషన్ లా అండ్ ఎయిర్ మేనేజ్‌మెంట్, సెక్యూరిటీ అండ్ డిఫెన్స్ లా, స్పేస్ అండ్ టెలి కమ్యూనికేషన్ లాస్, మేరిటైం లాస్ వంటి కోర్సులు నల్సార్‌లో నిర్వహిస్తున్నారు. మండలి చైర్మన్ నేతృత్వంలోనే ఈ కోర్సులు అక్కడ అందుబాటులోకి వచ్చాయి. వైమానిక రంగం శరవేగంగా దూసుకెళ్తోందని, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో భారీ పెట్టుబడులు వస్తున్నాయని బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ కారణంగా డిగ్రీ స్థాయిలో వైమానిక, లా కోర్సుల అవసరం పెరుగుతోందని చెప్పారు. ఈ కోర్సులతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఇప్పటికే ఈ కోర్సులు చేసిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నట్టు వివరించారు. రాష్ట్ర డిగ్రీ కోర్సుల్లో దీన్ని సర్టిఫికెట్ కోర్సుగా ఆన్‌లైన్ విధానంలో తీసుకొచ్చే యోచన చేస్తున్నామన్నారు. శుక్రవారం ఉన్నత విద్యా మండలిలో జరిగే విశ్వవిద్యాలయాల వీసీల సమావేశంలో దీనిపై చర్చిస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో కొన్ని కాలేజీల్లో కోర్సును అందుబాటులోకి తేవాలని భావిస్తున్నట్టు తెలిపారు.

మేలో ఇంజనీరింగ్ సెట్

- వీలైనంత త్వరగా కౌన్సెలింగ్... ఆగస్టులో క్లాసులు మొదలు
- టీసీఎస్‌కు ఉన్నత విద్యా మండలి స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్)ను ఎప్పటిలాగే మే నెలలోనే నిర్వహించాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. అయితే, తర్వాత ప్రక్రియను మాత్రం వేగంగా పూర్తి చేయాలని భావిస్తోంది. ఇందుకు తగ్గట్టుగానే పరీక్ష తేదీలను, కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను రూపొందించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. జాతీయ, రాష్ట్ర పరీక్షలను దృష్టిలో ఉంచుకుని టీసీఎస్ ప్రతి సంవత్సరం సెట్ తేదీలను మండలికి సూచిస్తుంది. ఇప్పటికే దీనిపై మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డితో టీసీఎస్ అధికారులు సంప్రదింపులు జరిపారు. తొలుత ఈఏపీసెట్‌ను ముందే నిర్వహించాలని భావించారు. అయితే ఇది సాధ్యం కాదని, జాతీయ పరీక్షలు అడ్డంకిగా ఉంటాయని టీసీఎస్ తెలిపింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని, ఎప్పటిలాగే మే నెలలో పరీక్ష నిర్వహణకు మండలి ఆమోదం తెలిపింది. ఇందుకు అనుగుణంగానే తేదీలను ఖరారు చేయమని టీసీఎస్‌కు తెలిపినట్టు మండలి చైర్మన్ గురువారం మీడియాకు వెల్లడించారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఈఏపీసెట్ తేదీ ఖరారుపై మరో మూడు రోజుల్లో స్పష్టత వచ్చే వీలుందని అధికారులు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసం మోడల్ స్కూల్ టీచర్ల ఆందోళన



సాక్షి, హైదరాబాద్: మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీఎంటీఏ టీఎస్ సంఘం ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మోడల్ స్కూల్స్‌లో గురువారం నిరసన కార్యక్రమాలు జరిగాయి. మోడల్ స్కూల్ టీచర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి, భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీశ్ డిమాండ్ చేశారు. మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. టీచర్లకు అన్ని అర్హతలు న్నా పాలనాపరమైన కారణాల వల్ల నియామకాలు చేపట్టడం లేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించే వరకూ తాము దశలవారీ ఆందోళనలు చేపడతామన్నారు.

రైల్వే కార్మిక సంఘాల ఎన్నికల్లో మజ్దూర్, సంఘ్‌లకు గుర్తింపు

అడ్డగుట్ట (హైదరాబాద్): రైల్వేలో ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్‌లు విజయం సాధించి గుర్తింపు పొందాయి. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూర్, నాందేడ్‌లలో డిసెంబర్ 4, 5, 6వ తేదీల్లో ట్రేడ్ యూనియన్ల గుర్తింపు ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ గురువారం జరిగింది. ఇందులో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ 47.46 శాతం ఓట్లు సాధించి ప్రథమ గుర్తింపు పొందింది. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కూడా 42.91 శాతం ఓట్లు సాధించి గుర్తింపు పొందింది. మిగిలిన దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ (8.26 శాతం), ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్ (0.42 శాతం), రైల్వే మజ్దూర్ యూనియన్(0.96 శాతం)లు ఓట్లు అంతంత మాత్రంగానే దక్కించుకున్నాయి. సికింద్రాబాద్ డివిజన్, విజయవాడ డివిజన్, రాయనపాడు వర్క్‌షాప్, హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్సీఆర్ మజ్దూర్ యూనియన్ మెజారిటీ సాధించగా, హైదరాబాద్ డివిజన్, గుంటూరు డివిజన్, నాందేడ్ డివిజన్, గుంతకల్ డివిజన్, లాలాగూడ వర్క్‌షాప్, తిరుపతి వర్క్‌షాప్‌లలో ఎస్సీఆర్ ఎంప్లాయీస్ సంఘ్‌కు మెజారిటీ వచ్చింది.

19న మంత్రి కొండా సురేఖ హాజరుకావాలి

నాంపల్లి కోర్టు ఆదేశం



సిటీ కోర్టులు: సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసులో ఈనెల 19న జరిగే విచారణకు హాజరుకావాలని మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణ గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. తన కుమారుడు నాగచైతన్య–సమంత విడాకులపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలతో తన కుటుంబ పరువు పోయిందంటూ నాగార్జున కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. గత విచారణలో నాగార్జున వేసిన పిటిషన్‌ను అనుమతిస్తూ మంత్రికి నోటీసులు జారీ చేస్తూ కోర్టు తదుపరి విచారణకు హాజరుకావాలని చెప్పింది. అయితే అసెంబ్లీ సమావేశాలు ఉన్నందున కొండా సురేఖ గురువారం కోర్టుకు హాజరుకాలేదని ఆమె తరఫు న్యాయవాది చెప్పారు. దీంతో తదుపరి విచారణను ఈనెల 19కి వాయిదా వేస్తూ.. ఆ రోజు తప్పకుండా హాజరుకావాలని కోర్టు స్పష్టంచేసింది.

క్లుప్తంగా...

'నాయకులు వెళ్లినా బలంగానే ఉన్నాం'



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొందరు సీనియర్ నాయకులు పార్టీని విడిచి వెళ్లినా బీఆర్ఎస్ బలం చెక్కు చెదరలేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పార్టీ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానా పూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్‌తో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేతలు గురువారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావును కలిశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో జోగు రామన్న మీడియాతో మాట్లాడారు. ఆదిలాబాద్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించిన తరహాలోనే నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో త్వరలో కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత కేటీఆర్ ఈ సమావేశాలకు హాజరవుతారని వెల్లడించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్న ఘటనలను కేటీఆర్ దృష్టికి తెచ్చామన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మూతపడిన సిమెంట్ ఫ్యాక్టరీ తెరిపిస్తామన్నారు. ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్‌కు రైల్వే లైన్ వేయిస్తామని ఎన్నికల వాగ్దానం చేసిన కాంగ్రెస్ వాటి అమలు దిశగా ప్రయత్నాలు చేయడం లేదని రామన్న విమర్శించారు.

కేసీఆర్‌కు వ్యక్తిగత కార్యదర్శిగా నాగేందర్‌రెడ్డి



మర్కూక్ (గజ్వేల్): మాజీ సీఎం కేసీఆర్ వ్యక్తిగత కార్యదర్శిగా నాగేందర్‌రెడ్డి నియమితులయ్యారని ఏడీ అనిల్‌కుమార్ తెలిపారు. నాగేందర్‌రెడ్డి మర్కూక్ మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వర్తించారు.

ప్రతిపక్ష పాత్ర పోషించలేక లేఖల రాజకీయమా?

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష పాత్ర పోషించడం చేతకాక తన ఆస్థాన పేటీఎం రైటర్లు రాసిన లేఖలతో కేటీఆర్ రాజకీయం చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రజల కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై అక్కసుతోనే కేటీఆర్.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి లేఖ రాశారని ధ్వజమెత్తారు. అసెంబ్లీలోని సీఎల్పీలో గురువారం శ్రీనివాస్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజా పాలనలో రాష్ట్రం సుఖంగా ఉండటం కూడా కేటీఆర్‌కు నచ్చడం లేదన్నారు. కేటీఆర్ రాసిన రోత రాతలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న రేవంత్ ప్రభుత్వంపై ఏడుపు ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూసి ప్రతి ఒక్కరూ తమ ఆడబిడ్డలా ఉందని అంటున్నారని, కానీ కేటీఆర్ తెలంగాణ తల్లి పైన మతిలేని మాటలు మాట్లాడుతున్నారని శ్రీనివాస్ మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ బ్యాంక్ బ్యాలెన్స్ రూ.1,400 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని నిలదీశారు. కులగణనపై కేటీఆర్‌కు ఎందుకు కంటగింపో చెప్పాలన్నారు. బీసీలకు బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకమా? అనుకూలమా? స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

మిలిటెంట్ తరహాలో ముందుకు..

మళ్లీ ఉద్యమం తరహా వ్యూహాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదును

- కాంగ్రెస్ ప్రభుత్వానికి తగినంత సమయం ఇచ్చామనే భావన
- జనం స్పందనకు అనుగుణంగా పార్టీ కార్యాచరణ
- బీజేపీ వైపు జనం మొగ్గుచూపడం లేదనే అభిప్రాయం
- అసెంబ్లీ స్పీకర్‌పై అవసరమైతే వాయిదా తీర్మానం
- ఫిబ్రవరి నెలాఖరులో పార్టీ సత్తా చాటేలా భారీ బహిరంగ సభ
- వచ్చే ఏడాదంతా పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాలని నిర్ణయం
- ప్రెస్‌మీట్లు, ప్రకటనలే కాకుండా.. జనంలోకి నేరుగా వెళ్లాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం
- సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించాలని సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో ఇకపై దూకుడుగా పోరాటాలు చేపట్టాలని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నిర్ణయించింది. కొత్త ప్రభుత్వం కుదురుకుని పనిచేసేందుకు సరిపడా సమయం ఇచ్చామని భావిస్తోంది. ఇక ముందు పూర్తిస్థాయిలో ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని.. ఒకవైపు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, మరోవైపు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు చేసిన మంచిని వివరించాలని నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని.. బీఆర్ఎస్ దీనిని అనుకూలంగా మలుచుకోవాలని నేతలు, కార్యకర్తలకు పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. రాబోయే రోజుల్లో పార్టీ కేడర్‌ను, ప్రజలను భాగస్వాములను చేస్తూ రేవంత్ ప్రభుత్వం తీరుపై 'మిలిటెంట్ తరహా దూకుడు పోరాటాలు చేయాల'ని ఇటీవల జరిగిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల భేటీలో సూచించినట్టు తెలిసింది.

పార్టీ విధానాలపై ఫోకస్..

కాంగ్రెస్ విధానాలను నిరంతరం విమర్శించడం వల్ల అధికారం కోల్పోయానే బాధతో విమర్శలు చేస్తున్నట్టుగా ప్రజలు భావించే అవకాశం ఉందని కేసీఆర్ అభిప్రాయపడినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే దూరదృష్టితో పదేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వాటి అమలు వెనుక ఉన్న తాత్వికతను కూడా ప్రజలకు విడమరిచి చెప్పాలని సూచించినట్టు సమాచారం. ''హైదరాబాద్‌లో భారీ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి అనుమతులివ్వడం ఇక్కడి ఆర్థిక పటిష్టతను ప్రజలకు చాటి చెప్పాం. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ఉన్న అవకాశాలను దృష్టిలో పెట్టుకుని భారీ ఫార్మాసిటీ ఏర్పాటుకు భూసేకరణ చేశాం. గత ప్రభుత్వం తీసుకున్న ప్రతీ నిర్ణయం వెనుక అనేక శాస్త్రీయ కోణాలు ఉన్నాయి. వాటిని సామాన్యులకు కూడా అర్థమయ్యే రీతిలో అసెంబ్లీలో, బయటా పార్టీ నేతలు విడమరిచి చెప్పాలి..''అని పార్టీ శాసనసభా పక్ష సమావేశంలో కేసీఆర్ పేర్కొన్నట్టు తెలిసింది. ప్రభుత్వ తప్పులను ఎండగట్టడం, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం కేవలం ప్రెస్‌మీట్లు, పత్రికా ప్రకటనలకు పరిమితం కాకుండా... సోషల్ మీడియాను విస్తృతంగా వాడుకోవాలని సూచించినట్టు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తున్న ప్రజా వ్యతిరేకత బీజేపీకి అనుకూలంగా ఏమీ మారడం లేదని, దీనిని బీఆర్ఎస్ అందిపుచ్చుకోవాలని పేర్కొన్నట్టు సమాచారం.

అసెంబ్లీ వేదికగా ఒత్తిడి పెంచి..: అసెంబ్లీ శీతాకాల సమావేశాలను వేదికగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని బీఆర్ఎస్ భావిస్తోంది. తొలిరోజున అదానీ–రేవంత్ దోస్తీ అంటూ టీషర్టులు ధరించి అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. సభ జరిగే మిగతా రోజుల్లోనూ ఏదో ఒకరకమైన వ్యూహంతో అసెంబ్లీకి వచ్చి ప్రజల్లో చర్చ జరిగేలా చేయాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. పార్టీ ఫిరాయింపుల అంశంపై స్పీకర్ అనుసరిస్తున్న వైఖరిని ప్రశ్నిస్తూ వాయిదా తీర్మానం ఇవ్వడం, లేదా స్వల్పకాలిక చర్చకు పట్టుబట్టడం దిశగా ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. ఇక కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలకు అసెంబ్లీతో చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఒత్తిడి తీసుకురావాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఈసారి అసెంబ్లీ సమావేశాలకు మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ హాజరైనా ఎలాంటి చర్చల్లో పాల్గొనే అవకాశం లేదని సమాచారం. అసెంబ్లీ సమావేశాలు ముగిశాక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాల్లో పర్యటించనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సంస్థాగత అంశాలపై ఫోకస్..

వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరులో హైదరాబాద్, వరంగల్‌లలో కాకుండా అన్ని జిల్లాల నుంచి రాకపోకలకు అనువుగా ఉండే ప్రాంతాన్ని ఎంచుకుని భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించినట్టు తెలిసింది. ఉద్యమకాలంలో నిర్వహించిన తరహాలో భారీ జనసమీకరణతో పార్టీ సత్తా చాటేలా సభ ఉంటుందని ఇటీవల తనను కలిసిన పార్టీ నేతలతో కేసీఆర్ పేర్కొన్నట్టు సమాచారం. ఇక వచ్చే ఏడాది పొడవునా గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కార్యవర్గాల ఏర్పాటు, సంస్థాగత శిక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. యువత, మహిళలకు చేరువ కావడం లక్ష్యంగా కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం.

త్వరలో స్టడీ టూర్లు, క్రీడా పోటీలు

- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వెల్లడి
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ముగిసిన అవగాహన కార్యక్రమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కూనంనేని. చిత్రంలో మహేశ్‌కుమార్ గౌడ్, పట్నం మహేందర్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రసాద్‌కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, శాసనమండలి సభ్యులకు త్వరలో స్టడీ టూర్లు, క్రీడా పోటీలు ఏర్పాటు చేస్తామని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం సహకరిస్తే త్వరలో శాసనసభ, మండలిలోని అన్ని కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో రెండురోజుల పాటు జరిగిన అవగాహన కార్యక్రమాలు గురువారం ముగిశాయి. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో గుత్తా ప్రసంగించారు. సభ నియమావళి, నిర్వహణకు సంబంధించి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనే కొత్త సంప్రదాయానికి రాష్ట్ర ప్రభుత్వం నాంది పలికిందని అన్నారు.

హక్కులు, బాధ్యతలపై అవగాహన: స్పీకర్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారిగా రెండురోజుల పాటు జరిగిన అవగాహన కార్యక్రమం ద్వారా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవడం సాధ్యమైందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చెప్పారు. సభ ఔన్నత్యం కాపాడటంలో ఈ తరహా శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. నేర్చుకున్న విషయాలను సభలో సభ్యులు అనుసరించడం ద్వారా ఉన్నత ప్రమాణాలు నెలకొల్పాలని సూచించారు. రెండోరోజు జరిగిన అవగాహన కార్యక్రమంలో 17 మంది ఎమ్మెల్సీలు, 61 మంది ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు: అవగాహన కార్యక్రమం ముగిసిన సందర్భంగా పర్యాటక భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తారామతి బారాదరిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ కోదండరాం, టూరిజం డైరెక్టర్ హనుమంతు జండగే, పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి పర్యవేక్షించారు.

భూ అక్రమార్కుల పని పడతాం!

మీడియాతో మంత్రి పొంగులేటి

- కొత్త ఆర్వోఆర్ చట్టం రాగానే వారి చిట్టా బయటపెడతాం
- ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో కొత్తగా పది అంశాలు చేర్చాం
- నెలాఖరులోపు మంత్రివర్గ విస్తరణ ఉంటుందని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన ఆర్వోఆర్ చట్టాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే సభలో ప్రవేశపెడతామని రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కొత్త చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత అక్రమార్కుల చిట్టాను ఆధారాలతో సహా విడుదల చేస్తామని చెప్పారు. ప్రధానంగా రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో జరిగిన భూ అవకతవకలను బహిర్గతం చేస్తామని అన్నారు. గురువారం సచివాలయంలో మీడియాతో ఆయన చిట్‌చాట్‌లో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారికి మరో అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ పథకం కోసం రూపొందించిన యాప్‌లో ఇప్పటివరకు 2.32 లక్షల దరఖాస్తులు నమోదు చేశామని వెల్లడించారు. ఎంపిక ప్రక్రియ కాస్త ఆలస్యమైనప్పటికీ అసలైన లబ్ధిదారులకే అర్హత కల్పిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో కొత్తగా మరో 10 అంశాలను చేర్చామని, సర్వే అధికారుల రికమండేషన్ ఆప్షన్‌ను తొలగించామని పేర్కొన్నారు. ఇళ్ల కోసం ఐటీడీఏ, గిరిజన ప్రాంతాల్లోనే ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని చెప్పారు. ఈ నెలాఖరులోపు మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందని తెలిపారు. సంక్రాంతిలోపు వీఆర్వో వ్యవస్థను తీసుకొస్తామని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్లే హాస్టళ్ల, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ నెల 14న మంత్రులు, అధికారులు విద్యార్థుల వసతి గృహాల్లోనే భోజనం చేస్తారని వెల్లడించారు. ఈ నెలాఖరులోపే హాస్టళ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తామని ప్రకటించారు.

ఆపన్నహస్తం 'సీఎం సహాయనిధి'

సాక్షి, హైదరాబాద్: ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్నహస్తంగా మారిందని ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కర వేణుగోపాల్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోగ్యశ్రీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో సరూర్‌నగర్‌కు చెందిన శ్రీకృష్ణ, అమీర్‌పేటకు చెందిన భానుప్రసాద్‌లకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా హర్కర వేణుగోపాల్ మాట్లాడుతూ ఒక్క ఆరోగ్యశ్రీ ద్వారానే కాకుండా సీఎం సహాయనిధి ద్వారా కూడా ఆపదలో ఉండి వైద్య ఖర్చులు భరించలేని వారికి సహాయనిధి తోడ్పాటునందిస్తుందని తెలిపారు.

దివాలా కాదు.. దివ్యమైన రాష్ట్రం

- ఈ ఏడాది మార్చి నాటికి రాష్ట్ర అప్పు 3.22 లక్షల కోట్లే
- ఆర్బీఐ నివేదికతోనే అది నుస్పష్టం

అప్పులపై ప్రభుత్వ ప్రచారం అబద్ధమని తేలింది: హరీశ్



ఆర్బీఐ నివేదికలోని వివరాలు వెల్లడిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట జోన్: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం అప్పులపాలైందన్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రచారం మొత్తం అబద్ధమని తేలిపోయిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రం మొత్తం రుణాలు 2024 మార్చి నాటికి రూ.3,22,499 లక్షల కోట్లు అని సాక్షాత్తూ ఆర్బీఐ నివేదిక వెల్లడించిందని తెలిపారు. వాస్తవాలు ఇలా ఉంటే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు మాత్రం గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.7 లక్షల కోట్లు అప్పు చేసినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్బీఐ నివేదిక కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని అన్నారు. ఆర్బీఐ విడుదల చేసిన 'హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ –2024'నివేదికలో తెలంగాణ ఆర్థిక పరిస్థితి గురించి పొందుపర్చిన వివరాలను గురువారం సాయంత్రం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాకు వెల్లడించారు. తెలంగాణ దివాలా తీసిన రాష్ట్రం కాదని, దివ్యంగా వెలుగుతున్న రాష్ట్రమని ఆర్బీఐ రిపోర్ట్ తేల్చి చెప్పిందని అన్నారు. అబద్ధాల పునాదుల మీద ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అవే అబద్ధాలను ప్రచారం చేస్తూ కాలం గడుపుతోందని విమర్శించారు. నిజం నిప్పు లాంటిదని, కొంత ఆలస్యంగానైనా బయటకు వస్తుందని పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రం అబద్ధాల కరపత్రమని ఆర్బీఐ రిపోర్ట్‌తో తేటతెల్లమైందని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ విషప్రచారాన్ని మానుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ పాలనలో ఆయా రంగాల్లో వినియోగించిన నిధులు, సమకూరిన ఆస్తుల వివరాలను హరీశ్‌రావు వివరించారు.

బతుకమ్మ ఒక్కటే తెలంగాణ గుర్తింపు కాదు: యెన్నం

మెజారిటీ ప్రజలు బతుకమ్మ ఆడరు: అద్దంకి దయాకర్

పింక్ కలర్ నిజాం పాలనకు సింబల్: బెల్లయ్య నాయక్



సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ పండుగ ఒక్కటే తెలంగాణను ప్రతిబింబింపజేయదని, ఒక్కో జిల్లాలోని ఒక్కో ప్రాంతంలో వేర్వేరు పండుగలు ఉంటాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోనే కల్వకుర్తి ప్రాంతంలో బతుకమ్మ ఆడినప్పటికీ, దళితులు, గిరిజనులు, కొన్ని బీసీ కులాలకు బతుకమ్మ చేరువ కాలేదని అన్నారు. గద్వాల, అలంపూర్‌లో బతుకమ్మ అంటేనే తెలియదని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ లేదని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్నదంతా దుష్ప్రచారమేనని చెప్పారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన పార్టీ ఇతర నేతలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణకు వేల సంవత్సరాల చరిత్ర ఉందని, బీఆర్ఎస్ నాయకులు చెప్పే 14 ఏళ్ల చరిత్ర కాదని అన్నారు. తెలంగాణ తల్లి ఏర్పాటుపై శాసనసభలో చర్చ జరిగిన తరువాతే ప్రతిష్టించడం జరిగిందని, దీనిపై చర్చకు ఆస్కారం లేదని స్పష్టం చేశారు. 'ఆలిని మార్చవచ్చు కానీ తల్లిని మారుస్తారా'అని కేటీఆర్ అంటున్నారని, తెలంగాణలో ఆలిని మార్చే సంస్కృతి కూడా లేదని అన్నారు. ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ, పదేళ్లు పాలించిన వాళ్లు ఇప్పు డు కోడి గుడ్డు మీద ఈకలు పీకుతున్నారని, తెలంగాణ తల్లిపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. తన ఇంట్లో ఎప్పుడూ బతుకమ్మ ఆడలేదని, గిరిజన, మాదిగ, ముస్లిం, క్రిస్టియన్, బౌద్ధులు ఎప్పుడూ బతుకమ్మ ఆడలేదని చెప్పారు. పింక్ కలర్ నిజాం పాలనకి సింబల్ అని వ్యాఖ్యానించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ సంప్రదాయంలో ఉన్నప్పటికీ, మెజారిటీ ప్రజలు బతుకమ్మ ఆడరని తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే పదవి ఎందుకని ప్రశ్నించారు.

బతుకమ్మపై అవగాహన లేక నోరు జారుతున్నారు

కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పాలి: బీఆర్ఎస్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సంస్కృతిపై అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు బతుకమ్మ పండుగపై నోరు జారుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. బతుకమ్మను కించపరుస్తూ మాట్లాడిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ నేతలు సంజీవ్‌నాయక్, పల్లయ్య కురువతో కలిసి నవీన్ కుమార్ రెడ్డి గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బతుకమ్మ చీరలు అడిగిన మహిళలకు అసలు బతుకమ్మ లేదు అనే రీతిలో కాంగ్రెస్ వ్యవహరిస్తోందన్నారు. బతుకమ్మ పండుగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేతలు అద్దంకి దయాకర్, బెల్లయ్య నాయక్‌లకు తెలంగాణ సంస్కృతి గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో బతుకమ్మ ఆడిన మంత్రి సీతక్కకు పండుగ గుర్తు లేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడంపై ప్రొఫెసర్ కోదండరాం తన గౌరవాన్ని తగ్గించుకునేలా మాట్లాడారని నవీన్‌కుమార్ విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత, కేసీఆర్ సతీమణి శోభమ్మపై కాంగ్రెస్ నేతలు దిగజారి మాట్లాడుతున్నారని సంజీవ్‌నాయక్ విమర్శించారు. తెలంగాణకు వచ్చి మహిళలతో బతుకమ్మ ఆడిన రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోనియా గాంధీ కూడా బతుకమ్మను ఎత్తుకున్నారని, తెలంగాణ తల్లి విగ్రహం చేతిలో బతుకమ్మ ఎందుకు తీసేశారో చెప్పాలన్నారు. ఉమ్మడి ఏపీలో బతుకమ్మపై అవగాహన లేకుండా అడ్డుకున్న ఆంధ్రపాలకుల బాటలోనే రేవంత్ సర్కారు నడుస్తోందని సంజీవ్‌నాయక్ మండిపడ్డారు.

కేంద్రం సాయం చేసేలా సహకరించండి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రధాన్, కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ భేటీల్లో సీఎంతో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు మల్లురవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, బలరాం నాయక్, కడియం కావ్య, గడ్డం వంశీ, సురేశ్ షెట్కార్, అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని ఏం కోరారంటే...

'ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.34,367.62 కోట్లు. ఆర్ఆర్ఆర్‌తో పాటు రేడియల్ రోడ్లు పూర్తయితే ఫార్మా పరిశ్రమలు, ఇండస్ట్రియల్ హబ్‌లు, లాజిస్టిక్ పార్కులు, రిక్రియేషన్ పార్కులు వంటివి అభివృద్ధి అవుతాయి. ఆర్ఆర్ఆర్‌కు సంబంధించి వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అనుమతులన్నీ ఇప్పించేందుకు కృషి చేయండి.

మెట్రో ఫేజ్–2 సంయుక్తంగా చేపట్టేలా..

మెట్రో ఫేజ్–2లో భాగంగా నాగోల్ నుంచి రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపొలిస్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట, మియాపూర్–పటాన్‌చెరు, ఎల్బీ నగర్–హయత్‌నగర్ మధ్య మొత్తం 76.4 కి.మీ మేర నిర్మించనున్న మెట్రో రైలు నిర్మాణానికి రూ.24,269 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 50: 50 వాటాతో దీనిని చేపట్టేందుకు సహకరించాలి.

'మూసీ'కి అనుమతులు, నిధులు కావాలి

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ పరిధిలోని 222.27 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరాం. దీనితో పాటు గాంధీ సరోవర్ నిర్మాణం, మూసీ సీవరేజీ ప్రాజెక్టులు, 11 హెరిటేజ్ వంతెనల నిర్మాణం ఇతర పనులకు రూ.14,100 కోట్లు వ్యయమవుతాయని అంచనా వేశాం. ఈ మేరకు అనుమతులు, నిధుల మంజూరుకు సహకరించాలి. మూసీ పునరుజ్జీవంలో భాగంగా గోదావరి నీటిని మూసీకి తరలించేందుకు, గోదావరి నుంచి నగరానికి 15 టీఎంసీలను హైదరాబాద్ తాగు నీటి అవసరాలకు తరలించేందుకు రూ.7,440 కోట్లతో ప్రణాళికలు రూపొందించాం. ఆ మొత్తం విడుదలకు సహకరించాలి. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్‌లో భూగర్భ డ్రైనేజీకి ప్రణాళిక రూపొందించాం. రూ.4,170 కోట్ల వ్యయమయ్యే ఈ ప్రణాళికను అమృత్–2 లేదా ప్రత్యేక పథకం కింద చేపట్టేలా చూడండి. సింగరేణి సంస్థ దీర్ఘకాలం పాటు మనుగడ కొనసాగించేందుకుగాను గోదావరి లోయ పరిధిలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించండి..' అని కిషన్‌రెడ్డిని సీఎం కోరారు.

నితిన్ గడ్కరీకి చేసిన విజ్ఞప్తి ఇదీ..

'ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి (159 కి.మీ) అవసరమైన సాంకేతిక, ఆర్థికపరమైన అనుమతులు వెంటనే ఇవ్వాలి. ఈ రహదారి నిర్మాణానికి అవసరమయ్యే భూమిలో 94 శాతం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. దక్షిణ కాశీగా గుర్తింపు పొందిన శ్రీశైలంను హైదరాబాద్‌తో అనుసంధానించే ఎన్‌హెచ్–765లో 125 కిలోమీటర్ల దూరం జాతీయ రహదారుల ప్రమాణాలతో ఉంది. అయితే మిగిలిన 62 కిలోమీటర్లు అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో ఉంది. అటవీ, పర్యావరణ శాఖల నిబంధనల ఫలితంగా ఆ మేరకు రహదారి అభివృద్ధికి ఆటంకం ఎదురవుతోంది. దీనివల్ల కేవలం పగటి వేళలో మాత్రమే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. కాబట్టి అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు బడ్జెట్లో నిధులు మంజూరు చేయండి. ఇది నిర్మిస్తే హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాల మధ్య 45 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది.



కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సీఎం రేవంత్ కరచాలనం

హైదరాబాద్–విజయవాడ డీపీఆర్ త్వరగా పూర్తి చేయండి

హైదరాబాద్–విజయవాడ (ఎన్‌హెచ్–65) రహదారిని 6 వరుసలుగా విస్తరించే పనుల డీపీఆర్‌ను త్వరగా పూర్తి చేయండి. వరంగల్ దక్షిణ భాగం బైపాస్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వండి. పర్వత్‌మాల ప్రాజెక్టులో భాగంగా యాదాద్రి దేవాలయం, నల్లగొండ పట్టణంలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ వద్ద రోప్ వేలను ఏర్పాటు చేయండి. గోదావరి, కృష్ణా నదులపై గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో.. ప్రజా రవాణాకు ఇబ్బందిగా ఉన్న 10 చోట్ల పాంటూన్ బ్రిడ్జిలు మంజూరు చేయండి. నల్లగొండ జిల్లాలో ఎన్‌హెచ్–65 పక్కన 67 ఎకరాల ప్రభుత్వ భూమిలో ట్రాన్స్‌పోర్ట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయండి..' అని నితిన్ గడ్కరీతో భేటీలో రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

కేంద్రీయ విద్యాలయాలు కేటాయించండి

'ఇటీవల రాష్ట్రానికి ఏడు నవోదయ విద్యాలయాలు కేటాయించినందుకు కృతజ్ఞతలు. కానీ రాష్ట్రానికి ఒక్క కేంద్రీయ విద్యాలయం కూడా కేటాయించలేదు. కేంద్రీయ విద్యాలయాలతో పాటు నవోదయ పాఠశాలలు లేని జిల్లాలకు వాటిని కేటాయించండి. డీమ్డ్ యూనివర్సిటీల ప్రకటనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తప్పనిసరి అయినప్పటికీ.. ఇటీవల కేవలం కేంద్ర ప్రభుత్వ అనుమతితోనే డీమ్డ్ యూనివర్సిటీలను గుర్తిస్తున్నారు. డీమ్డ్ యూనివర్సిటీ గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వ ఎన్ఓసీ కూడా తప్పకుండా తీసుకునేలా చూడండి..' అని ధర్మేంద్ర ప్రధాన్‌ను ముఖ్యమంత్రి కోరారు.

నేడు ఏఐసీసీ నేతలతో సీఎం భేటీ!

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఏఐసీసీ పెద్దలను కలిసే అవకాశం ఉంది. అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యే అవకాశాలున్నాయి. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలపై చర్చించవచ్చని సమాచారం.



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి

పలు ప్రాజెక్టులకు అనుమతులు కోరాం

గడ్కరీతో భేటీ తర్వాత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న పలు ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాల్సిందిగా కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరినట్లు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. పెండింగ్ రోడ్డు ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. గురువారం గడ్కరీతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అనంతరం కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. 'సుమారు గంటకు పైగా తెలంగాణ రోడ్ల అభివృద్ధి గురించి చర్చించాం. డిసెంబర్ 20న జరగనున్న ప్రాజెక్టు అప్రూవల్ కమిటీలో రీజనల్ రింగ్ రోడ్డుకు అనుమతులు ఇవ్వాలని కోరాం. కల్వకుర్తి నుంచి శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదనలు ఇచ్చాం. అందుకు అనుమతిస్తామన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 16 రోడ్లకు సంబంధించి రూ.3,200 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. త్వరలో వాటి డీపీఆర్‌లు కేంద్రానికి ఇస్తాం. హైదరాబాద్ విజయవాడ ఆరు లైన్ల రహదారి జీఎంఆర్ సంస్థ పూర్తి చేయలేదు. కాబట్టి మరోసారి టెండర్లు ఆహ్వానించడంపై చర్చించాం..'అని తెలిపారు. జనవరిలో రీజనల్ రింగ్ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమానికి రావాల్సిందిగా గడ్కరీని సీఎం కోరినట్లు వెల్లడించారు.

అయితే విజయోత్సవ సభ.. లేదంటే చావుడప్పు

- జనవరి 27లోగా ఎస్సీ వర్గీకరణ అమల్లోకి తేవాలి

కేబినెట్‌లో మరో ఇద్దరు మాదిగలకు చోటివ్వాలి: మంద కృష్ణ



సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 27వ తేదీలోగా ఎస్సీ వర్గీకరణ అమలులోకి వస్తే దాన్ని స్వాగతిస్తూ విజయోత్సవ సభ నిర్వహిస్తామని, లేదంటే చావుడప్పు కొడతామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. వర్గీకరణకు ఒప్పుకోని వారికి రాజకీయ భవిష్యత్ లేకుండా చేస్తామని అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ కళాకారులు, ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ డిమాండ్‌తో ఈ నెల 27 నుంచి ఊరూరా రథయాత్ర ప్రారంభం అవుతుందని, జనవరి 27న ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం దగ్గర లక్ష మందితో విజయోత్సవ దండోరా లేదా చావుడప్పు మోగిస్తామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల 9 మంది కళాకారులు, కవులకు ప్రకటించిన అవార్డుల్లో మాదిగలకు చోటేదని కృష్ణమాదిగ ప్రశ్నించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే పునః పరిశీలన చేయాలని, మరి కొంతమంది కళాకారులు, కవులకు స్థానం కల్పించాలని, ఇందులో మహిళలు కూడా ఉండేలా చూడాలని డిమాండ్ చేశా రు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం | 13 | డిసెంబర్ | 2024



కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించాలి

కార్పొరేట్ సంస్థలు గ్రామాల్లో కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించాలని మంత్రి సీతక్క అన్నారు. గురువారం గచ్చిబౌలిలో సోషల్ ఇంపాక్ట్ కాన్‌క్లేవ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. -10లో



స్లిమ్ సెట్.. డైట్ మస్ట్

నగరవాసుల ఆహార అలవాట్లు వేగంగా మారుతున్నాయి. యువత నుంచి వయోవృద్ధుల వరకు స్లిమ్‌తో పాటు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
30.0/14.0

వాతావరణం

నగరంలో శుక్రవారం ఉదయం పొగమంచు వాతావరణం ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. గరిష్టంగా 30, కనిష్టంగా 14 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



మురిపించిన మువ్వలు!

తారామతి బారాదరిలో గురువారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టాయి.





- మిమ్మల్ని ప్రజలు కలుసుకునే వీలు లేదా?
- కమిషనర్ పేషీలో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్
- అడ్డుకుంటున్న పోలీసులు
- సార్‌ను కలవాలంటే సవాలే..
- ఇదేం పద్ధతి అంటున్న ఫిర్యాదుదారులు

ఇలంబర్తి.. ఇదేం స్ఫూర్తి?



ప్రజాపాలన అంటే ఇదేనా?

సాక్షి, సిటీబ్యూరో:

అది జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం. కమిషనర్‌ను కలిసేందుకు వెళ్లాలనుకుంటున్నవారికి కార్యాలయ ద్వారం ఎదుటే ఉన్న పోలీసులు అడ్డుకుంటారు. మీకు ఏం పని అని అడుగుతారు. కమిషనర్ సార్‌ను కలవాలి. సర్కిల్, జోన్‌లో పరిష్కారం కానందున ఇక్కడికి వచ్చాం అంటే.. మీ సమస్య ఏమిటో అక్కడ చెప్పండి.. అంటూ దగ్గర్లోనే ఉన్న కంప్యూటర్ ఆపరేటర్‌ను చూపుతారు.అక్కడ తమ సమస్య చెప్పడానికి క్యూకట్టి చెబితే, నమోదు చేసుకొని ఇక వెళ్లమన్నట్లు సూచిస్తారు. సార్ అనుమతిస్తే కార్యాలయ సిబ్బంది మీకు ఫోన్ చేస్తారు. అప్పుడు వచ్చి కలవండి అని చెప్పి పంపిస్తారు.

.. ఇదీ రెగ్యులర్ కమిషనర్‌గా ప్రభుత్వం బాధ్యతలప్పగించాక, ఝార్ఖండ్ ఎన్నికల విధుల నుంచి తిరిగి వచ్చాక జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలవాలంటే సందర్శకులకు ఎదురవుతున్న అనుభవం. ఝార్ఖండ్ నుంచే వర్చువల్‌గా ఆదేశాలు జారీ చేస్తూ చురుగ్గా పనులు చేసిన కమిషనర్ శైలిని చూసిన నగర ప్రజలు అప్పుడు ఆహో అనుకున్నారు. ఇప్పుడు సార్‌ను కలవాలనుకుంటున్న ఫిర్యాదుదారులు అయ్యో ఇదేంటి? అని ముక్కున వేలేసుకుంటున్నారు.



ఎస్పీఎఫ్‌తో భద్రత..

బహుశా జీహెచ్‌ఎంసీ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు కమిషనర్ పేషీలో విధులు నిర్వహిస్తున్నారు. ఒక ఎస్ఐ, మహిళా పోలీసులు కూడా వీరిలో ఉన్నారు. కమిషనర్‌ను కలిసేందుకు వస్తున్నవారిలో కొందరు అక్కడున్న పోలీసులను చూసి వెనకడుగు వేస్తున్నారు. వెళ్లేందుకు ముందుకొచ్చేవారిని ఏం పని కోసం వచ్చారో తెలుసుకొని కమిషనర్ పేషీలోని అధికారుల వద్దకు పంపిస్తున్నారు. వారు విషయాన్ని బట్టి అపాయింట్‌మెంట్ కోసం వివరాల నమోదుకు కంప్యూటర్ ఆపరేటర్ వద్దకు పంపిస్తున్నారు. అపాయింట్‌మెంట్ ఎప్పుడు వస్తుందంటే విషయాన్ని బట్టి ఒక రోజు నుంచి వారం వరకు పట్టవచ్చు. లేదా అసలు రాకపోవచ్చని చెబుతున్నారని కమిషనర్‌ను కలిసేందుకు వచ్చిన వారిలో శ్రీనివాస్ అనే అతను చెప్పాడు. తాను అక్రమ నిర్మాణాల గురించి ఫిర్యాదు చేసేందుకు ఎల్‌బీనగర్ నుంచి వచ్చానని తెలిపాడు. మరో వ్యక్తి తాను కొన్ని రోజుల క్రితం వచ్చి వివరాలు ఇచ్చి వెళ్లానని, ఇంకా కాల్ రాకపోవడంతో కనుక్కునేందుకు వచ్చినట్లు చెప్పాడు.

మంత్రులు ప్రజలను కలుస్తున్నా..

ఓవైపు తాము అధికారంలోకి వచ్చాక ప్రజలు సీఎం దాకా ఎవరినైనా కలిసే అవకాశం లభించిందని, ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చామని ప్రభుత్వం చెబుతోంది. అంతేకాదు.. మంత్రులు సైతం గాంధీభవన్ వేదికగానూ ప్రజా సమస్యలు స్వీకరిస్తున్నారు. ప్రజలు తమ సమస్యలు, ఇబ్బందులు తెలిపేందుకు ఏర్పాటు చేసిన ప్రజావాణిలో సమస్యలు పరిష్కారమవుతున్నాయని, ఎన్ని ఇబ్బందులెదురైనా ఆపబోమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సైతం పేర్కొన్నారు. కోటిమంది సమస్యలు తీర్చే బాధ్యతల్లో ఉన్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ మాత్రం ప్రజలు తనను కలిసేందుకు సుముఖంగా లేరు. సార్ బిజీగా ఇతర పనుల్లో ఉన్నారని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. దీన్ని చూసి ప్రజాపాలన అంటే ఇదేనా? అని విస్తుపోతున్న వారూ ఉన్నారు. గతంలో బల్దియా కమిషనర్లుగా పనిచేసిన వారెవరూ ఇలా వ్యవహరించలేదు. మరి ప్రజాపాలన అంటున్న ప్రభుత్వంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న ఇలంబర్తికి స్ఫూర్తి ఎవరో ఆయనకే తెలియాలి.

రాజకీయ అండ?

జీహెచ్‌ఎంసీకి రాకముందు ఇలంబర్తి రవాణా శాఖలో పని చేశారు. రవాణా శాఖ మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నారు. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన వ్యవహారాల్లోనూ మంత్రిగా ఆయనే సమీక్షలు చేస్తున్నారు. కమిషనర్‌కు మంత్రి అండదండలు ఉన్నాయో లేదో తెలియదు కానీ ప్రజలను కలవని వ్యవహార శైలితో ప్రస్తుతం ఇది చర్చనీయాంశంగా మారింది.

ఆయన అలా.. ఈయన ఇలా

ప్రస్తుతం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న దానకిశోర్.. తాను జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా పని చేసిన కాలంలో తనను కలిసేందుకు వస్తున్న వారందరికీ కూర్చునేందుకు సరిపడా కుర్చీలు లేకపోవడం గుర్తించి.. వృద్ధులు తదితరులు ఎక్కువసేపు నిలబడి ఉండటం చూడలేక సందర్శకులందరికీ కూర్చునే సదుపాయం ఉండేలా ప్రత్యేక గది, కుర్చీలు ఏర్పాటు చేయించారు. ఇలంబర్తి మాత్రం సందర్శకులనే పేషీలోకి రానీయడం లేదనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

మెనూ.. మారును

రేపటి నుంచి అమల్లోకి రానున్న కొత్త విధానం

- మెస్ చార్జీల పెంపుతో పాటు మారనున్న మెనూ
- గురుకులాల బాట పట్టనున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం, సమస్యల పరిష్కారం



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మెనూ మారనుంది. పేద విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారం అందనుంది. ఇందు కోసం ప్రభుత్వం మెస్ చార్జీలు సహా కాస్మొటిక్ చార్జీలను 40 శాతం పెంచింది. శనివారం నుంచి కొత్త మెస్ చార్జీలతో పాటు కొత్త మెనూ అందుబాటులోకి రానుంది. ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో ప్రతి రోజు మూడు పూటల మూడు రకాల కూరలతో భోజనం వడ్డించనున్నారు. వారానికి నాలుగు కోడిగుడ్లు, నాలుగు అరటి పండ్లు సహా రెండుసార్లు చికెన్ వడ్డించనున్నారు. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో వారానికి రెండు గుడ్లు, మూడు అరటి పండ్లు, ఒకసారి చికెన్ పెడతారు. హైదరాబాద్ జిల్లాలో 81 గురుకులాలు, 116 సంక్షేమ వసతి గృహాలు, రంగారెడ్డి జిల్లాలో 57 రెసిడెన్షియల్ స్కూళ్లు, 99 సంక్షేమ వసతి గృహాలు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 41 వసతి గృహాల్లో చదువుతున్న బాల బాలికలకు లబ్ధి చేకూరనుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతారు. సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలకు చెక్ పెట్టనున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం బహిరంగ మార్కెట్లోని నిత్యవసరాల ధరకు.. ప్రభుత్వం చెల్లిస్తున్న మెస్ చార్జీలకు పొంతన లేదనే విమర్శలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మెనూలో పెద్ద మార్పులేమీ ఉండక పోవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పొంతన లేని ధరలతో తంటాలు..

రైతు ఫారం వద్ద కోడిగుడ్డు రూ.6.20 పలుకుతుండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.7 ఉంది. ప్రభుత్వం రూ.5 మాత్రమే చెల్లిస్తోంది. ఉల్లిగడ్డ హోల్‌సేల్ మార్కెట్‌లో కేజీ రూ.50 పలుకుతుండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.70 వరకు పలుకుతోంది. ఇక కేజీ వెల్లుల్లి రూ.350 నుంచి రూ.400 ధర పలుకుతోంది. కేజీ కందిపప్పు ప్రస్తుతం రూ.140 నుంచి రూ.160 ఉంది. ఇక ఆయిల్ ధరలు ఆకాశాన్నంటాయి. కేజీ ఆయిల్ రూ.180 పైమాటే. రైతు బజార్‌లో ఏ కూరగాయను పరిశీలించినా రూ .40 నుంచి రూ.60 ఉంటోంది. ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలకు, బహిరంగ మార్కెట్లోని నిత్యవసరాల ధరలకు పొంతన ఉండటం లేదు. విధిలేని పరిస్థితుల్లో నాసిరకం కూరగాయలు, పప్పుతో ఆహారం అందిస్తున్నారు. హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం సంగతేమో గానీ.. కడుపు నిండా తినలేని దుస్థితి. మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.5.45 ఇస్తుండగా, అదే ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థికి రూ.8.17 చెల్లిస్తోంది. ఇక ఉన్నత పాఠశాల విద్యార్థికి గుడ్డుతో కలిపి రూ.10.67 చెల్లిస్తుండగా, ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థికి గుడ్డుకు రూ.5 చొప్పున చెల్లిస్తోంది.

పండగ వాతావరణంలో..



సంక్షేమ వసతి గృహాల్లో డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం డైట్, కాస్మోటిక్ చార్జీలు 40 శాతం పెంపు ప్రారంభోత్స ఏర్పాట్లపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారులు, ఆర్డీవోలతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

అన్నవాహిక సమస్యలకు చిటికెలో పరిష్కారం

గాంధీలో అత్యాధునిక మోనోమెట్రీ యంత్రం

- తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ వితరణ



మోనోమెట్రీ వైద్యయంత్రాన్ని ప్రారంభిస్తున్న గాంధీ పాలనాధికారులు, టీడీఎఫ్ ప్రతినిధులు

గాంధీఆస్పత్రి : ఆహార పదార్థాలు కష్టంగా మింగడం, గుండెల్లో మంట, నాన్ కార్డియాక్ గుండెనొప్పి తదితర రుగ్మతలు అన్నవాహిక సమస్య (ఎసోఫాగియల్ మోటాలిటీ డిజార్డర్స్)తో ఉత్పన్నమవుతాయి. ఆయా రుగ్మతల తీరుతెన్నులను సులభంగా తెలుసుకుని మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో అత్యాధునిక మోనోమెట్రీ వైద్య యంత్రం అందుబాటులోకి వచ్చింది. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ (టీడీఎఫ్) గాంధీ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి వితరణగా అందించిన అత్యాధునిక ఎసోఫాగియల్ అండ్ ఆనల్ మోనోమెట్రీ వైద్య యంత్రాన్ని (దీని విలువ రూ. 27 లక్షలు) గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, టీడీఎఫ్ రాజేశ్వరరెడ్డి, గ్యాస్ట్రోఎంట్రాలజీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్‌లు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు మాట్లాడుతూ.. ఆహార పదార్థాలు మింగినప్పుడు కండరాలు వీటిని కడుపులోకి తరలించి తిరిగి బయటికి రాకుండా పట్టి ఉంచుతాయన్నారు. అన్నవాహికలో సమస్య ఏర్పడితే పలు రకాల రుగ్మతలు బాధిస్తాయని, ఆయా రుగ్మతలను సరైన రీతిలో నిర్ధారించి చికిత్స అందిస్తే నయమవుతుందన్నారు. గుండె నొప్పికి ఈసీజీ, టూడీఎకో వంటి పరీక్షల్లో ఎటువంటి నిర్ధారణలు కావన్నారు. అన్నవాహిక సమస్యతో గుండెనొప్పి వస్తుందని చెప్పారు. దీంతోపాటు అచలాసియా, స్క్లీరోడెర్మా, అన్నవాహిక దుస్సంకోచాలు, రూమినేషన్ సిండ్రోమ్ వంటి రుగ్మతలను మోనోమెట్రీ యంత్రం ద్వారా గుర్తించి వైద్యసేవలు, సర్జరీలు చేయవచ్చని వివరించారు. మోనోమెట్రీ ఆల్‌ఇండియా సొసైటీ అధ్యక్షుడు, కిమ్స్ వైద్యుడు డాక్టర్ నితీష్ ప్రతాప్ టీడీఎఫ్ ప్రతినిధులు మట్టా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ దివేష్ ఆర్.అనిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- రంగంలోకి దిగనున్న డిస్కనెక్షన్ బృందాలు
- ప్రభుత్వ సంస్థలకు పంపనున్న నోటీసులు
- ఈ నెల 16 నుంచి లైన్‌లవారీగా స్పెషల్ డ్రైవ్



బిల్లు కట్టకపోతే నల్లా కట్!

నీటి బకాయిదారులపై జలమండలి కొరడా

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో మీకు ఇల్లు ఉందా? కొన్ని నెలలుగా మీరు నల్లా బకాయిలు చెల్లించడం లేదా? అయితే.. మీ నల్లా కనెక్షన్‌ను జలమండలి అధికారులు డిస్కనెక్షన్ ప్రమాదం పొంచి ఉన్నట్లు.. అధికారులు ఇందుకు సన్నద్ధమవుతున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. బకాయిదారులూ.. తస్మాత్ జాగ్రత్త! జలమండలి నల్లా నీటి బిల్లుల బకాయిదారులపై చర్యలకు ఉపక్రమించేందుకు సిద్ధమైంది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఆలస్య రుసుం, వడ్డీ మాఫీ వర్తింప జేసినప్పటికీ సద్వినియోగం చేసుకోని కనెక్షన్‌దారులపై కొరడా ఝుళిపించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందు కోసం నలుగురితో కూడిన డిస్కనెక్షన్ (డీసీ) బృందాలను ఏర్పాటు చేసింది. ఈ నెల 16 నుంచి క్షేత్ర స్థాయిలో ఈ బృందాలు రంగలోకి దిగి వాటర్ కనెక్షన్లను తాత్కాలికంగా తొలగించే చర్యలకు ఉపక్రమించనున్నాయి.

గత రెండు నెలల పాటు నల్లా నీటి పెండింగ్ బిల్లులను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకం కింద వెసులుబాటు కల్పించినప్పటికీ వినియోగదారుల నుంచి అంతగా స్పందన లభించింది. మొత్తమ్మీద ఇది 15 శాతం మించలేదు. దీంతో నల్లా కనెక్షన్లు తొలగించేందుకు జలమండలి చర్యలు చేపట్టింది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని జలమండలికి బకాయి పడిన మొత్తం వినియోగదారుల్లో 77,640 మంది మాత్రమే ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకుని రూ.89.92 కోట్లు చెల్లించారు. మొదటి నెలలో 70,335 మంది వినియోగదారులు సద్వినియోగం చేసుకోగా.. రెండో నెలలో 7,315 మంది మాత్రమే బకాయిలు చెల్లించినట్లు జలమండలి అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక గడువు ముగియడంతో ఆలస్య రుసుం, వడ్డీతో కలిపి పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించాల్సి పరిస్థితి నెలకొంది.

మొత్తం 13.71 లక్షల నల్లా కనెక్షన్లు..

జలమండలి పరిధిలో మొత్తం 13.71 లక్షల నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో సుమారు 8.16 లక్షల వినియోగదారులు సుమారు రూ. 3,044 కోట్ల బకాయి పడినట్లు జలమండలి రెవెన్యూ విభాగం లెక్కలు చెబుతున్నాయి. అందులో చెల్లించని వడ్డీ రూ. 896.79 మినహాయిస్తే.. రూ.2,147 కోట్లు బకాయిలు ఉన్నాయి. మొత్తమ్మీద బల్క్, కాలనీ, వాణిజ్య, పారిశ్రామిక, ఎంఎస్‌బీ మినహాయించి 7.72 లక్షల గృహ వినియోగదారులు రూ.834 కోట్లు బకాయి పడినట్లు జలమండలి గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

బకాయిలు చెల్లించాల్సిన కనెక్షన్లు ఇలా..

కేటగిరీ	కనెక్షన్ల సంఖ్య
డొమెస్టిక్	6,23,434
డొమెస్టిక్ స్లమ్	1,48,680
కమర్షియల్	35,300
ఎంఎస్‌బీ	8,217
ఇండస్ట్రీ	1034
కాలనీలు	224
బల్క్	32

సర్కారు విభాగాలకు నోటీసులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగాలకు పెండింగ్ బిల్లులపై జలమండలి నోటీసులు జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 40 విభాగాల నుంచి ఆలస్య రుసుం, వడ్డీ మినహాయించి రూ. 1,313 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ శాఖల నుంచి రూ.1,229 కోట్లు, కేంద్ర ప్రభుత్వ విభాగాల నుంచి రూ. 83 కోట్లు రావాల్సి ఉందని సమాచారం.

నేను గురి పెడితే.. 'పారా' హుషారే!

రసూల్‌పురా: కంటోన్మెంట్ రసూల్‌పురాలో ఇన్ఫినిటీ పారా స్పోర్ట్స్ అకాడమీ, హై పర్ఫార్మెన్స్ పారా స్పోర్ట్స్ అకాడమీని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇలా గన్‌తో షూట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయానికి వైకల్యం అవరోధం కాదని పారా అథ్లెట్లు నిరూపించారని పేర్కొన్నారు. గురువారం ఇక్కడ ఆదిత్య మెహతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్ఫినిటీ పారా స్పోర్ట్స్ అకాడమీ, హై పర్ఫార్మెన్స్ పారా స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరల్డ్ ఎబిలిటీ గేమ్స్–2024, జాతీయ, అంతర్జాతీయ పారా క్రీడల విజేతలను సత్కరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. దివ్యాంగులు పతకాలు సాధించడం ప్రశంసనీయమన్నారు. ప్రతిభ, పట్టుదల, అలుపెరగని స్ఫూర్తికి వీరు నిదర్శనమన్నారు. ఆదిత్య మెహతా ఫౌండేషన్ పారా అథ్లెట్ల కోసం కల్పిస్తున్న సౌకర్యాలు ప్రపంచస్థాయి ప్రతిభను పెంపొందించేందుకు వేదికగా నిలిచాయని కొనియాడారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, ఎలికో లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్ వనిత దాట్ల, జవహర్ నవోదయ విద్యాలయ దక్షిణ విభాగ ఉప కమిషనర్ టి. గోపాల కృష్ణ, పల్లవి మెహతా, నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారా సైక్లిస్టులు, హ్యాండ్ సైక్లిస్టులు, బెల్జియం, ఇటలీ, ఆస్ట్రేలియాల్లో జరిగిన వరల్డ్ కప్‌తో పాటు కజకిస్తాన్‌లో జరిగిన క్రీడల్లో విజేతలుగా నిలిచిన పారా క్రీడాకారులను సత్కరించారు.



పారా అథ్లెట్లతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



తుపాకీ గురి పెట్టి..

మారణాయుధాలతో బెదిరించి 2 కిలోల బంగారం దోపిడీ

దోమలగూడ అరవింద్‌నగర్ కాలనీలో ఘటన




ఇంటి తలుపు కొడుతున్న దోపిడీ దొంగ



ఇంట్లోకి చొరబడుతూ.. (సీసీ టీవీ దృశ్యాలు)

కవాడిగూడ: దొంగలు బరితెగించారు. దోమలగూడ పరిధిలోని అరవింద్‌నగర్ కాలనీలో గురువారం తెల్లవారుజామున నగల వ్యాపారిని మారణాయుధాలతో బెదిరించి ఇంట్లోని 2 కిలోల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. కోల్‌కతాకు చెందిన రంజిత్ గొరాయ్ కొన్నేళ్లుగా అరవింద్‌నగర్ కాలనీలో నివసిస్తున్నారు. నగరంలోని వివిధ జ్యువెలరీ షాపుల నుంచి ఆర్డర్లు తీసుకుని నగలు తయారు చేసి సప్లయ్ చేస్తుంటారు. రంజిత్ వద్ద దాదాపు సుమారు 50 మంది కార్మికులు పని చేస్తున్నారు. గురువారం తెల్లవారు జామున 3– 4 గంటల మధ్య దాదాపు ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు రంజిత్ ఇంటి తలుపులు కొట్టి కత్తులతో ఒక్కసారిగా ఇంట్లోకి చొరబడ్డారు. రంజిత్ కుటుంబ సభ్యులను బెదిరించి ఇంట్లోని 2 కిలోల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు రంజిత్ గొరాయ్ దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టారు. బంగారం దోపిడీకి పాల్పడింది ఇంట్లో పని చేస్తున్న సిబ్బందికి తెలిసినవారా? గుర్తు తెలియని వ్యక్తులా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.



అరవింద్‌నగర్ కాలనీలోని రంజిత్ గొరాయ్ ఇల్లు

15 రోజుల ముందే అనుమతి తీసుకోవాలి

న్యూ ఇయర్ వేడుకల నిర్వాహకులకు కమిషనర్ సూచనలు

సాక్షి, సిటీబ్యూరో: కొత్త సంవత్సరం సందర్భంగా ఈ నెల 31న రాత్రి అర్ధరాత్రి ఒంటి గంట వరకు ప్రత్యేక ఈవెంట్స్ నిర్వహించే 3 నక్షత్రాల హోటళ్లు, బార్లు, క్లబ్బులు, పబ్‌లు తప్పని సరిగా 15 రోజుల ముందే అనుమతులు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. ఈవెంట్ నిర్వహించే ప్రాంతాల్లో తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ(మెజర్స్) ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ 2013 కింద తప్పని సరిగా ఎంట్రీ, ఎగ్జిట్‌తో పాటు ప్రాంగణమంతా కవరయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని. తగిన సంఖ్యలో సెక్యూరిటీ సిబ్బందిని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సరైన ఏర్పాట్లు చేసుకోవాలని, అశ్లీలతకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఔట్‌డోర్‌లో ఉండే సౌండ్ సిస్టమ్స్ రాత్రి 10 గంటలకల్లా బంద్ చేయాలని, ఇండోర్‌లో ఒంటి గంట వరకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. సామర్థ్యానికి మించి టిక్కెట్లు జారీ చేయడం వల్ల పలు రకాల ఇబ్బందులతో పాటు శాంతి భద్రతల సమస్యలు కూడా తలెత్తుతాయన్నారు. ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్ వాడకూడదని, ఈ విషయంలో నిర్వాహకులు పార్కింగ్, ఇతర ప్రాంతాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ నిబంధనల మేరకు నిర్ణీత సమయం వరకే మద్యం ఉపయోగించాలని, ఈవెంట్‌కు వచ్చే కస్టమర్లు తిరిగి వెళ్లే సమయంలో డ్రైవర్లు, క్యాబ్స్ అందుబాటులో ఉంచాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు కస్టమర్లను దూరంగా ఉంచాలన్నారు. ఆ రోజు రాత్రి విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయని సీపీ తెలిపారు. అగ్నిమాపక శాఖ ఆదేశాల మేరకు ఫైర్ వర్క్స్‌ను ఉపయోగించరాదని సూచించారు.

పాఠశాల భవనంపై నుంచి పడిపోయిన విద్యార్థి



భవనంపై నుంచి పడిన తనీష్ రెడ్డి

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి పల్లవి మోడల్ స్కూల్‌లో ప్రమాదవశాత్తూ ఓ విద్యార్థి మూడో అంతస్తు నుంచి కిందపడి గాయాల పాలయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్లేందుకు పేరెంట్స్ పాఠశాల ఆవరణకు చేరుకున్నారు. ఈ సమయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న తనీష్ రెడ్డి మూడో అంతస్తు నుంచి జారిపడ్డాడు. ఈ ఘటనలో గాయాల పాలైన బాలుడు అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ రూమ్‌లోకి తీసుకెళ్లి సపర్యలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని కొందరు పేరెంట్స్ ఆందోళన చేపట్టారు. దీంతో స్కూలు వ్యాన్‌లో బాధిత విద్యార్థిని స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సాయంత్రం సికింద్రాబాద్‌లోని మరో ప్రైవేట్ తీసుకెళ్లారు. బాలుడికి పలుచోట్ల ఫ్రాక్చర్ అయినట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం అందుకున్న పోలీసులు, విద్యార్థి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకునేందుకు ఆస్పత్రికి వెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడతామని కార్ఖానా ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. కాగా.. విద్యార్థి భవనంపై నుంచి పడిపోవడంపై భిన్న కథనాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థి తనంతట తానే దూకినట్లు యాజమాన్యం చెబుతున్నప్పటికీ.. అంతకుముందు టీచర్లు మందలించడంతోనే మనస్తాపానికి గురై కిందకు దూకినట్లు వాదనలు వినిపిస్తున్నాయి. గతంలోనూ ఇదే స్కూలు ఆవరణలో ఓ విద్యార్థిని మూడో అంతస్తు నుంచి దూకగా, ఓ ఆయా సైతం భవనంపై నుంచి పడి మరణించింది. స్కూలులో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేయడంతో భవనం చుట్టూ, బాల్కనీల వద్ద జాలీలు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ మరో విద్యార్థి భవనంపై నుంచి పడిపోవడం గమనార్హం.

ధూల్‌పేట గంజాయి డాన్ అంగూర్‌బాయి అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్న అంగూర్ బాయి ఎట్టకేలకు గురువారం కార్వాన్ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడింది. ధూల్‌పేట్ గంజాయి డాన్‌గా గుర్తింపు పొందిన అంగూర్‌బాయిని కార్వాన్ ప్రాంతంలో ఎస్టీఎఫ్, ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. గంజాయి అమ్మకాల్లో రూ.కోట్లకు పడగలెత్తిన అంగూర్ బాయిపై ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 3 కేసులు, మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో 4 కేసులు, ఆసిఫ్ నగర్, గౌరారం స్టేషన్లలో 10 కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో అరెస్టు చేసేందుకు ఎక్సైజ్, పోలీసులు పలు మార్లు ప్రయత్నించినా ఆమె తప్పించుకు తిరుగుతోంది. ఇప్పటికే 13 కేసుల్లో నిందితురాలిగా జైలుకు వెళ్లి వచ్చిన ఆమె కోర్టుల చుట్టూ తిరుగుతోంది. ఆమె కుటుంబ సభ్యులపై కూడా పదుల సంఖ్యలో కేసులు ఉండటం గమనార్హం. ధూల్‌పేట్‌లో గంజాయి హోల్‌సేల్, రిటేల్ అమ్మకాల్లో ఆరితేరిన అంగూర్ బాయిని ఆపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా అరెస్టు చేశారు. ఆమెను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు. అంగూర్‌బాయి అరెస్ట్‌తో ధూల్‌పేటలో ఎక్సైజ్ పోలీసులు భారీ విజయాన్ని నమోదు చేశారు.

గ్రామాల్లో కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించాలి

- వన్ కార్పొరేట్- వన్ విలేజ్ అడాప్షన్ అభినందనీయం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖల మంత్రి సీతక్క



సదస్సులో పాల్గొన్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

గచ్చిబౌలి: కార్పొరేట్ సంస్థలు గ్రామాల్లో కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. గురువారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోషల్ ఇంపాక్ట్ కాన్‌క్లేవ్ 4.0 కార్యక్రమానికి ఆమె ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో వన్ కార్పొరేట్- వన్ విలేజ్ అడాప్షన్ పేరిట గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కంపెనీలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అదే బాటలో మరిన్ని కంపెనీలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. అట్టడుగు స్థాయి ప్రజల అవసరాలను తీర్చగలిగేలా ప్రణాళికబద్ధంగా పని చేయాలని సూచించారు. ఇప్పటికీ ఇంటర్ నెట్ లేని గ్రామాలు ఉన్నాయని, గ్రామీణ బస్సు యాత్ర ద్వారా కార్పొరేట్ కంపెనీలకు అక్కడి పరిస్థితులు చూపించవచ్చునన్నారు. గ్రామాల్లో సాంకేతిక వెనకబాటును రూపుమాపే దిశగా ఐటీ సంస్థలు పని చేయాలన్నారు. 17 రకాల వ్యాపారాల్లో మహిళలను ప్రోత్సహిస్తున్నామని, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఆర్టీసీ అద్దె బస్సులను మహిళలకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. 64 లక్షల మంది సభ్యులుగా ఉన్న మహిళా బృందాలను కోటి మందికి చేర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, మహిళలు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి, కార్పొరేట్ సంస్థలకు వారధిగా నిర్మాణ్ సంస్థ పని చేస్తుందన్నారు. వన్ కార్పొరేట్- వన్ విలేజ్ అడాప్షన్ నినాదంతో కార్పొరేట్ సంస్థలు ములుగు జిల్లాలోని చంద్రు తండా, ఎల్బీనగర్, జవతారపల్లి, ఇంచన్ చెరువుపల్లి, నాగర్ కర్నూల్ జిల్లాలోని బిలాకల్, చెంచుగూడెంలను దత్తత తీసుకున్నాయి. నాలుగు గురుకులాల్లో డిజిటల్ ల్యాబ్‌లను మైక్రోసాఫ్ట్, ఏడు గురుకులాల్లో సైన్స్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథెమాటిక్స్ ల్యాబ్‌లను నాస్కామ్ ఏర్పాటు చేయనున్నాయి.

కేబీఆర్ పార్క్ ఫ్లై ఓవర్లకు టెండర్లు పిలవండి

- హై సిటీ పనుల వేగవంతానికి ప్రత్యేక కార్యాచరణ
- అధికారులకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఆదేశం



సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హైసిటీ ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ అధికారులకు సూచించారు. హైసిటీ ప్రాజెక్టులో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలో రూ.3,500 కోట్లతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, రూ.150 కోట్లతో చేపట్టనున్న జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ పనులపై ఎన్‌బియూఎంలో గురువారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైసిటీ ఫేజ్-1లో భాగంగా రూ.1230 కోట్లతో చేపట్టే కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు జంక్షన్లలో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి టెండర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ , పరిహారం పై నివేదిక అందజేయాలని సూచించారు.125 ట్రాఫిక్ జంక్షన్ల లో అడ్డుగా ఉన్న 4,100 విద్యుత్ స్తంభాలను 3 నెలల్లోగా తరలించి జంక్షన్ల అభివృద్ధి , సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. పనులను వేగంగా చేపట్టేందుకు ఇంజినీరింగ్, ట్రాఫిక్ పోలీస్, విద్యుత్, వాటర్ బోర్డు, టెలికాం, టౌన్ ప్లానింగ్, సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. హైసిటీ ప్రాజెక్టు పనుల అమలుకు ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి సూచించారు. టెండర్లు పూర్తయి, ఎంపికయ్యే కాంట్రాక్టు ఏజెన్సీ పనులు ప్రారంభించేలోగా యుటిలిటీస్ షిఫ్టింగ్ పనులు పూర్తిచేయాలన్నారు. ప్రతి ప్రాజెక్టు కు సంబంధించి చేపట్టాల్సిన భూ సేకరణ, చెల్లించాల్సిన పరిహారం అంచనా వేసి నివేదిక అందజేయాలని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ కిల్లు శివ కుమార్ నాయుడుకు సూచించారు. వచ్చే గురువారం మరోమారు సమావేశం నిర్వహిస్తామని, సంబంధిత ఈఈలు పనులు వేగంగా చేపట్టేందుకు దశలవారీగా తీసుకునే చర్యలపై సమగ్ర కార్యాచరణను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించాలన్నారు. సమావేశంలో అడిషనల్ సీపీ (ట్రాఫిక్) విశ్వప్రసాద్, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ, వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి, పబ్లిక్‌హెల్త్ ఈఎన్‌సీ ఎం. దేవానంద్, తదితర అధికారులు పాల్గొన్నారు. సమావేశానంతరం దానకిశోర్ సంబంధిత అధికారులతో కలిసి విరించి జంక్షన్, పెన్షన్ ఆఫీస్ రోడ్డును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విరించి జంక్షన్ వద్ద రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు ఎలక్ట్రికల్ పోల్స్ షిఫ్టింగ్‌పై అధికారులకు సూచనలు చేశారు.పెన్షన్ ఆఫీస్ వద్ద లింక్ రోడ్డు నిర్మాణం సాధ్యాసాధ్యాలపై చర్చించారు.

నాంపల్లి కోర్టుకు ఎమ్మెల్యే రాజాసింగ్

సిటీ కోర్టు : గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై నమోదైన పలు కేసుల్లో గురువారం ఆయన నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని సిటీలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బహదూర్‌పూర, మంగళ్‌హాట్ తదితర పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. మొత్తం 9 కేసులపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు జడ్జి శ్రీదేవి రాత్రి 7 గంటల వరకు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా 12 మంది సాక్షులను అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజాసింగ్ తరుపు న్యాయవాది కరుణసాగర్ క్రాస్ ఎగ్జామినేషన్ చేయగా కోర్టు రికార్డు చేసింది. తదుపరి విచారణను ఈనెల 19 కి వాయిదా వేసింది.

బీజేపీ ఎంపీ బండి సంజయ్ గైర్హాజరు..

హుజురాబాద్ ఉప ఎన్నికలో భాగంగా అప్పటి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రస్తుత బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారంటూ హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘిస్తూ రోడ్‌షో నిర్వహించి ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ కేసులపై గురువారం ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగిన విచారణకు బండి సంజయ్ గైర్హాజరు కావడంతో ఆయన తరుపు న్యాయవాది కరుణసాగర్ పిటిషన్ దాఖలు చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో ఆయన కోర్టుకు హాజరు కాలేకపోయారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అనంతరం ఈ కేసుల్లో ఇద్దరు సాక్షులు హాజరు కాగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో న్యాయవాది కరుణసాగర్ క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. తదుపరి విచారణ ఈనెల 19కి వాయిదా వేసింది.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడు పృథ్వీరాజ్

కీసర: కీసర మండలం, రాజీవ్ గృహకల్ప కాలనీ వద్ద ఈ నెల 10న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాప్రా మండలం, ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన కనకయ్య కుమారుడు మహిపాల్ (24) డీజే ప్లేయర్‌గా పని చేసేవాడు. అతడికి రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన పృథ్వీరాజ్‌తో స్నేహం ఉంది. వీరిద్దరికి ఓ యువతి పరిచయమైంది. సదరు యువతిని ప్రేమించిన పృథ్వీరాజ్ ఆమెను పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. అయితే అందుకు ఆమె తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో పృథ్వీరాజ్‌కు దూరంగా ఉంటున్న ఆమె మహిపాల్‌కు సన్నిహితంగా ఉంటోంది. దీంతో మహిపాల్‌పై కక్ష పెంచుకున్న పృథ్వీరాజ్ మహిపాల్‌ను చంపి ఆమెను పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఈ నేపథ్యంలో పథకం ప్రకారం ఈ నెల 10న మరో వ్యక్తి ద్వారా మహిపాల్‌ను దమ్మాయిగూడకు పిలిపించాడు. అతడికి మద్యం తాగించి బైక్‌పై ఎక్కించుకుని రాజీవ్ గృహకల్ప కాలనీ వెనక ఉన్న కొండపైకి తీసుకెళ్లి కత్తితో పొడిచి హత్య చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం పృథ్వీరాజ్‌ను అతడి ఇంట్లో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇల్లు పోతుందన్న భయంతో పేద గుండె ఆగింది



రవీందర్ (ఫైల్)

ఉప్పల్, సాక్షి హైదరాబాద్: తన ఇల్లు కూల్చివేస్తారేమో అన్న దిగులుతో ఓ నిరుపేద గుండె ఆగింది. ఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రామంతాపూర్ కేటీఆర్ నగర్ ప్రాంతానికి చెందిన స్కూల్ వ్యాన్ నడిపే తాటిపల్లి రవీందర్ (55)కి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. కుమార్తెలిద్దరికీ వివాహాలు అయ్యాయి. రవీందర్ 75 గజాల స్థలంలో నిర్మించిన రేకుల ఇంట్లో ఉంటున్నారు. ఇది మూసీ పరీవాహక ప్రాంతంలో ఉండటం వల్ల రవీందర్ నివాసముంటున్న ఇంటికి అవతలి పక్కన ఉన్న ఇంటికి అధికారులు మార్కు చేశారు. దీంతో రవీందర్‌కు తన ఇంటిని కూడా కూల్చి వేస్తారేమోనన్న బెంగ పట్టుకుంది. అప్పటి నుంచి దిగాలుగా ఉంటున్నాడు. ఉన్న చిన్న ఇల్లు ఆధారం పోతే ఎలా బతికేదంటూ కుటుంబ సభ్యులతో ఆందోళన వ్యక్తం చేసేవాడు. నెల రోజుల క్రితం ఇదే ఆవేదనతో గుండెపోటు వచ్చిందని కుటుంబ సభ్యులు చెప్పారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున మరోసారి గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించారు. అక్కడ రవీందర్‌ను పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పెద్ద దిక్కు కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

హైడ్రాపై ఫేక్ ప్రచారం చేస్తే కఠిన చర్యలు: రంగనాథ్

మూసీ నది ఎఫ్‌ఐఎల్, బఫర్ జోన్లలో మార్కింగ్, కూల్చివేతలతో హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదని, ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసినప్పటికీ ఫేక్ ప్రచారం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్లో హైడ్రాపై భయాందోళనలు సృష్టిస్తే ఊరుకోమని ఆయన హెచ్చరించారు. మూసీ నదిలో హైడ్రా ఎలాంటి చర్యలు చేపట్టదనీ, నిబంధనల ప్రకారమే హైడ్రా కార్యకలాపాలు ఉంటాయన్నారు. ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

'కిమ్స్' కృష్ణయ్య కేసులో పాస్‌పోర్ట్ యాక్ట్

- లభించిన ఆధారాలతో చేర్చిన సీసీఎస్
- ఆస్పత్రుల పాత్రపై లోతుగా దర్యాప్తు



సాక్షి, సిటీబ్యూరో: తెలుగుదేశం పార్టీ కీలక నేత, నెల్లూరు జిల్లా, ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యపై హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైన క్రిమినల్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటి వరకు చేపట్టిన దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాలు, లభించిన ఆధారాలతో కేసులో పాస్‌పోర్ట్ యాక్ట్ జోడించారు. ఈ మేరకు సీసీఎస్ పోలీసులు న్యాయస్థానానికి సమాచారం ఇచ్చారు. రెండో భార్య సంతానాన్ని మొదటి భార్య, బంధువుల సంతానంగా చూపిస్తూ బర్త్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టులు పొందారనేది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. విశాఖపట్నానికి చెందిన కృష్ణవేణి నాంపల్లిలోని మెడ్విన్ ఆస్పత్రిలో పని చేస్తుండగా కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్‌గా ఉన్న బొల్లినేని కృష్ణయ్యతో పరిచయమైంది. తన భార్య సుజాతతో సరైన సంబంధాలు లేవని, ఆమెకు పిల్లలు పుట్టే అవకాశం లేదంటూ కృష్ణవేణిని నమ్మించిన కృష్ణయ్య 2004 ఫిబ్రవరిలో రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి 2004 ఆగస్టు 31న బేగంపేటలోని స్వప్న హెల్త్ కేర్ సెంటర్‌లో కుమారుడు అర్జున్ జన్మించాడు. ఈ మేరకు జీహెచ్ఎంసీ సర్కిల్-10 కార్యాలయంలో అదే ఏడాది సెప్టెంబర్ 11న రిజిస్ట్రేషన్ చేయించారు. రెండేళ్లకు కృష్ణయ్య తన కుమారుడు అర్జున్‌ను తనతో పాటు తీసుకెళ్లిపోయారు. కృష్ణయ్య, కృష్ణవేణిలకు 2006 జూలై 29న స్వప్న నర్సింగ్ హోమ్‌లో కృష్ణ వైష్ణవి పుట్టింది. అదే ఏడాది ఆగస్టు 9న జీహెచ్ఎంసీ సర్కిల్-10 కార్యాలయంలో రిజిస్టర్ చేయించిన కృష్ణయ్య కుమార్తెను కూడా వివిధ కారణాలు చెప్పి తనతో తీసుకెళ్లిపోయారు. అర్జున్ పేరును బొల్లినేని అర్జున్ చౌదరిగా, సుజాత-కృష్ణయ్య తల్లిదండ్రులుగా పేర్కొంటూ, సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో అతడు పుట్టినట్లు 2007 జనవరి 29న జీహెచ్ఎంసీ సర్కిల్-18 కార్యాలయంలో రిజిస్టర్ చేయించారు. ఇందుకు సంబంధించి కృష్ణయ్య మొదటి భార్య సుజాత అదే ఏడాది జనవరి 27న హైదరాబాద్ ఆర్డీఓ వద్ద ఓ అఫిడవిట్ దాఖలు చేశారు. అందులో పొందుపరిచిన వివరాలతో పాటు ఇతర పత్రాల ఆధారంగానే అర్జున్ చౌదరికి మరో బర్త్ సర్టిఫికెట్ జారీ అయ్యింది. అదే తరహాలో కృష్ణ వైష్ణవి పేరును వైష్ణవిగా, ఆమె బాలానగర్‌లోని రెమిడీ ఆస్పత్రిలో జన్మించినట్లు, తల్లిదండ్రులుగా డాక్టర్ వంకాయలపాటి హేమ మాలినీ ప్రసాద్, డాక్టర్ వంకాయలపాటి శ్రీ వెంకటేశ్వర ప్రసాద్‌లను తల్లిదండ్రులుగా పేర్కొంటూ 2006 డిసెంబర్ 30న జీహెచ్ఎంసీ సర్కిల్-14 కార్యాలయంలో రిజిస్టర్ చేయించారు. ఈ మేరకు మరో బర్త్ సర్టిఫికెట్ పొందారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న అధికారులు ఇప్పటికే జీహెచ్ఎంసీ నుంచి కీలక పత్రాలు పొందారు. వీటి ఆధారంగా అర్జున్, వైష్ణవిల పాస్‌పోర్టు దరఖాస్తు సమయంలో దాఖలు చేసిన పత్రాల వివరాలను కోరుతూ రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయానికి లేఖ రాశారు. ఆ అధికారులు అందించిన సమాచారం ఆధారంగా పాస్‌పోర్టు యాక్ట్‌లోని సెక్షన్ 12 (1) (బీ) జోడించారు. పోలీసులు నిందితుల జాబితాలో కృష్ణయ్య, సుజాత, హేమామాలిని, వెంకటేశ్వర ప్రసాద్ పేర్లను మాత్రమే చేర్చారు. అయితే నకిలీ సర్టిఫికెట్లు సృష్టించడానికి కారణమైన కిమ్స్, రెమిడీ హాస్పిటల్స్ పేర్లను నిందితుల జాబితాలో చేర్చాలని బాధితురాలు కృష్ణవేణి అధికారులను కోరుతున్నారు. దీంతో సీసీఎస్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

కదంతొక్కిన అంగన్‌వాడీలు

- జిల్లాల నుంచి తరలివచ్చిన టీచర్లు, హెల్పర్లు
- ఇందిరాపార్కు వద్ద మహాధర్నా



మహాధర్నాలో మాట్లాడుతున్న జయలక్ష్మి

కవాడిగూడ: అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తమ న్యాయమైన డిమాండ్లు ఆమోదించాలని రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను పెంచాలన్నారు. నాలుగు వేల మంది టీచర్లకు 7 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా అక్కడ పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. అనంతరం పోలీసుల సహాయంతో యూనియన్ నేతలు సచివాలయానికి వెళ్లి మంత్రి సీతక్కతో చర్చలు జరిపారు. మంత్రి సీతక్క, కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ సమక్షంలో చర్చలు జరిగాయని, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనలను వాయిదా వేసుకున్నామని జయలక్ష్మి తెలిపారు.

వక్ఫ్‌బోర్డు కేటాయించిన భూములపై దర్యాప్తు చేయాలి

- జమాతె ఇస్లామీ రాష్ట్ర అధ్యక్షుడు ఖాలీద్



సాక్షి, సిటీబ్యూరో: గత పదేళ్లలో వక్ఫ్‌బోర్డు కేటాయించిన భూములపై దర్యాప్తు చేపట్టి, అక్రమ కేటాయింపులను రద్దు చేయాలని జమాతె ఇస్లామీ రాష్ట్ర అధ్యక్షుడు ఖాలిద్ జాఫర్ ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ వల్ల నష్టపోయిన వక్ఫ్ ఆస్తులను కాపాడాలన్నారు. వక్ఫ్ భూములకు రక్షణ కల్పించి, వాటి నిర్వహణను ముస్లిం సంస్థలకు అప్పగించాలని, అవి వినియోగంలోకి వచ్చేవిధంగా చూడాలని కోరారు. గురువారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను సంపూర్ణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కులగణనకు సంబంధించి 95% సర్వే పూర్తయిందని ప్రభుత్వం అంటోందని, కానీ వాస్తవాలు విరుద్ధంగా ఉన్నాయని అన్నారు. విభిన్న సముదాయాల ప్రజలందరికీ వారి హక్కులు అందేలా సమగ్రంగా, పారదర్శకంగా సర్వే చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో మత సామరస్యానికి విఘాతం కలిగించే సంఘటనలను నివారించడానికి అల్లర్లు సృష్టించే శక్తులపై సునిశిత నిఘా పెట్టాలని, జైనూర్ వంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ప్రభుత్వం చేపట్టే సానుకూల చర్యలను సమర్థించడంతోపాటు లోపాలను తమ సంస్థ ఎత్తిచూపుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శులు అబ్దుల్ హకీమ్, మహ్మద్ మంజూర్ పాల్గొన్నారు.

వర్షపు నీటి సంరక్షణకు చర్యలు

సుల్తాన్ ఉల్ ఉలూం సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్



వాసన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటున్న సుల్తాన్ ఉల్ ఉలూం కాలేజీ ప్రతినిధులు

బంజారాహిల్స్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా వర్షం నీటిని ఒడిసి పట్టుకోవడం చాలా ముఖ్యమని, భూగర్భ జలాలు పెంచుకోవడానికి పలు పద్ధతులు ఎంతో దోహదం చేస్తాయని సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్ అన్నారు. గురువారం కళాశాలలో వాటర్‌షెడ్ సపోర్టు సర్వీసెస్ అండ్ యాక్టివిటీస్ నెట్‌వర్క్ (వాసన్) సంస్థతో సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ ఇంకుడు గుంతల ఏర్పాటు, వాటర్ మేనేజ్‌మెంట్, వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానాలపై అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా జాఫర్ జావెద్ మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవడానికి అత్యాధునిక విధానాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వర్షపు నీటి సంరక్షణకు పలు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ డైరెక్టర్ ఎంవి. రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి



వినతిపత్రం సమర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

బంజారాహిల్స్: మరణించిన ఆటోడ్రైవర్లు, ట్రాన్స్‌పోర్ట్, నాన్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లకు సామాజిక భద్రత బీమా పథకం రెన్యువల్‌తోపాటు, వారి కుటుంబాలకు అందించే రూ.5 లక్షలను రూ.10 లక్షల వరకు పెంచాలని ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు దయ్యాల దాసు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, అలాగే సహజ మరణం పొందిన వారి కుటుంబాలకు కూడా ఈ పథకం వర్తింపజేయాలన్నారు. ప్రమాదంలో అంగవైకల్యం చెందిన డ్రైవర్లకు రూ. 3 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించాలని మంత్రిని కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నరసింహారెడ్డి, జనరల్ సెక్రటరీ గోదా మల్లేష్‌గౌడ్, దయానంద్, వెల్తూరి అశోక్, మంద వెంకట్‌నర్సు తదితరులు పాల్గొన్నారు.

గంగాధర్‌కు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి



అభివాదం చేస్తున్న మాదిగ సంఘాల నాయకులు

పంజగుట్ట: సంచార కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టాలు పడి డీఎస్పీ స్థాయికి ఎదిగిన మదనం గంగాధర్‌కు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరఫున అవకాశం కల్పించాలని మాదిగ, మాదిగ ఉపకులాల సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఎమ్ఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు ఇటిక రాజు మాదిగ, 57 ఎస్సీ కులాల ఐక్యవేదిక అధ్యక్షులు చింతల రాజలింగం, మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపకులు జున్ను కనకరాజ్‌లు మాట్లాడుతూ మాదిగ ఉపకులాల, సంచారజాతికి చెందిన కుటుంబంలో పుట్టిన మదనం గంగాధర్ చిన్నతనం నుంచి పేపర్‌బాయ్‌గా, కుటుంబ సభ్యులు బొమ్మలు, బుడగలు అమ్మితే వారికి సాయంగా ఉంటూ ఎంతో కష్టపడి చదువుకుని ఎస్సై ఉద్యోగం సంపాదించాడని తెలిపారు. ఇంకా సర్వీస్ ఉన్నప్పటికీ డీఎస్పీగా పదవీ విరమణ చేసి పట్టభద్రుల ఎమ్మెల్సీగా ప్రజలకు మరింత సేవ చేయాలని ముందుకు వస్తున్నాడని ఆయనకు మాదిగ, మాదిగ ఉపకులాల సంఘాలు అన్ని సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నో పార్టీలు ఆయనను తమ పార్టీలోకి రావాలని ఆహ్వానిస్తున్న ఆయన మాత్రం కాంగ్రెస్ పార్టీవైపు చూస్తున్నారని ముఖ్యమంత్రి స్పందించి కాంగ్రెస్ తరఫున పట్టభద్రుల అభ్యర్థిగా గంగాధర్‌ను ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎమ్ఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలరాజు, యాదయ్య, బాలకృష్ణ, తులసీరామ్, శంకర్, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహాన్ని నింపిన నోబ్యాగ్ డే వేడుకలు

వివిధ రకాల థీమ్‌లతో ఆకట్టుకున్న విద్యార్థులు





వేడుకల్లో విద్యార్థులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45లోని భారతీయ విద్యా భవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో గురువారం 'నోబ్యాగ్ డే' వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఒక్కరోజు పుస్తకాలను పక్కనబెట్టి రోజువారీ జీవితంలో ఎదురయ్యే అనుభవాలను ప్రాక్టికల్‌గా విద్యార్థులు చేసి చూపించారు. ఎంబీఏ గ్రాడ్యుయేట్ అయిన నాగబండి చందన, బీఎస్సీ కెమిస్ట్రీ అయిన అనిసెట్టి సుమలు రీసోర్స్‌పర్సన్లుగా విచ్చేసి పలు అంశాలపై విద్యార్థులకు మెళకువలు నేర్పించారు. బాల్ పంచాయతీ పేరిట వివిధ పాత్రలను పోషించి అనుభవపూర్వకంగా గ్రామ పంచాయతీలో నిర్ణయాధికారం, నాయకత్వ బాధ్యతలు గురించి తెలుసుకున్నారు. అలాగే రైతుబజార్ పేరిట రైతులు, కొనుగోలుదారులు, విక్రయదారులను అనుకరిస్తూ మార్కెట్‌లో కార్యకలాపాలు, వాటి పనితీరు, అక్కడ జరిగే వ్యవహారాలు, రోజువారీ జీవితంలో వ్యవసాయం ప్రాముఖ్యత గురించి అవగాహన పొందారు. బొమ్మల తయారీ పేరిట విద్యార్థులు తమ ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీస్తూ పూసలు, ప్లాస్టిక్ వైర్లను ఉపయోగించి బొమ్మలను రూపొందించిన తీరు ఆకట్టుకుంది. అలాగే గ్రీటింగ్ కార్డ్ తయారీ పేరిట విద్యార్థులు తమ కళాత్మక ప్రతిభను చాటారు. వివిధ రకాల వస్తువులను ఉపయోగించి కళ్లు చెదిరే గ్రీటింగ్ కార్డులను రూపొందించారు. రోజువారీ కార్యక్రమాలకు భిన్నంగా నిర్వహించిన ఆయా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి.

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి



చెత్తను తొలగించాలని సూచిస్తున్న దేదీప్య విజయ్

వెంగళరావునగర్: చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, లేకుంటే చర్యలు తప్పవని జీహెచ్‌ఎంసీ సిబ్బందిని కార్పొరేటర్ దేదీప్య విజయ్ హెచ్చరించారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని వెంగళరావునగర్ ప్రభుత్వ పాఠశాల, నాగదేవత, చర్చిగల్లీ, కమ్యూనిటీ హాల్ తదితర ప్రాంతాల్లో గురువారం కార్పొరేటర్ పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది ప్రతిరోజూ పరిసరాలను శుభ్రం చేయడం లేదని, దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని పేర్కొన్నారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ స్థానిక ఎస్ఎఫ్ఏ, కార్మికులను పిలిపించి చెత్త ఎత్తే విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, కిట్టు, బాలు రజక, యాదగిరి తదితరులు ఉన్నారు.

ఆపరేషన్ రోడ్డునెంబర్-12

- ఒకేరోజు ఫుట్‌పాత్‌లపై 75 ఆక్రమణల తొలగింపు
- పాల్గొన్న 60మంది ట్రాఫిక్ పోలీసులు, 15మంది జీహెచ్‌ఎంసీ సిబ్బంది
- హర్షం వ్యక్తం చేసిన పాదచారులు, వాహనదారులు
- సంపన్నుల ఇళ్ల ముందూ అక్రమ నిర్మాణాల కూల్చివేత



రోడ్డునెంబర్-12లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది



తొలగింపులను పర్యవేక్షిస్తున్న డీసీపీ రాహుల్‌హెగ్డే తదితరులు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12 ప్రధాన రహదారిలో బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా గురువారం ఐదు గంటలపాటు ఫుట్‌పాత్ ఆపరేషన్ రోప్ నిర్వహించి 75 ఆక్రమణలను తొలగించారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్‌హెగ్డే, వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా, బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ తదితరుల పర్యవేక్షణలో 60 మంది ట్రాఫిక్ పోలీసులు, 15 మంది జీహెచ్‌ఎంసీ సిబ్బంది రోడ్డునెంబర్–12 కమాన్ నుంచి కమాండ్ కంట్రోల్ సెంటర్ వరకు రోడ్డుకు రెండువైపులా ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన డబ్బాలు తొలగించారు. అలాగే పలువురు తమ షాపుల ముందు అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూడా జేసీబీలతో నేలమట్టం చేశారు. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఈ రోడ్డులో ఫుట్‌పాత్‌లు, రోడ్డును ఆక్రమించి నిర్మించి ఆక్రమణలు తొలగించారు. పది రోజుల క్రితం ఈ రోడ్డుకు రెండువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి చాయ్‌బండ్లు, కిళ్లీ కొట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, పాన్ డబ్బాలు, టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేయగా వీరందరికీ బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలని మూడు రోజుల క్రితం అందరికీ నోటీసులు జారీ చేశారు. అయితే ఏ ఒక్కరూ స్పందించలేదు. దీంతో భారీ బందోబస్తు మధ్య ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది 75 వరకు డబ్బాలను తొలగించి లారీల్లో తరలించారు. దీంతో రోడ్డునెంబర్–12 రెండువైపులా ఆక్రమించిన రోడ్డుతో పాటు ఫుట్‌పాత్‌లు క్లీన్ అయ్యాయి. పలువురు దుకాణాదారుల రోడ్డువైపు నిర్మించిన కట్టడాలను కూడా నేలమట్టం చేశారు. కొందరు బడాబాబులు తమ ఇళ్ల ముందు సుందరీకరణ ముసుగులో ఫుట్‌పాత్‌లపై లాన్ ఏర్పాటు చేశారు. వాటిని కూడా తొలగించి రోడ్డును క్లియర్ చేశారు. దీంతో పాదచారులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. మోర్ మెడికల్స్ పక్కన గత పదేళ్లుగా ఇంటి యజమాని సెట్‌బ్యాక్‌లో ఐదు షట్టర్లు ఏర్పాటు చేసి నెలనెలా లక్షలాది రూపాయల అద్దె వసూలు చేస్తుండగా ఆపరేషన్ రోప్‌లో మోర్ మెడికల్స్‌తో పాటు పక్కనే ఉన్న దుకాణాలన్నింటినీ తొలగించారు. దీంతో కొత్తగా వేసిన రోడ్డు వైపు నుంచి కమాన్ వైపు వెళ్లే వాహనదారులకు మార్గం సుగమమైంది.

ఇంతటితో ఆపొద్దు...

ట్రాఫిక్ పోలీసులు ఆపరేషన్ రోప్ నిర్వహించి ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించి జారుకుంటున్నారు. ఆ తెల్లవారి మళ్లీ యథావిధిగా వ్యాపారులు, దుకాణాదారులు మళ్లీ డబ్బాలను ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల సమస్య యథాస్థితికి వస్తోంది. ఇలా కాకుండా ఉండాలంటే ప్రతిరోజూ ట్రాఫిక్ పోలీసులు ఆపరేషన్ రోప్ నిర్వహించిన రోడ్డులో నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. పాదచారులు సైతం ఫుట్‌పాత్‌లు ఎప్పుడూ అందుబాటులో ఉండాలంటే అక్రమ డబ్బాలు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

హౌసింగ్ సొసైటీ ఎన్నికలకు భద్రత కల్పించండి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–70లోని జర్నలిస్ట్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు ఈ నెల 18వ తేదీన ఉదయం 9 గంటల నుంచి జరుగుతాయని, ఇందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల్సిందిగా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న డిప్యూటీ రిజిస్ట్రార్ కె. రాజేందర్‌రెడ్డి గురువారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. మొత్తం 1389 మంది సభ్యులు ఉన్నారని, అదే రోజు సాయంత్రం 3 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుందని, ఆ తర్వాత ఫలితాలు వెల్లడించడం జరుగుతుందని, అప్పటి వరకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఇల్లు విక్రయిస్తానని మోసం

వెంగళరావునగర్: ఇల్లు, ఫర్నిచర్ విక్రయిస్తానని నగదు తీసుకుని మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఏపీకి చెందిన ఆర్.హరిబాబు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ స్థానిక సిద్ధార్థనగర్‌లో నివాసం ఉంటున్నాడు. 9వ తేదీన అతని ఫేస్‌బుక్‌కు కెపిఎస్ ఆచార్య అనే వ్యక్తి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపాడు. రిక్వెస్ట్ అంగీకరించడంతో తన స్నేహితుడు సంతోష్‌కుమార్ పాత ఇల్లు, ఫర్నిచర్ తక్కువ రేటుకు విక్రయిస్తున్నట్లుగా చెప్పాడు. పరస్పరం వాట్సాప్ చాటింగ్ అనంతరం 10వ తేదీ రూ.2 వేలు హరిబాబు అతని అకౌంట్‌కు పంపాడు. మరికొన్ని గంటల్లో మరో రూ.48వేలు పంపాడు. కొంత సమయం తర్వాత తాను మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులకు తెలియజేసిన అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న 'ది పర్పుల్ పాప్ అప్' ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న పైడి రాకేష్ రెడ్డి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్–10 బీబీలాన్‌లో ది పర్పుల్ పాప్ అప్ పేరుతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను గురువారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ నగర యువతను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ చేతి వృత్తుల కళాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు దోహదపడతాయన్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాలకు చెందిన ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన భిన్నమైన వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శించినట్లు నిర్వాహకులు పైడి సుచరిత రెడ్డి, శ్రీజ తెలిపారు. ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో చదువుతున్న డిజైనింగ్ విద్యార్థుల ఉత్పత్తులను సైతం ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని గుండా ఈశ్వర్ ఫౌండేషన్, పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్ల ద్వారా పేద విద్యార్థుల విద్య, వైద్యం కోసం ఖర్చు చేయనున్నట్లు వారు తెలిపారు. ఓవైపు వ్యాపారం చేస్తూనే మరోవైపు సామాజిక బాధ్యతను చేపడుతున్నామని పేర్కొన్నారు. అంకాపూర్‌కు చెందిన ఆర్గానిక్ మసాలాలు తామే స్వయంగా తయారు చేయించి నగరవాసులకు అందుబాటులో ఉంచినట్లు పైడి సుచరిత రెడ్డి తెలిపారు.

నమ్మినందుకు నట్టేట ముంచాడు

వెంగళరావునగర్ : నమ్మినందుకు మహిళను ఒక వ్యక్తి మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మహబూబాబాద్‌కు చెందిన సునీత లేబర్ మేస్త్రీగా పనిచేస్తూ భర్త, పిల్లలతో కలిసి స్థానిక ఓంనగర్‌లో నివాసం ఉంటుంది. మూడేళ్ల కిందట ఆమె భర్త చనిపోగా, ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయితో కలిసి జీవిస్తోంది. మూడు నెలల కిందట ఆమె పనిచేసే చోట చెంచయ్య పరిచయమై మాయమాటలు చెప్పడంతో అతడితో కలిసి ఆమె ఒకే ఇంట్లో సహజీవనం చేస్తుంది. రెండు నెలల కిందట ఆమెకు తెలియకుండా చెంచయ్య ఆమె నల్లపూసల దండ, చెవి దిద్దులు, చైన్‌తో పాటుగా ద్విచక్ర వాహనం తీసుకుని వెళ్లిపోయాడు. చెంచయ్యకు ఫోన్ చేయగా త్వరలోనే తెస్తానని చెప్పి అనంతరం ఫోన్‌కు సమాధానం ఇవ్వడం లేదు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలాలు

తహసీల్దార్‌ను నిలదీసిన కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2 పార్క్ హయత్ వెనుక ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు



హెచ్చరిక బోర్డు తొలగించిన దృశ్యం

బంజారాహిల్స్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. ఈ క్రమంలోనే బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని పార్క్ హయత్ హోటల్ వెనుక సాగర్ సొసైటీ పక్కన నాలుగు వారాల క్రితం కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కబ్జా చేయగా సమాచారం అందుకున్న షేక్‌పేట మండల రెవెన్యూ సిబ్బంది వాటిని నేలమట్టం చేశారు. అదే రోజు ఇది ప్రభుత్వ స్థలమంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే ఈ స్థలంలో హెచ్చరిక బోర్డు తొలగించడంతో మళ్లీ కబ్జాకు గురవుతుందని, స్థలాల పరిరక్షణకు ఏం చర్యలు తీసుకుంటున్నారంటూ జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ గురువారం షేక్‌పేట మండల తహశీల్దార్ అనితారెడ్డిని ప్రశ్నించారు. మొన్నటి వరకు ప్రభుత్వ స్థలం కాగా, ఇప్పుడు ప్రైవేటు స్థలం ఎలా అవుతుందని నిలదీశారు. ప్రభుత్వ స్థలాలను కాపాడడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సుమారుగా 3,000 గజాల విస్తీర్ణంలో ఉన్న ఖరీదైన ఈ స్థలాన్ని కొందరు కబ్జా చేయగా వాటిని కూల్చివేసిన రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు తొలగించినా ఎందుకు నోరు మెదపడం లేదని ఆరోపించారు. షేక్‌పేట రెవెన్యూ అధికారుల నిర్వాకం వల్లనే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ డివిజన్ల పరిధిలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయని దుయ్యబట్టారు. స్థలాలను కాపాడడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమవుతుందన్నారు. కబ్జాదారులు దర్జాగా స్టేలు తెచ్చుకుంటుంటే రెవెన్యూ అధికారులు కౌంటర్లు ఎందుకు వేయడం లేదని, ఇందులో ఉన్న మతలబు ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని వెంకటేష్ కోరారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–2లోని ఇందిరానగర్ స్ట్రీట్‌నెంబర్–3లో రూ.18 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ గురువారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. రోడ్డు నిర్మాణ సమయంలో మ్యాన్‌హోళ్ల ఎత్తు సరిగా ఉందో లేదో చూసుకుని అందుకు అనుగుణంగా నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు శంకర్, జ్యోతి, రమణమ్మ, విక్కీ, పుంటీ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్ : ఇంటి ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్‌లో నివాసం ఉండే కె. శ్రీనివాసరావు అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 2వ తేదీ రాత్రి అతడు తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట పార్క్ చేసి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరణించి..నలుగురికి ఊపిరిపోసి..!

జీవన్‌దాన్‌కు యువకుడి అవయదానం



మృతుడు పొన్నబోయిన మల్లికార్జున్‌యాదవ్

బంజారాహిల్స్: చదువుకోవడానికి ఈ నెల 29న అమెరికా వెళ్లాల్సిన ఓ యువకుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కుటుంబ సభ్యులు మానవత్వంతో ఆ యువకుడి అవయవాలను అవసరమైన వారికి దానం చేసి తన దాతృత్వం చాటుకున్నారు. దీంతో ఆ యువకుడు మరణించినా మరో నలుగురికి ఊపిరిపోశాడు. వివరాల్లోకి వెళితే... రిసాలబజార్ బొల్లారానికి చెందిన పొన్నబోయిన మల్లికార్జున్‌యాదవ్ (25) సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తిచేశాడు. ఆయనకు అమెరికా న్యూజెర్సీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సీటు వచ్చింది. ఈ నెల 29న అమెరికా వెళ్లాల్సి ఉంది. ఇంతలోనే ఇటీవల బేగంపేటలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో యువకుడి కుటుంబ సభ్యులు ఆయన లివర్, లంగ్స్, హార్ట్, కిడ్నీలను జీవన్‌దాన్‌కు అందజేసి ఆదర్శంగా నిలిచారు.

రేపు 'టీహబ్'లో హెల్త్ కేర్ సమ్మిట్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జిసిటీలోని 'టీహబ్'లో శనివారం ఉదయం 9గంటలకు నాల్గవ హెల్త్ కేర్ సమ్మిట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ' హైప్ వర్సెస్ రియాలిటీ: న్యూ జెన్ టెక్నాలజీ ఇన్ హెల్త్‌కేర్ డెలివరీ' అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, ఏఐజీ ఆస్పత్రుల డైరెక్టర్ డాక్టర్ జీవీరావు, డాక్టర్ వి. మోహన్, పలువురు వైద్యులు పాల్గొంటారు.

ఇలాగైతే నడిచేదెలా..!

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్‌కు వెళ్లే రోడ్డులో పార్కింగ్ స్థలాన్ని ఆనుకుని ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన స్తంభాలు పాదచారులకు అడ్డంకిగా మారుతున్నాయి. ఇక్కడే కడక్ చాయ్, 1980 మిలటరీ హోటల్ కూడా ఉండగా, కేబీఆర్ పార్క్‌కు నిత్యం వందలాదిమంది పాదచారులు వస్తుంటారు. అయితే ఈ ఫుట్‌పాత్‌పై గోతులు, స్తంభాలు, పైకి తేలిన ఇనుప చువ్వలు ఉండటంతో పాదచారులు నడిచే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని తొలగిస్తే ఈ ఫుట్‌పాత్‌లు అందంగా మారడంతోపాటు పాదచారులు నడవటానికి సులభంగా ఉంటుందని పలువురు వాకర్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ స్పందించి ఈ ఫుట్‌పాత్‌లపై ఉన్న అనవసరమైన వాటిని తొలగించాలని కోరుతున్నారు.



నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ జరుగుతుంది.
- సూత్రా ఎగ్జిబిషన్ బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్‌కృష్ణలో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

నేడు అరుణాచలంలో 'కార్తీకదీపం'

సాక్షి సిటీబ్యూరో: తమిళనాట సంప్రదాయంగా జరుపుకునే కార్తీగైదీపం(తెలుగులో కార్తీక దీపం) శుక్రవారం అరుణాచలంలో కనుల పండువగా జరగనుంది. అగ్రగామి ఆధ్యాత్మిక ఆన్‌లైన్ వేదిక శ్రీ మందిర్ ఈ వేడుకల్ని తెలుగులో సైతం ఆన్‌లైన్ ద్వారా ప్రసారం చేయనున్నట్లు సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. అరుణాచల తీర్థ శివ పార్వతీ కల్యాణం, మహారుద్ర హోమంతోపాటు అరుణాచలేశ్వర దీపదర్శనం ప్రత్యక్ష ప్రసారం చేయనున్నామన్నారు. తెలుగువారితోపాటు నగరంలో నివసించే తమిళులు సైతం ఈ ఆధ్యాత్మిక సందడిని వీక్షించేందుకు వీలుగా రెండు లింక్స్‌ను అందిస్తున్నామని వివరించారు. తెలుగులో చూడాలనుకుంటే https:// www. srimandir. com/ epuja/333& maha& rudra& homa& live&13 th&2& dec&24లో లాగిన్ కావాలని కోరారు.

ఫ్యాషన్‌ప్రియుల గమ్యస్థానం 'సూత్రా'

- ఈ నెల14 వరకు హోటల్ తాజ్‌కృష్ణలో ఎగ్జిబిషన్

లక్డీకాపూల్: సూత్రా ఎగ్జిబిషన్.. దీనిని ఫ్యాషన్‌ప్రియుల గమ్యస్థానంగా పేర్కొనవచ్చు. అద్భుతమైన వస్త్రాలు, సున్నితమైన డిజైనర్ ఆభరణాలు, ప్రత్యేక ఉపకరణాలు, గృహాలంకరణ వస్తువులు మొదలైన వాటిని ఈ సూత్రా అందిస్తుంది. సూత్రా డిజైనర్ కలెక్షన్స్ అన్నింటిని ఒకే వేదికపైకి తీసుకురావాలన్న లక్ష్యంతో సంప్రదాయ, ఆధునిక దుస్తులను అందించడం ఈ ఎగ్జిబిషన్ ప్రత్యేకత. ఈ క్రమంలో ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, జైపూర్, పుణే, ఇండోర్, రాయ్‌పూర్, అహ్మదాబాద్, బెంగుళూరు, భోపాల్, సూరత్, పాట్నా, కొల్హాపూర్, బెంగుళూరు, కోయంబత్తూరు, మంగళూరులతోపాటు విభిన్న నగరాల నుంచి వచ్చిన ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ బ్రాండ్‌లు ఈ ప్రత్యేక ప్రదర్శనలో కొలువుదీరాయి.



ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికపై సర్వే

- పురపాలికలు, గ్రామపంచాయతీల్లో గుర్తింపు ప్రక్రియ
- ప్రత్యేక యాప్‌లో దరఖాస్తుదారుల వివరాలు నమోదు
- శివారుల్లోని 13 నియోజకవర్గాలకు 45,500 ఇళ్లు
- వచ్చిన దరఖాస్తులు 4.05 లక్షలు

సాక్షి,సిటీబ్యూరో: ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. ఈ మేరకు సర్వే చేపడుతోంది. ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. గ్రామపంచాయతీలు, పురపాలికలు, నగర పాలక సంస్థల్లో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లకు యాప్ డౌన్‌లోడ్ చేసి యూజర్ ఐడీలు కేటాయించారు. దీనికోసం ఉద్యోగుల మెయిల్ ఐడీలు రూపొందించి లాగిన్లు ఇస్తున్నారు. వీరంతా వెంటనే క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల దగ్గరకు వెళ్లి వివరాలను అప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేస్తున్నారు.

- నగర శివారు జిల్లాల్లో 13 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు, రంగారెడ్డి జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉన్నాయి. మొదటి విడతగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చొప్పున మొత్తం 45,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. సొంత స్థలం ఉన్న పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వం మంజూరు చేయనుంది. ప్రజాపాలన సమయంలో మహిళల పేరు మీద దరఖాస్తులు తీసుకోగా, వాటి ఆధారంగానే ఎంపిక చేస్తారు. దళితులు, గిరిజనులు, పేదలు, వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, అనాథలు, ఒంటరి మహిళలు, వితంతువులు, ట్రాన్స్ జెండర్లు, పారిశుద్ధ్య కార్మికులకు ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తారు.

లబ్ధిదారుల గుర్తింపు..

గతంలో మాదిరిగా ఇందిరమ్మ గృహాల్లో మంజూరు, నిర్మాణం, నిధుల విడుదలలో అవకతవకలకు తావు లేకుండా అధికారులు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధిత నిరుపేదలు దరఖాస్తు చేసుకున్న విషయం తెల్సిందే. వీటి ఆధారంగా గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, పురపాలక సంఘాల్లో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు సర్వే చేస్తున్నారు. ఈ సర్వే కార్యక్రమంలో అర్హులను గుర్తిస్తారు. ఇప్పటికే రెండు పర్యాయాలు జిల్లా అధికార యంత్రాంగం గ్రామ కార్యదర్శులు, పట్టణాల్లో బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులకు ఇందిరమ్మ ఇళ్ల యాప్‌పై అవగాహన కార్యక్రమం ,శిక్షణ నిర్వహించారు. వార్డులు/డివిజన్లవారీగా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులపై సర్వే కార్యక్రమం పకడ్బందీగా కొనసాగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కువ ఇళ్లు ఉంటే అదనంగా సర్వే సిబ్బందిని పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు.

నమూనా ఇల్లు

గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి ముందే ప్రభుత్వం మండల కేంద్రంలో నమూనా ఇంటిని నిర్మిస్తారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మూడు ఇళ్ల ఆకృతులను రూపొందించి విడుదల చేస్తుంది. స్థానిక పరిస్థితులు, నేలలను బట్టి ఒక నమూనా ఇంటిని నిర్మించనున్నారు. దాని ప్రకారంగా ఎంపికైన లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాల్సి ఉంటోంది.

ఇందిరమ్మ ఇళ్ల కోసం 4.05 లక్షల దరఖాస్తులు

నగర శివారు జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే 4.05 లక్షల దరఖాస్తులు వచ్చాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తంలో 1.76 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లాలో 2.29 లక్షల దరఖాస్తులు వచ్చాయి. తొలి విడతలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు 17,500, రంగారెడ్డి జిల్లాకు 28 వేల ఇళ్లు మంజూరయ్యాయి. నిర్మాణ దశల మేరకు మూడు విడతల్లో ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది.

కార్యదర్శుల ఆవేదన..

ఇందిమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వేను గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పురపాలికల్లో వార్డు అధికారి చేపట్టనున్నారు. అయితే ఈ సర్వేకు ఆదిలోనే అడ్డంకులు ఎదురయ్యాయి. దీర్ఘకాలికంగా అనేక సమస్యలున్నా వాటిని పరిష్కరించకపోగా, క్షణం తీరిక లేకుండా పనులు అప్పజెప్పడంపై కార్యదర్శులు మండిపడుతున్నారు. నిన్ని, మొన్నటి వరకు సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించడం, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించడం పూర్తి అయిందో లేదో ఇప్పుడు మళ్లీ ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయమంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల్లో నిధులు లేక కనీస సౌకర్యాలకు జేబులోంచి ఖర్చు చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు పేర్కొంటున్నారు.

రిటైల్ ఉపాధికే ప్రాముఖ్యత

- రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్
- టీవర్క్స్ వద్ద కిలోమీటర్ మేర 'రెడ్‌వాక్'



నాలెడ్జి సిటీలోని టీవర్క్స్ వద్ద రెడ్ వాక్‌కు జెండా ఊపి నిర్వాహకులతో ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖా ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్

రాయదుర్గం: రాష్ట్రంలో రిటైల్ ఉపాధికి ఎంతో ప్రాముఖ్యత ఉందని ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ వర్క్స్ వద్ద రిటైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఆర్ఏఐ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో గురువారం 'రిటైల్ ఎంప్లాయిస్ డే'ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాండ్ ఈవెంట్‌గా కిలోమీటర్ మేర చేపట్టిన 'రెడ్‌వాక్'కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిటైల్ ఎంప్లాయిస్ డే కోసం అత్యుత్తమ బ్రాండ్‌లు కలిసి రావడం చాలా సంతోషంగా ఉంద న్నారు. ఆర్ఏఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్, నీరూస్ మేనేజింగ్ డైరెక్టర్ అవినాష్‌కుమార్, ఆర్ఏఐ వైస్ చైర్మన్, సీఈఓ జయకుమార్ మాట్లాడుతూ రిటైల్ రంగాన్ని నడిపించే వ్యక్తులకు నిరంతరం మద్దతు, గుర్తింపు అందిస్తామన్నారు. రెడ్‌వాక్‌తో హైదరాబాద్ నాలెడ్జి సిటీ రోడ్లన్నీ 'రెడ్'మయంగా మారిపోయాయి. రెడ్ వాక్‌లో పాల్గొన్న వారంతా రెడ్ టీ షర్టులు ధరించడం, జయేష్‌రంజన్, నిర్వాహకులు కూడా 'రెడ్ కలర్'బుడగలను గాల్లోకి వదిలేయడంతో ఉల్లాసభరిత వాతావరణం కనిపించింది.

హ్యాకథాన్‌లో ట్రిపుల్ ఐటీ సత్తా



రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా పురస్కారం స్వీకరించిన రిషబ్ భట్టాచార్య

- నావల్ హ్యాకథాన్‌లో విజేత... రూ.3 లక్షల నగదు పురస్కారం

రాయదుర్గం: జాతీయ స్థాయి హ్యాకథాన్ పోటీలలో గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ–హైదరాబాద్ విద్యార్థి సత్తా చాటారు. ఇండియన్ నేవీ ఇన్నోవేషన్ అండ్ ఇండిజనైజేషన్ సెమినార్ 'స్వావలంబన్–2024'లో భాగంగా నేవీ వినూత్న సాంకేతిక పరిష్కారాలతో వాస్తవ ప్రపంచ కార్యాచరణ సవాళ్లను పరిష్కరించే లక్ష్యంతో జాతీయస్థాయి పోటీలు నిర్వహించారు. అందుకోసం నావల్ హ్యాకథాన్–2024 పోటీలను నిర్వహించారు. విజేతకు రూ.3 లక్షల బహుమతిని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రదానం చేశారు. ఈ పోటీల్లో ట్రిపుల్ ఐటీలో మెషీన్ లెర్నింగ్ ఫ్యాకల్టీ డాక్టర్ నరేష్ మన్వాని పర్యవేక్షణలో 3వ సంవత్సరం బీటెక్–మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బై రీసెర్చ్) విద్యార్థి రిషబ్ భట్టాచార్య విజేతగా నిలిచారు.

కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



ఆర్.కృష్ణయ్యను సత్కరిస్తున్న బర్క కృష్ణ తదితరులు

ముషీరాబాద్: కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కోరారు. విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రజా స్వామ్యబద్ధంగా రాయితీలను కల్పించాలని డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన బీసీ సేన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. బీసీల అభివృద్ధికి ప్రతి ఏటా బడ్జెట్‌లో రూ.3 లక్షల కోట్లు కేటాయించాలని, ఉద్యోగ నియామకాల్లో క్రీమిలేయర్‌ను ఎత్తి వేయాలని కోరారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ బీసీ ఉద్యోగ నియామకాల్లో బ్యాక్‌లాగ్ విధానం ఎత్తేయాలన్నారు. జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయింపులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సేన అధ్యక్షుడు బర్క కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రామకృష్ణ, నీల వెంకటేష్, ఈశ్వరప్ప, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

14న శ్రీశ్రీ రాధా గోవింద రథయాత్ర



రథయాత్ర పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 14న శ్రీశ్రీ రాధా గోవింద రథయాత్రను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభూజీ తెలిపారు. ఈ మేరకు రథయాత్ర పోస్టర్‌ను గురువారం విడుదల చేసి వివరాలు వెల్లడించారు. 14వ తేదీ సాయంత్రం 4.30 గంటల నుంచి గండిపేటలోని శ్రీకృష్ణ గో సేవా మండల్ గోశాల ప్రధాన రహదారి వై జంక్షన్ నుంచి నార్సింగ్‌లోని హరేకృష్ణ హెరిటేజ్ టవర్ వరకు ఊరేగింపు ఉంటుందని వివరించారు. అనంతరం హెరిటేజ్ టవర్‌లో రథయాత్ర సాంస్కృతిక కార్నివాల్ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. రథయాత్ర పొడవునా శ్రావ్యమైన భజనలు, కీర్తనలు, భక్తిపూర్వక నృత్యాలు, సంకీర్తనల మధ్య భక్తులు ఆనందంగా రథాన్ని లాగుతారని తెలిపారు. ప్రథమ హారతి అనంతరం రథ మార్గ వీధుల్లో ప్రముఖులచే సంప్రదాయం ప్రకారం చీపురుపట్టే కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. రాత్రి 8 గంటలకు శ్రీశ్రీ రాధా గోవిందులకు చివరి హారతి, విందు ప్రసాదంతో కార్యక్రమం ముగిస్తుందన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చెన్నై అధ్యక్షుడు స్తోక కృష్ణ మహారాజ్ సమక్షంలో ఈ రథయాత్ర కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.

కేబినెట్ విస్తరణలో సామాజిక న్యాయం పాటించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



కాచిగూడ: తెలంగాణలో త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు శాతం ఉన్నవారికి 60 శాతం పదవులు, 90 శాతం ఉన్న వారికి 20 శాతం పదవులు కట్టబెట్టడం సామాజిక న్యాయం ఎలా అవుతుందని ప్రశ్నించారు. 60 శాతం ఉన్న బీసీలకు కేవలం రెండు మంత్రి పదవులు కేటాయించారని పేర్కొన్నారు. మున్నూరుకాపులు, ముదిరాజ్‌లు, గొల్లకురుమలు, విశ్వబ్రాహ్మణులు, చాకలి, మంగలి, కుమ్మర్లకు అవకాశమే కల్పించలేదన్నారు. బడుగులను విస్మరించిన బీఆర్ఎస్‌కు గత ఎన్నికల్లో జరిగిన నష్టమే మున్ముందు కాంగ్రెస్ పార్టీకి తప్పదని ఆయన హెచ్చరించారు. సామాజిక సమన్యాయం పాటించాలని కోరుతూ రాహుల్ గాంధీకి, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, కన్వీనర్ బాలగోని బాలరాజుగౌడ్, తాటికొండ విక్రమ్ గౌడ్, దివిటి మల్లయ్య, ఎ.విజయ్‌కుమార్, వెంకన్న, జాజుల లింగం గౌడ్, నరసింహా నాయక్, తారకేశ్వరి, ఇంద్రమ్ రజక, సందీప్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై త్రిసభ్య కమిటీ

- ప్రజావాణి చొరవతో ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

లక్డీకాపూల్: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ఆర్టీసీ కార్మికులైన డ్రైవర్లు, కండక్టర్లు చేసిన చిన్న, చిన్న తప్పుల(స్టాప్‌లో బస్సులు ఆపకపోవడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడటం వంటివి)పై ఆర్టీసీ యాజమాన్యం వారిని సర్వీస్ నుంచి తొలగించింది. ఈ విషయాన్ని కార్మికులు 'సీఎం ప్రజావాణి'దృష్టికి తీసుకువచ్చారని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారని, తొలగించిన ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కమిటీని నియమించారని తెలిపారు. కమిటీ చైర్మన్‌గా కార్మిక, ఉపాధి, శిక్షణ, పరిశ్రమల శాఖల ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, మెంబర్ కన్వీనర్‌గా ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్, మెంబర్‌గా సెర్ప్ సీఈఓ దివ్యలను నియమిస్తూ రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయడం పట్ల చిన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కార కేంద్రంగా 'సీఎం ప్రజావాణి'ప్రత్యేక పాత్రను పోషిస్తుందని చిన్నారెడ్డి స్పష్టం చేశారు.

14, 15, 16 తేదీల్లో 'చెకుముకి సైన్స్ సంబురాలు'

కాచిగూడ: రాష్ట్రస్థాయి 'చెకుముకి'సైన్స్ సంబురాలను ఈ నెల 14, 15, 16 తేదీల్లో ఆదిలాబాద్‌లో నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ బీఎస్ రెడ్డి, కన్వీనర్ డాక్టర్ కోయ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ .. సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించడం, పరిశీలనాశక్తిని పెంచడం, శాస్త్రీయ దృక్పథం అలవర్చడం, సృజనాత్మకతను పెంపొందించడం లక్ష్యంగా ప్రతి సంవత్సరం లక్షలాది విద్యార్థులకు 'చెకుముకి సైన్స్ పంబురాలు'పేరుతో ప్రతిభాపాటవ పరీక్షల్ని 35 సంవత్సరాలుగా జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తోందని అన్నారు. ఈసారి ఈ కార్యక్రమానికి 33 జిల్లాల నుంచి 132 టీంలతో 396 మంది విద్యార్థులు, 132 గైడ్ టీచర్లు హాజరవుతారని తెలిపారు. ప్రఖ్యాత శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, మేధావులు, అధికారులు ఈ వేడుకల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'చెకుముకి సైన్స్ సంబురాలు'పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రాత పరీక్ష, ఆక్టివిటీ రౌండ్, క్విజ్, విజువల్ రౌండ్, క్రియేటివ్ రౌండ్, సైన్స్ ప్రయోగాలపై పోటీలు ఉంటాయని వివరించారు. సమావేశంలో జేవీవీ కార్యదర్శి ఎస్.వెంకటరమణారెడ్డి, ఎం.శ్రీనివాస్, శ్రవణ్ కుమార్, డి.అల్తాఫ్, చాగంటి సాయి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



'చెకుముకి సైన్స్ సంబురాలు'పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజా, బి.ఎస్.రెడ్డి

అన్ని ప్రభుత్వశాఖల్లో 'విజయ' ఉత్పత్తులు

– చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి



తెలంగాణ విజయ డెయిరీ పార్లర్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ అమిత్‌రెడ్డి

లాలాపేట: అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలు విజయ డెయిరీ పాల ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని ప్రభుత్వం జీవో 45 జారీ చేసిందని విజయ తెలంగాణ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ సంచాలన్ భవన్‌లో నూతనంగా తెలంగాణ విజయపార్లర్‌ను గురువారం ప్రారంభించారు. అమిత్‌రెడ్డి మాట్లాడుతూ విజయ తెలంగాణ డెయిరీ గత ఆరు దశాబ్దాల నుంచి రైల్వేతో భాగస్వామ్యాన్ని కొనసాగిస్తోందన్నారు. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, వరంగల్, ఖాజీపేట రైల్వేస్టేషన్లలో ఇప్పటికే విజయడెయిరీ పార్లర్లు విజయవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. త్వరలో అందుబాటులోకి రానున్న చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో విజయ డెయిరీ సేవలను విస్తరించడానికి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న పార్లర్‌లలో పాలు, పెరుగు, నెయ్యి, వెన్న, లస్సీ, బటర్ మిల్క్,ఐస్ క్రీమ్, స్వీట్లు వంటి అనేకమైన నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మాలినీ జైన్, డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేశ్ కుమార్‌జైన్, విజయ డెయిరీ అధికారులు కామేష్, మల్లికార్జున్, మల్లయ్య, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సాహితీ ఇన్‌ఫ్రా డైరెక్టర్‌పై కేసు నమోదు

సిటీ కోర్టులు: సాహితీ ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ కంపెనీలో ఫ్లాట్లను కొనుగోలు చేసినవారిని మోసగించిన కేసులో ఆ కంపెనీ డైరెక్టర్ బి.లక్ష్మీనారాయణపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. మరోవైపు సెప్టెంబర్ 29న లక్ష్మీనారాయణ మనీల్యాండరింగ్‌కు పాల్పడ్డాడని ఈడీ అరెస్ట్ చేసింది. అనంతరం ఈడీ నాంపల్లిలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో కేసు దాఖలు చేసింది. ఈ నెల 4న కోర్టు పిటిషన్‌ను అనుమతిస్తూ లక్ష్మీనారాయణకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఈడీ డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. బాధితుల నుంచి రూ. 842.15 కోట్లు అడ్వన్స్‌గా తీసుకున్నారని పేర్కొంది. రెసిడెన్షియల్ గేటెడ్ కమ్యూనిటీ పేరిట ఇళ్లు నిర్మిస్తున్నామని నమ్మబలికి పలువురి నుంచి రూ. 216.91 కోట్లు వసూలు చేశారని తెలిపింది. చాలామంది ఈ కంపెనీలో ఫ్లాట్లు కొనుగోలు చేసేందుకు అప్పులు తెచ్చి మరీ డబ్బులు చెల్లించారని, ఫ్లాట్లు ఇవ్వకపోవడమేకాకుండా తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు.

ఎక్స్‌పో.. చూసి పో..!

- హైటెక్స్‌లో పలు రకాల 'ఎక్స్‌పో'లు ప్రారంభం
- అందుబాటులో సాంకేతికయంత్ర పరికరాలు, వాటి విడిభాగాలు
- లిథియం బ్యాటరీ ద్విచక్రవాహనాలు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, సైకిల్స్ కూడా..
- వాహనాలను బుక్ చేసుకుంటున్నవారికి రాయితీలు



మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో 'ఎక్స్‌పో'లు సందడి నెలకొంది. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఫుడ్ ఎక్స్‌పో, డెయిరీ ఎక్స్‌పో, ఇండియా గ్రీన్ ఎక్స్‌పో, గ్రీన్ వెహికిల్ ఎక్స్‌పోలు గురువారం ప్రారంభయ్యాయి. ఈ ఎక్స్‌పోలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

గ్రీన్ వెహికిల్..

గ్రీన్ వెహికిల్ ఎక్స్‌పోలో వివిధ బ్రాండ్‌ల వాహనాలు, ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్స్, బ్యాటరీ సైకిళ్లు ప్రదర్శనలో ఉంచారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన లిథియం బ్యాటరీ వాహనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. తక్కువ ఖర్చు.. ఎక్కువ మైలేజీ వీటి ప్రత్యేకత.

సైకిల్, వెహికిల్



రెండు విధాలుగా ఉపయోగపడే టూ ఇన్ వన్ వాహనాన్ని రూపొందించారు. ధర రూ.49,999. 40 కేజీల బరువుతో ఉన్న వాహనాన్ని 4 గంటలు చార్జింగ్ చేస్తే, గంటకి 25 కిలోమీటర్ల వేగంతో వంద కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. వాహనాలు నాలుగు రంగులలో అందుబాటులో ఉన్నాయి. ప్రదర్శనలో బుకింగ్ చేసుకుంటే ప్రత్యేక రాయితీ ఇస్తున్నారు.

పర్యావరణ హితంగా..

వాతావరణ కాలుష్యం కాకుండా, పర్యావరణహితంగా బ్యాటరీ వాహనాలను తయారు చేశారు. లిథియం బ్యాటరీలు, సోలార్ సిస్టమ్‌తో చార్జింగ్ అయ్యే వాహనాలు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. వివిధ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, సర్వీస్ ఆటోలు, ఆఫీస్‌లకు వెళ్ళే వాహనాలు అందుబాటులో ఉన్నాయి. వీటి విలువ రూ.70 వేల నుంచి లక్షా అరవై వేల వరకు ఉంది.

ప్యాకేజింగ్ యంత్ర పరికరాలు

మారుతున్న కాలానికి అనుగుణంగా ఎక్స్‌పోలో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్ర పరికరాలను అందుబాటులో ఉంచారు. వివిధ రకాల ప్యాకేజింగ్‌కు ఉపయోగపడే యంత్రాల యూనిట్లు రూ.3.5 లక్షలుగా ఉన్నాయి. ఆటోమేటిక్ ఫుల్‌సీల్ మెషీన్, మినరల్ వాటర్‌ప్లాంట్స్, బాటిల్ ఫిల్లింగ్ మెషీన్స్, కార్బోనేటెడ్ వాటర్ ప్లాంట్స్, ఐస్ క్యాండీ మెషీన్లు అందుబాటులో ఉన్నాయి. గంటకు 150కిపైగా ప్యాకింగ్ చేసే మెషీన్లను కూడా ప్రదర్శనలో పెట్టారు. పాలు, పాల ఉత్పత్తుల ప్యాకేజింగ్ మిషనరీలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. డబుల్ హెడ్ మిల్క్ పౌచ్ ప్యాకింగ్ మెషీన్, డబుల్ హెడ్ వాటర్ ప్యాకింగ్ మెషీన్, మిల్క్ పాశ్చరైజేషన్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, సింగిల్ హెడ్ ఆయిల్, నెయ్యి ప్యాకింగ్, మిల్క్‌మెషీన్ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి.

సందర్శకులకు ఎంతో ఉపయోగకరం

ఇలాంటి ప్రదర్శనలను చూడటం వల్ల యంత్ర పరికరాలపై పూర్తి అవగాహన కలుగుతుంది. ఏఏ పనిముట్లను ఏఏ పనులకు వాడాలో పూర్తి స్థాయిలో తెలుసుకోవచ్చు. యంత్ర పరికరాల విడిభాగాలు ప్రదర్శనలో ఆకర్షణగా నిలుస్తున్నాయి. ధరల వివరాలను తెలుసుకోవచ్చు. మధ్యవర్తులు లేకుండా ప్రదర్శనలు తిలకించడం ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– రేవతి, స్టాల్ నిర్వాహకురాలు



ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ యంత్ర పరికరం

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, శుక్రవారం, 13 డిసెంబర్ 2024



ఫుడ్ కావొచ్చు.. డ్రింక్స్ కావొచ్చు.. ఎప్పటికప్పుడు సరికొత్తగా ఆస్వాదిస్తూ ఉండటమే సిసలైన డైనింగ్ కల్చర్.. అలాంటి కల్చర్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రయోగాలు చేస్తూ వెరైటీ రుచులను పరిచయం చేస్తున్నాయి సిటీ రెస్టారెంట్స్. సిటీలో వెరైటీ రుచుల అన్వేషకులను సంతృప్తి పరుస్తున్నాయి. లగ్జరీ డైనింగ్‌కి అడ్రస్ అని పేరున్న గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న ఓహ్రీ గ్రూప్‌నకు చెందిన తాన్‌సేన్.. కాస్ట్‌లీ కాక్‌టెయిల్‌తో ఇప్పుడు చవులూరిస్తోంది. 'జ్యువెల్ ఆఫ్ తాన్‌సేన్' కాక్‌టెయిల్‌తో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.

- సాక్షి, సిటీబ్యూరో



కాస్ట్‌లీ కాక్‌టెయిల్

దేశంలోకెల్లా అత్యంత ఖరీదైన పానీయం

పరిచయం చేసిన 'ఓహ్రీస్' తాన్‌సేన్



పానీయాల ప్రపంచంలో మాక్ టెయిల్స్, కాక్‌టెయిల్స్ రుచుల రూటే వేరు. వీటిని తరచూ టేస్ట్ చేసేవారే కాదు వీటిని టేస్టీగా తయారు చేసేవారు కూడా స్పెషలే అని చెప్పాలి. అదే స్పెషాలిటీతో ఓ వైపు రుచితో పాటు లగ్జరీ కాక్‌టెయిల్‌కు చిరునామాగా నిలుస్తోంది జ్యువెల్ ఆఫ్ తాన్‌సేన్.

అరుదైన కలయిక..

'జ్యువెల్ ఆఫ్ తాన్‌సేన్' మిగిలిన ఇతర కాక్‌టెయిల్స్ లాంటిది కాదు.. ఇది ప్రీమియమ్ స్పిరిట్స్ కలయికలో రూపొందిన మాస్టర్ పీస్' అని చెప్పారు ఈ పానీయం సృష్టించిన బృందానికి సారథ్యం వహించిన తాన్‌సేన్ రెస్టారెంట్‌కు చెందిన సాహిల్. దీని మేళవింపులో అరుదైనవి పొందుపరిచామంటున్న ఆయన.. సౌదీ అరేబియా నుంచి వచ్చిన ఖర్జూరాలు, క్రిస్పీ ఇటాలియన్ పైన్ గింజలు, రుచితో నిండిన వెర్మౌత్ వగైరాలతో పాటు 21ఏళ్ల వయసున్న రాయల్ సల్యూట్ విస్కీలను కలిపి తయారు చేశామన్నారు. మిక్సాలజిస్ట్ యాంగ్ డప్ లామా రూపొందించిన ఈ విలాసవంతమైన సమ్మేళనం, మిక్సాలజీ ప్రపంచంలో అభి'రుచుల'ను పునర్నిర్వచిస్తోంది. ఒక గ్లాసు ధర రూ.10 వేలు కాగా దేశంలోనే అత్యంత ఖరీదైన కాక్‌టెయిల్ హోదానూ దక్కించుకుందని సాహిల్ చెప్పారు.



చిన్నారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం అందరిదీ..


ఐటీసీ నిమైల్ 'క్లీన్ ఈక్వల్ మిషన్' అభినందనీయం

ఈ తరానికి సూచించిన టెన్నిస్ స్టార్ సానియా మీర్జా

సమానత్వం.. సాధికారత..

సాక్షి, సిటీబ్యూరో: సమానత్వం, మహిళా సాధికారత అనేవి మొదట మన ఇంటి నుంచే మొదలవ్వాలని, మన ఇంట్లోని చిన్నారులకు ఈ అంశాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మహిళల డబుల్స్(టెన్నిస్)లో మాజీ ప్రపంచ నంబర్-1 సానియా మీర్జా తెలిపారు. ప్రముఖ బ్రాండ్ ఐటీసీ నిమైల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'క్లీన్ ఈక్వల్ మిషన్'ను నగరంలోని హోటల్ తాజ్ దక్కన్ వేదికగా ఆమె ఆవిష్కరించారు. ఈ మిషన్‌లో భాగంగా అందరి ఇళ్లలో క్లీనింగ్ అనేది తల్లుల బాధ్యత మాత్రమే కాదు, దీనిపై చిన్నారులకు కూడా అవగాహన కల్పించాలనే లక్ష్యంగా ప్రారంభించారు. సానియా మీర్జా మాట్లాడుతూ.. సాధారణంగా పిల్లల్లో సత్ప్రవర్తన కోసం ఎలాంటి పనులు చేయాలి ఏమి చేయకూడదని వారి తల్లిదండ్రులు చాలా మంచి విషయాల గురించి చెబుతుంటారు. కానీ పిల్లలు వాటిని పట్టించుకోరు. చిన్నారులు మనం చెప్పేవి వినరు.. మనం ఏది చేస్తే అది పాటిస్తారు. వారికి సూచించే కన్నా ముందు మనం పాటించడం ముఖ్యమని సూచించారు.

- ఒక బాబుకి తల్లిగా తాను ఇదే నమ్ముతానని, దీనినే పాటిస్తామని అన్నారు. తిన్న ప్లేట్‌ను స్వయంగా కడగడం, షూస్‌ను శుభ్రంగా, భద్రంగా చూసుకోవడం, ఇంట్లో చిన్న చిన్న పనులు చేసుకోవడం వంటి పనులను తమను చూసే తన బాబు, తన సోదరి కూతురు పాటిస్తున్నారని తెలిపారు. మనం ఎంత ఎదిగామన్నది కాదు.. మన పిల్లల్ని ఏ దారిలో తీసుకెళ్తున్నాం.. వారికి ఎలాంటి క్రమశిక్షణ నేర్పిస్తున్నాం.. అనే అంశాలే ముఖ్యమని పేర్కొన్నారు.
- చిన్న వయసు నుంచే ఇలాంటి సున్నితమైన అంశాల్లో పిల్లలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఐటీసీ నిమైల్ నిర్వహిస్తున్న 'క్లీన్ ఈక్వల్ మిషన్' అభినందనీయమని ఆమె తెలిపారు. భారత్‌లో ఇళ్లలో గృహ పరిశుభ్రత, ఇతర పనులు కేవలం మహిళలకు మాత్రమే నిర్దేశించినట్లు భావిస్తున్నారని.. దీనిలో సమానత్వాన్ని పెంపొందించడం అవగాహన కల్పించడం ఈ మిషన్ ముఖ్య ఉద్దేశమని ఐటీసీ లిమిటెడ్ మార్కెటింగ్, పర్సనల్ కేర్ ప్రొడక్ట్స్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్యానెల్ సేషన్‌లో గీతాంజలి గ్రూపు విద్యా సంస్థల డైరెక్టర్ మాధవి చంద్ర, గ్లెన్ డొమన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన నిష్ణాతులైన విద్యావేత్త, పేరెంటింగ్ మెంటార్ కిరణ్మయి చౌదరి పాల్గొని పలు అంశాలపై చర్చించారు.



ఐటీసీ నిమైల్ 'క్లీన్ ఈక్వల్ మిషన్'..

ఇంటి పనులు, శుభ్రపరచడం, జీవన నైపుణ్యాలను నేర్పడానికి, సామాజిక విలువను, సమానత్వాన్ని పెంపొందించే కీలక అంశాలుగా వారదులుగా నిలుస్తాయని స్కూల్ పిల్లలకు అవగాహన కల్పిస్తున్నారు. నగరంలోని విభిన్న పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మిషన్ మొదటి దశలో హైదరాబాద్‌లో లక్ష కంటే ఎక్కువ మంది విద్యార్థులకు చేరువైంది. రాబోయే కొద్ది నెలల్లో ఈ చొరవ దేశంలో 8 లక్షల కంటే ఎక్కువ మంది విద్యార్థులకు చేరువ చేయనున్నారు.

హైదరాబాద్ వైబ్స్



స్లిమ్ సెట్.. డైట్ మస్ట్

స్లిమ్, వెయిట్ లాస్ కోసం తిండి తగ్గిస్తున్న నగరవాసి

ఆధునిక జీవన శైలిలో నగరవాసుల ఆహారపు అలవాట్లు వేగంగా మారిపోతున్నాయి. యువత నుంచి మొదలైతే వయోవృద్ధుల వరకు స్లిమ్‌తో పాటు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నారు. అధిక బరువు నుంచి ఉపశమనం పొందాలని, శరీరంలోని అనవసరమైన కొవ్వులు కరిగించాలని తినే ఆహారం తగ్గిస్తున్నారు. మరో వైపు వ్యాయామంపై ఎక్కువ దృష్టి పెడుతున్నారు. దీంతో నీరసించిపోవడం, ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

ఆరోగ్యంపై ప్రభావం

పోషకాహారం మస్ట్

హెచ్చరిస్తున్న నిపుణులు






నిత్యం మనతోనే ఉండే వారు లావుగా ఉన్నావని ఎత్తిపొడుపు మాటలకు బాధపడి కొంతమంది.. అధిక బరువు ఉన్నారని పెళ్లికి నిరాకరించడం, కాలేజీ, ఉద్యోగ ప్రాంగణంలో ఆకర్షణీయంగా కనిపించాలని మరికొంత మంది.. ఇలా ఎవరి అవసరాలు వారికి ఉన్నాయి. అవే స్లిమ్ సెట్ ట్రెండ్ సెట్ చేస్తున్నాయి. నగరంలో సుమారు 60 శాతం మంది 30 నుంచి 50 ఏళ్ల వయసు ఉన్నవారే నాజూగ్గా కనిపించాలని ఆరాటపడుతున్నారంటే ఆశ్చర్యం లేదు. మరో 20 శాతం నుంచి 30 శాతం మంది 14 నుంచి 29 ఏళ్ల వయస్కులు ఉండగా, సుమారు 10 శాతం మంది 50 ఏళ్లు దాటిన వారు ఈ తరహా స్లిమ్ సెట్ కోసం ట్రై చేస్తున్నారు. ఆరోగ్యకరమైన లైఫ్ స్టైల్ కావాలనుకునేవారు పౌష్టికాహారం వైపు అడుగులు వేస్తున్నారు. ఇది మంచిదే.. అయితే.. ఎవరైనా సరే నిపుణుల సూచనలు ఆచరణాత్మకంగా పాటిస్తారో అక్కడే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

మితంగా తింటున్నారు..

నాజూగ్గా కనిపించాలని చాలా మంది యువత తిండి తగ్గించేస్తున్నారు. దీనికి తోడు ప్రాసెసింగ్ ఫుడ్ ఎక్కువ తీసుకుంటున్నారు. శరీరంలో ఉన్న ఫ్యాట్ తగ్గించడానికి డైట్ యాక్టివిటీ తప్పనిసరిగా ఉండాలి. కొంత మంది ప్రత్యేకంగా నడుము, పొట్ట, చేతులు వంటి ఒక పార్ట్‌నే లక్ష్యంగా స్లిమ్ చేయాలనుకుంటున్నారు. వారంలో 750 గ్రాముల నుంచి ఒక కేజీ వరకు బరువు తగ్గితే ఆరోగ్యకరంగా ఉంటుంది. మనం సాధారణ పనులు చేసుకోవడానికి నిత్యం శరీరానికి శక్తి అవసరం. దానికి అవసరమైన ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలి. ఆహారం తగ్గిస్తే దాని ప్రభావం కండలు (మజిల్)పై కనిపిస్తుంది. నీరసం వస్తుంది. ఏ పని చేసుకోవాలన్నా ఇబ్బందిగా ఉంటుంది. వివిధ సంస్థలు ఒక కేజీ బరువు తగ్గడానికి సుమారుగా రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు తీసుకుంటున్నాయి.



ప్రొటీన్ పౌడర్ వాడేస్తున్నారు..

చాలా మంది ఈ మధ్య కాలంలో భోజనానికి ప్రత్యామ్నాయంగా ప్రొటీన్ పౌడర్ తీసుకుంటున్నారు. ప్రొటీన్ డబ్బా బయట మార్కెట్‌లో రూ.650 నుంచి రూ.1,500 వరకు అందుబాటులో ఉన్నాయి. ఆ వ్యక్తి లైఫ్ స్టైయిల్, బాడీ ప్యాటర్న్ బట్టి ప్రొటీన్ పౌడర్ తీసుకోవాలి. ఎక్కువ తీసుకోవడం మంచిది కాదు. మూడు పూటలా మీల్ రీప్లేస్‌మెంట్ ఆరోగ్యానికి ప్రమాదకరమని నిపుణులు పేర్కొంటున్నారు. ఉదయం మొలకెత్తిన గింజలు, రాగి జావ, తృణధాన్యాలు, ఫైబర్ ఫుడ్ వంటివి తీసుకోవడం వల్ల మేలు జరుగుతుంది. అయితే ఏదైనా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మాత్రం నిపుణుల సూచనల మేరకు తీసుకోవడం మంచిది. ఫ్లూయిడ్స్ తీసుకోవడం వల్ల శరీరంలోని వ్యర్థాలు పోతాయి.

సుమారు 30 కేజీలు బరువు తగ్గాను



అధిక బరువుతో ఇబ్బందిగా ఉండేది. వెయిట్ లాస్ కోసం 2023 నుంచి న్యూట్రిషన్ సూచనలు ఫాలో అవుతున్నాను. ఇప్పటి వరకు సుమారు 30 కేజీలు తగ్గాను. అప్పటి ఇప్పటికి చూస్తే మనకి స్పష్టమైన తేడా కనిపిస్తోంది. బరువుతో బాధపడే సమయంలో నెమ్మదిగా ఉండేది. ఇప్పుడు పిల్లలతో చురుగ్గా పనులు చేసుకోగలుగుతున్నాను. లుక్ వైజ్‌గా చాలా తేడా వచ్చింది. ఫీల్ గుడ్.

- వై.నిషిత, కూకట్‌పల్లి

ఆ ఆలోచన చేయవద్దు

డైట్ నిరంతర ప్రక్రియగా ఉండాలి. ఒక్కసారి స్లిమ్ అయిపోవాలి.. వేగంగా బరువు తగ్గిపోవాలనే ఆలోచన చేయవద్దు. అది ఒక్క రోజులో వచ్చే ఫ్యాట్ కాదు. మూడు నెలల పాటు హెల్దీ లైఫ్ స్టైల్‌కు అలవాటు పడాలి. వ్యక్తి శరీరానికి ప్రధానంగా ప్రొటీన్, కార్బొహైడ్రేట్స్, ఫ్యాట్, ఫ్రూట్స్, వెజిటబుల్స్ అవసరం. ఉదయం బాడీ డిటాక్సేషన్ కోసం నిమ్మరసం, జీరా నీరు, మెంతుల నీరు, దనియాలు, జీలకర్ర, కాంబినేషన్‌లో సూచిస్తాం. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి ప్రత్యేక మెనూ ఉంటుంది.



- బి.కవిత, పౌష్టికాహార నిపుణురాలు, హైదరాబాద్

ఇకపై డిజిటలైజ్డ్.. కాన్ఫరెన్స్‌లు



సాక్షి, సిటీబ్యూరో: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో సమావేశాల తీరుతెన్నులు సమూలంగా మారిపోనున్నాయని డిజిటల్ మీటింగ్స్ ఊపందుకోనున్నాయని ఆడియో, వీడియో నిపుణులు స్పష్టం చేశారు. అత్యాధునిక సాంకేతిక ఆడియో ఉత్పత్తులకు పేరొందిన సెన్‌హీజర్, క్రెస్ట్రాన్ బ్రాండ్స్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని ఐటీసీ కోహినూర్‌లో కాన్ఫరెన్స్‌లు- ఆడియో, వీడియో టెక్నాలజీ అంశంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రకరకాల అత్యాధునిక పరికరాల పనితీరును వీడియో సహితంగా వివరించారు. నగరానికి చెందిన వందలాది మంది ఆడియో వీడియో పరికరాల నిపుణులు, వినియోగదారులు హాజరయ్యారు.

శ్రీకృష్ణ లీలామృతంతో మెగా మ్యూజికల్స్

నగరంతో పాటు దేశవ్యాప్తంగా ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: రాజాధిరాజ్.. లవ్, లైఫ్, లీలా పేరుతో రూపొందించిన మెగా మ్యూజికల్స్‌ను దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన సంగీత వేదికల్లో విడుదల చేసినట్లు రూపకర్త ధన్‌రాజ్ నత్వానీ తెలిపారు. ప్రముఖ సంగీత ద్వయం సచిన్-జిగర్ స్వరపరిచగా, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రసూన్ జోషి సాహిత్యాన్ని అందించిన శ్రీకృష్ణుని లీలామృతం హైదరాబాద్‌తో పాటు దేశంలోని అన్ని నగరాల్లో ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. శ్రీకృష్ణుడి లీలలను మెలోడీ ద్వారా ప్రదర్శించే ఈ మెగా మ్యూజికల్స్‌లో భారతీయ శాస్త్రీయ సంగీతంతో పాటు పాశ్చాత్య సింఫోనిక్ అంశాల సమ్మేళనంగా స్వరపరిచారు. పాటలను శంకర్ మహదేవన్, శ్రేయా ఘోషల్, కైలాష్ ఖేర్, సచిన్ సంఘ్వీ, పార్థివ్ గోహిల్, కీర్తి సాగతియా, జోనితా గాంధీ వంటి ప్రముఖ గాయకులు పాడారు. శ్రీకృష్ణుడి జీవితంపై రూపొందించిన ప్రపంచంలోనే మొట్టమొదటి మెగా మ్యూజికల్ ప్రీమియర్‌ను 2025లో దుబాయ్ వేదికగా ప్రదర్శించనున్నామని సంగీత స్వరకర్త సచిన్-జిగార్ తెలిపారు.



క్లుప్తంగా...

ఆర్థిక సంఘం నివేదికలపై చర్యలేవి?

ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక సంఘం ఇస్తున్న నివేదికలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో స్పష్టం చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం.పద్మనాభ రెడ్డి డిమాండ్ చేశారు. సాధారణంగా ఆర్థిక సంఘం సూచనల మేరకు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయడం జరుగుతుందని, గత రెండేళ్లుగా రాష్ట్ర స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయడం లేదన్నారు. గత తొమ్మిదేళ్లుగా ఆర్థిక సంఘం సూచనలపై ప్రభుత్వం చర్యలు తీసుకున్న దాఖలాల్లేవని ఆయన తెలిపారు. అసలు ఆర్థిక సంఘం ఇచ్చిన సూచనలను అసెంబ్లీలో ఉంచాలని, కానీ ఆ పరిస్థితి ఇప్పటివరకు కనిపించలేదని చెప్పారు. తక్షణమే ఆర్థిక సంఘం నివేదికలను విడుదల చేయాలని, అదేవిధంగా ఈ నివేదికలపై తగిన చర్యలు తీసుకుని స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆయన వినతిపత్రం సమర్పించారు.

రైతుల పట్ల దుర్మార్గంగా రాష్ట్ర ప్రభుత్వ వైఖరి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



సాక్షి, హైదరాబాద్: రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి దుర్మార్గంగా ఉందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. లగచర్ల రైతులను జైలులో పెట్టడమే కాకుండా గిరిజన రైతు గుండెనొప్పితో ఆస్పత్రికి తీసుకెళ్లమంటే బేడీలు వేసి తీసుకెళ్లడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. రైతు రాజ్యం తెస్తామన్న రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ ఘటనతో రాష్ట్రంలోని రైతుల ఆగ్రహానికి ఈ ప్రభుత్వం గురవుతోందని కాసం వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై యావత్ తెలంగాణ సమాజం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోందన్నారు. ఈ అంశంపై మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు.

మత్స్య సంపదను పెంచేందుకు చర్యలు తీసుకోవాలి

బిజయ్ కుమార్ బెహరా

సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల సమన్వయంతో తెలంగాణలో మత్స్య సంపదను పెంచడానికి పలు చర్యలు తీసుకోవాలని నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌ఎఫ్‌డీబీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ బిజయ్ కుమార్ బెహెరా అన్నారు. ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, రాష్ట్ర మత్స్య శాఖ అధికారులతో డాక్టర్ బెహెరా గురువారం సచివాలయంలో భేటీ అయ్యారు. ఎస్ఎస్‌పీ-ఎస్‌పీఏఆర్ఎస్ హెచ్ ఖాతాలో అందుబాటులో ఉన్న పీఎంఎంఎస్‌వై 2024-25 కింద కేటాయించిన నిధులను ఆర్థిక సంవత్సరం చివరినాటికి వినియోగించుకోవాలని నిర్ణయించారు. మంచిర్యాల జిల్లా ఎల్లంపల్లి రిజర్వాయర్ వద్ద 100 శాతం గ్రాంట్‌పై పీఎంఎంఎస్‌వై-సెంట్రల్ సెక్టార్ స్కీమ్ 2024-25 కింద రూ.25 కోట్ల ఖర్చుతో ప్రత్యేకంగా కొర్రమీను చేపల పెంపకం కోసం ప్రతిపాదించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ సరస్సు వద్ద రూ.2 కోట్లతో రిక్రియేషనల్ ఫిషరీస్, రాష్ట్ర మత్స్య శాఖకు సంబంధించి గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద పెండింగ్‌లో ఉన్న అన్ని బీమా కేసులను క్లియర్ చేయాలని ప్రతిపాదించారు. ఎన్‌ఎఫ్‌డీబీలో పథకాలు, నిధుల అవకాశాలపై అవగాహన కల్పించడంపై జనవరి 7, 8వ తేదీలలో క్షేత్రస్థాయి మత్స్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

చివరి వరకు పోరాడతా

'ఎమర్జెన్సీ'విధింపును సమర్థించుకున్న ద.కొరియా అధ్యక్షుడు



సియోల్: దేశవ్యాప్తంగా ఆత్యయిక స్థితిని అమలు చేస్తూ 'మార్షల్ లా'ను ప్రకటించడాన్ని దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ సమర్థించుకున్నారు. ఎమర్జెన్సీ కారణంగా ఆశ్చర్యానికి, ఆందోళనకు గురైన ప్రజలకు మరోసారి క్షమాపణలు చెబుతున్నానని టెలివిజన్ ప్రసంగంలో పేర్కొన్నారు. తన నిర్ణయం సరైనదేనని చెప్పారు. శనివారం పార్లమెంటులో రెండో అభిశంసన ఓటింగ్‌ను ఎదుర్కొంటున్న ఆయన చివరి నిమిషం వరకు పోరాడతానని ప్రతిజ్ఞ చేశారు. తన రాజకీయ ప్రత్యర్థులను ప్రభుత్వ వ్యతిరేక శక్తులుగా అభివర్ణించారు. ఎన్నికల సంఘంలో అక్రమాలపై దర్యాప్తు చేయడానికి అత్యయిక స్థితిని విధించాల్సి వచ్చిందని అన్నారు. ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో యూన్‌కు చెందిన పీపుల్ పవర్ పార్టీ (పీపీపీ) ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో జాతీయ అసెంబ్లీపై ప్రధాన ప్రతిపక్షం డెమొక్రటిక్ పార్టీ ఆధిపత్యం చలాయిస్తూ ప్రజాస్వామ్యయుత రాజ్యాంగ విలువలను మంటగలుపుతోంది'' అని యూన్ ఆరోపించారు. కాగా, తొలి అభిశంసన తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో మరోసారి అభిశంసనకు విపక్షాలు నడుంబిగించాయి. గురువారం మరోమారు పార్లమెంట్‌లో యూన్‌కు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. దీనిపై శనివారం ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. మొదటి అభిశంసన సందర్భంగా అధ్యక్షుడికి మద్దతిచ్చిన అధికార పీపీపీ ఈసారి ప్రతిపక్ష పార్టీకి మద్దతు పలుకుతున్నట్లు తెలుస్తోంది.

ఘనంగా చక్రతీర్థ ముక్కోటి



తిరుమలలో చక్రతీర్థ ముక్కోటి గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాదీ కార్తీక మాసంలో చక్రతీర్థ ముక్కోటి నిర్వహిస్తారు. ఈ క్రమంలో శ్రీవారి ఆలయ అర్చకులు, పరిచారకులు, భక్తులు గురువారం ఉదయం మంగళవాయిద్యాల నడుమ ఆలయం నుంచి ఊరేగింపుగా చక్రతీర్థానికి చేరుకున్నారు. అక్కడ చక్రత్తాళ్వారుకు, నరసింహస్వామివారికి, ఆంజనేయస్వామివారికి అభిషేకం, పుష్పాలంకారం చేపట్టి హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

- తిరుమల

తీరం దాటిన తీవ్ర అల్పపీడనం

నేడూ దక్షిణ కోస్తా, రాయలసీమలో వానలు



సాక్షి, విశాఖపట్నం: గల్ఫ్ ఆఫ్ మన్నార్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది. ఇది క్రమంగా పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ దక్షిణ తమిళనాడు దగ్గర అర్ధరాత్రి తీరం దాటింది. తీరం దాటిన తర్వాత శుక్రవారం ఉదయం నాటికి బలహీనపడనుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో తమిళనాడులో వర్షాలు జోరందుకోనున్నాయి. తీవ్ర అల్పపీన ప్రభావంతో తిరుపతి, నెల్లూరు జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. శుక్రవారం కూడా చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే సూచనలున్నాయి. ఉత్తర కోస్తా జిల్లాల్లో పొడి వాతావరణం ఉండనుంది.

ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం.. ఏడుగురి దుర్మరణం

- మరో ఆరుగురి పరిస్థితి విషమం
- షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- తమిళనాడులోని దిండిగల్‌లో ఘటన



ఆస్పత్రిలో చెలరేగిన మంటలు

సాక్షి, చెన్నై: తమిళనాడు రాష్ట్రం దిండిగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గురువారం అర్ధరాత్రి ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. చెన్నైకి 380 కిలోమీటర్ల దూరంలో ఉన్న దిండిగల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రాత్రి 11 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. 4 అంతస్తుల భవనంలో పెద్ద ఎత్తున పొగలు వ్యాపించాయి. దీంతో రోగులు భయంతో పరుగులు తీశారు. రెస్క్యూ సిబ్బంది రంగంలోకి దిగి భవనంలో చిక్కుకున్న 22 మందిని రక్షించారు. లిఫ్టులో చిక్కుకున్న ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వంద మంది ఇన్ పేషెంట్లు చికిత్స పొందుతున్నారని తెలిసింది. వారిని బయటకు తీసుకొచ్చి ఇతర ఆస్పత్రులకు తరలించేందుకు 20కి పైగా అంబులెన్స్‌లను ఉపయోగించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలను త్వరలోనే తెలియజేస్తామని జిల్లా కలెక్టర్ పూంగొడి తెలిపారు.

ఆరు నెలల అరాచకం

హత్యలు, దాడులతో ఏపీ అల్లకల్లోలం

ఆగని అత్యాచారాలతో మహిళా లోకం భీతావహం

- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల విధ్వంసం
- వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు, అరెస్టులు
- ఐఏఎస్, ఐపీఎస్‌లూ రెడ్‌బుక్ బాధితులే
- అధికార వ్యవస్థపై కక్షగట్టిన ప్రభుత్వం
- భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం
- రెడ్‌బుక్ రాజ్యాంగమే అజెండాగా మారణహోమం
- ఆరు నెలల్లోనే రాష్ట్రంలో 229 హత్యలు
- 750కిపైగా హత్యాయత్నాలు.. 4 వేలకుపైగా దాడులు
- 7వేలకుపైగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల ధ్వంసం
- 126 అత్యాచారాలు, లైంగిక దాడులు
- వారిలో 12 మందిపై అత్యాచారం.. హత్య
- శాంతిభద్రతలు మృగ్యం.. సామాన్యుడి బతుకు ఛిద్రం
- అధికారిక గూండాగిరీతో బరితెగిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం

రోజుకు ఒకటికి మించి హత్యలు.. రోజున్నరకు ఓ అత్యాచారం.. రోజుకు 10కిపైగా అక్రమ కేసులు.. రోజుకు 25కుపైగా దాడులు, దౌర్జన్యాలు.. ఏమిటిదంతా అనుకుంటున్నారా!.. ఆరు నెలల పాలనలో చంద్రబాబు ప్రభుత్వ ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇది. స్వయంగా చంద్రబాబు, లోకేశ్ ప్రామాణికంగా తీసుకున్న రెడ్‌బుక్ పాలన రాష్ట్రంలో అధికారికంగా బీభత్సం సృష్టిస్తోంది. 75ఏళ్లలో ఎన్నడూ లేని రీతిలో ఈ ఆరు నెలల్లోనే దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు, అక్రమ కేసులతో బెంబేలెత్తిపోతోంది. చంద్రబాబు పాలనలో శాంతభద్రతలు చేష్టలుడిగి చూస్తుంటే.. సామాన్యుడి బతుకు ఛిద్రమైపోతోంది.



సాక్షి, అమరావతి: రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోంది. టీడీపీ గూండాలు, రౌడీమూకలు యథేచ్ఛగా హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, దౌర్జన్యాలకు తెగబడుతున్నాయి. చీనీ తోటలు నరికేస్తున్నారు. దళిత వాడలపై దండెత్తుతున్నారు. సామాన్యులను హడలెత్తించి గ్రామాల నుంచి వెళ్లగొడుతున్నారు. వరుస అత్యాచారాలు, లైంగిక దాడులతో రాష్ట్రంలో కీచకపర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఇక వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలతోపాటు సామాన్య సోషల్ మీడియా యాక్టివిస్టులను అక్రమ కేసులతో అడ్డూఅదుపు లేకుండా వేధిస్తున్నారు. చంద్రబాబు మార్కు కక్షసాధింపు చర్యలతో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సైతం రెడ్‌బుక్ రాజ్యాంగ బాధితులుగా మారిపోయారు. టీడీపీ సాగిస్తున్న అరాచక యజ్ఞంలో సామాన్యుల బతుకులే సమిధులవుతున్నాయి.

అరాచకాలే బ్రాండ్.. అదే బాబు పాలన ట్రెండ్

చంద్రబాబు ప్రభుత్వం బహిరంగంగానే అరాచకానికి బరితెగిస్తోంది. లోకేశ్ ఫొటోలతోసహా రెడ్‌బుక్ హోర్డింగులు ఏర్పాటు చేయడం ద్వారా మారణహోమంతో బీభత్సం సృష్టించడమే ప్రభుత్వ అజెండా అని ప్రకటించడం టీడీపీ కూటమికే చెల్లింది. తద్వారా టీడీపీ గూండాలు కత్తులు, కర్రలు, బాంబులతో యథేచ్ఛగా దాడుల చేయాలని ఆదేశించింది. అందుకు పోలీసు యంత్రాంగం సహకరించాలి లేదా పక్కకు తప్పుకోవాలని స్పష్టం చేసింది. మరి ప్రభుత్వమే అధికారికంగా గూండాగిరీకి తెగిస్తే ఎంతటి విధ్వంసం సాగుతుందన్నది యావత్ రాష్ట్రం ఈ ఆరు నెలల్లో చూసింది.

పచ్చ మూకల కీచకపర్వం

ఆరు నెలల్లో 126 అత్యాచారాలు, లైంగిక దాడులు

చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రంలో కీచకపర్వం అడ్డూఅదుపులేకుండా సాగుతోంది. ఒకప్పటి చంబల్ లోయలోని అకృత్యాలను తలపిస్తూ రాష్ట్రంలో పచ్చమూకలు మహిళలు, బాలికలపై లైంగిక దాడులకు తెగబడుతున్నాయి. అత్యాచారానికి పాల్పడటమే కాకుండా బాధిత మహిళల్ని హతమార్చి మరీ దర్జాగా జారుకుంటున్నారు. ఆరు నెలల్లోనే రాష్ట్రంలో 126 మంది మహిళలు, బాలికలపై అత్యాచారాలకు, దాడులకు తెగబడటం రాక్షస పాలనకు అద్దం పడుతోంది. వారిలో 12 మందిపై అత్యాచారం జరిపి హత్య చేయడం రౌడీ మూకల బరితెగింపునకు నిదర్శనంగా మారింది. టీడీపీ కూటమి పెద్దలు, గూండాలకు భయపడి బాధితులు ఫిర్యాదులు చేయని ఉదంతాలు అంతకు రెట్టింపు సంఖ్యలో ఉన్నాయన్నది పచ్చి నిజం.

229 హత్యలు.. 750కుపైగా హత్యాయత్నాలు

చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న హత్యాకాండ బెంబేలెత్తిస్తోంది. ఆరు నెలల్లో రాష్ట్రంలో ఏకంగా 229 మందిని హత్య చేశారు. 750కుపైగా హత్యాయత్నాలకు తెగబడ్డారు. దాడులు, దౌర్జన్యాలకు అడ్డూ అదుపూ లేకుండాపోయింది. 4 వేలకుపైగా దాడులతో విధ్వంసం సృష్టించారు. 2 వేలకుపైగా ప్రైవేటు ఆస్తులు, 5 వేలకుపైగా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. టీడీపీ గూండాల దాడులతో బెంబేలెత్తి దాదాపు 5వేల కుటుంబాలు గ్రామాలను విడిచిపెట్టి వలసపోయాయి.

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ.. రాజ్యాంగ హక్కుల కాలరాత

సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు

సోషల్ మీడియా కార్యకర్తలపై వేధింపులతో చంద్రబాబు ప్రభుత్వ అరాచకం పతాకస్థాయికి చేరింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు నమోదు చేస్తూ అక్రమ నిర్బంధాలు, థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారు. భౌతిక దాడులకు దిగుతూ.. కోర్టు ఆదేశాలను ధిక్కరించి మరీ వేధింపులు, దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. ఎమర్జెన్సీ తరహా నియంతృత్వ పాలనను కూటమి సర్కారు రాష్ట్రంపై రుద్దుతోంది. రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛను కాలరాస్తోంది. సెక్షన్లను మారుస్తూ.. చట్టాలను ఏమారుస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోంది.

రెడ్‌బుక్ రాజ్యాంగానికి పోలీస్ దాసోహం

పోలీస్ శాఖ లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగానికి గులాంగిరీ చేస్తూ టీడీపీ అరాచకానికి కొమ్ము కాస్తోంది. టీడీపీ కూటమి నేతలు, కార్యకర్తలు, గూండాలు యథేచ్ఛగా హత్యలు, దాడులు, దౌర్జన్యాలకు తెగబడుతున్నా పోలీస్ శాఖ చోద్యం చూస్తోంది. ఏకంగా అఖిల భారత సర్వీస్ అధికారులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు కూడా రెడ్‌బుక్ రాజ్యాంగ బాధితులుగా మారిపోవడం ప్రస్తుత వైచిత్రి. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించక ముందే అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డిని బలవంతంగా సెలవుపై పంపారు. అధికారం చేపట్టిన తరువాత ఏకంగా 10 మంది ఐఏఎస్, 24 మంది ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇవ్వకుండా వేధించారు.

వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా కుట్ర

వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. టీడీపీ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు, అక్రమ అరెస్టులతో విరుచుకుపడుతోంది. అందుకోసం పోలీసు, సీఐడీ, విజిలెన్స్, ఏసీబీ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోంది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎంపీలు నందిగం సురేశ్, రెడ్డప్ప, మాజీ మంత్రులు పినిపే విశ్వరూప్, పేర్ని నాని, కొడాలి నాని, జోగి రమేశ్, మేరుగ నాగార్జున, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రోజా, విడదల రజినీ, మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పెద్దారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వల్లభనేని వంశీ, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, పార్టీ నేతలు దేవినేని అవినాశ్, సజ్జల భార్గవ్‌రెడ్డి, వైవీ విక్రాంత్‌రెడ్డి తదితరులతోపాటు వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలపై టీడీపీ కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తోంది.

చీడపీడలకు టెక్నాలజీతో చెక్

- పంటల రక్షణకు ఆధునిక టెక్నాలజీ వాడాలి: చిన్నారెడ్డి
- వ్యవసాయ వర్సిటీలో 'రాపిడ్'జాతీయ సదస్సు ప్రారంభం



సాక్షి, హైదరాబాద్/ఏజీవర్సిటీ: వాతావరణ మార్పుల కారణంగా పంటలకు సోకే చీడపీడల నివారణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ప్లాంట్ పాథాలజీ అండ్ ఇన్నోవేటివ్ అప్రోచెస్ ఇన్ ప్లాంట్ డిసీజ్ మేనేజ్‌మెంట్ (రాపిడ్)'అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తోన్న జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఈ సదస్సును ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఫైటో పాథలాజికల్ సొసైటీ (సెంట్రల్ జోన్), దక్కన్ సొసైటీ ఆఫ్ ప్లాంట్ పాథాలజీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ కృత్రిమ మేధ, మెషీన్ లర్నింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలను సస్యరక్షణలో వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు ఆహార, పోషణ, భద్రత కల్పించడంలోనూ వ్యవసాయ శాస్త్రవేత్తలు తమవంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీలోని తాడేపల్లిగూడెంలో ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ ఉపకులపతి కె. గోపాల్, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ శారదా జయలక్ష్మి, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి దండ రాజిరెడ్డి తదితరులు ప్రసంగించారు. వివిధ పంటలకు సోకే రోగాల నిర్ధారణ, నివారణకు కూడా రిమోట్ సెన్సింగ్ అధ్యయనం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. పలు విభాగాల శాస్త్రవేత్తలు కలిసి పనిచేయడం వల్ల సస్యరక్షణలో మెరుగైన ఫలితాలు సాధించగలమని కె. గోపాల్ అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ సత్యనారాయణ, ఇండియన్ ఫైటో ప్లాంట్ పాథలాజికల్ సొసైటీ (సెంట్రల్ జోన్) అధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

'రాష్ట్రంలో సూక్ష్మ సేద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వం సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించిందని ఉద్యానవన సంచాలకులు షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. రాష్ట్రంలోని రైతాంగం ఈ అవకాశాన్ని వినియోగించుకొని పెద్దఎత్తున ఉద్యానవన పంటలు సాగుచేయాలని కోరారు. గురువారం ఆమె సూక్ష్మనీటి సేద్య పథకం విస్తరణ తీరుపై 31 జిల్లాలలోని అధికారులు, సూక్ష్మ సేద్య పరికరాలు సరఫరా చేసే కంపెనీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా యాస్మిన్ మాట్లాడుతూ, సూక్ష్మ సేద్యానికి అవసరమైన పరికరాలకు సంబంధించి 2024-25 సంవత్సరానికి జిల్లాలకి కేటాయించిన లక్ష్యాలను వచ్చే సంవత్సరం జనవరి 15 లోగా పూర్తిచేయాలని సమావేశంలో పాల్గొన్న 21 కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. కంపెనీల ప్రతినిధులు, జిల్లా అధికారులు కలిసికట్టుగా పనిచేస్తూ నిర్ణయించిన లక్ష్యాలను పూర్తి చేసి బిల్లులను సమర్పించాలని, రైతులు సూక్ష్మ సేద్య పరికరాలు తమ పొలంలో తొందరగా అమర్చుకొని సహకరించాలని ఆమె కోరారు.

మరణశిక్ష.. జీవితఖైదుగా మార్పు

కింది కోర్టు విధించిన శిక్షను సవరించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య కేసులో దోషి గఫార్ అలీ (62)కి సంగారెడ్డి జిల్లా కోర్టు విధించిన మరణశిక్షను హైకోర్టు జీవితఖైదుగా మార్చింది. అయితే పలు షరతులు కూడా విధించింది. 30 ఏళ్లపాటు శిక్ష అనుభవించాలని, ముందస్తు విడుదల, ఇతర ఉపశమనాలకు అర్హుడు కాదని పేర్కొంది. అలాగే తొలి 15 ఏళ్ల శిక్షా కాలంలో ఎలాంటి పెరోల్ కూడా ఉండదని స్పష్టం చేసింది. గఫార్.. వయసు, గతంలో ఎలాంటి కేసులు లేకపోవడాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ మేరకు శిక్షను సవరించినట్లు పేర్కొంది. పోలీసుల వివరాల మేరకు.. బిహార్‌కు చెందిన గఫార్ బీడీఎల్ భానూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చైతన్య కంపెనీ పక్కన లేబర్ రూమ్‌లో నివాసం ఉండేవాడు. అదే రాష్ట్రం నుంచి వచ్చిన శంకర్, ఉమాదేవి దంపతులు తమ ఐదేళ్ల మనవరాలిని అదే కంపెనీ సెక్యూరిటీ గార్డు వద్ద ఉంచి పనికి వెళ్లారు. అక్కడే ఉన్న గఫార్.. పాపకు కూల్‌డ్రింక్ తాగించి తెస్తానని తీసుకెళ్లాడు. మద్యం కలిపిన కూల్‌డ్రింగ్ తాగించి పత్తి చేనులోకి తీసుకెళ్లి అత్యాచారం చేసి, గొంతు నులిమి హత్య చేశాడు. పాప కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. వాదనల తర్వాత ఉరిశిక్ష విధిస్తూ జిల్లా కోర్టు గత సెప్టెంబర్‌లో తీర్పునిచ్చింది. దీనిపై గఫార్ హైకోర్టును ఆశ్రయించగా, ఆయన పిటిషన్‌పై జస్టిస్ కె.సురేందర్, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టి.. మరణశిక్షను జీవితఖైదుగా సవరిస్తూ తీర్పునిచ్చింది.

ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల కేసులపై కమిటీ

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: వివిధ కారణాలతో ఆర్టీసీలో తొలగింపునకు గురైన ఉద్యోగుల కేసుల సమీక్షకు ప్రభుత్వం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసింది. గత మూడేళ్లుగా ఆర్టీసీలో చిన్నచిన్న తప్పిదాలు, నిర్లక్ష్యాలతో 600 మందిని సంస్థ విధుల నుంచి తొలగించింది. పదేపదే వారి విన్నపాలతో ఇటీవల అప్పీళ్ల మేళా నిర్వహించి 180 మందిని తిరిగి విధుల్లోకి తీసుకుంది. మిగిలిన 420 మంది కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. బస్సులు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, ప్రయాణికులకు తగిన టికెట్ జారీ చేయకపోవడం, వసూలు చేసిన డబ్బులు, జారీచేసిన టికెట్ విలువలో తేడాలుండటం, అనుమతి లేనిదే సెలవులు పెట్టడం వంటి కారణాలతో వీరిని విధుల నుంచి తొలగించారు. తమ కేసులను మరోసారి సమీక్షించాలని, తప్పులుంటే మన్నించి చిన్న శిక్షలతో సరిపెట్టాలని, పేదరిక కుటుంబ నేపథ్యాన్ని పరిగణించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఈ తొలగింపు సిబ్బంది కోరుతూ వస్తున్నారు. ఈ నేపథ్యాన్ని వివరిస్తూ గత శుక్రవారం 'సాక్షి' ప్రధాన సంచికలో 'చిల్లర పొరపాట్లు..పెద్ద శిక్షలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ త్రిసభ్య కమిటీని నియమించింది. ఉద్యోగులకు తిరిగి విధులు అప్పగించే విషయంలో ప్రభుత్వానికి ఇది తగిన సిఫారసు చేయనుంది.

త్రిసభ్య కమిటీలో ఎవరెవరంటే..

కమిటీకి చైర్మన్‌గా కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ, కర్మాగారాల విభాగం ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్ వ్యవహరిస్తారు. సభ్యులుగా సెర్ప్ సీఈఓ డి.దివ్య, మెంబర్ కన్వీనర్‌గా టీజీఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈమేరకు రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఆర్టీసీలో తొలగించిన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయడం శుభపరిణామమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రజావాణి ద్వారా ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, స్పందించిన ప్రభుత్వం ఈమేరకు నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.

అక్రమార్జన వెనుక ఇంకెవరైనా ఉన్నారా?

- ఏఈఈ నిఖేశ్‌కుమార్ కేసులో ఏసీబీ ఆరా
- స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా ప్రశ్నలు
- సహకరించిన అధికారులు, బ్యాంకు లాకర్లపై విచారణ

సాక్షి, హైదరాబాద్: తక్కువ కాలంలోనే వందల కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టే స్థాయికి ఎదిగిన నీటిపారుదల శాఖ ఏఈఈ నిఖేశ్‌కుమార్ యథేచ్ఛ దోపిడీ వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న కోణంలో ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిఖేశ్‌కుమార్‌ను ఏసీబీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయన ఇంట్లో, బంధువులు, స్నేహితుల ఇళ్లలో సోదాల సందర్భంగా పలు కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటన్నింటిపైనా మరింత సమాచారం సేకరించేందుకు నిందితుడిని కస్టడీకి ఇవ్వాలని కోరగా కోర్టు గురువారం నుంచి నాలుగు రోజులు కస్టడీకి అనుమతించిన విషయం తెలిసిందే. దీంతో గురువారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి నిఖేశ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించి ప్రశ్నించారు. సోదాల్లో భాగంగా స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా ప్రశ్నల పరంపర కొనసాగించారు. క్లియర్ చేసిన ఫైల్స్ తదితర అంశాలపై ప్రాథమిక వివరాలు సేకరించారు.

ఎవరి సహకారం ఎంత...?

ఏఈఈ నిఖేశ్‌కుమార్ తన పరిధి దాటి మరీ అక్రమాలకు పాల్పడినట్టు ఏసీబీ అధికారులు ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించారు. ఈ నేపథ్యంలో తొలుత వ్యక్తిగత, కుటుంబ వివరాలు, ఉద్యోగంలో రోజువారీ పనులకు సంబంధించిన వివరాలు, బ్యాంకు లాకర్లు ఎవరెవరి పేర్ల ఉన్నదీ ఆరా తీశారు. ప్రధానంగా రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వచ్చిన తర్వాత ఆస్తులు అమాంతంగా పెరిగిపోవడంపై ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం, మేడ్చల్, గండిపేటల్లో ఏఈఈగా పనిచేసినప్పుడు నాలాలు, చెరువుల బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాల అనుమతుల్లో నిఖేశ్ చక్రం తిప్పినట్టు గుర్తించారు. దీంతో కీలక అనుమతుల జారీలో సహకరించిన అధికారులు ఎవరు? శాఖలో అంత స్వేచ్ఛ ఇచ్చింది ఎవరు? తదితర అంశాలపై దృష్టి పెట్టారు. స్వాధీనం చేసుకున్న అన్ని పత్రాలను నిఖేశ్‌కుమార్ ముందుంచి ప్రశ్నించారు. అయితే నిఖేశ్ పొడిపొడి సమాధానాలకే పరిమితమైనట్టు తెలిసింది. శుక్రవారం నిఖేశ్‌కుమార్ కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, ఇతర బినామీల పేరిట ఉన్న బ్యాంకు లాకర్లను ఓపెన్ చేయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

స్వయంశక్తి


పవిత్ర మాలలతో వెల్ది రేఖ, హరిప్రసాద్ దంపతులు.


ప్రత్యేక మిషన్‌పై నూలు పోగులతో పవిత్ర మాలలను పోస్తున్న వెల్ది రేఖ

‘నా వల్ల ఎక్కడ అవుతుంది’ అనుకుంటే పరిష్కారం, విజయం ఎప్పుడూ కనిపించవు.

‘నా వల్ల ఎందుకు కాదు’ అనే ఆత్మవిశ్వాసం ఏ కొంచెం ఉన్నా పరిష్కారాలు పరుగెత్తుకుంటూ వస్తాయి.

ఆలయాల్లో దేవతా మూర్తుల పూజలకు అవసరమైన నూలు పోగులతో తయారైన మాలలు హైదరాబాద్, విజయవాడ లాంటి పెద్ద పట్టణాల్లో కూడా దొరకడం లేదనే మాట విన్న రేఖ ఆ లోటును భర్తీ చేసేలా పవిత్ర మాలల తయారీకి పూనుకుంది. ఎంతోమందికి ఉపాధి కల్పిస్తోంది.

దేవుడికో నూలుపోగు

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పూజారులు ఒకరోజు సిరిసిల్లకు వచ్చారు. తమిళనాడులో తయారైన ఒక పవిత్ర మాలను శాంపిల్‌గా తీసుకొచ్చి ‘ఇలాంటి మాలలు మాకు కావాలి. తయారు చేసి ఇవ్వగలరా’ అంటూ నేత కార్మిక కుటుంబానికి చెందిన వెల్ది రేఖ, హరిప్రసాద్ దంపతులను అడిగారు

ఆ మాలలను పరిశీలించి, తయారు చేసే విధానాన్ని తెలుసుకున్నారు రేఖ, హరిప్రసాద్ దంపతులు. నాలుగు వైపులా మేకులు కొట్టి వాటికి నూలు పోగులను చుడుతూ, వేలాది పోగులతో ఒక రూపం వచ్చాక దాన్ని అందమైన దండగా తీర్చిదిద్దాలి. ఈ పని చేయడానికి చాలా సమయం పడుతుంది. శ్రమ కూడా అధికమవుతుంది. పవిత్ర మాలలు హైదరాబాద్, విజయవాడలో ఎక్కడా దొరకడం లేదని, పూజాసామాగ్రి అమ్మే దుకాణాల్లో ఈ పవిత్ర మాలల కొరత ఉందని పూజారులు చెప్పారు. హరిప్రసాద్‌కు సాంచాలు (పవర్‌లూమ్స్) ఉన్నాయి. వాటిపై వినూత్నమైన వస్త్రాలను తయారు చేస్తాడు. అయితే పవిత్ర మాలలను తయారు చేసే బాధ్యతను భార్య రేఖకు అప్పగించాడు.

‘నేను చేయలేనేమో’ అని రేఖ అనుకొని ఉంటే మంచి అవకాశం చేజారి పోయి ఉండేది.

కొత్త విషయాలు తెలుసుకోవడం, కొత్తగా ప్రయత్నించడం అంటే... మొదటి నుంచి ఆసక్తి ఉన్న రేఖ ‘నేను తయారు చేయగలను’ అంటూ పనిలోకి దిగింది.

నాలుగు వైపులా మేకులు కొట్టడం, దాని చుట్టూరా నూలు పోగులను ఒక్కొక్కటి చుట్టడం కష్టమైన పని కావడంతో తమ దగ్గర ఉండే నూలు బింగిరిలను, సైకిల్ హబ్‌ను, నాలుగు పట్టీలను వెల్డింగ్ చేయించి, చిన్న మోటారు సాయంతో నేరుగా నూలు పోగులు ఆ నాలుగు పట్టీలకు చుట్టుకునే విధంగా ప్రత్యేక మిషన్‌ను తయారు చేయించారు రేఖ, హరిప్రసాద్.

వినూత్న ఆలోచనతో మిషన్ రూపుదిద్దుకోవడంతో పని సులభమైంది. ధర్మవరం నుంచి హార్డ్ సిల్క్, పట్టు పోగుల నూలు దిగుమతి చేసుకుని ఆ మిషన్‌పై దండలను తయారు చేయడం మొదలు పెట్టింది రేఖ. క్రమంగా వీటికి డిమాండ్ పెరగడం మొదలైంది. మాలల తయారీ ద్వారా ఇతర మహిళలకు కూడా ఉపాధి చూపుతోంది రేఖ.

ఇప్పుడు రేఖ, ఆమె బృందం తయారు చేస్తున్న పవిత్ర మాలలు సిరిసిల్లకు మాత్రమే పరిమితం కాలేదు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, నిజామాబాద్... మొదలైన పట్టణాలకు సరఫరా చేస్తున్నారు.

‘మరింత కష్టపడితే వ్యాపారాన్ని పెద్దస్థాయికి తీసుకువెళ్లవచ్చు అనిపిస్తుంది’ ఉత్సాహం, ఆత్మవిశ్వాసం నిండిన గొంతుతో అంటుంది రేఖ.

మన్ కీ బాత్‌లో మా ఆయన గురించి

కొత్తగా ఆలోచించడం, కష్టపడి పనిచేసే విషయంలో నా భర్త హరిప్రసాద్ నాకు స్ఫూర్తి. అగ్గిపెట్టిలో ఇమిడే చీర, దబ్బనంలో దూరే చీర, ఉంగరంలో దూరిపోయే పట్టు చీరలను ఆవిష్కరించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకున్నారు. జీ 20 లోగోను మగ్గంపై వస్త్రంపై నేసి ప్రధాని నరేంద్రమోదీకి పంపించారు. చేనేత వస్త్రంపై జీ 20 లోగోను చూసిన ప్రధాని ‘మన్‌కీ బాత్’లో హరిప్రసాద్‌ను అభినందించారు. వస్త్రాలపై చిత్రాలను ఆవిష్కరించే నైపుణ్యాన్ని అభినందిస్తూ నన్ను, మా ఆయనను అప్పటి గవర్నర్ తమిళిసై రాజ్‌భవన్‌కు ఆహ్వానించి సన్మానించారు.

– వెల్ది రేఖ




పవిత్ర మాలలు అల్లుతున్న వెల్ది రేఖ

నూలు పోగులే ఆశాదీపాలై...

సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగం ప్రభుత్వ ఆర్డర్లు లేక, రాక సంక్షోభంలో ఉంది. ‘టెక్స్‌టైల్ పార్క్’లాంటి ఆధునిక మగ్గాల సముదాయం మూతపడి వేలాదిమంది కార్మికులు ఉపాధి కోసం దిక్కులు చూస్తున్నారు. ఇలాంటి సమయంలో రేఖ సాధించిన విజయం ఎంతో స్ఫూర్తిని ఇస్తుంది. ‘కొత్తగా ఏదైనా ప్రయత్నిస్తే... కొత్త దారి కనిపిస్తుంది’ అనే భరోసాను ఇస్తోంది. ఎక్కడెక్కడి నుంచో పవిత్ర మాలల కోసం సిరిసిల్లకు వస్తున్నారు. ఇక్కడ తయారైన మాలలు ఎక్కడెక్కడికో ఎగుమతి అవుతున్నాయి. ఇది చిన్న విజయమే కావచ్చు. సంక్షోభ సమయంలో స్వయంశక్తిని గుర్తుకు తెచ్చి ఉత్సాహాన్ని ఇచ్చే విజయం.

ఎన్నో పెద్ద విజయాలు చిన్న విజయాలతోనే మొదలయ్యాయి.


రేఖ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మరిన్ని విజయం సాధించాలని ఆశిద్దాం.

– పూరడి మల్లికార్జున్
సాక్షి, సిరిసిల్ల
ఫోటోలు: వంకాయల శ్రీకాంత్

ఫిట్‌నెస్

72 ఏళ్ల శక్తి కపూర్ తన ఫిట్‌నెస్ రహస్యాన్ని ఇటీవల తెలియచేశాడు. రోజుకు 35 వేల అడుగులు నడవడం తన ఆరోగ్య రహస్యం అన్నాడు. నడక వల్ల ఉపయోగాలు అందరికీ తెలిసినా 70 ఏళ్ల తర్వాత కూడా నడక మంచిదేనని వైద్యులు అంటున్నారు. రోజూ 7 వేలతో మొదలుపెట్టి కనీసం 10 వేల వరకూ నడిస్తే మంచిది అంటున్నారు. నడవని వారు గుండెకు చేటు తెచ్చుకుంటారని హెచ్చరిస్తున్నారు. మీరెంత నడుస్తున్నారు?

రోజుకు 35000 అడుగులు నడుస్తాను


శక్తి కపూర్

వందలాది సినిమాల్లో నటించిన శక్తి కపూర్ 72 ఏళ్ల వయసులో కూడా చలాకీగా, ఫిట్‌గా ఉంటారు. ఇటీవల ఒక టీవీ షోలో మీ ఫిట్‌నెస్ రహస్యం ఏమిటని అడిగితే ‘రోజూ కనీసం 35000 అడుగులు నడవడమే’ అని చెప్పాడు. మధ్యలో కొన్ని రోజులు మానేశాను... తిరిగి మొదలుపెట్టాను అని చెప్పాడు. నటన అంటే రకరకాల పాత్రలు చేయాలి. పరిగెత్తడం, డాన్స్.. ఇలాంటివి ఉంటాయి. అవన్నీ చేయాలంటే ఫిట్‌నెస్ చాలా ముఖ్యం. చాలామంది రకరకాల వ్యాయామం చేస్తారు. అయితే శక్తికపూర్ నడకే తన ఫిట్‌నెస్‌కు కారణం అని తెలియచేశాడు.

నడక మంచిది

ఈ విషయం గురించి ఢిల్లీలోని సికె బిర్లా హాస్పిటల్‌కు చెందిన వైద్య నిపుణుడు డాక్టర్ నరేంద్ర సింఘలా ఏమన్నారంటే ‘రోజుకు 35 వేల అడుగులు నడవడం ఎవరికైనా మంచిది... ముఖ్యంగా వయసు మళ్లిన వారి గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. ఇన్ని అడుగులు నడవడం వల్ల 2000 నుంచి 2500 కేలరీలు బర్న్ అవుతాయి. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. కాళ్ల కండరాలు బలపడతాయి. క్రమం తప్పకుండా నడవడం వల్ల పెద్ద వయసు వారిలో రక్తప్రసరణ క్రమబద్ధీకరణ జరిగి బ్లడ్‌ప్రెషర్ తగ్గుతుంది. దానివల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అంతేకాకుండా నడక బరువును అదుపు చేస్తుంది. వయసు మళ్లాక బరువు పెరిగితే స్థూలకాయం వల్ల వచ్చే సమస్యలు తోడవుతాయి. వాటిని నివారించాలన్నా బరువు పెరగకుండా చూసుకోవాలన్నా వయసు పెరిగే కొద్దీ నడకను పెంచాలి’ అన్నారాయన.

> నడక బరువును అదుపు చేస్తుంది. వయసు మళ్లాక బరువు పెరిగితే స్థూల కాయం వల్ల వచ్చే సమస్యలు తోడవుతాయి. వాటిని నివారించాలన్నా బరువు పెరగకుండా చూసుకోవాలన్నా వయసు పెరిగే కొద్దీ నడకను పెంచాలి

మానసిక ఆరోగ్యానికి...

ఎక్కువ అడుగులు నడవడం వల్ల మానసిక ఆరోగ్యానికి కూడా మంచిదని నిపుణులు అంటున్నారు. నడక మెదడుకు స్పష్టతనిచ్చి ఎంచుకున్న పనిపై ఏకాగ్రతను కలిగిస్తుందని వారు అంటున్నారు. అయితే 70 ఏళ్లు దాటాక 35 వేల అడుగుల నడక చాలా మందికి సాధ్యం కాకపోవచ్చు. ముందు నుంచి అలవాటు లేకపోతే. కాని 7000 అడుగుల నుంచి శక్తి, ఓపికను బట్టి 10 వేల అడుగుల వరకూ నడవాలని వారు అంటున్నారు. నడకకు అనువైన షూస్, పోష్చర్, తగినంత నీరు తాగి బయలుదేరడం... ఈ జాగ్రత్తలతో క్రమం తప్పకుండా నడిస్తే ఆరోగ్యం ఓ భాగ్యంలా తోడు ఉంటుందని అంటున్నారు వారు. నడవడమే బాకీ.

✻ స్కిన్ గ్లో...

మురిసే మెరుపు

ఫ్యాషన్ బ్యూటీ

వివాహ వేడుకలలో లెహంగా చోలీ హంగుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే, వాటి డిజైన్లలో వచ్చే మార్పుల గురించి ఎప్పుడూ ప్రస్తావిస్తూనే ఉంటారు. ఒకే మోడల్‌లో కాకుండా విభిన్న డిజైన్లలో ఆకట్టుకునే ఈ డ్రెస్ డిజైన్స్‌లో కలర్ కాంబినేషన్స్‌కి మొదటి ప్రాధాన్యత ఉంటే ప్రింట్‌లో, ఫ్రిల్స్‌లో, ప్యానెల్స్‌లో, ఎంబ్రాయిడరీలో కనిపించే స్పెషాలిటీ సెపరేట్. బ్లౌజ్ ఫ్రిల్స్.. లెహంగా ప్యానెల్స్ ఈ వెడ్డింగ్ సీజన్‌ని మరింత బ్రైట్‌గా కనిపించేలా కనువిందు చేస్తున్నాయి.

- షీర్ ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేసిన లెహంగా ప్యానెల్స్, దుపట్టాలు, స్లీవ్స్ ఎంపికలు ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి.
- వివాహ వేడుకలలో ఎరుపు ఎప్పుడూ క్లాసిక్ బ్రైడల్ ఎంపిక. అందుకే, ఎరుపు రంగు జనాదరణ పొందుతున్నప్పటికీ ఆరెంజ్, బర్గండీ, గ్రీన్, పింక్.. పేస్టెల్ కలర్స్‌దే ఫస్ట్ ప్లేస్. ఈ డిజైన్స్ వివాహానికి ముందు లేదా తర్వాతి వేడుకలలో సందడి చేస్తుంటాయి.
- లెహంగా ప్యానెల్స్‌లో ఎంబ్రాయిడరీతో పాటు ఫ్రిల్స్, ప్లెయిన్ కాంబినేషన్ ఆకట్టుకుంటుంది.
- బ్లౌజ్ డిజైనింగ్‌లో ఫ్రిల్స్ ఎంపిక ఇటీవల ముందుంటోంది. ఫ్యాబ్రిక్ ఎంపిక బట్టి బటర్‌ఫ్లై, ప్రిన్సెస్ కళ ఈ డిజైన్స్‌లో కోరుకోవడం ఎంపిక చేసుకున్నవారి అభిరుచిని తెలియజేస్తుంది.





స్కిన్ గ్లో

శాశ్వతం చేసుకోండి

చర్మం నిగారింపును అందరూ కోరుకుంటారు. అందుకు సౌందర్య ఉత్పత్తుల వాడకం, ఫేషియల్స్, స్కిన్ ట్రీట్‌మెంట్లు చేయించుకుంటూ ఉంటారు. ఈ విషయాల్లో సరైన అవగాహన లేక ఉపయోగించే పద్ధతులు ఒక్కోసారి రివర్స్ అవుతుంటాయి. ముఖ్యంగా.. మొటిమలు/యాక్నే సమస్య ఉన్నవారు పార్లర్‌లో ఫేషియల్స్ చేయించుకుంటారు. మళ్లీ ఇంట్లో కొన్ని రకాల మసాజ్‌లు చేస్తుంటారు. వీటివల్ల సమస్య మరింత పెరుగుతుంది. నిపుణుల ఆధ్వర్యంలో కెమికల్ పీల్ చేయించుకుంటారు. కానీ, ట్రీట్‌మెంట్‌కి ముందు–తర్వాత వాడే ప్రొడక్ట్స్ విషయంలో జాగ్రత్తలు తీసుకోరు. దీనివల్ల సాధారణంగా ఉండే సమస్య మరింత పెరిగి, చర్మం దెబ్బతింటుంది.

మచ్చలు తగ్గాలంటే..

నలుపు/తెలుపు మచ్చలు కనిపించినప్పుడు మొదట సొంతంగా హోమ్ రెమిడీస్ చేస్తుంటారు. వీటి వల్ల కొన్ని రివర్స్ అవుతుంటాయి. దీర్ఘకాలపు సమస్యగా కూడా మారుతుంటాయి. క్రీములు, మెడిసిన్స్.. సమస్య మొదట్లోనే గుర్తించి, వాడితే చర్మ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

లేజర్ చికిత్స

మచ్చలకు, కొన్ని రకాల చర్మ సమస్యలకు లేజర్ చికిత్స అవసరం అవుతుంటుంది. చికిత్స తర్వాత సరైన క్రీములను ఉపయోగించకపోతే చర్మం పాడిబారుతుంది. కొత్త మచ్చలు కూడా పుట్టుకు వస్తుంటాయి.

ప్రొడక్ట్స్ .. అలెర్జీలు

ఆహారం పడకపోతే ఎలాంటి సమస్యలు వస్తాయో సరైనది ప్రొడక్ట్ ఉపయోగించకపోతే చర్మానికి అలాంటి అలెర్జీలు ఉత్పన్నం అవుతుంటాయి. అందుకే, ఏదైనా కొత్త ప్రొడక్ట్ వాడాలనుకున్నప్పుడు ముందుగా చర్మంపై టెస్ట్ ప్యాచ్ చేసుకోవాలి. చలికాలం పొడి చర్మం గలవారికి స్కిన్ అలెర్జీ ఎక్కువ ఉంటుంది. క్రీములు, నూనెల వాడకంలో మరికొంత జాగ్రత్త తీసుకోవాలి.


చర్మం నిగారింపు, హెయిర్ సాఫ్ట్‌నెస్ కోసం పర్మనెంట్ గ్లో వంటి చికిత్సల వైపు మొగ్గుచూపుతుంటారు. కానీ, శాశ్వత పరిష్కారం అంటూ ఉండదు. సమస్య ఉత్పన్నం కాకుండా తీసుకునే ఆహారం, పానీయాలు, తమ శరీర తత్త్వానికి ఉపయోగపడే క్రీములను వాడుతూ ఉండాలి.



– డా.స్వప్నప్రియ, డెర్మటాలజిస్ట్

హెల్దీ డైట్

మఖానా స్మూతీ



కావలసినవి:
వేయించిన మఖానా– కప్పు
బాదం పప్పు– 3 టేబుల్ స్పూన్‌లు
అరటిపండు – ఒకటి; ఖర్జూరాలు– 4;
పీనట్ బటర్– టేబుల్ స్పూన్;
పాలు– 300 ఎం.ఎల్;
గుమ్మడి గింజలు– టీ స్పూన్;

తయారీ:
గుమ్మడి గింజలుమినహా మిగిలిన అన్నింటినీ మిక్సీలో మెత్తగా బ్లెండ్ చేయాలి. గ్లాసుల్లో పోసి పైన గుమ్మడి గింజలు చల్లి సర్వ్ చేయాలి. చల్లగా కావాలంటే అరగంట సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇది మంచి పోషకాహారం. పిల్లలు ఆటల్లో మునిగి తినడానికి ఇష్టపడక పరుగులు తీస్తుంటారు. పోషకాలన్నింటినీ ఒక గ్లాసులో పోసి ఇచ్చినట్లే. స్కూల్ నుంచి వచ్చిన వెంటనే ఇది ఒక గ్లాసు తాగితే రోజుకు అవసరమైన పోషకాలన్నీ దాదాపుగా అందినట్లే. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ బదులుగా కూడా ఈ స్మూతీని ఇవ్వవచ్చు. ఫిట్‌నెస్ చేసేవాళ్లు వర్కవుట్ తర్వాత ఈ డ్రింక్‌ను తీసుకోవచ్చు.


డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

పోషకాలు:
శక్తి– 764 కిలోకేలరీలు
ప్రొటీన్– 26.1 గ్రాము
కార్బొహైడ్రేట్‌లు– 87.2 గ్రాములు
ఫ్యాట్ – 36.3 గ్రాములు
ఫైబర్– 10 గ్రాములు

సాక్షి బిజినెస్
శుక్రవారం
13-12-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
236	93
81,290	24,549

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

● నాస్‌డాక్	19,982	▽	49
● డోజోన్స్	44,087	▽	62
● ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,312	△	10
● డాక్స్	20,426	△	27
● షాంఘై	3,462	△	29
● నికాయ్	39,849	△	477

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)		
78,147	△	481
బంగారం (22 క్యారెట్)		
77,834	△	479
వెండి (కిలో)		
93,300	△	600

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.45	85.47
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.10	109.97
€	యూరో	ఎస్‌బీఐ	88.17	90.77
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.34	56.75
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.13	55.25
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.82	65.54
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.72	23.28
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.21	23.99
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.81	12.63

అక్టోబర్‌లో ఐఐపీ నిరాశ

వృద్ధి 3.5 శాతానికి పరిమితం

న్యూఢిల్లీ: పారిశ్రామిక వృద్ధి అక్టోబర్‌లో మందగించింది. భారత్ పారిశ్రామిక ఉత్పత్తి (ఐఐపీ) వృద్ధి రేటు కేవలం 3.5 శాతానికి (2023 ఇదే నెలతో పోల్చి) పరిమితమైంది. తయారీ, మైనింగ్, విద్యుత్ రంగాలు పేలవ పనితనాన్ని ప్రదర్శించాయి. 2023 అక్టోబర్‌లో ఐఐపీ 11.9 శాతం పురోగతి సాధించింది. అయితే నెలవారీగా చూస్తే, ఐఐపీ కొంత ఊరటనిచ్చింది. 2024 సెప్టెంబర్‌లో ఐఐపీ వృద్ధి రేటు 3.1 శాతం కావడం గమనార్హం. ఇక ఆగస్టులో అసలు వృద్ధిలేకపోగా 0.1 శాతం క్షీణ రేటు నమోదయ్యింది.

మరోవైపు ఐఐపీ ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్య 4 శాతంగా నమోదయ్యింది. గత ఏడాది ఇదే కాలంలో ఈ రేటు 7 శాతంగా ఉంది.

విభాగాల వారీగా (శాతాల్లో..)

రంగం	2024 అక్టోబర్	2023 అక్టోబర్
తయారీ	4.1	10.6
మైనింగ్	0.9	13.1
విద్యుత్	2.0	20.4
క్యాపిటల్ గూడ్స్	3.1	21.7
కన్జూమర్ డ్యూరబుల్స్	5.9	15.9
కన్జూమర్ నాన్-డ్యూరబుల్స్	2.7	9.3
మౌలిక/నిర్మాణ	4.0	12.6
ప్రైమరీ గూడ్స్	2.6	11.4
ఇంటర్మీడియట్ గూడ్స్	3.7	9.5



నవంబర్‌లో ద్రవ్యోల్బణం ఊరట

5.48 శాతంగా నమోదు

న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం నవంబర్‌లో కొంత ఊరటనిచ్చింది. సూచీ 5.48 శాతంగా (2023 ఇదే నెలతో పోల్చి) నమోదయ్యింది. ఆహార ఉత్పత్తులు ప్రత్యేకించి కూరగాయల ధరలు తగ్గడం దీనికి ప్రధాన కారణం. రిటైల్ ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో ఆందోళనకరంగా 14 నెలల గరిష్ట స్థాయిలో 6.2 శాతంగా (2023 ఇదే నెలతో పోల్చి) నమోదయిన సంగతి తెలిసిందే. ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశాల ప్రకారం రిటైల్ ద్రవ్యోల్బణం 2 శాతం అటు ఇటుగా 4 శాతం వద్ద ఉండాలి. అంటే ఎగువదిశగా 6 శాతం పైకి పెరగకూడదు. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన నవంబర్ గణాంకాల్లో ముఖ్యమైనవి...

- అక్టోబర్‌లో 10.87 శాతంగా ఉన్న ఫుడ్ బాస్కెట్ ద్రవ్యోల్బణం సమీక్షా నెల్లో 9.04 శాతానికి తగ్గింది.
- కూరగాయలుసహా పప్పుదినుసులు, ఉత్పత్తులు, చక్కెర, పండ్లు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు సుగంధ ద్రవ్యాల ధరలు తగ్గాయి.



రుణదాతలకు పీసీ జ్యువెలర్ షేర్లు

ఎస్‌బీఐ కన్సార్షియంకు 5.17 కోట్ల షేర్ల జారీ

న్యూఢిల్లీ: ఆభరణ విక్రయ సంస్థ పీసీ జ్యువెలర్ రుణదాతలకు ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. చెల్లించవలసిన రుణాలలో కొంతమేర షేర్ల జారీ ద్వారా సెటిల్ చేసుకునేందుకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ తెలియజేసింది. వెరసి ఎస్‌బీఐ కన్సార్షియంకు 5.17 కోట్ల షేర్లను జారీ చేయనున్నట్లు పేర్కొంది. ప్రిఫరెన్షియల్ పద్ధతిలో ప్రయివేట్ ప్లేస్‌మెంట్‌కింద 5,17,11,462 షేర్లను కేటాయించనున్నట్లు వెల్లడించింది. పబ్లిక్ వాటాదారుల(నాన్‌ప్రమోటర్) విభాగంలోనే వీటి జారీని చేపట్టనున్నట్లు తెలియజేసింది. తద్వారా ఔట్‌స్టాండింగ్ రుణాలలో కొంతమేర సెటిల్ చేసుకోనున్నట్లు వివరించింది. అయితే ఫ్లోర్ ధరకంటే అధిక ధరలోనే ఈక్విటీ జారీని




చేపట్టనుంది. కంపెనీ ఇప్పటికే రుణదాతలతో వన్ టైమ్ సెటిల్‌మెంట్ కుదుర్చుకున్న విషయం విదితమే. కాగా.. ఈ ఏడాది జులైలో ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు వారంట్లను జారీ చేసేందుకు కంపెనీ ప్రకటించింది. తద్వారా రూ. 2,705 కోట్లు సమీకరించాలని, నిధులను బ్యాంక్ రుణ చెల్లింపులకు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వెచ్చించాలని ప్రణాళికలు వేసింది.

ఈక్విటీ జారీ వార్తలతో ఎన్ఎస్ఈలో పీసీ జ్యువెలర్ షేరు 2 శాతం నష్టంతో రూ. 176 వద్ద ముగిసింది.

ఆటో విడిభాగాల పరిశ్రమ

రూ. 3.32 లక్షల కోట్లకు అప్

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో 11 శాతం వృద్ధి
- ఆటోమోటివ్ కాంపొనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ వెల్లడి



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో దేశీయంగా ఆటోమోటివ్ విడిభాగాల పరిశ్రమ 11 శాతం వృద్ధి చెందింది. రూ. 3.32 లక్షల కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో పరిశ్రమ రూ. 2.98 లక్షల కోట్ల స్థాయిలో ఉంది. ఆటోమోటివ్ కాంపొనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎంఏ) ప్రెసిడెంట్ శ్రద్ధా సూరి మార్వా ఈ విషయం తెలిపారు. 'ఎగుమతులకు సంబంధించి భౌగోళిక, రాజకీయ సవాళ్లు నెలకొన్నప్పటికీ వివిధ విభాగాలవ్యాప్తంగా వాహన విక్రయాలు కరోనా పూర్వ స్థాయికి చేరిన నేపథ్యంలో విడిభాగాల పరిశ్రమ కూడా వృద్ధి చెందింది.'అని ఆమె తెలిపారు. పండుగ సీజన్‌లో కూడా అమ్మకాలు గణనీయంగా నమోదయ్యాయని వివరించారు. అయితే, ఆర్థిక సంవత్సరంలో గత ఎనిమిది నెలల ధోరణి చూస్తే టూవీలర్ల వృద్ధి ఆశావహంగానే ఉన్నప్పటికీ, ప్యాసింజర్.. కమర్షియల్ వాహనాల అమ్మకాలు ఒక మోస్తరుగానే నమోదైనట్లు పేర్కొన్నారు. అటు ఎగుమతుల విషయానికొస్తే భౌగోళిక సవాళ్ల కారణంగా డెలివరీ సమయం, రవాణా వ్యయాలు మళ్లీ పెరిగాయని మార్వా వివరించారు. టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేసుకోవడం, స్థానికంగా తయారీ కార్యకలాపాలను విస్తరించడంపై పరిశ్రమ గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తోందని చెప్పారు. ఏసీఎంఏ ప్రకారం .. సమీక్షాకాలంలో ఎగుమతులు 7 శాతం పెరిగి 11.1 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 4 శాతం పెరిగి 11 బిలియన్ డాలర్లకు చేరాయి. 150 మిలియన్ డాలర్ల మిగులు నమోదైంది. ఆఫ్టర్‌మార్కెట్ విభాగం కూడా 5 శాతం వృద్ధి చెంది రూ. 47,416 కోట్లకు చేరింది.

రూపాయి ఆల్‌టైం కనిష్టం

84.88 వద్ద ముగింపు



ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త కనిష్టాలను తాకింది. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 84.70 వద్ద మొదలైంది. ఈక్విటీ మార్కెట్ బలహీన ట్రేడింగ్, ఎఫ్ఐఐల పెట్టుబడుల ఉపసంహరణ, క్రూడాయిల్ ధరలు పెరగడం తదితర కారణాలతో ఇంట్రాడేలో 6 పైసలు క్షీణించి 84.89 వద్ద సరికొత్త కనిష్టాన్ని నమోదు చేసింది. రోజంతా కనిష్టాల వైపు పయనించిన దేశీయ కరెన్సీ చివరికి 5 పైసలు బలహీనపడి జీవితకాల కనిష్టం 84.88 స్థాయి వద్ద ముగిసింది.



'సాక్షి ప్లస్'
ఈ-పేపర్‌లో ..



వృద్ధి తిరిగి ట్రాక్‌లోకి వస్తుంది: పీయూష్ గోయల్

ఆరేళ్లలో 8,000 సర్వీసింగ్ కేంద్రాలు : మారుతీ సుజుకీ



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-12-2024	
విశాఖ	620-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	630-00
విజయవాడ	630-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	620-00
వరంగల్	622-00
రిటైల్ ధర	6.80

ప్రభుత్వ బ్యాంకుల్లో భారీగా తగ్గిన మొండిబాకీలు

దశాబ్దపు కనిష్టం 3.12 శాతానికి చేరిక: కేంద్రం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ) స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) దశాబ్దపు కనిష్ఠ స్థాయికి తగ్గాయి. 2018 మార్చి నాటికి 14.98 శాతంగా ఉండగా తాజాగా 2024 సెప్టెంబర్ ఆఖరు నాటికి 3.12 శాతానికి దిగి వచ్చాయి. ప్రభుత్వం అమలు చేసిన 4ఆర్ వ్యూహం (రికగ్నిషన్, రీక్యాపిటలైజేషన్, రిజల్యూషన్, రిఫార్మ్ - మొండిపద్దులను గుర్తించడం, బ్యాంకులకు మూలధనం సమకూర్చడం, బాకీల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం, బ్యాంకింగ్‌లో సంస్కరణలు ప్రవేశపెట్టడం) ఇందుకు దోహదపడినట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. పీఎస్‌బీల క్యాపిటల్ అడెక్వసీ నిష్పత్తి 2015 మార్చితో పోలిస్తే 2024 సెప్టెంబర్ నాటికి 393 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 15.43 శాతానికి చేరింది. 2023-24లో పీఎస్‌బీలు అత్యధిక స్థాయిలో రూ. 1.41 లక్షల కోట్ల లాభాలు ఆర్జించాయి.



అధిక వెయిటేజీ షేర్లలో

అమ్మకాలు

సెన్సెక్స్ నష్టం 236 పాయింట్లు ● 24,600 దిగువకు నిఫ్టీ

ముంబై: దేశీయ ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి గణాంకాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో అధిక వెయిటేజీ రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌యూఎల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 236 పాయింట్లు నష్టపోయి 81,290 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93 పాయింట్లు పతనమై 24,549 వద్ద నిలిచింది. రూపాయి విలువ కనిష్టాల దిశగా పయనించడం, విదేశీ ఇన్వెస్టర్లు మళ్లీ విక్రయాల బాటపట్టడం సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడి పెంచాయి. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు కాసేపు మాత్రమే లాభాల్లో కదలాడాయి. తర్వాత నష్టాల్లోకి జారుకున్న సూచీలు ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 314 పాయింట్లు క్షీణించి 81,211 వద్ద, నిఫ్టీ 114 పాయింట్లు పతనమై 24,527 వద్ద కనిష్టాన్ని తాకాయి. ఐటీ షేర్లు మినహా అన్ని రంగాల షేర్లలో స్తబ్ధత నెలకొంది. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ ఇండెక్సులు 1%, అరశాతం నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- దేశీయ ఈక్విటీ మార్కెట్ నష్టాల్లో ట్రేడైనా.. అదానీ గ్రూప్‌లో 11 గాను 9 కంపెనీల షేర్లు లాభపడ్డాయి. అత్యధికంగా అదానీ గ్రీన్ ఎనర్జీ 6% పెరిగింది.

సినిమా



● అనిల్ తడాని, యలమంచిలి రవిశంకర్, అల్లు అర్జున్, నవీన్ ఎర్నేని

పుష్ప 2 విజయం ఇండియాది

- అల్లు అర్జున్

''నాపై ఇంత ప్రేమ చూపిస్తున్న భారతీయులందరికి నా కృతజ్ఞతలు. ముఖ్యంగా అన్ని రాష్ట్రాల ప్రజలకు థ్యాంక్స్. భారతీయులందరూ 'పుష్ప 2' సినిమాను ఆదరిస్తున్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులందరూ భారతీయ సినిమాను ఇంతగా ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు. 'పుష్ప 2' విజయం నాది కాదు... ఇండియాది. ఒక సినిమాను అన్ని రాష్ట్రాల ప్రజలు సెలబ్రేట్ చేశారు... ఇదే నా దేశం గొప్పతనం'' అని హీరో అల్లు అర్జున్ చెప్పారు. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా నటించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. ఈ సందర్భంగా గురువారం ఢిల్లీలో జరిగిన థ్యాంక్యూ ఇండియా ప్రెస్‌మీట్‌లో అల్లు అర్జున్ మాట్లాడుతూ- ''పుష్ప 2' సినిమాను మరింత ప్రేమతో, అత్యధిక వసూళ్లతో ఆదరిస్తున్న హిందీ సినీ ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా థ్యాంక్స్. ఈ సినిమా సక్సెస్‌కు ప్రధాన కారణం ఇండియన్ బాక్సాఫీస్‌ను రూల్ చేస్తున్న దర్శకుడు సుకుమారే. ఆయన విజన్, కష్టానికి ప్రతిఫలం ఈవిజయం. ఈ చిత్రం రూ. 1000 కోట్లు కలెక్ట్ చేయడం, భవిష్యత్‌లో మరిన్ని వసూళ్లు సాధించనుండటం ఒక ఎత్తు అయితే... నంబర్స్ అనేవి ప్రేక్షకుల ప్రేమకు నిదర్శనం. అయితే ఈ నంబర్స్ అనేవి తాత్కాలికం. ఎందుకంటే భవిష్యత్‌లో మరో సూపర్‌హిట్ సినిమా ఈ వసూళ్లను క్రాస్ చేస్తుంది. కానీ, ప్రేక్షకులు ఇచ్చే ప్రేమ మాత్రం శాశ్వతం... వాళ్లు నాపై చూపిస్తున్న వైల్డ్ ప్రేమకు జీవితాంతం ఋణపడి ఉంటాను'' అని తెలిపారు. యలమంచిలి రవిశంకర్ మాట్లాడుతూ- ''పుష్ప 2' కోసం అల్లు అర్జున్ ఎంతో కష్టపడ్డారు. ముఖ్యంగా పతాక సన్నివేశాల కోసం 32 రోజులు రోప్ ధరించి ఉండేవారు. ఆయన కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తోంది'' అన్నారు. ఈ సమావేశంలో హిందీ ఎగ్జిబిటర్స్ నిమిత్, సంజయ్, శశాంక్ రాజహెడ, యూపీ ఎగ్జిబిటర్ అశుతోష్ అగర్వాల్ పాల్గొన్నారు.

రాజకీయాల్లోకి రావడంలేదు: ''అల్లు అర్జున్ రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారని ఈ మధ్య ప్రచారంలోకి వచ్చిన వార్తల్లో నిజం లేదు'' అంటూ అల్లు అర్జున్ పీఆర్ టీమ్ ప్రకటించింది. నిరాధారమైన వార్తలను ప్రచారం చేయొద్దని, అల్లు అర్జున్ టీమ్ నుంచి అధికారికంగా వచ్చే వార్తలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని కూడా పేర్కొన్నారు.

స్టయిలిష్‌గా...

వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లు. ట్రయాంగిల్ క్రైమ్ స్టోరీగా ఈ సినిమా ఉంటుంది. ఈ సినిమాలో మాజీ పోలీస్ ఆఫీసర్‌గా వెంకటేశ్, ఆయన భార్య పాత్రలో ఐశ్వర్యా రాజేశ్ నటించారు. వెంకటేశ్ మాజీ ప్రేయసి పాత్రలో మీనాక్షీ చౌదరి కనిపిస్తారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా గురువారం (డిసెంబరు 12) వెంకటేశ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా నుంచి ఆయన స్టయిలిష్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అలాగే ఈ సినిమాలోని రెండో పాట 'మీనూ...' ప్రోమోను నేడు రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ తెలిపారు. ఈ సినిమా జనవరి 14న రిలీజ్ కానుంది.



● వెంకటేశ్

తేజ్ ఊచకోత చూస్తారు

- రామ్ చరణ్



● ఐశ్వర్య లక్ష్మి, సాయి దుర్గా తేజ్, చైతన్య రెడ్డి, రామ్‌చరణ్, నిరంజన్ రెడ్డి, రోహిత్ కేపీ

''సంబరాల ఏటిగట్టు' తేజుకి 18వ సినిమా. అందరికీ ఒకటే మాట చెబుతున్నా. తేజు ఊచకోత ఎలా ఉంటుందో ఈ సినిమాతో చూడబోతున్నారు. ఔట్ స్టాండింగ్ విజువల్స్. డైరెక్టర్ రోహిత్ మొదటి సినిమా చేస్తున్నట్టుగా లేదు.. చాలా అద్భుతంగా తీస్తున్నాడు'' అని రామ్ చరణ్ తెలిపారు. సాయిదుర్గా తేజ్ నటిస్తున్న తాజా చిత్రానికి 'ఎస్‌వైజీ'(సంబరాల ఏటిగట్టు) అనే టైటిల్‌ని ఖరారు చేశారు. నూతన దర్శకుడు రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఈ సినిమాని 2025 సెప్టెంబర్ 25 తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళంలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మూవీ టైటిల్ టీజర్‌ని రామ్ చరణ్ విడుదల చేసి, మాట్లాడుతూ-''తేజు ఈరోజు ఇక్కడ ఇలా నిలిచి ఉండటానికి కారణం అభిమానుల ఆశీర్వాదాలే. ఇది తనకి పునర్జన్మ. ఈ జన్మ అభిమానులే ఇచ్చారు. అంటే తను మా తేజ్ కాదు.. మీ తేజ్. తనపై ఇంత పెద్ద బడ్జెట్ పెడుతున్న నిర్మాతలు నిరంజన్, చైతన్యగార్లను చూస్తే సినిమా పట్ల వారికి ఉన్న ప్యాషన్ తెలిస్తోంది. ఈ చిత్రం బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ కావాలి'' అన్నారు. **అల్లు అరవింద్ మాట్లాడుతూ-**''తేజు ఇండస్ట్రీకి వచ్చి పదేళ్లు అయిందంటే నమ్మశక్యంగా లేదు. మా విజయదుర్గ అదృష్టవంతురాలు. తన పేరును తీసుకెళ్లి తన పేరులో పెట్టుకున్నాడు తేజు(సాయి దుర్గా తేజ్). అలాంటి కొడుకు ఉండటం అదృష్టం. తను మృత్యుంజయుడు'' అని తెలిపారు. **సాయి దుర్గా తేజ్ మాట్లాడుతూ-**''ఈ వేదికపై నేను ఉండటానికి కారణమైన మా ముగ్గురు మావయ్యలకి ఎప్పటికీ రుణపడి ఉంటాను. మీ(అభిమానులు) అందరి ప్రేమను పొందే అదృష్టం నాకు దక్కింది. బైక్ నడుపుతున్నప్పుడు నేను హెల్మెట్ ధరిస్తాను.. మీరు కూడా హెల్మెట్ ధరించాలి'' అని కోరారు. ''ఈ సినిమా చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు, తేజుగారికి ధన్యవాదాలు'' అన్నారు **రోహిత్ కేపీ.** ''సంబరాల ఏటిగట్టు' చాలా కొత్తగా, అద్భుతంగా ఉంటుంది. ఈ సినిమాని మీరందరూ ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాను'' అన్నారు **చైతన్య రెడ్డి.** ఈ కార్యక్రమంలో హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి, డైరెక్టర్స్ వైవీఎస్ చౌదరి, దేవా కట్టా, కిశోర్ తిరుమల, మారుతి, అనిల్ రావిపూడి, ప్రశాంత్ వర్మ, నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, ఎస్‌కేఎన్ మాట్లాడారు.



● సాయి పల్లవి

ఇకపై సహించను!

''నాపై ఇప్పటి వరకూ చాలా పుకార్లు వచ్చాయి. కానీ, వాటిపై నేను స్పందించకుండా మౌనంగానే ఉన్నాను. ఎందుకంటే వాస్తవం ఏంటనేది దేవుడికి తెలుసు. అయితే మౌనంగా ఉంటున్నానని పుకార్లు తెగ రాస్తున్నారు. నా గురించి నిరాధారమైన వార్తలు రాస్తే ఇకపై సహించను'' అంటున్నారు సాయి పల్లవి. ఎప్పుడూ వివాదాలకు దూరంగా ఉండే సాయి పల్లవి తొలిసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయి పల్లవి ప్రస్తుతం హిందీలో 'రామాయణ' సినిమాలో నటిస్తున్నారు. నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణాసురుడి పాత్రలో యశ్ నటిస్తున్నారు. ఈ సినిమా పూర్తయ్యే వరకు సాయి పల్లవి మాంసాహారానికి దూరంగా ఉండాలను కుంటున్నారని, హోటల్స్‌లో కూడా తినడం లేదని, విదేశాలకు వెళ్లేటప్పుడు వంటవాళ్లను వెంట తీసుకెళ్తున్నారనే వార్తలు వచ్చాయి. ఈ వార్తలను ఉద్దేశించే సాయి పల్లవి పై విధంగా స్పందించి ఉంటారు. ''నా సినిమాల రిలీజ్, నా ప్రకటనలు.. ఇలా నాకు సంబంధించిన వాటి గురించి నిరాధారమైన వార్తలు రాస్తే యాక్షన్ తీసుకుంటాను. ఎంత పెద్ద సంస్థ అయినా లీగల్ యాక్షన్ ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇన్నాళ్లూ సహించాను. ఇకపై సిద్ధంగా లేను'' అంటూ పోస్ట్ చేశారామె.





● ఆంటోనీ తట్టిల్, కీర్తి సురేశ్

కల్యాణ వైభోగమే...

ప్రముఖ హీరోయిన్ కీర్తి సురేశ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన స్నేహితుడు, వ్యాపారవేత్త ఆంటోనీ తట్టిల్‌తో ఆమె ఏడడుగులు వేశారు. గోవాలోని ఓ రిసార్ట్‌లో గురువారం (12న) వీరి పెళ్లి ఘనంగా జరిగింది. ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే ఈ వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఈ వేడుకలకు సంబంధించిన ఫొటోలను కీర్తి సురేశ్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. పలువురు సినీ, వ్యాపార ప్రముఖులతో పాటు నెటిజన్లు, కీర్తి ఫ్యాన్స్ ఈ నూతన వధూవరులకు అభినందనలు తెలియజేశారు. ఇదిలా ఉంటే... కీర్తి సురేశ్- ఆంటోనీ దాదాపు 15 ఏళ్ల నుంచి స్నేహితులు. వీరి స్నేహం ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నారు.



● ఏఆర్ అభి, హరిత, సోహైల్, సాహితి

అందుకే చిన్న సినిమాని ఆదరించాలి

- డా. హరిత గోగినేని

''పెద్ద సినిమాని థియేటర్‌లో, చిన్న సినిమాని ఓటీటీలో చూద్దామనే ఫీలింగ్‌లో కొందరు ప్రేక్షకులు ఉంటారు. అయితే చిన్న సినిమాలను థియేటర్‌లో ఆదరిస్తేనే ఓటీటీలోకి వెళ్తాయి. అందుకే చిన్న సినిమాను అందరూ ఆదరించాలని కోరుతున్నాను'' అని డైరెక్టర్ డా. హరిత గోగినేని అన్నారు. హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఫియర్'. అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్ర చేశారు. డా. వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మించారు. సుజాత రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హరిత గోగినేని మాట్లాడుతూ- ''మా మూవీలో సరికొత్త స్క్రీన్‌ప్లే ఉంది కాబట్టే 70 అంతర్జాతీయ అవార్డులు వచ్చాయి. మహిళా దర్శకులు మనకు చాలా తక్కువ. మీ ఇంట్లో అమ్మాయి తీసిన సినిమా అనుకుని 'ఫియర్'ని చూసి, ఆదరించండి'' అని కోరారు. ''నా భార్య హరిత స్క్రిప్ట్ మీద పూర్తి నమ్మకంతో 'ఫియర్' చేసింది'' అన్నారు ఏఆర్ అభి. ''ఫియర్' అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నా'' అన్నారు మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్.

ఇది వీర విప్లవ కథ

- చింతపల్లి రామారావు



''పాలకుల అహంకారానికి అణచివేయబడిన సామాన్యుల నుంచి ఉద్భవించిన ఒక అసామాన్యుడి వీర విప్లవ గాథే 'విడుదల-2' సినిమా. ఇది తమిళ చిత్రం కాదు... తెలుగు రాష్ట్రాల్లోని సమస్యలు, ఇక్కడ జరిగిన ఘటనల ఆధారంగా తీశారు. పెరుమాళ్ అనే నక్సలైట్ పాత్రలో విజయ్ సేతుపతి నటన, పాత్రలోని భావోద్వేగాలను ఆయన పండించిన విధానం అద్భుతం'' అని నిర్మాత చింతపల్లి రామారావు అన్నారు. విజయ్ సేతుపతి, సూరి లీడ్ రోల్స్‌లో వెట్రిమారన్ దర్శకత్వం వహించిన 'విడుదల: పార్ట్ 1' (2023) చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. ఆ చిత్రానికి సీక్వెల్‌గా విజయ్ సేతుపతి లీడ్ రోల్‌లో వెట్రిమారన్ దర్శకత్వంలో ఎల్‌రెడ్ కుమార్ నిర్మించిన చిత్రం 'విడుదల-2'. ఈ చిత్రం తమిళ, తెలుగులో ఈ నెల 20న విడుదల కానుంది. శ్రీ వేదాక్షర మూవీస్ అధినేత చింతపల్లి రామారావు 'విడుదల-2' తెలుగు హక్కులను దక్కించుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చింతపల్లి రామారావు మాట్లాడుతూ- ''మా చిత్రం పాటలకు, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రంలోని కొన్ని సీన్లు కంటతడి పెట్టిస్తాయి'' అని పేర్కొన్నారు. దర్శకుడు కొండా విజయ్‌కుమార్, నిర్మాతలు సుబ్బారెడ్డి, రామసత్యనారాయణ, డీఎస్‌రావు పాల్గొన్నారు.

జగజ్జేత మన గుకేశ్

అద్భుతం జరగడంలో కొన్నిసార్లు ఆలస్యం కావచ్చు... కానీ అనలు సమయంలో అలాంటి అద్భుతాన్ని ఎవరూ ఆపలేరు! ఒకటి కాదు... రెండు కాదు... కనీసం మూడుసార్లు దొమ్మరాజు గుకేశ్‌కు విజయావకాశాలు వచ్చాయి... కానీ దురదృష్టవశాత్తూ త్రుటిలో అతను వాటిని చేజార్చుకున్నాడు. మరోవైపు ప్రత్యర్థి కూడా మూడుసార్లు పైచేయి సాధించి గెలుపుపై కన్నేసినా... బలంగా నిలబడ్డాడు. అన్నింటికి మించి యుద్ధ వ్యూహాల్లో 'సంధి' కూడా ఒక భాగమే అన్నట్లుగా ఒక అడుగు వెనక్కి తగ్గుతూ అవసరమైనప్పుడు 'డ్రా'లకు అంగీకరించాడు. కానీ పోరు ఆఖరి ఘట్టానికి చేరేసరికి ఇక సంధి దశకు సమయం మించిపోయింది. దాడి చేయడం మినహా మరో మార్గం లేదు. ఇక్కడ వెనుకంజ వేస్తే ఇక కోలుకునేందుకు ఎలాంటి అవకాశమూ ఉండదు. అందుకే ఆ సమయంలో తనలోని అసలైన అస్త్రశస్త్రాలకు పదును పెట్టాడు. అతను పన్నిన ఉచ్చులో డింగ్ లిరెన్ చిక్కాడు. 55వ ఎత్తు వద్ద అతను సరిదిద్దుకోలేని తప్పిదం చేశాడు. అంతే...మరో మూడు ఎత్తుల్లోనే గుకేశ్ చైనా కింగ్ ఆట కట్టించాడు... అద్భుత ప్రదర్శనతో కొత్త చరిత్రను సృష్టిస్తూ అరవై నాలుగు గళ్ల ప్రపంచంలో రారాజుగా కిరీటధారణ చేశాడు.

ఆట ముగిశాక సాంప్రదాయం ప్రకారం గుకేశ్ చెస్ బోర్డుపై మళ్లీ పావులను పేరుస్తున్నాడు... ఒక్కో గడిలో వాటిని పెడుతున్న సమయంలో అతని కన్నీళ్లు ఆగడం లేదు... ఏడుస్తూనే అభినందనలు అందుకుంటున్నాడు... ఆ భావోద్వేగాలను నియంత్రించడం సాధ్యం కావడం లేదు. అతను చేతులు జోడించి పదే పదే బోర్డుకు మొక్కుతున్న తీరు చూస్తే గుకేశ్ దృష్టిలో అది అరవై నాలుగు గళ్ల ఆట వస్తువు మాత్రమే కాదనిపిస్తోంది... అదో దేవాలయంలా, తానో భక్తుడిలా కనిపిస్తున్నాడు. 11 ఏళ్ల చిన్నారిగా ఉన్న సమయంలో ఏదో ఒక రోజు ప్రపంచ చాంపియన్‌ను అవుతానని చెప్పుకున్న ఆ కుర్రాడు టీనేజర్‌గానే ఆ లక్ష్యాన్ని చేరుకున్న క్షణాన తన ఇన్నేళ్ల కష్టం, సాధన, త్యాగాలను గుర్తు చేసుకుంటున్నట్లుగా అనిపించింది... ఆటలో తొలి ఎత్తు వేసిన నాటి నుంచే అసాధారణ ప్రదర్శనలకు చిరునామాగా మారిన గుకేశ్ నలుపు తెలుపుల గళ్లలోనే తన రంగుల ప్రపంచాన్ని సృష్టించుకున్నాడు. అతి పిన్న వయసులో గ్రాండ్‌మాస్టర్‌గా రికార్డు సృష్టించే అవకాశాన్ని 17 రోజుల తేడాతో కోల్పోయిన ఈ చెన్నై చిన్నోడు ఇప్పుడు 18 ఏళ్ల వయసులో 18వ ప్రపంచ చాంపియన్‌గా తన జెండా పాతాడు.

-సాక్షి క్రీడా విభాగం



ప్రపంచ చెస్ చాంపియన్‌గా దొమ్మరాజు గుకేశ్

18 ఏళ్లకే వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన భారత గ్రాండ్‌మాస్టర్

చివరి గేమ్‌లో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌పై గెలుపు

ఓవరాల్‌గా 7.5-6.5 పాయింట్ల తేడాతో టైటిల్ కైవసం

విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన భారత ఆటగాడిగా గుర్తింపు

సింగపూర్ సిటీ: భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ కొత్త ప్రపంచ చెస్ చాంపియన్‌గా ఆవిర్భవించాడు. 18 ఏళ్ల వయసులోనే విశ్వ విజేతగా నిలిచి ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. క్లాసికల్ ఫార్మాట్‌లో డిఫెండింగ్ చాంపియన్, చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌తో జరిగిన 14 గేమ్‌ల పోరులో గుకేశ్ 7.5–6.5 పాయింట్ల తేడాతో విజయం సాధించాడు. 13 గేమ్‌లు ముగిసేసరికి ఇద్దరూ 6.5–6.5 పాయింట్లతో సమంగా ఉండగా నిర్ణాయక చివరి పోరులో గుకేశ్ తన సత్తాను ప్రదర్శించాడు. 58 ఎత్తుల్లో లిరెన్ ఆట కట్టించి విజయనాదం చేశాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో క్యాండిడేట్స్ టోర్నీ గెలుచుకొని వరల్డ్ చాంపియన్‌కు సవాల్ విసిరేందుకు సిద్ధమైన రోజు నుంచి గుకేశ్‌పై అంచనాలు పెరిగాయి. నవంబర్ 25 నుంచి మొదలైన ఈ సమరంలో 9 గేమ్‌లు 'డ్రా'గానే ముగిశాయి. గురువారం చివరి గేమ్‌కు ముందు చెరో రెండు గేమ్‌లు గెలిచిన ఇద్దరూ సమంగా ఉన్నారు. ఈ గేమ్ కూడా 'డ్రా' అయితే 'టైబ్రేక్' ద్వారా విజేతను నిర్ణయించాల్సి వచ్చేది. కానీ గుకేశ్ ఆ అవకాశం ఇవ్వలేదు. తన అత్యుత్తమ ఆటను ప్రదర్శించి లిరెన్‌ను పడగొట్టాడు. తద్వారా క్లాసికల్ విభాగంలో దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ (2012) తర్వాత వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన భారత ప్లేయర్‌గా గుకేశ్ నిలిచాడు.



14వ గేమ్ సందర్భంగా డింగ్ లిరెన్

చివరి పోరు సాగిందిలా...

తెల్లపావులతో ఆడిన 32 ఏళ్ల లిరెన్ కింగ్స్ ఇండియన్ అటాక్ ఓపెనింగ్‌తో ఆటను మొదలు పెట్టగా... గ్రన్‌ఫీల్డ్ వేరియేషన్‌తో గుకేశ్ బదులిచ్చాడు. ఈ గేమ్ కూడా 'డ్రా' అయితే తన బలమైన ర్యాపిడ్‌లో గుకేశ్ ఆట కట్టించవచ్చని భావించిన లిరెన్ ఈసారి కూడా దూకుడు ప్రదర్శించకుండా రక్షణాత్మకంగానే ఆడాడు. ఇక మరో 'డ్రా' ఖాయం అనిపించింది. ఈ దశలో లిరెన్ చేసిన భారీ తప్పిదం తన టైటిల్ కోల్పోయేలా చేసింది. తన 55వ ఎత్తులో అతను రూక్‌ను ఎఫ్2 గడిలోకి పంపించాడు. ఆశ్చర్యంతో గుకేశ్ కళ్లు ఒక్కసారిగా మెరిశాయి! కాస్త మంచినీళ్లు తాగిన అనంతరం గుకేశ్ తన ప్రత్యర్థి ఆట కట్టించేందుకు ఎన్ని ఎత్తులు అవసరమో ప్రశాంతంగా ఆలోచించుకున్నాడు. ఆపై ఎంతో సమయం పట్టలేదు. తన 58వ ఎత్తులో కింగ్‌ను ఇ5 గడిలోకి పంపడంతో లిరెన్‌కు ఓటమిని అంగీకరించడం మినహా మరో మార్గం లేకపోయింది.



ప్రపంచ చాంపియన్‌గా అవతరించిన క్షణాన గుకేశ్ భావోద్వేగం... ఓటమి తర్వాత లిరెన్ నిష్క్రమణ

39 ఏళ్ల రికార్డు బద్దలు

రష్యా దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ పేరిట 39 ఏళ్లుగా ఉన్న రికార్డును భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ బద్దలు కొట్టాడు. క్లాసికల్ చెస్‌లో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన పిన్న వయస్కుడిగా ఇప్పటి వరకు కాస్పరోవ్ (22 ఏళ్ల 6 నెలల 27 రోజులు ; 1985లో కార్పోవ్‌పై విజయం) పేరిట రికార్డు ఉంది. అయితే గురువారం ఈ రికార్డును గుకేశ్ (18 ఏళ్ల 8 నెలల 14 రోజులు) తిరగరాశాడు. విశ్వవిజేతగా నిలిచిన గుకేశ్‌కు 13 లక్షల 50 వేల డాలర్లు (రూ. 11 కోట్ల 45 లక్షలు), రన్నరప్ డింగ్ లిరెన్‌కు 11 లక్షల 50 వేల డాలర్లు (రూ. 9 కోట్ల 75 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

'డ్రా'లను దాటి...



'గుకేశ్, లిరెన్ మధ్య గేమ్‌లు చూస్తుంటే వరల్డ్ చాంపియన్‌షిప్ పోరులాగా అస్సలు అనిపించడం లేదు. ఇద్దరిలో ఎవరూ పైచేయి సాధించేందుకు ఇష్టపడటం లేదు'... నార్వే చెస్ దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ వ్యాఖ్య ఇది. 'ఈ గేమ్‌లు ఇలాగే సాగితే చదరంగంపై ఇప్పటికి మిగిలిన ఉన్న ఆ కాస్త ఆసక్తి కూడా పోతుంది'... పలువురు మాజీలు, విశ్లేషకుల అభిప్రాయం ఇది. గుకేశ్, లిరెన్ మధ్య సాగిన పోరు చూస్తే ఇది వాస్తవమే అనిపిస్తుంది. మొదటి గేమ్‌లో లిరెన్ గెలుపుతో చాంపియన్‌షిప్ సమరం ఉత్సాహంగా మొదలైంది. రెండో గేమ్ 'డ్రా' కాగా... మూడో గేమ్‌లో గుకేశ్ విజయం సాధించి లెక్క సమం చేశాడు. ఆ తర్వాత వరుసగా ఏడు గేమ్‌లు 'డ్రా'గా ముగిశాయి. దాంతో సగటు చెస్ అభిమానులు కూడా ఇదేం ఆట అన్నట్లుగా నిట్టూర్పు విడిచారు. ముఖ్యంగా ఇద్దరు ఆటగాళ్లు చెరో మూడుసార్లు గెలిచే అవకాశం వచ్చినా... వాటిని చేజార్చుకోవడం, దూకుడుగా ఆడి పైచేయి సాధించే ప్రయత్నం చేయకపోవడం కూడా ఆశ్చర్యం కలిగించింది. 10 గేమ్‌ల తర్వాత గుకేశ్ గెలుపుపై స్వయంగా కార్ల్‌సన్ కూడా సందేహం వ్యక్తం చేశాడు. లిరెన్ కూడా జాగ్రత్తగా ఆడి ర్యాపిడ్ పోరువైపు తీసుకెళ్లే ఆలోచనతో ఉన్నట్లే కనిపించింది. కానీ 11వ గేమ్‌లో గుకేశ్ గెలుపు ఒక్కసారిగా చలనం తీసుకొచ్చింది. ఆ వెంటనే లిరెన్ కూడా విజయంతో సమాధానమివ్వడంతో మరింత ఆసక్తి పెరిగింది. అయితే 13వ గేమ్ కూడా 'డ్రా' అయింది. దాంతో అందరి దృష్టి చివరి పోరుపై నిలిచింది. కానీ విశ్వనాథన్ ఆనంద్ కూడా ఫలితంపై సందేహంతోనే ఉన్నాడు. దాదాపు సగం ఆట ముగిశాక ఈ మ్యాచ్‌లో ఎవరైనా గెలిచే అవకాశాలు ఒక శాతం కూడా లేవని అతను అభిప్రాయపడ్డాడు. అయితే లిరెన్ చేసిన తప్పు ప్రపంచ చాంపియన్‌షిప్‌ను అనూహ్యంగా ముగించింది. అంది వచ్చిన అవకాశాన్ని సమర్థంగా వాడుకున్న మన గుకేశ్ ఈ మెగా ఈవెంట్‌ను భారతీయుల దృష్టిలో చిరస్మరణీయం చేశాడు.

గుకేశ్... శభాష్...

న్యూఢిల్లీ: పిన్న వయస్సులోనే చదరంగంలో విశ్వవిజేతగా నిలిచిన గుకేశ్‌పై ప్రశంసల వర్షం కురిసింది. రాష్ట్రపతి, ప్రధాని మొదలు పలువురు గుకేశ్ విజయాన్ని కొనియాడారు.

అతిపిన్న వయస్సులోనే ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ సాధించిన గుకేశ్‌కు హృదయపూర్వక అభినందనలు. నిన్ను చూసి యావత్ జాతి గర్వపడుతోంది. ప్రపంచ చెస్‌లో భారత్ కూడా ప్రచండ శక్తి అని నీ విజయం చాటింది. భారతీయులందరి తరఫున నీకు శుభాకాంక్షలు. భవిష్యత్తులోనూ నీవు ఇలాగే రాణించాలి. -రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

అభినందనలు గుకేశ్. కెరీర్ తొలినాళ్లలోనే సంచలన విజయం సాధించావు. ఆటలో నీ ప్రతిభ, చేసిన కఠోర కృషి, కనబరిచిన అంకితభావం అసాధారణం. ఈ విజయం భారత చెస్ పుటల్లో కేవలం నీ పేరును లిఖించడమే కాదు... కలల్ని సాకారం చేసుకోవాలనుకునే లక్షల మంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తుంది. భవిష్యత్‌లో మరెన్నో ఘనతలు, ఘనవిజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా. -ప్రధాని నరేంద్ర మోదీ

ప్రపంచ చాంపియన్‌షిప్ గెలిచిన గుకేశ్‌కు శుభాభినందనలు. నీవు సాధించిన టైటిల్ చెస్‌కే గర్వకారణం. భారత్ ఉప్పొంగిపోయే విజయం నీది. వెస్ట్‌బ్రిడ్జ్ ఆనంద్ చెస్ అకాడమీ (వాకా) గర్వించే క్షణాలివి. మాజీ చాంపియన్ అయిన నాకూ ప్రత్యేక క్షణాలను మిగిల్చావు. ప్రతి రౌండ్లో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్ మెరుగ్గా ఆడినా... నీవు ఎదుర్కొన్న తీరు మాత్రం అద్భుతం.
-విశ్వనాథన్ ఆనంద్, ప్రపంచ మాజీ చాంపియన్

ప్రపంచ చాంపియన్‌గా ఆవిర్భవించిన గుకేశ్‌కు కంగ్రాట్స్. ఒత్తిడిని జయించిన తీరు... ప్రతీ రౌండ్‌లోనూ కనబరిచిన నీ ఆటతీరుకు హ్యాట్సాఫ్! నీ దృఢ సంకల్పంతో యావత్ దేశాన్ని గర్వించేలా చేశావ్. నీవు సాధించింది ఓ టైటిల్ మాత్రమే కాదు... యువతరం ప్రేరణ పొందే విజయగాథ నీది. ఇంకెన్నో విజయాలు, మరెన్నో సాఫల్యాలు నీ ముందుంటాయి. -బీజింగ్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా

'గుకేశ్... 64 గడుల్లో హద్దులెరుగని అవకాశాల్ని సృష్టించావు. ఆనంద్ అడుగు జాడల్లో భారత కొత్త చెస్ కెరటంగా అవతరించావు. -సచిన్ టెండూల్కర్

మా ఆటలో మరో కొత్త ప్రపంచ చాంపియన్ అవతరించాడు. గుకేశ్... కంగ్రాట్స్.
-ప్రపంచ చెస్ సమాఖ్య

అమ్మా నాన్న అండగా...

'కొడుకు కోరికను తండ్రి తీరిస్తే ఇద్దరూ నవ్వుకుంటారు... అదే తండ్రి కోరికను కొడుకు తీరిస్తే ఇద్దరూ ఏడుస్తారు'... ఈ హీబ్రూ వ్యాఖ్యను వివరించేందుకు గురువారం కనిపించిన దృశ్యం ఒకటి చాలు! గుకేశ్ చివరి గేమ్ సాగుతున్న సమయంలో అతని తండ్రి రజనీకాంత్ లాబీలో తీవ్ర ఉత్కంఠకు లోనయ్యారు. గెలుపు గురించి తెలిసిన క్షణాన తెలిసిన కొందరు అభినందిస్తుండగా తన ఆనందాన్ని వ్యక్తం చేయడానికి ఆయనకు మాటలు కూడా రాలేదు. ఆ తర్వాత కొద్దిసేపటికే గుకేశ్ బయటకు వచ్చాడు. కొడుకును హత్తుకున్న ఆయన భావోద్వేగంతో కన్నీళ్లపర్యంతమయ్యారు. తన అబ్బాయి సాధించిన ఘనత విలువేమిటో ఆయనకు తెలుసు. ఈ విజయం వెనక అతని కష్టం, సాధన ఎలాంటిదో కూడా బాగా తెలుసు. గుకేశ్ ఆటగాడిగా ఎదిగే క్రమంలో అన్ని సౌకర్యాలు, శిక్షణ అందించడంతో పాటు టోర్నీల కోసం ప్రయాణించేందుకు చాలాసార్లు వైద్యవృత్తిని పక్కన పెట్టి సమయాన్ని కేటాయించాల్సి వచ్చింది. 'త్యాగం అనే పదం నాకు నచ్చదు. పిల్లల కోసం కష్టపడటం తల్లిదండ్రుల బాధ్యత. గుకేశ్‌లో చెస్ ప్రతిభను గుర్తించిన తర్వాత ప్రోత్సహించేందుకు సిద్ధమైపోయాం' అని ఈఎన్‌టీ స్పెషలిస్ట్ అయిన రజనీకాంత్ గతంలో చెప్పారు. మైక్రోబయాలజిస్ట్ అయిన అమ్మ పద్మాకుమారి కూడా అన్ని వేళలా కొడుకుకు అండగా నిలిచింది. ఓటమి ఎదురైనప్పుడల్లా అతను తల్లితోనే మాట్లాడేవాడు. స్ఫూర్తిదాయక మాటలు, గాథలతో గుకేశ్ మళ్లీ కొత్త సమరోత్సాహంతో బరిలోకి దిగేందుకు అమ్మ మాటలే ఉపకరించేవి.

చెన్నైలో చెస్ చాంపియన్ల అడ్డా అయిన వేలమ్మాల్ స్కూల్‌లో గుకేశ్ ఆట మొదలైంది. అండర్-11 జాతీయ చాంపియన్‌గా అతనికి మొదటిసారి గుర్తింపు లభించింది. ఆ సమయంలో అతనికి ఎలాంటి ఐఎం, జీఎం నార్మ్‌లు లేవు. కానీ తర్వాతి 16 నెలల వయసులో అద్భుత ఆటతో మూడు ఐఎం నార్మ్‌లు, మూడు జీఎం నార్మ్‌లు సాధించడంతో పాటు 2500 రేటింగ్‌ను దాటి గుకేశ్ సత్తా చాటాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల వయసులో గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచిన అతను పిన్న వయసులో జీఎంగా మారిన ప్రపంచ రికార్డును 17 రోజుల తేడాతో కోల్పోయాడు. అయితే 'ఇవి నాకు పెద్ద లెక్క కాదు. ఇలాంటివేమీ లేని కార్ల్‌సన్ ఎక్కడికి వెళ్లాడో తెలుసు కదా. నేను అలాంటి పెద్ద లక్ష్యాలు పెట్టుకున్నాను' అనడం అతని ఆత్మవిశ్వాసాన్ని అప్పుడే చూపించింది. ఆ తర్వాత ఆసియా యూత్, వరల్డ్ యూత్, ఆసియా క్రీడలు, ఒలింపియాడ్ సహా పలు పెద్ద టోర్నీల్లో వరుస విజయాలు, రికార్డులు అతని ఖాతాలో వరుసగా వచ్చి చేరాయి. ఇటీవల సెప్టెంబరులో భారత జట్టు చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణం సాధించడంలో గుకేశ్ కూడా కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం అతను 2783 'ఫిడే' రేటింగ్‌తో కొనసాగుతున్నాడు. క్యాండిడేట్స్ టోర్నీ గెలిచిన తర్వాత కూడా వరల్డ్ చాంపియన్‌షిప్‌లో అతని గెలుపుపై ఏదో మూల సందేహం ఉంది. 2800 రేటింగ్ దాటడంతో పాటు ఒక దశలో వరుసగా 100 గేమ్‌లలో ఓటమి ఎరుగని డింగ్ లిరెన్‌ను నిలువరించగలడా అనే అనుమానాలను గుకేశ్ పటాపంచలు చేశాడు.



చెస్ ఒలింపియాడ్ స్వర్ణ పతకంతో గుకేశ్, తల్లిదండ్రులు పద్మాకుమారి, రజనీకాంత్



విశ్వవిజేతగా నిలిచాక తండ్రీ కొడుకుల సంబరం

చిత్తూరు జిల్లా మూలాలు...

వరదయ్యపాళెం: గుకేశ్‌ది చెన్నైలో స్థిరపడిన తెలుగు కుటుంబం. వారిది తిరుపతి జిల్లాకు చెందిన గ్రామీణ నేపథ్యం. గుకేశ్ తండ్రి రజనీకాంత్ స్వస్థలం సత్యవేడు సమీపంలోని పిచ్చాటూరు మండలం చెంచురాజుకండ్రిగ. ఆయన తన వైద్యవృత్తి కోసం చెన్నైకి తరలి వెళ్లగా, అక్కడే అబ్బాయి పుట్టాడు. గుకేశ్ తాత శంకరరాజు సొంత ఊరు చెంచురాజు కండ్రిగలోనే ప్రస్తుతం స్థిరపడ్డారు.

గుకేశ్‌కు వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: పిన్న వయస్సులో ప్రపంచ చెస్ చాంపియన్‌గా అవతరించిన తెలుగు తేజం గుకేశ్ దొమ్మరాజు చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొనియాడారు. గుకేశ్‌కు అభినందనలు తెలుపుతూ గురువారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. గుకేశ్ తెలుగువాడైనందుకు గర్విస్తున్నామన్నారు. గుకేశ్ దేశంలోని యువతకు, విద్యార్థులకు ప్రేరణగా నిలవనున్నారని పేర్కొన్నారు. ఒక తెలుగు యువకుడు ఈ రికార్డు సాధించడం అందరికీ ఆదర్శనీయమన్నారు. భవిష్యత్తులో గుకేశ్ మరిన్ని విజయాలు సాధించాలని జగన్ ఆకాంక్షించారు.

'కల నిజమాయెగా'



'లిరెన్ 55వ ఎత్తు తర్వాత నేను ఏం వేయాలో అప్పటికే సిద్ధమైపోయా. ఇక ఎత్తు వేయడమే తరువాయి. అయితే ఒక్కసారిగా అతని అడుగు నన్ను ఆశ్చర్యపరిచింది. దానిని వెంటనే నమ్మలేకపోయా. కానీ నా జీవితంలో అత్యుత్తమ క్షణం వచ్చేసిందని అప్పుడే అర్థమైపోయింది. ఆరేళ్ల వయసులో చెస్ మొదలు పెట్టాను. గత పదేళ్లుగా ఇదే కల నన్ను నడిపించింది. ప్రతీ ఆటగాడు ఇలాంటి స్థాయిని అందుకోవాలని ఆశిస్తాడు. కానీ కొందరికే అవకాశం దక్కుతుంది. నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నాను. 2013లో ఆనంద్, కార్ల్‌సన్ మధ్య పోరును చెన్నైలోని ఆడిటోరియంలో కూర్చొని చూసేందుకు చోటు దొరకలేదు. దాంతో గాజు తెర బయట నిలబడ్డా. ఇప్పుడు అలాంటి తరహాలో భారత జెండా పక్కన పెట్టుకొని పోటీ పడటం గర్వంగా అనిపించింది. కార్ల్‌సన్ టైటిల్ సాధించిన సమయంలో దానిని మళ్లీ భారత్‌కు అందించే ఆటగాడిని నేనే కావాలని కోరుకున్నా. అధికారికంగా నా టీమ్‌లో ఆనంద్ సర్ భాగస్వామి కాకపోయినా ఆయన అన్ని విధాలా నాకు సహకరించారు. నా శిక్షణ శిబిరానికి కూడా వచ్చారు. నాకు దేవుడిపై నమ్మకం ఉంది. గత ఏడాది నేను క్యాండిడేట్స్‌కు అర్హత కూడా సాధించలేకపోయినా ఆ తర్వాత ఎన్నో అవకాశాలు వచ్చాయి. టైటిల్ గెలవగానే అమ్మకు ఫోన్ చేశాను. ఇద్దరమూ ఏడుస్తున్నాం తప్ప ఏమీ మాట్లాడుకోలేకపోయాం. నా తల్లిదండ్రులు నా కోసం ఎన్నో త్యాగాలు చేశారు. చెస్‌ను ఆస్వాదిస్తుంటే చాలు ఏదో ఒక రోజు లక్ష్యం చేరవచ్చు. 12 గేమ్‌ల వరకు కూడా సరిగ్గా నిద్రపోలేదు. కానీ ప్యాడీ అప్టన్ ఇచ్చిన సూచనలు నన్ను ప్రశాంతంగా మార్చాయి. హాయిగా పడుకోగలిగాను. అందుకే తర్వాతి రెండు గేమ్‌లలో ఉత్సాహంగా ఉన్నాను. ఇది గెలవగానే నేను ప్రపంచ అత్యుత్తమ ఆటగాడిని అయిపోలేదు. కార్ల్‌సన్ ఎలాగూ ఉన్నాడు. అతనితో తలపడాలని నాకూ ఉంది. చెస్‌లో అదే అత్యంత పెద్ద సవాల్. అయితే అది అతని ఇష్టంపై ఆధారపడి ఉంది. అతడిని స్ఫూర్తిగా తీసుకొనే అతని స్థాయిని అందుకోవాలనుకుంటున్నా'

-మీడియా సమావేశంలో గుకేశ్

గుకేశ్ బృందమిదే...



వరల్డ్ చాంపియన్‌షిప్‌లాంటి మెగా ఈవెంట్‌లో పాల్గొనే ఆటగాడి సన్నాహాలు అత్యుత్తమ స్థాయిలో ఉంటాయి. ఈ క్రమంలో అతను కేవలం తన బుర్రకు మాత్రమే పదును పెడితే సరిపోదు. వ్యూహ ప్రతివ్యూహాల విషయంలో అనేక మంది సహాయం కూడా తప్పనిసరిగా ఉంటుంది. ట్రెయినర్లు, సెకండ్‌లు, ట్రెయినింగ్ పార్ట్‌నర్‌లు కూడా అతని విజయంలో భాగస్వాములే. గుకేశ్ టీమ్‌లో ఐదుగురు గ్రాండ్‌మాస్టర్లు (జీఎం), ఒక ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం) ఉన్నారు. భారత ఆటగాడు, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ ఇందులో కీలక సభ్యుడు. పోలాండ్‌కు చెందిన నలుగురు గ్రాండ్‌మాస్టర్లు గ్రిగోర్జ్ గజేస్కీ, రడొస్లావ్ వొజాసెక్, జాన్ క్రిస్టాఫ్ డ్యూడాలతో పాటు పోలాండ్‌కే చెందిన ఐఎం జాన్ క్లిమ్‌కోవ్‌స్కీ వీరిలో ఉన్నారు. జర్మన్ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమర్ కూడా గుకేశ్ టీమ్‌లో సభ్యుడే. వీరితో పాటు మానసికంగా దృఢంగా ఉండేందుకు మెంటల్ ట్రెయినర్ ప్యాడీ అప్టన్‌తో కూడా గుకేశ్ కలిసి పని చేయడం విశేషం. ప్యాడీ అప్టన్ 2011లో వన్డే వరల్డ్ కప్ గెలిచిన భారత క్రికెట్ జట్టుతో... 2024 పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత పురుషుల హాకీ జట్టుతో కలిసి పనిచేశారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో





ఫొటోగ్రఫీ పురస్కారాల్లో వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్‌ను 'ఆస్కార్'గా భావిస్తారు. అలాంటి పోటీలో పీపుల్స్ చాయిస్ పురస్కారం కోసం దాదాపు 60 వేల ఎంట్రీల్లో నుంచి 25 చిత్రాలను ఎంపిక చేశారు. అందులో ఇది కూడా ఒకటి. దీన్ని బెంగళూరుకు చెందిన అరవింద్ కృష్ణమూర్తి తీశారు. ఏదో ఫొటోకు స్టిల్ ఇచ్చినట్లుగా ఉన్న ఈ తోడేళ్ల గుంపు చిత్రాన్ని మహారాష్ట్రలోని బిగ్వాన్‌లో తీశారు. 'సాధారణంగా ఇవి గడ్డి మైదానాల్లో ఉంటాయి. రోజురోజుకీ వాటి ప్రాంతాలను మనం ఆక్రమిస్తున్నాం. దీంతో అవి ఇలా పొలాల్లోకి వస్తున్నాయి. ఆ సమయంలో కొన్ని సెకన్లపాటు అవి అలా కెమెరా వైపు చూశాయి. వెంటనే క్లిక్‌మనిపించాను' అని అరవింద్ తెలిపారు. మన దేశీయ తోడేళ్ల సంఖ్య తగ్గుతోందని.. పులులు గురించి పక్కనపెట్టి.. తోడేళ్ల పరిరక్షణ గురించి సీరియస్‌గా ఆలోచించాలని చెప్పారు. పీపుల్స్ చాయిస్ అవార్డు విజేతను, నలుగురు రన్నరప్‌లను ఫిబ్రవరిలో ప్రకటిస్తారు.

కొచ్చిన్ ఫ్లైట్ టికెట్ అ'ధర'హో



రూ.25 వేల వరకు పెరిగిన టికెట్ ధర

శంషాబాద్: ఆకాశయానం చేసి తక్కువ సమయంలో అయ్యప్ప దర్శనం చేసుకునే భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో విమాన టికెట్ ధరలు కూడా అదిరిపోతున్నాయి. హైదరాబాద్ నుంచి కొచ్చిన్ చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో శబరిమల వెళ్లే వారి సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. ఈ దఫా ఇప్పటికే భక్తులు శబరిమల చేరుకుని అయ్యప్ప దర్శనం చేసుకుని వస్తుండటంతో 4,5 రోజులుగా కొచ్చిన్ విమాన టికెట్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సాధారణ సమయాల్లో రూ.4,900 ఉండే టికెట్ ధర ఇప్పుడు కనీస ధర రూ.10 వేలు ఉండగా గరిష్ఠంగా రూ.25 వేల వరకు చేరుకుంది. హైదరాబాద్ నుంచి ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఎయిర్ ఇండియా సర్వీసులు కొచ్చిన్‌కు ఉన్నాయి. నాన్‌స్టాప్ సర్వీసులతో పాటు కనెక్టివిటీ ఉన్న ఫ్లైట్స్ కలిపి సుమారు ఇరవై సర్వీసులు హైదరాబాద్ నుంచి కొచ్చిన్‌కు రాకపోకలు సాగిస్తున్నాయి. నాన్‌స్టాప్ సర్వీసులు 1.40 గంటలో కొచ్చిన్ చేరుకోగా.. కనెక్టివిటీ విమానాలు సుమారు 5 నుంచి 8 గంటల సమయంలో కొచ్చిన్‌కు చేరుకుంటున్నాయి. కనెక్టివిటీ విమానాల్లో కూడా టికెట్ ధరలు అధరహో అన్న తీరుగా ఉన్నాయి.

రూ.44 కోట్ల అదనపు వ్యయానికి అనుమతించండి

న్యూఢిల్లీ: కేంద్రం గురువారం లోక్‌సభలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను మొదటి విడతలో రూ.87,765 కోట్లకు గాను సప్లిమెంటరీ డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్ బిల్లును ప్రవేశపెట్టింది. ఇందులో వ్యవసాయం, ఎరువులపై ఇవ్వాల్సిన సబ్సిడీలు, రక్షణ విభాగాలకు ఎక్కువ వ్యయం చేయాల్సి ఉన్నందున రూ.44,143 కోట్లకు అనుమతివ్వాలని పార్లమెంట్‌ను కోరింది. మిగతా రూ. 43,618 కోట్లను వివిధ మంత్రిత్వ శాఖల చెల్లింపుల కోసం మంజూరు చేయాల్సి ఉందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి వివరించారు.

అప్‌డేట్ అవ్వాల్సిందే!

- ఏఐ రంగ ప్రవేశంతో కొత్త సవాళ్లు
- ఏఐకి అనుగుణంగా డేటా సిద్ధం చేసుకుంటున్న కంపెనీలు
- ఆధునిక ఆన్‌లైన్ కోర్సులపై విద్యార్థులు, ఐటీ ఉద్యోగుల ఆసక్తి
- ప్రముఖ యూనివర్సిటీలు సైతం కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్న వైనం

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ విద్యార్థులే కాదు.. బీటెక్ చదివి ఐటీ ఉద్యోగాలు చేస్తున్న వారికీ కొన్ని అత్యాధునిక సాంకేతిక కోర్సులు చేయడం అని వార్యమవుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) దూసుకొస్తున్న నేపథ్యంలో ఉద్యోగావకాశాలు మెరుగుపరుచుకునేందుకు, ఉన్న ఉద్యోగాన్ని కాపాడుకునేందుకు ఈ దిశగా పరుగులు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ కోర్సులకు పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా ప్రముఖ యూనివర్సిటీలు కూడా వాటిని ప్రవేశ పెట్టాల్సిన, డిజైన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మద్రాస్ ఐఐటీ విద్యార్థులు జరిపిన సర్వే ప్రకారం 52 శాతం ఇంజనీరింగ్ విద్యార్థులు ఏదో ఒక ఆన్‌లైన్ కోర్సు నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతు న్నారు. టెక్ ఉద్యోగులు ఏకంగా 72 శాతం మంది ఆన్‌లైన్ కోర్సుల బాట పడుతున్నారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే, మరోవైపు సమయం చిక్కినప్పుడల్లా కొత్త టెక్నాలజీ కోర్సులను నేర్చుకుంటున్నారు. అప్పుడే భవిష్యత్తులో ఏఐతో వచ్చే పోటీని తట్టుకోగలమని భావిస్తున్నారు.



8% మందికే స్కిల్డ్ ఉద్యోగాలు

ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లలో కేవలం 8% మంది స్కిల్డ్ ఉద్యోగాలు పొందుతున్నారు. మిగతా వాళ్లంతా ఇంజనీరింగ్‌తో సంబంధం లేని సాధారణ ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. చాలామందికి పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఉండటం లేదని మద్రాస్ ఐఐటీ పరిశీలనలో వెల్లడైంది. మరోవైపు కొత్త కోర్సులు చేస్తే తప్ప ఇంజనీరింగ్ తర్వాత ఉపాధి దొరకడం కష్టంగా ఉంది. ఐటీ ఉద్యోగుల్లోనూ ఇదే సమస్య ఎదురవుతోంది. కొన్నేళ్ల క్రితం సంస్థలో చేరిన ఉద్యోగికి ఇప్పుడొస్తున్న ఏఐ టెక్నాలజీపై పెద్దగా పట్టు ఉండటం లేదు. ఏఐ టెక్నాలజీ అర్హత గల వాళ్ళు సంస్థలో ఉద్యోగులుగా వస్తుండటం, యాంత్రీకరణ నేపథ్యంలో అన్ని పనులు ఏఐ టెక్నాలజీనే చేయడంతో ఆ టెక్నాలజీ లోపించిన ఉద్యోగుల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది.

అందుబాటులో ఎన్నో ఆన్‌లైన్ కోర్సులు

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మరో రెండేళ్లలో ఐటీ సెక్టార్‌ను సమూలంగా మార్చబోతోందని నిపుణులు చెబుతున్నారు. ఆ రంగంలో నిపుణుల కొరతను దృష్టిలో ఉంచుకుని, ఇంజనీరింగ్‌లో నాణ్యత పెంచే ఉద్దేశంతో పలు ప్రముఖ సంస్థలు ఎన్నో కోర్సులను అందుబాటులోకి తెచ్చాయి. వీటికి ఐటీ ఉద్యోగులు, ఇంజనీరింగ్ విద్యార్థుల నుంచి మంచి స్పందన కన్పిస్తోంది.

- ఐఐటీ హైదరాబాద్ ఏఐ అండ్ ఎంఎల్, డిజిటల్ మార్కెటింగ్ నైపుణ్యాలు మెరుగుపరిచే కోర్సులను అందిస్తోంది.
- మద్రాస్ ఐఐటీ బీఎస్సీ డేటా సైన్స్... నాలుగేళ్ల బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ అందిస్తోంది.
- ఐఐటీ బాంబేలో డిజిటల్ మార్కెటింగ్ అండ్ అప్లైడ్ అనలిటిక్స్, డిజైన్ థింకింగ్, మెషీన్ లెర్నింగ్ అండ్ ఏఐ విత్ పైథాన్, ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ఉన్నాయి.
- ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏఐ–ఎంఎల్, పైథాన్ ఫర్ డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇండస్ట్రియల్ సేఫ్టీ మేనేజ్‌మెంట్, సేఫ్టీ ఇన్ కామన్ ఇండస్ట్రీస్, సేఫ్టీ అండ్ ది లా, ఇండస్ట్రియల్ సేఫ్టీ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ టెక్నిక్స్ అండ్ ఫార్మాస్యూటికల్ రెగ్యులేటరీ అఫైర్స్ వంటి కోర్సులు అందిస్తోంది.

నైపుణ్యం పెంచే కోర్సులకు ప్రణాళిక

విద్యార్థుల్లో తగిన నైపుణ్యం పెంచేలా ఆన్‌లైన్ కోర్సులు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇందులో భాగంగా మద్రాస్ ఐఐటీతో ఇటీవల చర్చలు జరిపాం. ఇంజనీరింగ్‌లో నాణ్యత పెంచాల్సిన అవసరం ఉంది.

– ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి (ఉన్నత విద్యామండలి ఛైర్మన్)

తాడ్వాయి అడవుల్లో పెద్దపులి!

అడుగు జాడలను పరిశీలించిన డీఎఫ్ఓ.. పులి కోసం కొనసాగుతున్న అన్వేషణ

మంగపేట: కొద్దిరోజులుగా ములుగు జిల్లా ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న పెద్దపులి.. తాజాగా తాడ్వాయి మండలం పంబాపూర్ అటవీ ప్రాంతం నార్త్ బీటు పరిధిలో సంచరించినట్లు అటవీశాఖ మంగపేట రేంజ్ అధికారి అశోక్ తెలిపారు. పంబాపూర్‌కు చెందిన రమేష్ అనే వ్యక్తి పులి గాండ్రింపులు వినిపించాయని చెప్పడంతో తాడ్వాయి రేంజ్ అధికారి సత్తయ్యతో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి పులి జాడ కోసం గాలించారు. పంబాపూర్ అటవీ ప్రాంతంలోని వట్టివాగు సమీపం వరకు వెళ్లిన పులి, తిరిగి వెనక్కి వచ్చినట్లు ఆనవాళ్లను గుర్తించారు. అది మంగపేట మండలం కొత్తూరు మొట్లగూడెం లేదా మల్లూరువాగు ప్రాజెక్టు అటవీ ప్రాంతానికి లేదా కాటాపురం, గంగారం మీదుగా లవ్వాల అడవుల్లోకి వెళ్లే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో అటవీ సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

పాదముద్రల సేకరణ

ములుగు జిల్లా మంగపేట మండల పరిధి చుంచుపల్లి, తిమ్మాపురం అటవీ ప్రాంతంలో రెండు రోజుల నుంచి పెద్ద పులి సంచరించిన ప్రాంతాన్ని జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్ఓ) రాహుల్ కిషన్‌జాదవ్ గురువారం సందర్శించారు. చుంచుపల్లి, పాలాయిగూడెం గ్రామాల మధ్య గోదావరి నదిని దాటివచ్చిన ప్రాంతంలో పులి పాదముద్రలను పరిశీలించారు. అనంతరం తిమ్మాపురం అటవీ ప్రాంతంలోని చౌడొర్రె వద్ద పులి పాద ముద్రలను పీఓపీ విధానం ద్వారా సేకరించారు.



తిమ్మాపురం చౌడొర్రె వద్ద పులి పాదముద్రలను పీఓపీ ద్వారా సేకరిస్తున్న అధికారులు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


ఒకే ఈత కాండానికి అనేకం పెరిగిన ఇతర ఈత చెట్లు


ఒకే కాండానికి 36 శాఖలు ఉన్న ఈత చెట్టు ఇదే


ఈత చెట్ల నీడలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

భలే ఈత చెట్లు..

మిరుదొడ్డి (దుబ్బాక): సాధారణంగా ఒక ఈత చెట్టు నిటారుగా పెరగడం సహజం. ఒకే ఈత చెట్టుకు రెండు శాఖలు (తలలు) పెరగడం సర్వ సాధారణం. కానీ అనేకం చిగురిస్తున్నాయంటే నమ్ముతారా? సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం లింగుపల్లి శివారులోని ఈత వనం పుట్ట ఎల్లమ్మ తల్లి సన్నిధిలో ఇలాంటి ఈత చెట్లు దర్శనమిస్తున్నాయి. ఎల్లమ్మ తల్లి పుట్ట చుట్టూ వందేళ్ల వయసు గల 9 ఈత చెట్లు పెరుగుతుండటం విశేషం. ఒక్కో చెట్టుకు ఒకే కాండం ఉండటం, వాటికి రెండు నుంచి 36 వరకు శాఖలతో పచ్చగా కళకళలాడుతున్నాయి. ఈత చెట్లను చూసిన ప్రతి ఒక్కరూ ఔరా! అంటున్నారు. అయితే ఈ ఈత చెట్లు పూత గానీ, కాత గానీ కాయకపోవడం గమనార్హం.

సీడ్ సాగుపై నియంత్రణేది?

అధికారిక అనుమతులు లేకుండా సాగు చేయిస్తున్న కంపెనీలు ● వాటి నాణ్యతపై రైతుల్లో అవగాహన లోపం

ఆర్గనైజర్ల ఉచ్చులో పడి మోసపోతున్న వైనం ● ముందస్తు పెట్టుబడికి ఆశపడి సీడ్ సాగు చేస్తున్న చిన్న, సన్నకారు రైతులు

వ్యవసాయ శాఖ నిబంధనలు సీడ్ కంపెనీలు పాటించడంలేదంటూ ఆరోపణలు


దమ్మపేట మండలంలోని సీడ్ మొక్కజొన్న వ్యవసాయ క్షేత్రం

దమ్మపేట: విత్తనోత్పత్తి కోసం సీడ్ మొక్కజొన్నను ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా సాగు చేయిస్తున్న కంపెనీలపై వ్యవసాయ శాఖ అధికారుల నియంత్రణ, పర్యవేక్షణ కొరవడుతోంది. ఆయా సీడ్ కంపెనీల వారు పెట్టుబడి పేరుతో రైతులను మాయచేసి పంటలు సాగు చేయిస్తున్నారు. సీడ్ విత్తనాలను సరఫరా చేస్తున్న సంస్థలు.. వ్యవసాయ శాఖకు సంబంధించిన కనీస నిబంధనలు పాటించకపోవడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది.

అవగాహన లేమితో మోసపోతున్న రైతులు

విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సీడ్ కంపెనీలు ఆర్గనైజర్ల ద్వారా రైతులకు సరఫరా చేస్తుండగా, వాటి నాణ్యతపై రైతులు పూర్తిగా అవగాహన లోపంతో ఉన్నారని తెలుస్తోంది. వాటి నాణ్యత ధ్రువీకరణను, విత్తన చట్టం నిబంధనల ప్రకారం విత్తన కంపెనీలు స్పష్టం చేయాల్సి ఉండగా ఆ వివరాలను అడిగి తెలుసుకోవాలనే కనీస అవగాహన కూడా లేని చిన్న రైతులు, విత్తన కంపెనీల ఆర్గనైజర్ల ఉచ్చులో పడి మోసపోతున్నారు. కేవలం ఆర్గనైజర్లు ఇచ్చే ముందస్తు పెట్టుబడికి ఆశపడిన చిన్న, సన్నకారు రైతులు సీడ్‌ను సాగు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం సీడ్ మొక్కజొన్నను సాగు చేస్తున్న రైతులకు, విత్తన కంపెనీలకు మధ్య పరస్పర అగ్రిమెంట్లు ఉండాలి. ఈ అగ్రిమెంటులో కనీస దిగుబడి పరిమాణం, టన్నుకు ధర, విత్తన లోపాల కారణంగా దిగుబడి తగ్గితే రైతులకు కంపెనీలు చెల్లించాల్సిన మొత్తాన్ని రాతపూర్వకంగా ధ్రువీకరించాల్సి ఉంది. కానీ విత్తన కంపెనీలు మచ్చుకైనా అగ్రిమెంటు చేయకపోగా, దీనిపై వ్యవసాయ శాఖ అధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించిన సందర్భాలు కూడా లేవు.

విత్తన చట్టానికి తూట్లు

విత్తన చట్టం, వ్యవసాయ శాఖ నిబంధనల ప్రకారం సీడ్ కంపెనీల యాజమాన్యం నిబంధనలను సరిగా పాటించడంలేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సీడ్ విత్తనాలను రైతులకు సరఫరా చేయాలంటే, విత్తన చట్టం ప్రకారం సంబంధిత వ్యవసాయ శాఖ నుంచి ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా పొంది ఉండాలి. లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మితే చట్ట ప్రకారం శిక్షార్హులు. కాగా, మండలంలోని రైతులకు దాదాపుగా ఆంధ్రప్రదేశ్ నుంచే సీడ్ విత్తనాలు సరఫరా అవుతున్నాయని సమాచారం. ప్రత్యేక అనుమతులు లేకుండా ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి విత్తనాలను సరఫరా చేసే అవకాశం కూడా లేకపోగా నిబంధనలకు తిలోదకాలు వదిలిన ఆర్గనైజర్లు, జోరుగా సీడ్‌ను రైతులకు అందజేస్తున్నారు.



అధికారులు జోక్యం చేసుకోవాలి

నేను గత 15 ఏళ్లుగా దాదాపు పదెకరాల్లో సీడ్ మొక్కజొన్న సాగు చేస్తున్నా. సీడ్ ఆర్గనైజర్లు మాకు విత్తనాలతో పాటుగా ఎకరాకు రూ.20,000 వరకు పెట్టుబడి ఇస్తున్నారు. కానీ మాకు విత్తన కంపెనీలకు ఎలాంటి అగ్రిమెంట్లు లేవు. కొన్ని విపత్కర పరిస్థితుల్లో విత్తన కంపెనీలు నిర్దేశించిన దిగుబడి రానప్పుడు రైతులు నష్టపోతున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు పరిగణలోకి తీసుకుని, విత్తన కంపెనీలు నియంత్రణ పాటించేలా, వ్యవసాయ శాఖ జోక్యం చేసుకుని, సరైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

– చక్కిరాల మల్లేశ్వరరావు, రైతు దమ్మపేట, భద్రాద్రి జిల్లా

నిబంధనలు పాటించాల్సిందే



విత్తన చట్టం, వ్యవసాయ శాఖ నిర్దేశించిన నియమ నిబంధనల మేరకు మాత్రమే సీడ్ కంపెనీల యాజమాన్యం వ్యవహరించాలి. లేదంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో సీడ్ సాగుకు దీటుగా కమర్షియల్ మొక్కజొన్న సాగుతో కూడా అధిక లాభాలను పొందవచ్చు. సీడ్ సాగు చేస్తున్న రైతులకు, విత్తన కంపెనీల మధ్య నియమ నిబంధనలు తెలిపేలా అగ్రిమెంట్లు తప్పకుండా చేయాలి. ఈ విషయంలో రైతుల నుంచి ఫిర్యాదు అందితే, సదరు విత్తన కంపెనీలు, వారి ఆర్గనైజర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి వెనకాడబోం.

– శీలం చంద్రశేఖరరెడ్డి, మండల వ్యవసాయ అధికారి

ప్రాజెక్టుల వారీగా ఆయకట్టు వివరాలు

2024–25 యాసంగి సీజన్‌లో రాష్ట్రంలోని భారీ, మధ్యతరహా, చిన్న నీటి ప్రాజెక్టులతో పాటు చెరువులు, ఎత్తిపోతల కింద ఏకంగా 42,48,780 ఎకరాల ఆయకట్టుకు మొత్తం 354.88 టీఎంసీల సాగునీటిని సరఫరా చేయాలని నీటిపారుదల శాఖలోని రాష్ట్ర స్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (స్కివం) రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో యాసంగి సీజన్‌లో సాగు విస్తీర్ణానికి సంబంధించి తడి, పొడి పంటలు.. భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు..ప్రాజెక్టుల వారీగా గణాంకాలు ఇలా ఉన్నాయి.

గత మూడేళ్లలో సాగు విస్తీర్ణం, ప్రస్తుత యాసంగిలో ప్రతిపాదిత సాగు విస్తీర్ణం వివరాలు

కేటగిరీ	2021–22	2022–23	2023–24	2024–25
తడి	11,95,256	19,81,301	11,57,014	24,54,429
పొడి	22,32,433	13,84,291	17,38,565	17,94,351
మొత్తం	34,27,689	33,65,592	28,95,579	42,48,780

భారీ, మధ్యతరహా, చిన్న సాగునీటి ప్రాజెక్టుల వారీగా గత, ప్రస్తుత ప్రతిపాదిత విస్తీర్ణం వివరాలు

ప్రాజెక్టు	2023–24	2024–25
భారీ ప్రాజెక్టులు	18,68,883	30,96,210
మధ్యతరహా ప్రాజెక్టులు	2,18,535	2,68,978
మైనర్ ప్రాజెక్టులు	6,72,938	7,23,330
ఐడీసీ	1,35,223	1,60,262
మొత్తం	28,95,579	42,48,780

ప్రాజెక్టుల వారీగా 2024-25 యాసంగి సీజన్ వివరాలు

ప్రాజెక్టు	పొడి	తడి	మొత్తం
ఎస్సారెస్పీ–1	3,58,569	4,40,903	7,99,472
నాగార్జునసాగర్	1,62,495	4,75,890	6,38,385
ఎస్సారెస్పీ–2	77,400	2,59,230	3,36,630
కల్వకుర్తి	2,60,177	20,204	2,80,381
నిజాంసాగర్	3180	1,21,012	1,24,192
కాళేశ్వరం	22,970	70,100	93,070
మిడ్‌మానేరు	20,104	34,120	54,224
కడెం	1500	32,800	34,300
అలీసాగర్ లిఫ్టు	3331	44,331	47,662
గుత్ప లిఫ్టు	3025	29,673	32,698
జూరాల	22,346	12,000	34,346
ఆర్డీఎస్	30,000	7000	37,000
మూసీ	30,000	–	30,000
ఎల్లంపల్లి–2	11,600	17,400	29,000
దేవాదుల	1,28,280	70,350	1,98,630
కోయిల్‌సాగర్	8000	–	8000
భీమా	24,350	4650	29,000
నెట్టెంపాడు	21,300	3500	24,800
ఎస్ఎల్‌బీసీ	1,15,150	1,24,270	2,39,420




ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమాలు ముగిసిన సందర్భంగా హైదరాబాద్ తారామతి బారాదరిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో జూపల్లి కృష్ణారావు, పట్నం మహేందర్‌రెడ్డి శ్రీధర్‌బాబు, కోదండరాం తదితరులు

పాతవి అన్నీ పెండింగే!

లక్షల సంఖ్యలో ఉన్న భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులు

అటకెక్కిన 9.4 లక్షల సాదా బైనామాల పరిష్కారం ● వేల సంఖ్యలో 'ప్రభుత్వ స్థలాల్లోని నిర్మాణాల క్రమబద్ధీకరణ' దరఖాస్తులు

అటవీ హక్కుల కోసం ఎన్నాళ్లగానో గిరిజనుల ఎదురుచూపులు ● కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటున్న ప్రజలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూముల క్రమబద్ధీకరణ అంశం పడావు పడింది. సాదా బైనామాల పరిష్కారం, జీవో 58, 59ల ద్వారా ప్రభుత్వ స్థలాల్లోని నిర్మాణాల క్రమబద్ధీకరణ, అటవీ భూములకు హక్కుల కల్పన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నా ఫలితం లభించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో న్యాయం జరగలేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరణి పోర్టల్ సంస్కరణ, రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్) కొత్త చట్టం రూపకల్పన ద్వారా భూ యాజమాన్య హక్కులపై సమగ్ర విధానాలను అమల్లోకి తెస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. భూముల క్రమబద్ధీకరణపై దృష్టి సారించాలని, తద్వారా రాష్ట్ర ఖజానాకు కాసుల పంట కూడా పండుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బీఆర్ఎస్ హయాంలో దరఖాస్తులు స్వీకరించినా..

సాదా బైనామా (కాగితాలపై నమోదు)ల ద్వారా భూముల క్రయ విక్రయ లావాదేవీలు తెలంగాణలో దశాబ్దాల తరబడి జరిగాయి. కాగా తెల్లకాగితాలపై భూయాజమాన్య హక్కులు మిగిలిపోయి పట్టాలు లభించని నేపథ్యంలో వీటిని పరిష్కరిస్తామని గత ప్రభుత్వం పలుమార్లు చెప్పింది కానీ అమల్లో సాధ్యం కాలేదు. అయితే ధరణి పోర్టల్ అందుబాటులోకి తెచ్చే క్రమంలో 2020లో అప్పటి ప్రభుత్వం సాదాబైనామాల పరిష్కారం కోసం దరఖాస్తులు స్వీకరించింది. దాదాపు 9.4 లక్షల దరఖాస్తులు రాగా, వాటిలో చాలా కొద్ది సంఖ్యలో దరఖాస్తులు మాత్రమే పరిష్కారమయ్యాయి. అయితే ఆ భూములకు కూడా పాస్‌పుస్తకాలు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా వివిధ కారణాలతో ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదు. ఈ దరఖాస్తులను పరిష్కరించి భూములపై హక్కులు కల్పిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరనుంది.

డబ్బులు కట్టి ఎదురుచూపులు

జీవో 58, 59ల ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ స్థలాల్లో ఉన్న ప్రైవేటు నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వ హయాంలో ఉత్తర్వులు వెలువడ్డాయి. జీవో 58 ద్వారా ఉచితంగా (125 గజాల లోపు భూమి), 59 ద్వారా మార్కెట్ ధరలను చెల్లించడం ద్వారా క్రమబద్ధీకరించుకునేందుకు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే రెండుసార్లు దరఖాస్తులు స్వీకరించి చాలావరకు పరిష్కరించారు. కొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగానే ఎన్నికల కోడ్ రావడం, ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడం జరిగిపోయింది. తీరా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ జీవోల అమలును నిలిపివేసింది. అయితే అప్పటికే చాలామంది దరఖాస్తుదారులు తమ వంతు చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించి క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్నారు. మరికొన్ని దరఖాస్తులు పరిశీలన పూర్తయి కలెక్టర్ల ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయి. మరికొన్ని పరిశీలన దశలో ఉన్నాయి. ఇలా వేల సంఖ్యలో దరఖాస్తులు జీవో 59 కింద పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈ జీవో ద్వారా అక్రమంగా క్రమబద్ధీకరణ జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఈ జీవో అమలును నిలిపివేసింది. అలాగే గత ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో క్రమబద్ధీకరణ జరిగిన నిర్మాణాలకు సంబంధించి తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు ఎలాంటి లావాదేవీలు నిర్వహించడానికి వీలులేకుండా ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు ఈ జీవో ద్వారా దరఖాస్తు చేసుకుని పరిష్కారానికి ఎదురుచూస్తున్నవారు, పరిష్కారమై కన్వేయన్స్ డీడ్‌లు వచ్చినప్పటికీ ఎలాంటి లావాదేవీలకు వీలు లేకుండా పోయినవారు జీవో 59పై ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందా అని కళ్లల్లో వత్తులు వేసుకుని చూస్తున్నారు. ఈ జీవోను పారదర్శకంగా అమలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపు రూ.2 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా.

పోడు భూములదీ అదే పరిస్థితి

అటవీ భూములకు హక్కుల కల్పన అంశం కూడా గత 11 నెలలుగా పెండింగ్‌లోనే ఉంది. ఈ అంశంలోనూ గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తులు స్వీకరించారు. దాదాపు 12 లక్షల ఎకరాలపై తమకు హక్కులు కల్పించాలంటూ గిరిజనులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికలు ముగిసేనాటికి 4 లక్షల ఎకరాలపై పోడు హక్కులు కల్పించినట్టు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. అందులో ఎన్ని ఎకరాలకు వాస్తవ హక్కుల కల్పన జరిగిందన్న దానిపై స్పష్టత లేకపోయినప్పటికీ, ఇంకా లక్షల ఎకరాలకు చెందిన హక్కుల కోసం గిరిజనం ఎదురుచూస్తూనే ఉన్నారు.

క్లుప్తంగా...

చీటింగ్ కేసులో ఇద్దరికి మూడేళ్లు జైలు శిక్ష

నెల్లూరు సిటీ: ఓ డాక్యుమెంట్ ఫోర్జరీ కేసులో ఇద్దరికి మూడేళ్లు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ నెల్లూరు స్పెషల్ ఎక్సైజ్ కోర్టు జడ్జి శుయోధన్ గురువారం తీర్పు వెల్లడించారు. నెల్లూరు రూరల్ మండలం పరిధిలోని గుడిపల్లిపాడులోని ఓ స్థలానికి ముత్తుకూరు మండలం పంటపాళెంకు చెందిన ఎస్.మోహన్‌రెడ్డి ఫోర్జరీ డాక్యుమెంట్‌ను సృష్టించారు. అతనికి రూరల్ తహసీల్దార్ కార్యాలయంలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి బి.శ్రీనివాసులు సహకరించారు. ఫోర్జరీ డాక్యుమెంట్‌తో స్థలాన్ని మరొకరికి విక్రయించారు. విషయం తెలుసుకున్న యజమాని ఆదిశేషారెడ్డి నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 2011 సంవత్సరంలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో ఏ1 మోహన్‌రెడ్డి, ఏ2 శ్రీనివాసులుకు మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.40 వేలు చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు. ఏ1 మోహన్‌రెడ్డి కోర్టు విచారణకు గైర్హాజరు అయ్యారు.

కృష్ణయ్యది ఆత్మవంచన

బహుజన కులాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గురుప్రసాద్ మండిపాటు

సాక్షి, అమరావతి: బీసీలను అడ్డుపెట్టుకుని ఆర్.కృష్ణయ్య పెదాలపై ఆత్మగౌరవం గురించి గొప్పలు చెబుతారని, ఆయన మాత్రం ఆత్మవంచనతో బతుకుతున్నాడని మరోసారి రుజువైందని ఆంధ్రప్రదేశ్ బహుజన కులాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి గురుప్రసాద్ మండిపడ్డారు. కృష్ణయ్య బీజేపీ అభ్యర్థిగా రాజ్యసభకు పోటీ చేయడాన్ని తప్పుబడుతూ గురుప్రసాద్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీసీలకు రాజకీయ అధికారం కోసం ఉద్యమం చేస్తున్నట్లు బిల్డప్ ఇచ్చి.. ఆయన మాత్రం పదవుల కోసం పార్టీలు ఫిరాయిస్తున్నాడని తెలిపారు. కృష్ణయ్యకు కృతజ్ఞత లేదని విమర్శించారు. బీసీలకు వెన్నుదన్నుగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలిచి మరీ కృష్ణయ్యను రాజ్యసభకు పంపించారని గుర్తుచేశారు. జగన్ పట్ల కనీస కృతజ్ఞత లేకపోగా వైఎస్సార్‌సీపీని వదిలి బీజేపీలో చేరి మళ్లీ రాజ్యసభ సీటుకు పోటీ చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.

ఏపీఎస్ఎఫ్ఎల్ టెక్నికల్ కమిటీ పునర్‌వ్యవస్థీకరణ

సాక్షి, అమరావతి: ఏపీస్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) టెక్నికల్ కమిటీని పునర్‌వ్యవస్థీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఎస్ఎఫ్ఎల్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ కన్వీనర్‌గా మొత్తం ఆరుగురు సభ్యులతో కొత్త కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర పెట్టుబడులు మౌలికవసతుల కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో ఏపీఎస్ఎఫ్ఎల్ ఈడీ (ప్రాజెక్ట్స్), చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్‌తో పాటు ఐటీ శాఖ డైరెక్టర్, ఇన్‌క్యాప్ సీజీఎం, ఏపీఎంటీ చీఫ్ ఇంజనీర్లు సభ్యులుగా ఉంటారు. ఏపీఎస్ఎఫ్ఎల్‌కు చెందిన టెండర్లను ఈ కమిటీ పరిశీలించి తగిన సూచనలు చేస్తుంది.

కార్పొరేటర్ వ్యాఖ్యలు మా ఆత్మగౌరవానికి భంగం

సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నూతలపాటి వరప్రసాద్

సీతమ్మధార(విశాఖ): రాష్ట్ర వార్డు, గ్రామ సచివాలయం ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిబ్బంది విశాఖ జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ నూతలపాటి వరప్రసాద్ మాట్లాడుతూ వార్డ్ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కౌన్సిల్లో చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా అన్ని ప్రభుత్వశాఖల నుంచి సచివాలయ సిబ్బంది నిరసనకు దిగినట్లు తెలిపారు. వేలకు వేలు వేతనాలు తీసుకుని, ఖాళీగా ఉంటున్నారని కార్పొరేటర్ ఇష్టానుసారం వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సచివాలయ సిబ్బంది సేవలను గుర్తించకపోగా వారి ఆత్మగౌరవాన్ని భంగపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. తమకు రావాల్సిన ఈఎల్‌లు, ఇంక్రిమెంట్‌లు వెంటనే మంజూరు చేయాలని, జీతాల్లో కోతలు విధించవద్దని వేడుకున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భార్గవ సుజిత మాట్లాడుతూ తమ శ్రమను గుర్తించకపోయినా, అవమానపరిచేలా మాట్లాడొద్దని కోరారు. కార్పొరేటర్ గోవిందరెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు నల్ల రిబ్బన్లు ధరించి, మొబైల్‌ఫోన్లలో ఫ్లాష్‌లైట్లు వేసి వినూత్న నిరసన తెలిపారు.

ఊరంతా దుస్తులే!



తన ఇంటి వద్ద విక్రయానికి అనుకూలమైన దుస్తులను పరిశీలిస్తున్న వ్యాపారస్తురాలు

- వస్త్ర వ్యాపారంలో రెండో ముంబయిగా 'పామిడి'
- నాణ్యమైన దుస్తులకు కేరాఫ్

పామిడి: రాయలసీమ జిల్లాల్లోనే నాణ్యమైన వస్త్రాలకు ఖ్యాతి గాంచింది అనంతపురం జిల్లా పామిడి. 65 వేల మంది జనాభా ఉన్న పామిడిలో 85 శాతం మంది వస్త్ర వ్యాపారంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఏ వీధికెళ్లినా వస్త్ర దుకాణాలే కనిపిస్తాయి. కేవలం టెక్స్‌టైల్‌లోనే కాకుండా రెడీమేడ్ దుస్తుల తయారీలోనూ రెండో ముంబయిగా ఖ్యాతిగాంచింది.

గ్రామం ఆవిర్భావం నుంచే...

శతాబ్దాల క్రితం ఆవిర్భవించిన పామిడి గ్రామానికి పెద్ద చరిత్రనే ఉంది. పూర్వం పరుశురాముడి స్వైర విహారం నుంచి తప్పించుకుని కుటుంబాలతో వలస వచ్చిన క్షత్రియులు పామిడి పెన్నానది ఒడ్డున సింగిరప్ప కొండపై స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు పూర్వీకులు చెబుతున్నారు. అనంతరం ప్రస్తుతమున్న గ్రామానికి తమ మకాం మార్చి జీవనోపాధి కింద దుస్తులకు రంగుల అద్దకం పనిని చేపట్టారు. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం వరకూ పామిడిలో కుటీర పరిశ్రమగా రంగుల అద్దకం పని కొనసాగింది. ఈ నైపుణ్యం వారిని రాయల్ టైలర్స్‌గా, డ్రెస్ డిజైనర్లుగా ఎదగడానికి దోహదపడింది. గుజరాత్, మహారాష్ట్ర ప్రాంతం నుంచి వలస రావడంతో వీరిని భావసార క్షత్రియులుగా పిలిచేవారు.

రెడీమేడ్‌కు పెట్టింది పేరు

దాదాపు ఐదు దశాబ్దాల క్రితం వరకూ పామిడి వాసులు ర్యాగ్స్ (ఒక సెం.మీ. వెడల్పు ఉన్న వస్త్రం)తో చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్‌లు కుట్టి అతి తక్కువ ధరకు విక్రయించేవారు. ఈ క్రమంలో పరిశ్రమల నుంచి బేళ్ల కొద్దీ సరుకును దిగుమతి చేసుకునేవారు. చేతి నిండా పని దొరకడంతో ప్రతి ఇంట్లోనూ రెండు, మూడు కుట్టుమిషన్లపై ఉదయం నుంచి రాత్రి వరకూ డ్రెస్‌లు కుట్టేవారు. ప్రస్తుతం నైటీలు, నైట్ ప్యాంట్లను కుడుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలను కరువు రక్కసి పీడించిన రోజుల్లోనూ పామిడిలో ఉపాధికి ఢోకా ఉండేది కాదు. తర్వాతి కాలంలో మిల్లుల నుంచి కట్‌పీస్‌లు తెప్పించి కిలోల లెక్కన అమ్మడం మొదలు పెట్టారు. వీటితోనే ప్రస్తుతం నైట్ ప్యాంట్లు తయారవుతున్నాయి. జైపూర్ కాటన్‌తో నైటీలను పెద్ద సంఖ్యలో ఉత్పత్తి చేస్తున్నారు. ఇక్కడి ఉత్పత్తులకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, కేరళ, తమిళనాడు ప్రాంతాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంది. నైటీలకు సంబంధించి 70కి పైగా, నైట్ ప్యాంట్‌లకు సంబంధించి 50 దాకా కుటీర పరిశ్రమలు ఇక్కడ వెలిశాయి. అన్ని కులాలకు చెందిన వారు ఈ వ్యాపారంలో రాణిస్తున్నారు.



నైటీల వ్యాపార దుకాణం

ధర తక్కువ.. నాణ్యత ఎక్కువ

వస్త్ర వ్యాపారంలో పామిడి వాసుల ప్రత్యేకతే వేరు. కేవలం వస్త్ర వ్యాపారం సాగించే వీధినే ప్రత్యేకంగా ఉంది. ఈ వీధిలో 130కు పైగా వస్త్ర దుకాణాలు ఉన్నాయి. ఏ వస్త్రం నాణ్యత ఏపాటిదో కంటితో చూస్తే చెప్పే నైపుణ్యం ఇక్కడి వారి సొంతం. వస్త్ర పరిశ్రమలు విస్తారంగా ఉన్న గుజరాత్, మహారాష్ట్ర నుంచి తమకు అవసరమైన ముడిసరుకును దిగుమతి చేసుకుని వ్యాపారం సాగిస్తూ వచ్చారు. నేరుగా పరిశ్రమల నుంచి వస్త్రాలను దిగుమతి చేసుకోవడంతో వినియోగదారులకు చాలా తక్కువ ధరకే లభ్యమయ్యేవి. నాణ్యమైన వస్త్రాలను మాత్రమే విక్రయిస్తూ పామిడి ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేశారు. ఇక్కడి వస్త్రాలు కొనుగోలు చేసి ధరిస్తే ఏళ్ల తరబడి రంగు వెలిసిపోవని వినియోగదారుల నమ్మకం. దీంతో మూడు దశాబ్దాల వరకూ రాయలసీమ జిల్లాల్లో ఎవరింట శుభకార్యం జరిగినా పామిడికి చేరుకుని వస్త్రాలు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ఎక్కడికక్కడ పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ రావడంతో పామిడి వైపు ఎక్కువగా దృష్టి సారించలేకపోతున్నారు.



వస్త్ర వ్యాపారానికి ఖ్యాతిగాంచిన పామిడిలోని మెయిన్ బజార్

మన్నిక భేష్



పామిడి వస్త్రాల మన్నిక చాలా బాగుంటుంది. ధర కూడా తక్కువే. ప్రత్యేకించి ఎక్కువ మొత్తంలో వస్త్రాలు కొనుగోలు చేయాలనుకునేవారు తప్పనిసరిగా పామిడికి వస్తుంటారు. ఇక ఇళ్ల వద్ద చీరలు, ఇతర వస్త్రాలు విక్రయించాలనుకునే మహిళలు సైతం పామిడిలోనే కొనుగోలు చేస్తుండడం విశేషం.
– డి.హొన్నూరుసాహెబ్, కల్లూరు

నాణ్యతగా ఉంటాయి



మా గ్రామం గొప్పతనం చెప్పడం కాదు కానీ, ఇక్కడ ఒక్కసారి వస్త్రాలు కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరూ నాణ్యమైన సరుకు కావాలంటే పామిడికే వెళ్లాలని చెబుతుంటారు. ప్రస్తుతమున్న ధర ప్రకారం ఇతర ప్రాంతాల్లో రూ.900 చెల్లించి కొనుగోలు చేసిన ఓ ప్యాంట్ పీస్ నాణ్యతకు అదే ధరతో పామిడిలో కొనుగోలు చేసే ప్యాంట్ పీస్ నాణ్యతకు చాలా తేడా ఉంటుంది. ఇక్కడ కొనుగోలు చేసిన వస్త్రాలు చాలా కాలం పాటు మన్నిక వస్తాయి. రంగు వెలిసిపోదు. దీంతో నాణ్యత కావాలనుకునే వారు పామిడికే వచ్చి వస్త్రాలు కొనుగోలు చేస్తుంటారు.
– పి.శివకుమార్, పామిడి

'చుక్క' తెచ్చిన చిక్కు

కూటమి ప్రభుత్వం మద్యం విధానంతో ఎక్కడ పడితే అక్కడ మద్యం షాపులు, అడుగడుగునా బెల్ట్ షాపులు, దీంతో తాగడానికి నీళ్లు దొరకవేమో కానీ రాష్ట్రంలో మద్యానికి మాత్రం కొరత లేకుండా పోయింది. ఇక బాబుగారు సూపర్ సిక్స్‌లో భాగంగా రూ. 99కి ఇస్తున్న క్వార్టర్ మద్యం నాణ్యతకి ఎక్కడ తాగినవాళ్లు అక్కడే పడిపోతున్నారు. నెల్లూరు వీఆర్‌సీ సెంటర్‌లో మద్యం తాగి స్పృహలేని స్థితిలో ఓ మహిళ, అదే స్థితిలో మరోవ్యక్తి ట్రాలీ రిక్షాలో పడి ఉండగా, కాస్త మెరుగ్గా ఉన్న మరో వ్యక్తి ఆ ట్రాలీని లాక్కుంటూ వెళ్తున్నాడు. రోడ్డుపై ఈ దృశ్యాన్ని చూసిన ప్రజలు అవాక్కయ్యారు.



రేంజర్ ఇంటి దొంగే

- వ్యానులో 30 రకాల విలువైన టేకు ఫర్నిచర్, కలప
- నెల్లిపాక రేంజ్ కార్యాలయంలో పంచనామా
- చర్యలు తీసుకోవాలని నాయకుల డిమాండ్



వ్యానులో తరలిస్తున్న టేకు,జిట్రేగి కలప ఫర్నిచర్



పంచనామా నిర్వహిస్తున్న అధికారులు

ఎటపాక: అల్లూరి జిల్లా కూనవరం అటవీ శాఖ రేంజర్‌గా పనిచేసే సమయంలో భారీగా కూడబెట్టిన టేకు, జిట్రేగి ఫర్నిచర్‌ను కోతులగుట్ట నుంచి తరలిస్తూ గత రాత్రి పట్టుబడిన మోహిని విజయలక్ష్మి తీరు తీవ్ర చర్చనీయాంశమైంది. బుధవారం రాత్రి ఫర్నిచర్ తరలిస్తున్న వ్యానును బీజేపీ నాయకుడు వెంకయ్యతో పాటు కొందరు గిరిజనులు నందిగామ వద్ద అడ్డుకున్నారు. కలప తరలిస్తున్న సమాచారాన్ని ఉన్నతాధికారులకు చెప్పడంతో వ్యాను నెల్లిపాక రేంజ్ కార్యాలయానికి తరలించారు. గురువారం ఉదయం కూనవరం రేంజర్ కరుణాకర్, సబ్ డీఎఫ్‌వో రాఘవరావు సమక్షంలో వ్యానులోని సామగ్రిని క్రిందికి దించి పంచనామా నిర్వహించారు. సోఫా సెట్లు, డ్రెస్సింగ్ టేబుళ్లు, కింగ్ సైజ్ మంచాలు తదితర 30 రకాల విలువైన ఫర్నిచర్‌తోపాటు జిట్రేగి, టేకు కలప కూడా ఉన్నట్లు గుర్తించారు. కూనవరంలో రేంజర్‌గా పనిచేసిన సమయంలో ఇంత ఫర్నిచర్‌ను కూడబెట్టిన రేంజర్ తీరుకు వారంతా విస్తుపోయారు. అయితే సొంత శాఖ అధికారిని కాపాడేందుకు ఆ శాఖ అధికారులు తాత్సారం చేస్తూ పంచనామా వివరాలు వెల్లడించటం లేదన్నారు.

పోలీసుల కనుసన్నల్లో రేషన్ మాఫియా !

- తనిఖీకి వెళ్లిన సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దారు
- ఎందుకు వెళ్లారంటూ కానిస్టేబుల్ ఫోన్
- సీఐతో మాట్లాడేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన సీఎస్‌డీటీ
- కానిస్టేబుల్ ఫోన్ స్విచ్ఛాఫ్
- సాక్షాత్తు పౌరసరఫరాల శాఖ మంత్రి ఇలాఖాలోనే ఘటన

తెనాలి రూరల్ : సాక్షాత్తు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రాతినిధ్యం వహిస్తున్న తెనాలిలోనే పోలీసుల కనుసన్నల్లో రేషన్ మాఫియా కొనసాగుతోందని తాజా ఘటన ఒకటి ధృవీకరించింది. ఇక్కడ పోలీసులు రెవెన్యూ అధికారులకు అడ్డుపడుతుండడం విశేషం. రేషన్ పంపిణీ సరిగా జరగడంలేదని, మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనం ద్వారా కాకుండా రేషన్ షాపులోనే సరుకులను ఇస్తున్నారంటూ ఫిర్యాదులు రావడంతో రేషన్ దుకాణ తనిఖీకి సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ (సీఎస్‌డీటీ) మూర్తి గురువారం పట్టణ చినరావూరులోని ఓ రేషన్ దుకాణం తనిఖీకి తన సిబ్బందితో వెళ్లారు. వాహనం మరమ్మతుకు గురవడంవల్లే రేషన్ షాపులో ఇస్తున్నారని ఆయన నిర్ధారించుకున్నారు. ఈలోగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ తన స్థాయిని మరచి సీఎస్‌డీటీ మూర్తికి ఫోన్ చేసి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. ఇక తనిఖీల అనంతరం తన కార్యాలయానికి వెళ్లే క్రమంలో ఇదే విషయమై సీఐతో మాట్లాడి ఫిర్యాదు చేసేందుకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సీఎస్‌డీటీ వెళ్లి రైటర్‌ను కలవగా సీఐ సెలవులో ఉన్నారని.. రూరల్ సీఐ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తనకు వచ్చిన నంబరును రైటర్‌కు వచ్చి ఎవరిదో చూడమని అడగ్గా అది అదే స్టేషనులో పనిచేస్తున్న కానిస్టేబుల్‌ది అని తేలింది. డయల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది.

రేషన్ మాఫియాకు పోలీసుల అండ?

తెనాలిలో పోలీసుల కనుసన్నల్లోనే రేషన్ మాఫియా నడుస్తోందన్న విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. తాజా ఘటన దీనికి బలం చేకూరుస్తోంది. చినరావూరులోని రేషన్ దుకాణానికి సమీపంలోని ఓ కార్ఖానాకు రేషన్ బియ్యం తరలుతోందన్న ఆరోపణలున్నాయి. దీనికి పోలీసుల సహకారం ఉందన్నది ఆ ప్రాంతంలో బహిరంగ రహస్యమే. అక్కడి రేషన్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు సీఎస్‌డీటీ వెళ్లడంతో ఖంగుతిన్న సదరు కానిస్టేబుల్ సీఎస్‌డీటీకి ఫోన్‌చేశాడని తెలుస్తోంది. రేషన్ మాఫియా వ్యవహారాలను వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో పర్యవేక్షిస్తున్నందునే సదరు కానిస్టేబుల్‌కు రేషన్ దుకాణ తనిఖీ సమాచారం రావడంతో వెంటనే సీఎస్‌డీటీకి ఫోన్ చేశాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఈ వ్యవహారాన్ని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా, కానిస్టేబుల్ ఫోన్‌చేయడం నిజమేనని, ఘటనపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే, ఇదే విషయమై ఇన్‌చార్జి సీఐ బెల్లం శ్రీనివాసరావును సంప్రదించగా తమకు లిఖితపూర్వక ఫిర్యాదు రాలేదని, ఏ నంబరు నుంచి ఫోన్ వచ్చిందో దానిని తెలియజేస్తూ ఫిర్యాదు వస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరినీ ఉపేక్షించేదిలేదని స్పష్టంచేశారు.

సింగిల్ నెంబర్ లాటరీ నిర్వాహకులకూ సహకారం..

ఇదిలా ఉంటే.. డీఎస్పీ తనకు బాగా పరిచయస్తుడని, ఏదైనా వ్యవహారం ఉంటే తాను సర్దుబాటు చేయగలనంటూ పట్టణంలో సింగిల్ నంబరు లాటరీ నిర్వాహకులకు «సహకారం» అందిస్తున్న ఇదే స్టేషనుకు చెందిన కానిస్టేబుల్ ఒకరు బహిరంగంగానే చెప్పుకుంటున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కుటుంబ కలహాలతో తల్లీబిడ్డ మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాహిత్య



మృతి చెందిన సుజాత



మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు వెళ్తు మార్గమధ్యలో మృతి చెందిన చైతన్య

- ఇద్దరు బిడ్డలతో కలిసి ఆత్మహత్యాయత్నం చేసిన తల్లి
- తల్లీకుమారుడు మృతి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుమార్తె
- అనంతపురం జిల్లా గార్లదిన్నెలో విషాదం

గార్లదిన్నె: కుటుంబ కలహాల కారణంగా ఓ వివాహిత పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. పిల్లలకు బలవంతంగా విషపు గుళికలు తాగించి, తనూ తాగేసింది. ఈ ఘటనలో తల్లీకుమారుడు మృతి చెందగా.. కూతురు ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటన గురువారం అనంతపురం జిల్లా గార్లదిన్నెలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. గార్లదిన్నె మండలం యర్రగుంట్లకు చెందిన సురేష్‌కు శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలానికి చెందిన సుజాత (38)కు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె రాహిత్య, కుమారుడు చైతన్య (11) సంతానం. రాహిత్య ప్రస్తుతం చైన్నై సత్యభామ కాలేజీలో బీటెక్ ప్రథమ సంవత్సరం, చైతన్య గార్లదిన్నెలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 7వతరగతి చదువుతున్నారు. సురేష్, సుజాత దంపతులు మూడేళ్ల క్రితం గార్లదిన్నెలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కిరాణా షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కుటుంబ కలహాలు తలెత్తాయి. గురువారం ఉదయం భర్త సురేష్ గార్లదిన్నె నుంచి యర్రగుంట్లలోని వ్యవసాయ తోట వద్దకు వెళ్లగా..సుజాత గార్లదిన్నెలోని ఓ ఫర్టిలైజర్ షాపులో విషపుగుళికలు కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్లింది. అనంతరం తలుపులు వేసుకొని మొదట కుమార్తె రాహిత్య, కుమారుడు చైతన్యకు నీళ్లలో విషపు గుళికలు కలిపి తాపించే ప్రయత్నం చేసింది. పిల్లలు వద్దన్నా వినకుండా బలవంతంగా విషపుగుళికలు కలిపిన నీళ్లు తాగించింది. అనంతరం ఆమెకూడా విషపుగుళికలు కలిపిన నీళ్లు తాగి అపస్మారక స్థితిలో పడి పోయింది. దీంతో కుమార్తె రాహిత్య బయటకు వచ్చి జరిగిన విషయాన్ని స్థానికులకు తెలిపింది. వెంటనే స్థానికులు సుజాత, రాహిత్య, చైతన్యలను కారులో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుజాత (38) మృతి చెందింది. కుమారుడు చైతన్య, కుమార్తె రాహిత్యకు మెరుగైన వైద్యం అందించేందుకు బెంగళూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చైతన్య (11) మృతి చెందాడు. ప్రస్తుతం రాహిత్య బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సురేష్ పెట్టిన మానసిక వేధింపులతోనే సుజాత పిల్లలతో కలిసి చనిపోవాలనుకుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కిరోసిన్ పోసుకుని తల్లి, కూమార్తె ఆత్మహత్యాయత్నం

ఆస్తి విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం



కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య యత్నం చేసుకున్న తల్లి సుబ్బులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఆస్తి విషయమై తల్లీ కుమార్తె మధ్య వాగ్వాదం జరగడంతో ఇద్దరూ కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. గుంటూరులోని నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటీ అగ్రహారం 17వ లైన్‌కి చెందిన పుచ్చం సుబ్బులు, నర్సిరెడ్డి దంపతులకు ఇద్దరు మగ, ఐదుగురు ఆడ పిల్లలు. గుంటూరు మిర్చి యార్డులో ముఠా పని చేసే నర్సిరెడ్డి అనారోగ్య కారణంగా 15 రోజుల కిందట మృతి చెందాడు. అప్పటి నుంచి పెద్దకుమార్తె కొత్తపల్లి రమణ తల్లి సుబ్బులు వద్ద తోడుగా ఉంటోంది. బుధవారం పెద్ద దినం పూర్తి కాగా.. ఆ తరువాత ఆస్తి విషయంలో తల్లి, పెద్ద కుమార్తె మధ్య వాగ్వాదం జరిగింది. గురువారం ఉదయం ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ఇంట్లో ఉన్న కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకున్నారు. వారి కేకలు విని స్థానికులు మంటలను అదుపు చేసి కాపాడారు. నగరంపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తల్లీకుమార్తెలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.


శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 65,887 మంది స్వామి వారిని దర్శించుకోగా 25,725 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.88 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను ముందుగా క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

గౌరీదేవికి సారె సమర్పణ



అత్తిలి: పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం మంచిలి గ్రామంలో గౌరీదేవి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం గౌరీ కులస్తులు అమ్మవారికి సారె చీరలను సమర్పించారు. ఉదయం లక్ష్మీ గణపతి ఆలయం నుంచి గౌరీ కులస్తులు 30 రకాల స్వీట్లు, పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు, చీర,సారెలతో గ్రామంలో ఊరేగుతూ గౌరీదేవి అమ్మవారి ఆలయానికి చేరుకుని సారెను సమర్పించారు. శనివారం గౌరీదేవి ఉత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



రైతు సంక్షేమమే లక్ష్యంగా నూతన పరిశోధనలు

తిరుపతి సిటీ : పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా యువత నూతన పరిశోధనలకు నాంది పలకాలని వెటర్నరీ వర్సిటీ వీసీ డాక్టర్ జీవీ రమణ పిలుపునిచ్చారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో రెండు రోజులుగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసి జాతీయ పరిశోధన సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే ప్రథమంగా అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య



ఆధ్వర్యంలో ఇలాంటి సదస్సు జరగడం అభినందనీయమన్నారు. పశువులకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులు, వాటి నివారణ, నిర్ధారణ ప్రక్రియలపై పెద్ద ఎత్తున పరిశోధనలు జరగాలన్నారు. యువత గ్రామీణ పాడి రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారికి ఉపయోగపడే విధంగా పరిశోధనలు సాగాలన్నారు. దేశవ్యాప్తంగా సదస్సుకు హాజరై ఉత్తమ పరిశోధన పత్రాలు సమర్పించిన విద్యార్థులకు అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతి రామయ్య, డీన్ వీరబ్రహ్మయ్య, సదస్సు కో ఆర్గనైజింగ్ సెక్రటరీలు సుధీర్ పాల్గొన్నారు.

స్టార్టప్‌లతో అవకాశాలు అందిపుచ్చుకోవాలి

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోసైన్స్, సెరికల్చర్, డీబీటీ బిల్డర్ టీమ్ సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీలో లైవ్ అగ్రిటెక్నాలజీ–స్టార్టప్ అవకాశాలు అనే అంశంపై జాతీయ వర్క్‌షాపు నిర్వహించారు. ప్రొఫెసర్ డీఎం మమత ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాపునకు సిట్రస్ రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపల్ ఇన్వేస్టిగేటర్ డాక్టర్ సి.మధుమతి ముఖ్య అతిథిగా హాజరై స్టార్టప్ ఫండింగ్ ఏజెన్సీలు, వ్యవస్థాపక అవకాశాలు, ఉద్యానవన రంగంలో సమీకృత వ్యవసాయ నమూనాలపై పలు సూచనలు చేశారు. అనంతరం నంద్యాలకు చెందిన వ్యవసాయ పారిశ్రామికవేత్త రమేష్ తేనెటీగల పెంపకం ద్వారా వివిధ స్టార్టప్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాపులో ప్రొఫెసర్లు సుజాతమ్మ, సావిత్రి, విజయ కుమారి, సువర్ణలత, శాంతి, శోభారాణి, హేమావతి, హరిప్రియ, రేఖ, మహిళా శాస్త్రవేత్త శ్వేత కుమారి, వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

భయమే భరోసా..!


ప్రభాస్

హారర్ సినిమాలు ఏ మాత్రం ఆడియన్స్‌కు కనెక్ట్ అయినా బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపిస్తాయి. అందుకే కథాబలం ఉన్న భయపెట్టే కథలు తమ దగ్గరకి వస్తే చేసేందుకు భయపడరు హీరోలు, హీరోయిన్లు. కథలోని భయాన్నే భరోసాగా చేసుకుని, ప్రస్తుతం కొందరు నటీనటులు హారర్ సినిమాలు చేస్తున్నారు. ఆ స్టార్స్ చేస్తున్న హారర్ చిత్రాల గురించి తెలుసుకుందాం.

రాజా డీలక్స్ థియేటర్‌లో రాజా సాబ్

ప్రభాస్ కటౌట్ చాలు బాక్సాఫీస్ భయపడటానికి. కానీ వెండితెరపై ప్రభాస్ భయపడితే ఎలా ఉంటుంది? ఆడియన్స్‌ను ప్రభాస్ భయపెడితే ఎలా ఉంటుంది? అనేది 'రాజా సాబ్' సినిమాలో చూడొచ్చు. 'ప్రేమకథా చిత్రమ్'తో ఆడియన్స్‌ని నవ్విస్తూనే భయపెట్టి, బాక్సాఫీస్ కాసులను కురిపించిన దర్శకుడు మారుతి 'రాజా సాబ్' సినిమాను తెరకెక్కిస్తున్నారు. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ చిత్రంలో ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని, తాతా మనవళ్ళుగా ప్రభాస్ కనిపిస్తారని, ఈ సినిమాలోని ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్‌లో సీరియస్ హారర్ సీన్స్ ఉన్నాయని సమాచారం. 'రాజా డీలక్స్' అనే థియేటర్‌లో జరిగే హారర్ సీన్స్ ఈ సినిమాకు కీలకమని ఫిల్మ్‌నగర్ భోగట్టా. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు చాలా సీజీ వర్క్ చేయాల్సి ఉంది. దీంతో వీలైనంత తొందరగా షూటింగ్‌ను కంప్లీట్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. హారర్ తరహా జానర్‌లో ప్రభాస్ ఇప్పటివరకు సినిమా చేయలేదు. దీంతో 'రాజా సాబ్' సినిమా ఎలా ఉండబోతుంది? అనే క్యూరియాసిటీ ప్రభాస్ అభిమానులతో పాటు ఆడియన్స్‌లోను నెలకొంది. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 10న విడుదల కానుంది.


సాయి శ్రీనివాస్


నాగచైతన్య


వరుణ్ తేజ్

ఇప్పుడు సినిమాలోనూ...

నాగచైతన్య కెరీర్‌లో ఇప్పటివరకూ హారర్ బ్యాక్‌డ్రాప్ సినిమాలు లేవు. అయితే హారర్ టచ్ ఉన్న 'ధూత' అనే వెబ్ సిరీస్ చేశారు. ఈ సిరీస్‌కు వీక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ లభించింది. ఇప్పుడు ఓ పర్ఫెక్ట్ హారర్ మూవీతో వచ్చేందుకు రెడీ అవుతున్నారు నాగచైతన్య. 'విరూపాక్ష' సినిమాతో దర్శకుడు కార్తీక్ వర్మ దండు ఆడియన్స్‌ను బాగా భయపెట్టి, బాక్సాఫీస్ వద్ద డబ్బులు రాబట్టుకున్నారు. ఈ దర్శకుడు తెరకెక్కించనున్న కొత్త సినిమాలో నాగచైతన్య హీరోగా నటించనున్నారు. 'విరూపాక్ష'ను మించిన హారర్ ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఉంటాయని, కథకు కాస్త మైథలాజికల్ టచ్ కూడా ఉంటుందని సమాచారం. ఈ సినిమాను ఇటీవల అధికారికంగా ప్రకటించారు. ఓ ఎత్తైన పర్వతం పైకి ఎక్కుతున్న నాగచైతన్యను ఓ పక్షి కన్నులో నుంచి చూపించారు మేకర్స్. దీంతో ఈ సినిమాపై ఆడియన్స్‌కు ఆసక్తి నెలకొంది. ఈ నెలాఖర్లో ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించాలనుకుంటున్నారు. నాగచైతన్య కెరీర్‌లోని ఈ 24వ సినిమాను బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించనున్నారు.

కొరియన్ కనకరాజు

లవ్‌స్టోరీ, యాక్షన్ జానర్స్‌లో సినిమాలు చేశారు వరుణ్ తేజ్. అయితే ఈసారి కొత్తగా ప్రయత్నించాలని వరుణ్ తేజ్ డిసైడ్ అయ్యారు. అందుకే ఓ హారర్ కామెడీ సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు వరుణ్. 'రన్ రాజా రన్, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' వంటి చిత్రాలతో ఆడియన్స్‌ను ఆకట్టుకున్న మేర్లపాక గాంధీ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థలు ఈ సినిమాను నిర్మించనున్నాయి. ఈ సినిమా కథనం రాయలసీమ నేపథ్యంలో ఉంటుంది. మార్చిలో ఈ సినిమా రెగ్యులర్ షూట్‌ను ప్రారంభించాలనుకుంటున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఇది పీరియాడికల్ ఫిల్మ్‌గా ఉండొచ్చనే టాక్ వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాకు 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని తెలిసింది. మార్చిలో చిత్రీకరణ అంటున్నారు కాబట్టి, వచ్చే ఏడాది చివర్లో ఈ సినిమా రిలీజ్ అయ్యే అవకాశాలు ఉన్నట్లుగా ఊహించవచ్చు.

చీకటి-వెలుగుల మధ్యలో...!

చీకటి వెలుగుల మధ్య దాగి ఉన్న ఓ మిస్టరీని ఛేదించే పనిలో పడ్డారట బెల్లకొండ సాయి శ్రీనివాస్. ఆయన హీరోగా కౌశిక్ పెగుళ్లపాటి దర్శకత్వంలో ఓ హారర్ మిస్టరీ థ్రిల్లర్ మూవీ రూపొందుతోంది. సాయి శ్రీనివాస్ కెరీర్‌లోని ఈ 11వ చిత్రంలో 'కిష్కింధపురి' అనే కల్పిత ప్రాంతం ఉంటుందని, అక్కడ కోతులు ఎక్కువగా ఉంటాయని, ఈ నేపథ్యంలో ఓ హారర్ కథను కౌశిక్ రెడీ చేసుకున్నారనీ భోగట్టా. ఈ సినిమాకు 'కిష్కింధపురి' అనే టైటిల్ అనుకుంటున్నారట. సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది రిలీజ్ కావొచ్చు.

ఇంకా సత్యం రాజేశ్ 'పొలిమేర 3', తిరువీర్ 'మసూద 2', వంటి హారర్ సినిమాలు స్క్రిప్ట్ దశలో ఉన్నాయని తెలుస్తోంది. మరికొందరు యువ దర్శకులు కూడా హారర్ సినిమాలు చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసింది.

– ముసిమి శివాంజనేయులు


హన్సిక


తమన్నా

ఈ ఏడాది 'అరణ్మనై 4' (తెలుగులో 'బాకు') వంటి హారర్ సినిమాతో ఆడియన్స్‌ను అలరించారు తమన్నా. ఈ సినిమాలో ఓ పాజిటివ్ ఆత్మగానే కనిపించారు. అలాగే ఈ ఏడాదే విడుదలైన హిందీ బ్లాక్‌బస్టర్ హారర్ ఫిల్మ్ 'స్త్రీ 2'లోనూ మెరిశారు తమన్నా. కానీ ఆమె పాత్రకు హారర్ టచ్ లేదు. ఓ స్పెషల్ సాంగ్‌తోనే సరిపోయింది. కాగా ప్రస్తుతం తమన్నా 'ఓదెల 2' అనే మైథలాజికల్ హారర్ మూవీలో నటిస్తున్నారు. ఇందులో నాగసాధువు శివశక్తి పాత్రలో కనిపిస్తారు తమన్నా. హెబ్బా పటేల్, వశిష్ఠ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓదెల మల్లన్న స్వామి తన గ్రామ ప్రజలను దుష్ట శక్తుల నుంచి ఏ విధంగా కాపాడారు? అన్నదే ఈ చిత్రం కథాంశం. సంపత్ నంది ఈ సినిమాకు కథ అందించారు. అశోక్ తేజ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను సంపత్ నంది టీమ్ వర్క్స్, మధు క్రియేషన్స్ పతాకాలపై డి. మధు ఈ నిర్మిస్తున్నారు.

మరోవైపు గాంధారి కోటలోని రహస్యాలను కనిపెట్టే యువతి పాత్రలో నటించారు హన్సిక. 'శ్రీ గాంధారి' సినిమా కోసం హన్సిక ఈ పాత్ర చేశారు. హారర్, మిస్టరీ, సస్పెన్స్, థ్రిల్ అంశాలతో రూపొందిన ఈ చిత్రంలో మెట్రో శిరీష్, మయిల్ సామి, తలైవాసల్ విజయ్ ఇతర కీలక పాత్రధారులు. ఆర్. కన్నన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను తెలుగులో రాజు నాయక్ రిలీజ్ చేస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం రిలీజ్ కానుంది.

స్టయిలిష్ కూలీ


రజనీకాంత్

రజనీకాంత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కూలీ'. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, ఆమిర్ ఖాన్, శ్రుతీహాసన్, సౌబిన్ షాహిర్‌లు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జైపూర్‌లో జరుగుతోంది. రజనీకాంత్, ఉపేంద్ర, ఆమిర్ ఖాన్‌ల కాంబినేషన్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. కాగా గురువారం (డిసెంబరు 12) రజనీకాంత్ బర్త్ డే. ఈ సందర్భంగా 'కూలీ' నుంచి 'సిటిక్కు' పాట చిన్న గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాటలో రజనీ స్టయిలిష్ స్టెప్పులు ప్రేక్షకులను అలరించేలా ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం: అనిరుధ్ రవిచందర్.

కేరళ కాలింగ్


రామ్‌చరణ్

కేరళ కాలింగ్ అంటున్నారు రామ్‌చరణ్. ఆయన హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కన్నడ యాక్టర్ శివ రాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేందు ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా తొలి షెడ్యూల్ మైసూర్‌లో ముగిసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఓ సెట్‌లో క్రికెట్ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని తెలిసింది. రామ్‌చరణ్‌తో పాటు ప్రధాన తారాగణం ఈ సన్నివేశాల్లో పాల్గొంటున్నారట. అలాగే ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్‌ను కేరళలో ప్లాన్ చేశారట. సో... త్వరలో కేరళ కాలింగ్ అంటూ ఈ యూనిట్ అక్కడికి వెళ్లనుంది. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదలవుతుంది.

హిందీ సినిమాను తెలుగులో వినవచ్చు!



నిఖిల్‌కు 'పుష్ప-2' టికెట్ దొరకలేదు. ఇదే విషయాన్ని ఫ్రెండ్ అఖిల్‌కు చెప్పాడు.

'హిందీ వెర్షన్‌కు టికెట్లు దొరుకుతున్నాయి. వెళ్దామా' అడిగాడు అఖిల్. 'టికెట్లు దొరకడం సరే, నీకు... నాకు హిందీ రాదు కదా... బొమ్మలు చూసి రావాల్సిందేనా!' అన్నాడు నిఖిల్. 'ఇప్పుడు మీకు కావాలి... సినీ డబ్' అని యూట్యూబ్ యాడ్‌లా అరిచాడు అఖిల్. 'సినీ డబ్ అంటే?' ఆశ్చర్యంగా అడిగాడు నిఖిల్. ఇప్పుడు దీని గురించి తెలుసుకుందాం. సినీ డబ్ అనే యాప్ ద్వారా మూవీ ఏ భాషలో ప్లే అయినా, మనకు వచ్చిన, నచ్చిన భాషలో చూడవచ్చు. ఉదాహరణకు మీరు 'పుష్ప-2' హిందీ వెర్షన్‌కు వెళ్లారనుకుందాం. మీకు హిందీ రాకపోయినా ఫరవాలేదు. నిర్ణీత మొత్తాన్ని పే చేసి 'సినీ డబ్' యాప్ ద్వారా తెలుగులోనే వినవచ్చు. షో స్టార్ట్ కాగానే ఆడియో ప్లే చేయాలి. 30 సెకండ్ల తరువాత ఇయర్ ఫోన్‌లలో హిందీ సంభాషణలను తెలుగులోనే వినవచ్చు.

మరీ అంత కోపం... కానే కాదు అలంకారం!


'అల్లరి' నరేశ్


''మరీ అంత కోపం... కానే కాదు అలంకారం... నిజం ఓ అబద్ధం అయినదంటే బతుకు శూన్యం...' అంటూ మొదలవుతుంది 'బచ్చల మల్లి' సినిమాలోని 'మరీ అంత కోపం...' సాంగ్. 'అల్లరి' నరేశ్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'బచ్చల మల్లి'. ఈ చిత్రంలో అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటించారు. రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'మరీ అంత కోపం...' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. 'అహం ఉన్న దేహం దాటలేదు అంధకారం... వేదాంతం ఏమీ లేదురా... నీలోని నిన్నే అడగరా...' అంటూ సాగే ఈ పాటకు పూర్ణాచారి సాహిత్యం అందించగా, సాయి విఘ్నేష్ పాడారు. ఈ సినిమాకు విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ డైరెక్టర్. ''సినిమాలో హీరో అంతర్గత సంఘర్షణ, పశ్చాత్తాపాన్ని వ్యక్తీకరించే పాట ఇది. హీరో తన జీవితంలో గతంలో చేసిన తప్పులు, ఈగో, చెడు అలవాట్లు... వంటి అంశాలను గురించి తనను తానే ప్రశ్నించుకునే విధంగా ఈ పాట ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాలో రోహిణి, రావు రమేష్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్, హరి తేజ, ప్రవీణ్, 'వైవా' హర్ష ఇతర కీలక పాత్రలు పోషించారు.

బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్


ధర్మ

ధర్మ, ఐశ్వర్యా శర్మ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా కిరణ్ తిరుమలశెట్టి ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా 'డ్రింకర్ సాయి' సినిమా నుంచి 'డ్రింక్సు... డ్రింక్సు... డ్రింక్సు...' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. 'డ్రింక్సు... డ్రింక్సు... డ్రింక్సు... స్వర్గానికి, మనకు లింక్సు, డ్రింక్సు... డ్రింక్సు... డ్రింక్సు... మన బాడీకి పెట్రోల్ బంక్సు, డ్రింక్సు... డ్రింక్సు... డ్రింక్సు కనిపెట్టినవాడికి థ్యాంక్సు...' అంటూ సాగుతుందీ పాట. చంద్రబోస్ క్యాచీ లిరిక్స్ అందించిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ సినిమాకు శ్రీ వసంత్ సంగీతం అందించారు.

స్వయంభూలో సుందరవల్లి


నభా నటేష్

'స్వయంభూ' సినిమా కోసం సుందరవల్లిగా మారిపోయారు హీరోయిన్ నభా నటేష్. నిఖిల్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ వార్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్ 'స్వయంభూ'. ఈ సినిమాలో సంయుక్త, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్‌పై భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని సుందరవల్లి పాత్రలో నభా నటేష్ నటిస్తున్నట్లుగా చిత్రయూనిట్ వెల్లడించి, ఆ పాత్ర పోస్టర్‌ను విడుదల చేసింది. సుందరవల్లి పాత్ర చాలా సాఫ్ట్‌గా ఉంటుందని, సంయుక్త పాత్రకు యాక్షన్ సీన్స్ ఉంటాయని తెలిసింది. నిఖిల్ కెరీర్‌లోని ఈ 20వ సినిమాను భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో మేకర్స్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుందని, తొలి భాగం వచ్చే ఏడాదిలో రిలీజ్ కానుందని తెలిసింది. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, కెమెరా: కేకే సెంథిల్‌కుమార్.

బిజినెస్ రీల్

టయోటా నుంచి క్యామ్రీ హైబ్రీడ్ కొత్త వెర్షన్

ధర రూ. 48 లక్షలు

బెంగళూరు: ఆటోమొబైల్ దిగ్గజం టయోటా కిర్లోస్కర్ (టీకేఎం) తాజాగా క్యామ్రీ హైబ్రీడ్ సెడాన్ కారుకు సంబంధించి కొత్త వెర్షన్‌ను ఆవిష్కరించింది. దీని ధర రూ. 48 లక్షలుగా ఉంటుంది. 2002లో క్యామ్రీని భారత మార్కెట్లో ప్రవేశపెట్టినప్పటి నుంచి కంపెనీ దాదాపు 17,900 యూనిట్లను విక్రయించింది. తొలుత పెట్రోల్ ఇంజిన్‌తో పూర్తి స్థాయిలో దిగుమతి చేసుకున్న ఈ కారును 2013లో హైబ్రీడ్ వెర్షన్‌లోను ప్రవేశపెట్టింది. మరోవైపు, శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించుకోవాలన్న జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా వాహనాలపై పన్నుల విధానం ఉండాలని టీకేఎం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ విక్రమ్ గులాటీ తెలిపారు. పన్నులపరమైన ప్రోత్సాహకాలను నిర్దిష్ట టెక్నాలజీలకు మాత్రమే పరిమితం చేయరాదని అభిప్రాయపడ్డారు.

ఈవీ స్టార్టప్ విద్యుత్‌తో మహీంద్రా కంపెనీ జోడీ



న్యూఢిల్లీ: ఈవీ రంగంలో ఉన్న మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ తాజాగా ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాలకై బ్యాటరీ–యాజ్–ఎ–సర్వీస్ ఫైనాన్సింగ్ సేవల కోసం ఈవీ స్టార్టప్ విద్యుత్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా విద్యుత్ కంపెనీ ద్వారా వాహన యజమానులు బ్యాటరీలను అద్దెకు తీసుకోవచ్చు. వినియోగాన్నిబట్టి కిలోమీటరుకు ప్రారంభ చార్జీ రూ.2.50 నుంచి ఉంటుంది. మహీంద్రా జియో, జోర్ గ్రాండ్, ట్రియో ప్లస్ వంటి ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు వ్యయం 40 శాతం వరకు తగ్గుతుందని కంపెనీ తెలిపింది. బ్యాటరీ–యాజ్–ఎ–సర్వీస్ ద్వారా ముందస్తు కొనుగోలు ధరను తగ్గించి ఎలక్ట్రిక్ మొబిలిటీని మరింత అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ ఎండీ, సీఈవో సుమన్ మిశ్రా తెలిపారు. తద్వారా వాణిజ్య రంగంలో ఈవీలను విస్తృతంగా స్వీకరించడాన్ని ప్రోత్సహిస్తామని అన్నారు.

కోక కోలా బాట్లింగ్‌లో వాటా విక్రయం

జూబిలెంట్ భర్తియా చేతికి 40 శాతం

న్యూఢిల్లీ: ప్రపంచ పానీయాల దిగ్గజం కోక కోలా దేశీ బాట్లింగ్ బిజినెస్‌లో 40 శాతం వాటాను విక్రయించింది. జూబిలెంట్ భర్తియా గ్రూప్ ఈ వాటాను సొంతం చేసుకుంది. హిందుస్తాన్ కోక కోలా బెవరేజెస్ ప్రయివేట్ లిమిటెడ్‌లో 40 శాతం వాటాను అమ్మివేసినట్లు కోక కోలా తాజాగా ప్రకటించింది. అయితే డీల్ విలువను వెల్లడించలేదు. కాగా.. వాటా విలువను రూ. 10,000 కోట్లుగా మీడియా వర్గాలు అంచనా వేస్తున్నాయి. దేశీ బాట్లింగ్ బిజినెస్ మాతృ సంస్థ హిందుస్తాన్ కోక కోలా హోల్డింగ్స్‌లో 40 శాతం వాటాను జూబిలెంట్ భర్తియా గ్రూప్‌నకు విక్రయించేందుకు ఒప్పందం కుదిరినట్లు కోక కోలా ఒక ప్రకటనలో తెలియజేసింది. కంపెనీ దేశీయంగా కోక కోలాకు అతిపెద్ద బాట్లింగ్ సరఫరాదారుగా నిలుస్తోంది. దశాబ్దాలుగా జూబిలెంట్ భర్తియా గ్రూప్‌నకున్న అత్యుత్తమ అనుభవం కోక కోలా వ్యవస్థకు సహకారమందించగలదని కోక కోలా పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా కోక కోలాకు దేశీ మార్కెట్ ఐదో ర్యాంకులో నిలుస్తోంది. జూబిలెంట్ భర్తియా గ్రూప్ కంపెనీయే క్యూఎస్‌ఆర్ రెస్టారెంట్ల దిగ్గజం జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్‌కావడం గమనార్హం!

వృద్ధి తిరిగి ట్రాక్‌లోకి వస్తుంది

- ఈ ఏడాది కూడా వృద్ధి వేగవంతమే
- ఆశాజనకంగా మూడో త్రైమాసికం గణాంకాలు
- వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఎన్నో అనిశ్చితులు నెలకొన్నప్పటికీ దేశ ఆర్థిక వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి తిరిగి గాడిన పడుతుందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఏడాది కూడా భారత్ ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందన్నారు. ''ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) ఎన్నికలు జరిగాయి. ఎన్నికల సమయంలో విధాన నిర్ణయాలు, వృద్ధికి సంబంధించి చర్యలు, మౌలిక వసతులపై ఖర్చు చేయడం సహజంగానే తగ్గుతాయి. ప్రస్తుత త్రైమాసికం (అక్టోబర్–డిసెంబర్)లో పండుగల వ్యయాలకుతోడు, గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధి పుంజుకోవడం, మౌలిక వసతులపై వ్యయాలు సాధారణ స్థితికి చేరుకున్నట్టు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. వచ్చే మార్చి చివరికి తిరిగి ట్రాక్‌లోకి వస్తాం''అని టైమ్స్ నెట్‌వర్క్ నిర్వహించిన సదస్సులో భాగంగా మంత్రి గోయల్ చెప్పారు. తయారీ, మైనింగ్ రంగాల్లో బలహీన పనితీరుతో సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు రెండేళ్ల కనిష్ట స్థాయి 5.4 శాతానికి తగ్గిపోవడం గమనార్హం. ఇది ఆందోళన కలిగిస్తుందా? అన్న మీడియా ప్రశ్నకు గోయల్‌పై విధంగా బదులిచ్చారు. క్రితం ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ క్వార్టర్‌లో వృద్ధి 8.1 శాతంగా ఉండడం గమనించొచ్చు. చివరిగా 2022 అక్టోబర్–డిసెంబర్ కాలంలో జీడీపీ 4.3 శాతం కనిష్ట వృద్ధి రేటును నమోదు చేసింది.

అయినా వేగవంతమే..

ఇప్పటికీ ప్రపంచంలో భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా గోయల్ చెప్పారు. ఆధునిక టెక్నాలజీలు, ఆవిష్కరణలు దేశ వృద్ధి రేటును నడిపిస్తాయన్నారు. సెప్టెంబర్ త్రైమాసికంలో చైనా వృద్ధి రేటు 4.6 శాతమే కావడం గమనార్హం. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు, ప్రతికూల ప్రచారం దేశ ఆర్థికాభివృద్ధిని అడ్డుకోలేవన్నారు. ''వక్ఫ్ బిల్లు లేదా వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లుల ఆమోదానికి కట్టుబడి ఉన్నాం. ఇవి నిర్మాణాత్మక మార్పులు. దేశానికి మంచి చేసే వీటి విషయంలో చిత్తశుద్ధితో ఉన్నాం''అని చెప్పారు.

దిగుమతులపై ఆందోళన అక్కర్లేదు

కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్



న్యూఢిల్లీ: దిగుమతి చేసుకున్న వాటిల్లో ఎక్కువ భాగాన్ని ఎగుమతి చేస్తున్నంత వరకు వాణిజ్య సమతుల్యత, దిగుమతులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ తెలిపారు. వాణిజ్యానికి, ఉత్పత్తుల రవాణాకు ప్రతిబంధకాలు సృష్టించే రక్షణాత్మక ధోరణులను ప్రపంచ దేశాలు నివారించాలని ఆయన పేర్కొన్నారు. 'ప్రపంచమంతా 3–3.5 శాతం వృద్ధి చెందుతోంటే భారత ఎకానమీ 7 శాతం వృద్ధి సాధిస్తోంది. అలాంటప్పుడు భారత్‌లో వినియోగం ఎక్కువగానే ఉంటుంది. కాబట్టి దిగుమతులూ పెరుగుతాయి. అయితే, ఎగుమతుల్లో దిగుమతుల పాత్ర కూడా చాలా కీలకం. ఎగుమతుల్లో దిగుమతుల వాటాను (దిగుమతి చేసుకున్న వాటిని మరో రూపంలో ఎగుమతి చేయడం ద్వారా) మెరుగుపర్చుకుంటున్నంత వరకు మనం దిగుమతుల గురించి పెద్దగా ఆందోళన చెందనక్కర్లేదు' అని ఆయన చెప్పారు.

ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో ఉత్పత్తుల ఎగుమతులు 3.18 శాతం పెరిగి 252.28 బిలియన్ డాలర్లకు చేరగా, దిగుమతులు 5.77 శాతం పెరిగి 416.93 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. మరోవైపు, సంపన్న దేశాల్లో వలసలు, మొబిలిటీ విషయంలో గందరగోళం నెలకొందని బర్త్వాల్ తెలిపారు. భారతీయులు లేదా భారతీయ కంపెనీలు ఇతర దేశాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నప్పుడు ఆయా దేశాలకు ప్రొఫెషనల్స్ రాకపోకలు సాగించాల్సిన (మొబిలిటీ) అవసరం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిరాటంకమైన మొబిలిటీకి వెసులుబాటు కల్పించాలని భారత్ అడుగుతోందే తప్ప వలసలను అనుమతించమని కోరడం లేదని బర్త్వాల్ వివరించారు.

ట్రాన్స్‌రైల్ లైటింగ్ ఐపీవో 19న

ట్రావెల్ ఫుడ్ ప్రాస్పెక్టస్ దాఖలు

న్యూఢిల్లీ: ప్రధానంగా విద్యుత్ ప్రసారం, పంపిణీ సంబంధిత ఈపీసీ కంపెనీ ట్రాన్స్‌రైల్ లైటింగ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ నెల 19న ప్రారంభమై 23న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.01 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రమోటర్ సంస్థ ఆజన్మా హోల్డింగ్స్ ప్రయివేట్ లిమిటెడ్ విక్రయానికి ఉంచనుంది. ప్రస్తుతం ప్రమోటర్లకు 83.22 శాతం వాటా ఉంది. ఈ నెల 18న యాంకర్ ఇన్వెస్టర్లకు షేర్లను కేటాయించనుంది. ఈక్విటీ జారీ నిధులను పెట్టుబడి వ్యయాలు, వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. స్ట్రక్చర్స్, కండక్టర్స్, మోనోపోల్స్ తదితర సమీకృత తయారీ సౌకర్యాలను కంపెనీ కలిగి ఉంది.

రూ. 2,000 కోట్లపై కన్ను

విమానాశ్రయాలలో ట్రావెల్ క్విక్ సర్వీసు రెస్టారెంట్లు, లాంజ్ బిజినెస్ నిర్వహించే ట్రావెల్ ఫుడ్ సరీ్వసెస్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ప్రధానంగా భారత్, మలేషియాలో కంపెనీ సర్వీసులు అందిస్తోంది. ఐపీవోలో భాగంగా ప్రమోటర్ సంస్థ కపూర్ కుటుంబ ట్రస్ట్ రూ. 2,000 కోట్ల విలువైన వాటాను విక్రయానికి ఉంచనుంది. దీంతో ఐపీవో ద్వారా కంపెనీ కాకుండా ప్రమోటర్ సంస్థ నిధులు సమకూర్చుకోనుంది. ప్రమోటర్లలో ఎస్ఎస్‌పీ గ్రూప్‌సహా.. కపూర్ కుటుంబ ట్రస్ట్, వరుణ్ కపూర్, కరణ్ కపూర్ ఉన్నారు. ఎస్ఎస్‌పీ లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీ లిస్టయిన కంపెనీ. ఆదాయంరీత్యా 2024లో గ్లోబల్ ట్రావెల్ ఫుడ్, పానీయాల విభాగంలో దిగ్గజంగా నిలిచినట్లు రేటింగ్ సంస్థ క్రిసిల్ పేర్కొంది.



రూ.10,000 కోట్ల మైలురాయికి ఈక్విరస్ వెల్త్

- 18 నెలల్లోనే రెట్టింపు
- 2028 నాటికి రూ.50వేల కోట్ల లక్ష్యం



న్యూఢిల్లీ: పెట్టుబడులు, సంపద నిర్వహణ సేవలను అందించే ఈక్విరస్ వెల్త్ తన నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) రూ.10,000 కోట్లను అధిగమించినట్టు ప్రకటించింది. కేవలం 18 నెలల్లోనే ఏయూఎం రెట్టింపైనట్టు తెలిపింది. అధిక ధనవంతులు, అల్ట్రా హెచ్ఎన్ఐల అవసరాలను తీర్చడంలో, వినూత్నమైన పెట్టుబడుల పరిష్కారాలు అందించడంలో తమ సామర్థ్యాలను ఈ గణాంకాలు తెలియజేస్తున్నట్టు పేర్కొంది. కస్టమర్ల లక్ష్యాలు, రిస్క్ సామర్థ్యం ఆధారంగా ఇక ముందూ వినూత్నమైన పెట్టుబడి ఉత్పత్తులను అందించేందుకు కట్టుబడి ఉన్నట్టు తెలిపింది. 2028 నాటికి రూ.50,000 కోట్ల ఏయూఎంను సాధించడమే లక్ష్యమని ప్రకటించింది. తమ కస్టమర్లకు మరింత విలువను సమకూర్చడం, కొత్త ప్రాంతాలకు విస్తరించడం ద్వారా దీన్ని సాధిస్తామని ఈక్విరస్ వెల్త్ సీఈవో అభిజిత్ భవే తెలిపారు. పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్) సహా కస్టమర్లకు ప్రత్యేకించిన పెట్టుబడుల సేవలను ఈ సంస్థ ఆఫర్ చేస్తుంటుంది. క్యాపిటల్ మార్కెట్లు, వెల్త్ మేనేజ్‌మెంట్, కార్పొరేట్ అడ్వైజరీలో తమకున్న లోతైన అనుభవం క్లయింట్లకు అసాధారణ విలువను సమకూర్చేందుకు సాయపడుతున్నట్టు ఈక్విరస్ గ్రూప్ ఎండీ అభిజిత్ దేశ్‌ముఖ్ పేర్కొన్నారు.

వ్యవసాయానికి ఉజ్వల భవిష్యత్

- సుస్థిర సాగు విధానాలు, టెక్నాలజీ అవసరం
- ఐటీసీ చైర్మన్ సంజీవ్ పురి



న్యూఢిల్లీ: వ్యవసాయ రంగం వృద్ధికి గొప్ప అవకాశాలున్నాయని ఐటీసీ చైర్మన్ సంజీవ్‌పురి అన్నారు. సుస్థిర సాగు విధానాలు, టెక్నాలజీ సాయంతో ఇందుకు అనుకూలమైన పరిష్కారాలు అవసరమన్నారు. ఈ రంగంలో ఉత్పాదకత, నాణ్యత పెరగాలంటూ, అదే సమయంలో వాతావరణ మార్పుల వంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. సీఐఐ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సంజీవ్ పురి ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా ఆహార, పోషకాహార భద్రతపై తీవ్ర ఆందోళన నెలకొందంటూ.. ఆహార ద్రవ్యోల్బణం కొండెక్కి కూర్చోవడానికి ఇలాంటి అంశాలే కారణమని వ్యాఖ్యానించారు. ''భారత్‌లో పెద్ద సంఖ్యలో చిన్న, సన్నకారు రైతులున్నారు. వారితో మనం ఏ విధంగా కలసి పనిచేయగలం ? వారిని ఉత్పాదకత దిశగా, భవిష్యత్‌కు అనుగుణంగా ఎలా సన్నద్ధులను చేయగలం ? ఈ దిశగా వృద్ధికి గొప్ప అవకాశాలున్నాయి''అని సంజీవ్‌పురి చెప్పారు. సాగు విధానాలు పర్యావరణ అనుకూలంగా ఉండేలా చూడాలన్నారు. ఈ తరహా సుస్థిర సాగు విధానాలు అవసరమన్నారు. నూతన తరం టెక్నాలజీల సాయంతో, వినూత్నమైన, సమగ్రమైన పరిష్కారాలను రైతులకు అందించాలన్నారు. ఈ దిశగా కొంత పురోగతి సాధించినప్పటికీ, ఇంకా ఎన్నో సవాళ్లు ఉన్నట్టు పేర్కొన్నారు.

ఆరేళ్లలో 8,000 సర్వీసింగ్ కేంద్రాలు

మారుతీ సుజుకీ లక్ష్యం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా దేశవ్యాప్తంగా సర్వీసింగ్ కేంద్రాలను విస్తరిస్తోంది. 2030–31 నాటికి మొత్తం 8,000 టచ్ పాయింట్లు అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా చేసుకున్నట్టు సంస్థ ఎండీ, సీఈవో హిసాటీ టాకేయూచీ తెలిపారు. నెక్సా 500వ టచ్ పాయింట్‌ను కంపెనీ బుధవారం ప్రారంభించింది. నెక్సా, ఆరీనా బ్రాండ్లలో మారుతీ సుజుకీ ఇండియాకు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 5,240 సర్వీసింగ్ కేంద్రాలు ఉన్నాయి. 'కస్టమర్లకు సౌలభ్యం, అత్యుత్తమ కారు యాజమాన్య అనుభవాన్ని స్థిరంగా అందించడమే మా లక్ష్యం. వినియోగదార్లకు దగ్గరవ్వాలి. తద్వారా సమీపంలో మారుతీ సుజుకీ సర్వీస్ టచ్‌పాయింట్‌ని కనుగొనగలమన్న భరోసా వారికి ఉంటుంది. వార్షిక తయారీ సామర్థ్యాన్ని, అమ్మకాలను గణనీయంగా పెంచడానికి ప్రణాళిక చేస్తున్నందున సర్వీస్ నెట్‌వర్క్‌ను ఏకకాలంలో బలోపేతం చేస్తాం' అని టాకేయూచీ వివరించారు. మారుతీ సుజుకీ తన మొదటి నెక్సా సర్వీస్ సెంటర్‌ను 2017 జూలైలో ప్రారంభించింది. 2023–24లో 90 కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక సంవత్సరంలో ఇదే అత్యధికం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు కంపెనీ కొత్తగా 78 నెక్సా సర్వీస్ టచ్‌పాయింట్లను తెరిచింది. 500ల సర్వీస్ టచ్‌పాయింట్ల మైలురాయిని 7 సంవత్సరాల 5 నెలల వ్యవధిలో చేరుకుంది.

వెల్‌నెస్ విభాగంలోకి డాక్టర్ మోర్‌పెన్



న్యూఢిల్లీ: డాక్టర్ మోర్‌పెన్ సంస్థ తాజాగా వెల్‌నెస్ విభాగంలోకి ప్రవేశించింది. స్థూలకాయాన్ని నియంత్రణలో ఉంచుకునేందుకు సహాయపడే లైట్‌లైఫ్ ప్రోడక్టును ఆవిష్కరించింది. దీనికి అనుబంధంగా వ్యక్తిగత న్యూట్రిషన్ ప్రణాళికలు, ట్రైనింగ్ గైడెన్స్ మొదలైనవి కూడా పొందవచ్చని వివరించింది. దేశీయంగా వెల్‌నెస్ ఉత్పత్తుల విభాగం రూ. 12,000 కోట్ల స్థాయిలో ఉండగా, వార్షికంగా 16 శాతం వృద్ధి చెందుతోందని పేర్కొంది. ఈ ప్రోడక్టు ద్వారా తొలి ఏడాది రూ. 30 కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు కంపెనీ సీఈవో వరుణ్ సూరి తెలిపారు. మోర్‌పెన్ ల్యాబరేటరీస్‌లో భాగమైన డాక్టర్ మోర్‌పెన్ ప్రస్తుతం ఓవర్ ది కౌంటర్ ఉత్పత్తుల సెగ్మెంట్ ద్వారా రూ. 200 కోట్ల ఆదాయం ఆర్జిస్తోంది. వరల్డ్ ఒబెసిటీ అట్లాస్ 2024 ప్రకారం 25 శాతం మంది పైగా దేశీయంగా వయోజనులు 2035 నాటికి స్థూలకాయం సమస్యను ఎదుర్కోవచ్చనే అంచనాలు ఉన్నాయి.

ఐసీఏఐ రిసర్చ్ హబ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) హైదరాబాద్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రిసర్చ్ హబ్‌ను ఏర్పాటు చేసింది. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు, ఆర్థిక అక్షరాస్యత, విధాన రూపకల్పనలో చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర, సులభతర వ్యాపారంతో కూడిన సుపరిపాలన తదితర అంశాలపై ఈ కేంద్రం లోతైన అధ్యయనాలను నిర్వహిస్తుందని ఐసీఏఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరిశోధన కార్యక్రమాల ద్వారా వెల్లడైన అంశాలను ప్రభుత్వంతో పంచుకుంటామని వివరించింది. కాగా, సెంటర్ డైరెక్టర్, డీన్‌గా నుపుర్ పవన్ బంగ్‌ను ఐసీఏఐ నియమించింది. జైపూర్‌లోనూ ఐసీఏఐకి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఉంది. కోల్‌కతలో ఇటువంటి కేంద్రాన్ని 2025 జనవరిలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడానికి వచ్చే మూడేళ్లలో దేశవ్యాప్తంగా మరో ఎనిమిది సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను నెలకొల్పాలని ఐసీఏఐ యోచిస్తోంది. దాదాపు 9.85 లక్షల మంది విద్యార్థులు, 4 లక్షల మంది సభ్యులతో ఐసీఏఐ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రొఫెషనల్ అకౌంటెన్సీ సంస్థ కావడం విశేషం.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,504.00	1.9
BHARTIARTL	1,610.00	1.51
INDUSINDBK	998	1.34
TECHM	1,784.05	1.21
ADANIPORTS	1,244.15	0.84

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
NTPC	355.9	-2.63
HINDUNILVR	2,345.90	-2.31
COALINDIA	407.9	-2.17
HEROMOTOCO	4,555.00	-2.05
BPCL	301.75	-1.85

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,124
ఎన్ఎస్ఈ	1,06,113
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,44,899
ఎఫ్ఐఐ	- 3,560
డీఐఐ	+ 2,647

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.31	$ 70.29
బ్రెంట్	72.61	$ 73.52

డేటా సెంటర్లలోకి 60 బిలియన్ డాలర్లు

- 2019–24 మధ్య పెట్టుబడుల హామీలు
- 2027 నాటికి 100 బిలియన్ డాలర్లు దాటిపోవచ్చని అంచనా
- సీబీఆర్ఈ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా విస్తరిస్తున్న డేటా సెంటర్ మార్కెట్ భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఆరేళ్ల వ్యవధిలో (2019–24) 60 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశ ఇన్వెస్టర్లు హామీ ఇచ్చారు. దీంతో 2027 ఆఖరు నాటికి ఈ విభాగంలోకి మొత్తం పెట్టుబడులు 100 బిలియన్ డాలర్ల స్థాయిని దాటిపోవచ్చనే అంచనాలు నెలకొన్నాయి. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్ఈ సౌత్ ఏషియా విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 'భారత డేటా సెంటర్ మార్కెట్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అంతర్జాతీయ సంస్థలు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ప్రైవేట్ ఈక్విటీ ఫండ్స్ గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నాయి' అని నివేదిక పేర్కొంది. పెట్టుబడుల హామీలు పొందిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ, ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ అగ్రస్థానాల్లో ఉన్నాయి.

అసాధారణ వృద్ధి..

పెరుగుతున్న డిజిటల్ వినియోగం, ప్రభుత్వ తోడ్పాటు, దేశ విదేశ ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడుల దన్నుతో భారత డేటా సెంటర్ మార్కెట్ అసాధారణ వృద్ధిని నమోదు చేస్తోందని సీబీఆర్ఈ చైర్మన్ అన్షుమన్ మ్యాగజైన్ తెలిపారు. బీఎఫ్ఎస్ఐ, టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్ రంగాల నుంచి డిమాండ్ నెలకొనడం, రాష్ట్రాల స్థాయిలో పాలసీల పరంగా ఇస్తున్న ప్రోత్సాహకాలు మొదలైనవి ఇందుకు దోహదం చేస్తున్నాయని వివరించారు.

నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- 2025 ఆఖరు నాటికి భారత డేటా సెంటర్ సామర్థ్యం 2,070 మెగావాట్ల స్థాయికి చేరు కోనుంది. ప్రస్తుతం ఇది 1,255 మెగావాట్లుగా ఉండగా, ఈ ఏడాది ఆఖరు నాటికి 1,600 మెగావాట్లకు చేరుకోవచ్చనే అంచనాలు ఉన్నాయి.
- డేటా సెంటర్ల సంఖ్యాపరంగా ముంబై అగ్రస్థానంలో ఉండగా చెన్నై, ఢిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరు తర్వాత స్థానాల్లో ఉన్నాయి. దేశీయంగా మొత్తం డేటా సెంటర్ సామర్థ్యాల్లో 90 శాతం ఈ నగరాల్లోనే ఉన్నాయి.
- టెక్నాలజీ వినియోగం వేగవంతం కావడం, డిజిటల్ పరివర్తన, ఇంటర్నెట్ విస్తృతి పెరగడం, సానుకూల విధానాలు, (ఏఐ) ఆధారిత డేటా మొదలైనవి డేటా సెంటర్ల వృద్ధికి తోడ్పడగలవు. అలాగే ఈ విభాగానికి మౌలిక రంగం హోదా ఇవ్వడం సైతం ఇందుకు దోహదపడుతున్న కీలకాంశాల్లో ఒకటి. దీనితో ఆపరేటర్లు, డెవలపర్లకు ఒక సానుకూల వాతావరణం ఏర్పడింది. డిజిటల్ వ్యక్తిగత డేటా భ ద్రత చట్టం (డీపీడీపీఏ) అమలు అనేది చట్ట బద్ధమైన డేటా ప్రాసెసింగ్‌కు, సంబంధిత వర్గా ల విశ్వాసాన్ని చూరగొనేందుకు దోహదపడింది.

విద్యుత్ వాహనాల్లోకి రూ. 3.4 లక్షల కోట్ల పెట్టుబడులు

- 2030 నాటికి అంచనాలు
- రియల్ ఎస్టేట్‌కి కూడా ఊతం
- కొలియర్స్ ఇండియా నివేదిక



న్యూఢిల్లీ: దేశీయంగా విద్యుత్ వాహనాలు (ఈవీ), అనుబంధ పరిశ్రమల్లోకి వచ్చే ఆరేళ్లలో భారీగా పెట్టుబడులు రానున్నాయి. దేశ, విదేశ సంస్థలు రూ. 3.4 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నాయి. అయితే, 2030 నాటికి మొత్తం వాహనాల్లో ఈవీల వాటాను 30 శాతానికి పెంచుకోవాలన్న లక్ష్యం దిశగా పురోగతి అంతంత మాత్రంగానే ఉంటోంది. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా ఒక నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది. దీని ప్రకారం భారత్‌లో ఈవీల వినియోగం 8 శాతంగా ఉంది. 2024లో ఈవీల అమ్మకాలు సుమారు 20 లక్షల యూనిట్లుగా ఉంటాయనే అంచనాలు ఉన్నాయి. 'ఈవీల వినియోగం చెప్పుకోతగ్గ స్థాయిలో ఉన్నప్పటికీ, ఊహించినంత వేగంగా పుంజుకోవడం లేదు' అని నివేదిక వివరించింది. ఈవీ విభాగంలో 2030 వరకు కంపెనీలు దశలవారీగా 40 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 3,40,000 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. ఇందులో 27 బిలియన్ డాలర్లు లిథియం అయాన్ బ్యాటరీల తయారీపై, 9 బిలియన్ డాలర్లు ఈవీలు, ఒరిజినల్ విడిభాగాల (ఓఈ) తయారీపై వెచ్చించనున్నట్లు వివరించింది. ఈవీ రంగంలోకి భారీ పెట్టుబడుల రాకతో రియల్ ఎస్టేట్ పరిశ్రమకు కూడా ఊతం లభించగలదని నివేదిక పేర్కొంది.

నివేదికలోని మరిన్ని అంశాలు..

- వచ్చే 5–6 ఏళ్లలో రాబోయే భారీ పెట్టుబడులతో రియల్ ఎస్టేట్‌కి సంబంధించి, ముఖ్యంగా పరిశ్రమలు.. వేర్‌హౌసింగ్ విభాగంలో, గణనీయంగా వృద్ధి అవకాశాలు ఉండగలవు. ఈవీలు, ఓఈలు, లిథియం అయాన్ బ్యాటరీలు మొదలైన వాటి తయారీ కోసం స్థల సమీకరణ, ప్లాంట్ల ఏర్పాటు వేగవంతం కావచ్చు.
- 2030 నాటికి 30 శాతం స్థాయిలో ఎలక్ట్రిక్ మొబిలిటీ సాధించాలని భారత్ నిర్దేశించుకుంది. అంటే సుమారు 8 కోట్ల ఈవీలు ఉండాలి. అయితే, అమ్మకాల పరిమాణం స్థిరంగా పెరుగుతూ, ప్రభుత్వం నుంచి కూడా తోడ్పాటు అందుతున్నప్పటికీ పురోగతి పెద్దగా లేదు. ప్రస్తుతం ఈవీల విస్తృతి దాదాపు 8 శాతంగా, వాహనాల సంఖ్య కేవలం 50 లక్షల పైచిలుకు ఉంది. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే వివిధ కేటగిరీలవ్యాప్తంగా ఈవీల వినియోగం అనేక రెట్లు వృద్ధి చెందాలి.
- ఆసక్తికరంగా ఈ–రిక్షాల్లాంటి త్రీవీలర్ల విభాగంలో ఈవీల వినియోగం ఎక్కువగా ఉంటోంది. టూ వీలర్లు, ఫోర్ వీలర్లను దేశీయంగా తయారు చేయడాన్ని మరింతగా ప్రోత్సహిస్తే ఈవీ కొనుగోళ్లకు సంబంధించి స్థిర వ్యయాల భారం తగ్గుతుంది. సబ్సిడీలు, పన్నులపరమైన ప్రోత్సాహకాలు, దేశీయంగా తయారీని ప్రోత్సహించడంతో పాటు చార్జింగ్ మౌలిక సదుపాయాలను కూడా మెరుగుపరిస్తే వివిధ కేటగిరీల వ్యాప్తంగా ఈవీల అమ్మకాలు పుంజుకోగలవు. అలాగే, ఈవీలు, ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ (ఐసీఈ) వాహనాల ధరల మధ్య వ్యత్యాసాన్ని (వాహనాన్ని బట్టి ప్రస్తుతం 20–50 శాతం స్థాయిలో ఉంది) గణనీయంగా తగ్గిస్తే ఈవీల అమ్మకాలు అనేక రెట్లు పెరిగే అవకాశం ఉంది.

భారత అండర్-19 జట్టులో త్రిష, ధృతి, షబ్నమ్


త్రిష


షబ్నమ్

న్యూఢిల్లీ: జూనియర్ మహిళల ఆసియా కప్‌లో పాల్గొననున్న భారత అండర్-19 జట్టులో తెలంగాణకు చెందిన గొంగడి త్రిష, కేసరి ధృతి, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి షబ్నమ్ చోటు దక్కించుకున్నారు. కౌలాలంపూర్ వేదికగా ఈ నెల 15 నుంచి 22 వరకు జూనియర్ మహిళల ఆసియా కప్ జరగనుంది. సెలెక్షన్ కమిటీ గురువారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. నికీ ప్రసాద్ భారత జట్టుకు సారథ్యం వహించనుండగా... సనికా చాల్కె వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. అండర్-19 ప్రపంచకప్‌లో ఆడిన అనుభవం ఉన్న త్రిషతో పాటు మహిళల ఐపీఎల్లో గుజరాత్ జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న షబ్నమ్ ఇందులో చోటు దక్కించుకున్నారు. నలుగురు స్టాండ్‌బై ఆటగాళ్లను ప్రకటించగా... అందులో తెలంగాణ అమ్మాయి గుగులోత్ కావ్యశ్రీ కూడా ఉంది. ఈ టోర్నీలో పాకిస్తాన్, నేపాల్‌తో కలిసి భారత్ జట్టు గ్రూప్ 'ఎ' నుంచి పోటీ పడుతోంది. బంగ్లాదేశ్, శ్రీలంక, మలేసియా గ్రూప్ 'బి'లో ఉన్నాయి. టోర్నీ ఆరంభ పోరులో ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో భారత జట్టు తలపడుతుంది. గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిచిన రెండేసి జట్లు సూపర్-4కు అర్హత సాధించనున్నాయి. అందులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఈ నెల 22 జరగనున్న ఫైనల్లో తలపడనున్నాయి.

భారత జట్టు: నికీ ప్రసాద్ (కెప్టెన్), సనికా చాల్కె (వైస్ కెప్టెన్), గొంగడి త్రిష, కమలిని, భావిక అహిరె, ఈశ్వరి అవాసరె, మిథిలా వినోద్, జోషిత, సోనమ్ యాదవ్, పరుణిక సిసోడియా, కేసరి ధృతి, ఆయుషి శుక్లా, అనందిత కిషోర్, షబ్నమ్, నందన. **స్టాండ్‌బైలు:** హర్లీ గాలా, హ్యాపీ కుమారి, గుగులోత్ కావ్యశ్రీ, గాయత్రి.

ఫైనల్ బెర్త్ ఎవరిదో?

- నేడు ముస్తాక్ అలీ ట్రోఫీ సెమీఫైనల్స్
- బరోడాతో ముంబై; మధ్యప్రదేశ్‌తో ఢిల్లీ 'ఢీ'

తొలి సెమీఫైనల్ ఉదయం గం. 11:00 నుంచి, రెండో సెమీఫైనల్ సాయంత్రం గం. 4:30 నుంచి జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

బెంగళూరు: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చివరి అంకానికి చేరుకుంది. ఈ టోర్నీలో భాగంగా శుక్రవారం రెండు సెమీఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. తొలి సెమీస్‌లో బరోడాతో ముంబై జట్టు... రెండో మ్యాచ్‌లో మధ్యప్రదేశ్‌తో ఢిల్లీ తలపడనుంది. క్వార్టర్ ఫైనల్లో విదర్భ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించి ముంబై సెమీస్‌కు చేరితే... బెంగాల్‌పై గెలిచి బరోడా ముందడుగు వేసింది. సీనియర్ బ్యాటర్ అజింక్యా రహానే ఫుల్ ఫామ్‌లో ఉండగా... గత మ్యాచ్‌లో ఓపెనర్ పృథ్వీ షా కూడా రాణించాడు. శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గె, శార్దుల్ ఠాకూర్ ఇలా ముంబై జట్టులో మ్యాచ్ విన్నర్లకు కొదవలేదు. మరోవైపు బరోడా జట్టుకు హార్దిక్ పాండ్యా, కృనాల్ పాండ్యా కీలకం కానున్నారు. మరో సెమీఫైనల్లో ఆయుశ్ బదోనీ సారథ్యంలోని ఢిల్లీ జట్టు... మధ్యప్రదేశ్‌తో తలపడనుంది. ఢిల్లీకి అనూజ్ రావత్, యశ్ ధుల్ కీలకం కానుండగా... రజత్ పాటిదార్, వెంకటేశ్ అయ్యర్‌పై మధ్యప్రదేశ్ జట్టు భారీ అంచనాలు పెట్టుకుంది.



గెలిచి నిలిచిన గాయత్రి-ట్రెసా జోడీ

హాంగ్జౌ (చైనా): బ్యాడ్మింటన్ సీజన్ ముగింపు టోర్నమెంట్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో భారత జోడీ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ తొలి విజయం నమోదు చేసుకుంది. మొదటిసారి ఈ టోర్నీకి అర్హత సాధించిన గాయత్రి-ట్రెసా జంట తొలి లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ నంబర్ జోడీ చేతిలో ఓడినా... రెండో మ్యాచ్‌లో తిరిగి పుంజుకుంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా గురువారం జరిగిన పోరులో గాయత్రి -ట్రెసా ద్వయం 21-19, 21-19తో ప్రపంచ ఆరో ర్యాంక్ పియర్లీ టాన్-థీనా మరళీధరన్ (మలేసియా) జంటపై గెలుపొందింది. సెమీఫైనల్ అవకాశాలు సజీవంగా ఉండాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో మన అమ్మాయిలు... ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వరుస గేమ్‌ల్లో విజృంభించారు. 46 నిమిషాల పాటు సాగిన పోరులో మలేసియా జోడీ ఒక దశలో వరుసగా 6 పాయింట్లు సాధించి ఆధిక్యం కనబర్చే ప్రయత్నం చేయగా... భారత జంట కీలక సమయాల్లో విజృంభించి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ ఆధిక్యం చేతులు మారుతూ సాగినా... చివరకు గాయత్రి-ట్రెసా జంటనే విజయం వరించింది. గ్రూప్ 'ఎ'లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన చైనా జంట 2 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... భారత జట్టు ఒక పాయింట్‌తో రెండో స్థానంలో ఉంది. భారత షట్లర్లు సెమీఫైనల్‌కు అర్హత సాధించాలంటే నేడు జరిగే గ్రూప్ దశ చివరి లీగ్ మ్యాచ్‌లో నామీ మసుయమా-చిహారు షిడా (జపాన్)పై విజయం సాధించాల్సి ఉంటుంది.



సెమీఫైనల్లో భారత్

మస్కట్: డిఫెండింగ్ చాంపియన్ భారత మహిళల హాకీ జట్టు జూనియర్ ఆసియా కప్ టోర్నీలో సెమీఫైనల్స్‌కు చేరింది. తద్వారా జూనియర్ ప్రపంచకప్ టోర్నీకి కూడా అర్హత సంపాదించింది. ఆసియా టైటిల్ వేటలో భారత్ రెండు అడుగుల దూరంలో ఉంది. గురువారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 9-0 గోల్స్ తేడాతో థాయ్‌లాండ్‌పై ఏకపక్ష విజయం సాధించింది. భారత ఫార్వర్డ్ ప్లేయర్ దీపిక అద్భుతంగా రాణించింది. ఆమె నాలుగు (28వ, 31వ, 35వ, 55వ నిమిషాల్లో) గోల్స్ చేయగా, కనిక సివాచ్ (23వ, 25వ, 40వ నిమిషాల్లో) మూడు గోల్స్ అందించింది. మిగతా వారిలో సాక్షి రాణా (17వ నిమిషంలో), లాల్‌రిన్‌పుయి (27వ నిమిషంలో), గోల్స్ చేశారు. భారత్ తొలి అర్ధభాగం (రెండు క్వార్టర్లు) ముగిసేసరికే 5-0తో మ్యాచ్‌ను శాసించేస్థితిలో నిలిచింది. మూడు, నాలుగో క్వార్టర్లలో మరో నాలుగు గోల్స్ సాధించింది. మూడో క్వార్టర్ మొదలైన నిమిషాల వ్యవధిలోనే రెండు గోల్స్ చేయడం ద్వారా దీపిక, కాసేపటికే మూడో గోల్ సాధించిన కనిక 'హ్యాట్రిక్స్' నమోదు చేశారు. శనివారం జరిగే సెమీఫైనల్లో జపాన్‌తో భారత్; చైనాతో దక్షిణ కొరియా తలపడతాయి.


వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్

భారత మహిళల జట్టుకు జరిమానా

పెర్త్: ఆస్ట్రేలియా గడ్డపై వన్డే సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన భారత మహిళల క్రికెట్ జట్టుకు మరో దెబ్బ తగిలింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం ఇరు జట్ల మధ్య బ్రిస్బేన్‌లో జరిగిన రెండో వన్డేలో టీమిండియా స్లో ఓవర్‌రేట్‌కు పాల్పడటంతో ప్లేయర్ల మ్యాచ్ ఫీజులో కోత పడింది. నిర్ణీత సమయంలో రెండు ఓవర్లు తక్కువ వేయడంతో ఓవర్‌కు 5 చొప్పున... భారత ప్లేయర్ల మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధిస్తున్నట్లు రెఫరీ డేవిడ్ గిల్‌బర్ట్ వెల్లడించాడు. ఐసీసీ నియమావళిలోని 2.22 ఆర్టికల్ ప్రకారం జరిమానా విధించినట్లు పేర్కొన్నాడు. భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తప్పు అంగీకరించడంతో ఎలాంటి విచారణ లేకుండా నేరుగా కోత విధించినట్లు తెలిపాడు.

గుజరాత్ బౌలింగ్ కోచ్‌గా ప్రవీణ్ తాంబే



అహ్మదాబాద్: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ ఫ్రాంచైజీ గురువారం బౌలింగ్ కోచ్‌గా మాజీ లెగ్‌స్పిన్నర్ ప్రవీణ్ తాంబేను నియమించింది. ఆస్ట్రేలియాకు చెందిన డానియెల్ మార్ష్‌కు బ్యాటింగ్ కోచ్ బాధ్యతలు అప్పగించింది. గత సీజన్‌లో హెడ్ కోచ్‌గా ఉన్న మైకేల్ క్లింగర్ (ఆస్ట్రేలియా)ను కొనసాగించనున్నట్లు ఫ్రాంచైజీ యాజమాన్యం తెలిపింది. 2013 సీజన్‌లో 41 ఏళ్ల లేటు వయసులో తాంబే ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ తరఫున అరంగేట్రం చేశాడు. కెరీర్ తదనంతరం కోచ్‌గా కోల్‌కతా నైట్‌రైడర్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీలకు సేవలందించాడు. ఇప్పుడు 53 ఏళ్ల వయసులో మహిళల లీగ్‌లో కోచింగ్ బాధ్యతలకు సిద్ధమయ్యాడు. ప్రతిభావంతులైన మహిళా క్రికెటర్ల బృందంతో పనిచేసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాని తాంబే చెప్పాడు. ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్ టీమ్ టాస్మేనియా హెడ్ కోచ్‌గా 2013 నుంచి 2017 వరకు పనిచేసిన మార్ష్... 2022లో ఆస్ట్రేలియా మహిళల జాతీయ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరించారు. వచ్చే సీజన్ డబ్ల్యూపీఎల్ కోసం ఆదివారం బెంగళూరులో ప్లేయర్ల వేలాన్ని నిర్వహించనున్నారు.

తెలుగు టైటాన్స్ పరాజయం

దబంగ్ ఢిల్లీ చేతిలో ఓటమి


తెలుగు టైటాన్స్ రెయిడర్‌ను పట్టేసిన దబంగ్ ఢిల్లీ ఆటగాళ్లు

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు ఖాతాలో మరో పరాజయం చేరింది. గురువారం జరిగిన పోరులో తెలుగు టైటాన్స్ 27-33 పాయింట్ల తేడాతో దబంగ్ ఢిల్లీ చేతిలో ఓడింది. టైటాన్స్ తరఫున విజయ్ మలిక్ 10 పాయింట్లు, ఆశిష్ నర్వాల్ 8 పాయింట్లు సాధించారు. దబంగ్ ఢిల్లీ తరఫున స్టార్ రెయిడర్ నవీన్ కుమార్ 11 పాయింట్లతో రాణించగా... ఆశు మలిక్ 9 పాయింట్లతో అతడికి సహకరించాడు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 21 రెయిడ్ పాయింట్లు సాధించగా... టైటాన్స్ 20 రెయిడ్ పాయింట్లు సాధించింది. అయితే టైటాన్స్ రెండుసార్లు ఆలౌటై... ప్రత్యర్థికి 4 పాయింట్లు సమర్పించుకోగా... ఢిల్లీ జట్టు ఒకేసారి ఆలౌటైంది. తాజా సీజన్‌లో 19 మ్యాచ్‌లు ఆడిన టైటాన్స్ 10 విజయాలు, 9 పరాజయాలతో 55 పాయింట్లు ఖాతాలో వేసుకొని ఆరో స్థానంలో నిలవగా... దబంగ్ ఢిల్లీ 18 మ్యాచ్‌ల్లో 9 విజయాలు, 5 పరాజయాలు, 4 'టై'లతో 61 పాయింట్లు సాధించి రెండో స్థానానికి ఎగబాకింది. యూపీ యోధాస్, బెంగాల్ వారియర్స్ మధ్య జరిగిన మరో మ్యాచ్ 31-31 పాయింట్లతో 'టై'గా ముగిసింది. యూపీ యోధాస్ తరఫున గగన్ గౌడ 11 పాయింట్లతో రాణించగా... బెంగాల్ వారియర్స్ తరఫున ప్రణయ్ 10 పాయింట్లతో సత్తాచాటాడు. పాయింట్ల పట్టికలో యూపీ యోధాస్ (59 పాయింట్లు) నాలుగో స్థానానికి చేరగా... బెంగాల్ వారియర్స్ (40 పాయింట్లు) 9వ స్థానంలో ఉంది. శుక్రవారం జరగనున్న మ్యాచ్‌ల్లో తమిళ్ తలైవాస్‌తో పట్నా పైరేట్స్ (రాత్రి 8 గంటలకు), పుణేరి పల్టన్‌తో బెంగళూరు బుల్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.


రాహుల్


ప్రాక్టీస్‌లో భారత ఆటగాళ్లు


బుమ్రా

ఫుల్ ప్రాక్టీస్...

బ్రిస్బేన్‌లో చెమటోడ్చిన టీమిండియా

రేపటి నుంచి ఆస్ట్రేలియాతో మూడో టెస్టు

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాతో మూడో టెస్టుకు ముందు భారత క్రికెట్ జట్టు కఠోర సాధన చేస్తోంది. ప్రతిష్టాత్మక 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'ని నిలబెట్టుకోవడంతో పాటు... ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ చేరడమే లక్ష్యంగా సాగుతున్న టీమిండియా గురువారం బ్రిస్బేన్‌లో చెమటోడ్చింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇరు జట్లు చెరో టెస్టు గెలిచి 1-1తో సమంగా నిలవగా... శనివారం నుంచి మూడో మ్యాచ్ ప్రారంభం కానుంది. దీని కోసం గురువారమే బ్రిస్బేన్ చేరుకున్న రోహిత్ శర్మ బృందం... రోజంతా ప్రాక్టీస్‌లో నిమగ్నమైంది. గత రెండు పర్యాయాలు ఆస్ట్రేలియా పర్యటనలో టెస్టు సిరీస్‌లు గెలిచిన టీమిండియా... ఈసారి కూడా అదే మ్యాజిక్ కొనసాగిస్తూ 'హ్యాట్రిక్' కొట్టాలని భావిస్తోంది. అడిలైడ్‌లో 'పింక్ బాల్'తో జరిగిన రెండో టెస్టులో పరాజయంతో జట్టు సభ్యుల్లో ఆత్మవిశ్వాసం లోపించినట్లు కనిపిస్తున్న నేపథ్యంలో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి ఆటగాళ్లకు కీలక సూచనలు చేశాడు. టెస్టు ఫార్మాట్‌లో రోహిత్ కన్నా ఎక్కువ అనుభవం ఉన్న కోహ్లి... గురువారం ప్రాక్టీస్ సందర్భంగా సహచరుల్లో స్ఫూర్తి నింపాడు. తిరిగి పుంజుకునే విధంగా యువ ఆటగాళ్లకు కీలక సూచనలు ఇచ్చాడు. బుమ్రా, రోహిత్‌తోనూ కోహ్లి విడిగా చర్చిస్తూ కనిపించాడు. గత మ్యాచ్‌లో మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి విఫలమైన కెప్టెన్ రోహిత్ శర్మ... మూడో టెస్టులో ఏ స్థానంలో బరిలోకి దిగుతాడనేది ఆసక్తికరంగా మారింది. ప్రాక్టీస్ సందర్భంగా రోహిత్ అటు కొత్త బంతితో పాటు... పాత బంతితోనూ సాధన కొనసాగించాడు. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ కొత్త బంతితో ప్రాక్టీస్ చేశారు. పచ్చికతో కూడిన గబ్బా పిచ్... పేస్‌కు, బౌన్స్‌కు సహకరించడం ఖాయం కాగా... రోహిత్ ఓపెనర్‌గానే బరిలోకి దిగి ప్రత్యర్థి బౌలర్ల లయను దెబ్బతీయడమే మేలని పలువురు మాజీలు అభిప్రాయపడుతున్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రాక్టీస్ సెషన్‌ను దగ్గరుండి పర్యవేక్షించాడు. ఈ సందర్భంగా రోహిత్, కోహ్లీతో గంభీర్ సుదీర్ఘంగా సంభాషించాడు. ఆకాశ్‌కు అవకాశం దక్కేనా!

నెట్స్‌లో భారత బౌలర్లంతా తీవ్రంగా శ్రమించగా... పేసర్ ఆకాశ్‌దీప్ తన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అయినా మూడో టెస్టులో అతడికి అవకాశం దక్కడం కష్టమే. ఆస్ట్రేలియాతో తొలి టెస్టు ద్వారానే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన హర్షిత్ రాణా రెండో మ్యాచ్‌లో ఆకట్టుకోలేకపోయాడు. అయితే ఇప్పుడప్పుడే అతడి స్థానానికి వచ్చిన ప్రమాదమేమీ లేకపోయినా... ప్రాక్టీస్‌లో ఆకాశ్ బౌలింగ్ చూస్తుంటే హర్షిత్ స్థానంలో అతడికి అవకాశం ఇవ్వడమే మేలు అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మూడో టెస్టు జరగనున్న పిచ్ హర్షిత్ బౌలింగ్ శైలికి సహకరించే అవకాశాలున్నాయి. శస్త్రచికిత్స అనంతరం తిరిగి కోలుకొని దేశవాళీల్లో సత్తాచాటిన సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీ... 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో పాల్గొనే అవకాశాలు పెద్దగా కనిపించడం లేదు. రంజీ ట్రోఫీతో పాటు ముస్తాక్ అలీ టోర్నీలో షమీ సత్తా చాటినా... టెస్టు మ్యాచ్‌కు అవసరమైన ఫిట్‌నెస్ అతడు ఇంకా సాధించలేదు. 'షమీ గాయం నుంచి కోలుకున్నా... ఇంకా మడమ వాపు పూర్తిగా తగ్గలేదు. ఎక్కువ పనిభారం పడితే గాయం తిరగబెట్టే ప్రమాదం ఉంది. అతడు అంతర్జాతీయ మ్యాచ్ ఆడటానికి ముందు ఒక్కో మ్యాచ్‌లో 10 ఓవర్ల పాటు మూడు స్పెల్స్ వేయాల్సి ఉంటుంది. ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న విజయ్ హజారే ట్రోఫీలో షమీ బెంగాల్ తరఫున బరిలోకి దిగుతాడు' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. మూడో టెస్టులోనూ భారత జట్టు ఏకైక స్పిన్నర్‌తోనే బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌లో ఎవరికి చాన్స్ దక్కుతుందో చూడాలి.

జైస్వాల్ బస్ మిస్..


రోహిత్


జైస్వాల్

రెండో టెస్టు ముగిసిన అనంతరం గురువారం అడిలైడ్ నుంచి బ్రిస్బేన్‌కు బయలుదేరే సమయంలో భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ నిర్ణీత సమయానికి టీమ్ బస్ వద్దకు చేరుకోలేకపోయాడు. దీంతో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ... జైస్వాల్‌ను అక్కడే వదిలి మిగిలిన జట్టుతో ఎయిర్‌పోర్ట్‌కు పయనమయ్యాడు. జట్టు సభ్యులంతా వచ్చిన తర్వాత కూడా జైస్వాల్ అక్కడికి రాకపోవడంతో రోహిత్ అసహనానికి గురయ్యాడు. ఉదయం 10 గంటలకు విమానం ఎక్కాల్సి ఉండటంతో... జట్టు సభ్యులంతా గం 8:30కి హోటల్ నుంచి బయలుదేరగా... జైస్వాల్ సమయానికి రాలేకపోయాడు. దీంతో 20 నిమిషాల అనంతరం హోటల్ సిబ్బంది ప్రత్యేక వాహనంలో జైస్వాల్‌ను విమానాశ్రయానికి చేర్చారు.



రాజస్తాన్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదవుతోంది. ఈ సందర్భంగా గురువారం జైపూర్‌లో చేపట్టిన 'రన్ ఫర్ వికసిత్ రాజస్తాన్'లో పాల్గొని పరుగెడుతున్న ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ

పురుషుల ప్రాణాలూ ముఖ్యమే

- వారికీ చట్టపరమైన రక్షణ కావాలి
- ఆత్మహత్య చేసుకున్న బెంగళూరు టెక్కీ సోదరుడి ఆవేదన

బెంగళూరు: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బెంగళూరు టెక్కీ సోదరుడు భావోద్వేగంతో ప్రకటన చేశారు. మహిళల ప్రాణాలు ఎంత ముఖ్యమో పురుషుల ప్రాణాలూ అంతే ముఖ్యమని, పురుషుల రక్షణ కోసమూ చట్టం చేయాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. తన సోదరుడి ఆత్మహత్య సంఘటన తీవ్రత ఉన్నప్పటికీ, ఈ కేసులో ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులు అనుభవిస్తున్న పురుషుల కోసం చట్టాలు రూపొందించాలన్నారు. 'నా సోదరుడికి న్యాయం చేయాలి. పురుషులు కూడా వేధింపులకు గురవుతున్నారు. వారి కోసం కూడా చట్టాలు చేయాలి. ఈ విషయాన్ని భారత ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. స్త్రీ ప్రాణం ఎంత ముఖ్యమో పురుషుడి ప్రాణాలు కూడా అంతే ముఖ్యం. ఈ కేసులో ఇంకా ఎవరినీ అరెస్టు చేయలేదు. చట్టపరంగా ముందుకెళ్తాం'అని తెలిపారు. సుభాష్‌ను అత్తమామలు చిత్రహింసలకు గురిచేస్తున్నారని తమకు తెలుసని, కానీ అతను ఇలాంటి చర్యకు పాల్పడతాడని తాము ఊహించలేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా... భార్య, ఆమె కుటుంబ సభ్యుల వేధింపుల కారణంగానే బెంగళూరు టెక్కీ ఆత్మహత్యకు పాల్పడినట్లు వైట్ ఫీల్డ్ డీసీపీ శివకుమార్ ధ్రువీకరించారు. 'అతనిపై ఉత్తరప్రదేశ్‌లో పలు కేసులు నడుస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి అతని భార్య, ఆమె కుటుంబ సభ్యులు అతని నుంచి డబ్బు డిమాండ్ చేశారు. ఆ కారణాలతోనే ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ మేరకు మారతహళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. దర్యాప్తు కొనసాగుతోంది'అని ఆయన వెల్లడించారు.

చితాభస్మాన్ని కలపొద్దు

డిసెంబర్ 9న బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ 34 ఏళ్ల అతుల్ సుభాష్ ఆత్మహత్య చేసుకున్నారు. చనిపోవడానికి ముందు ఆయన 24 పేజీల సూసైడ్ నోట్ రాశారు. ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్ ఫ్యామిలీ కోర్టు జడ్జి తన వాదనను వినడం లేదని, కోర్టులోని ఓ అధికారి జడ్జి ముందు లంచం తీసుకున్నారని ఆయన ఆరోపించారు. తాను ఆత్మహత్య చేసుకోవడానికి ప్రేరేపించిన సంఘటనలను ఆయన పూసగుచ్చినట్లు వివరించారు. భార్య నికిత తనపై హత్య, లైంగిక వేధింపులు, డబ్బు కోసం వేధించడం, గృహ హింస, వరకట్నం సహా తొమ్మిది కేసులు పెట్టిందని సుభాష్ తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. తన నాలుగేళ్ల కుమారుడిని తనకు దూరంగా ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. తన బిడ్డను తన తల్లిదండ్రులకు అప్పగించాలని కోరారు. న్యాయం జరిగేవరకు తన చితాభస్మాన్ని నిమజ్జనం చేయొద్దని కుటుంబ సభ్యులను కోరుతూ సుభాష్ ఓ వీడియోను రికార్డు చేశారు.

మృగంలా ప్రవర్తించారు: నికిత ఆరోపణ

ఆత్మహత్యపై నేపథ్యంలో 2022లో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిన వివరాలు బయటకొచ్చాయి. జౌన్‌పూర్‌కు చెందిన నికితకు 2019లో బిహార్‌కు చెందిన సుభాష్‌తో వివాహం జరిగింది. వీరు బెంగళూరులో ఉంటూ అక్కడే పనిచేసేవారు. తన భర్త అతుల్ తనను కొట్టేవాడని, భార్యాభర్తల సంబంధం విషయంలో మృగంలా ప్రవర్తించేవాడని నికితా సింఘానియా ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లిలో ఇచ్చిన కట్నంతో సంతృప్తి పొందక మరో 10 లక్షలు డిమాండ్ చేశారన్నారు. కట్నంకోసం తనను శారీరకంగా, మానసికంగా హింసించారని పేర్కొన్నారు. తన తల్లిదండ్రులకు చెబితే సర్దుకుని పోవాలని సూచించేవారని ఫిర్యాదులో వెల్లడించారు. అయినా పరిస్థితి మెరుగుపడలేదని, మద్యం తాగి భర్త తనను కొట్టడం ప్రారంభించాడని, బెదిరించి తన జీతం మొత్తాన్ని అతని ఖాతాకు బదిలీ చేసుకునేవారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తన అత్తామామలు పదేపదే వేధించడం వల్లే తన తండ్రి ఆరోగ్యం క్షీణించిందని, 2019 ఆగస్టు 17న గుండెపోటుతో మరణించారని ఆమె తెలిపారు.

సిరియా సైనిక స్థావరాల్లో 80 శాతం ధ్వంసం

ప్రకటించిన ఇజ్రాయెల్



ఇజ్రాయెల్: సిరియాలోని వ్యూహాత్మక సైనిక స్థావరాల్లో 80 శాతం ప్రాంతాలపై దాడి చేసి ఆ దేశ సైనిక సామర్థ్యాలను చావుదెబ్బతీశామని ఇజ్రాయెల్ తెలిపింది. సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పాలన అంతమైన కొద్ది రోజులకే సిరియాలోని వ్యూహాత్మక సైనిక స్థావరాలపై తమ సేనలు గురిపెట్టి పని పూర్తిచేశామని ఇజ్రాయెల్ తెలిపింది. గత 48 గంటల్లో 400కు పైగా దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం గురువారం ప్రకటించింది. ఇజ్రాయెల్ ఆక్రమిత గోలన్ హైట్స్‌కు తూర్పున ఉన్న నిస్సైనీకరణ(బఫర్ జోన్) ప్రాంతంలోకి దళాలను పంపామని, 80 శాతం సిరియా సైనిక స్థావరాలను నేలమట్టంచేశామని వెల్లడించింది. ఆయుధ నిల్వలపై దాడి చేసి, అవి తిరుగుబాటుదారుల శక్తుల చేతుల్లో పడకుండా నిరోధించామని తెలిపింది.

అన్ని రకాల ఆయుధాలు ధ్వంసం

''అల్-బైదా పోర్టు, లటాకియా పోర్టు, డమాస్కస్, ఇతర కీలక నగరాల్లో శత్రువుల యుద్ధవిమానాలను కూల్చే ఆయుధ వ్యవస్థలు, ఆయుధాగారాలకు చెందిన 15 నావికాదళ నౌకలను ధ్వంసం చేశాం. సముద్రతలంపై 80 నుంచి 190 కిలోమీటర్ల పరిధిలో ఉన్న లక్ష్యాలను ఛేదించేందుకు సముద్రతలం నుంచి ప్రయోగించే స్వల్పశ్రేణి క్షిపణులను ధ్వంసంచేశాం. స్కడ్ క్షిపణులు, క్రూయిజ్ క్షిపణులు, ఉపరితలం నుంచి సముద్రం వరకు, ఉపరితలం నుంచి గగనతలంలోకి, ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణులు, మానవసహిత యుద్ధ వాహకాలు (యూఏవీ), యుద్ధ విమానాలు, యుద్ధ హెలికాప్టర్లు, రాడార్లు, ట్యాంకులు, హ్యాంగర్లు తదితర వ్యూహాత్మక ఆస్తులను నిర్వీర్యం చేశాం''అని సిరియా సైన్యం పేర్కొంది. సిరియాలో 2011లో అంతర్యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇజ్రాయెల్ వందలాది దాడులు చేసింది.

అసద్ పతనంపై నెతన్యాహు ఏమన్నారంటే..

అసద్ పాలన అంతమై రోజు చారిత్రాత్మకమైన రోజు అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. ఇరాన్, అసద్‌లకు ప్రధాన మద్దతుదారులైన హెజ్‌బొల్లాలను తాము చావు దెబ్బ కొట్టిన ఫలితమే అసద్ పాలన అంతానికి అసలు కారణమని ఆయన వ్యాఖ్యానించారు. అణచివేత పాలన నుంచి విముక్తి పొందాలనుకునేవారికి స్వేచ్ఛ, సాధికారత ఇజ్రాయెల్ కల్పించిందని ఆయన ఒక వీడియో ప్రకటనలో చెప్పారు. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్లను, ఇరాన్ మద్దతు ఉన్న పాలస్తీనా హమాస్ కీలక నేతలను, లెబనాన్ హెజ్‌బొల్లా సీనియర్ నాయకులను ఇజ్రాయెల్ వరసబెట్టి అనూహ్య దాడుల్లో అంతంచేయడం తెల్సిందే.



అయోధ్య రామ మందిరం, క్రిస్మస్ ట్రీ పక్కనే చేయి ఊపుతూ శాంటాక్లజ్ వేషధారి.. బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో గురువారం జరిగిన వార్షిక కేక్ షోలో ఈ దృశ్యం చోటుచేసుకుంది. సుమారు 850 కిలోల చక్కెరతో రామ మందిరం ప్రతిమను రూపొందించారు.

ఆ జైళ్లన్నిటినీ మూసి వేస్తాం

సిరియా తిరుగుబాటుదార్ల నేత వెల్లడి



డమాస్కస్: పదవీచ్యుత అధ్యక్షుడు బషర్ అల్- అసద్ కాలంలోని భయంకరమైన జైళ్లన్నిటినీ మూసివేస్తామని సిరియా తిరుగుబాటుదార్లు ప్రకటించారు. ఈ జైళ్లలో నిర్బంధించిన వేలాదిమందిని చిత్రహింసలకు గురిచేసి, చంపిన వారికి శిక్ష తప్పదని స్పష్టం చేశారు. వారికి క్షమాభిక్షనిచ్చే ప్రశ్నే లేదన్నారు. ఇందుకు బాధ్యులైన అధికారులను తిరిగి తమకు అప్పగించాలంటూ వారు పారిపోయినట్లుగా భావిస్తున్న దేశాలను కోరుతామని చెప్పారు. తిరుగుబాటుదార్ల నేత అహ్మద్ అల్-షరా అలియాస్ అబూ మహ్మద్ అల్-జొలానీ ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో రసాయన ఆయుధాల స్థావరాలను గుర్తించేందుకు అంతర్జాతీయ సంస్థల సాయం కోరుతామని చెప్పారు. అసద్ హయాంలోని భద్రతా బలగాలను రద్దు చేస్తామన్నారు. జొలానీ ప్రకటనను అమెరికా స్వాగతించింది. జొలానీ చేతల్లో చూపించాలని అమెరికా రక్షణ శాఖ ప్రతినిధి సబ్రినా సింగ్ వ్యాఖ్యానించారు.

సిరియాలోని రసాయన ఆయుధాలు తప్పుడు వ్యక్తుల చేతుల్లో పడకుండా చూడటంపైనే తమ దృష్టంతా ఉందన్నారు. అసద్ రష్యాకు పలాయనమవడం, సిరియా తమ ఆధీనంలో ఉన్నట్లు తిరుగుబాటుదార్లు ప్రకటించుకోవడంతో డమాస్కస్‌లోని ప్రధాన జైలులో బందీలుగా ఉన్న వేలాది మందికి ఆదివారం విముక్తి లభించడం తెలిసిందే.

షెన్‌జెన్‌లోకి రొమేనియా, బల్గేరియా

బ్రస్సెల్స్: యూరోపియన్ యూనియన్(ఈయూ) సభ్య దేశాలైన రొమేనియా, బల్గేరియాలు ఎట్టకేలకు నియంత్రణలు లేని సరిహద్దు ప్రయాణ షెన్‌జెన్ జోన్‌లో చేరాయి. ఈ రెండు దేశాల పౌరులు 2025 జనవరి ఒకటో తేదీ నుంచి ఫ్రాన్స్, స్పెయిన్ నుంచి నార్వే వరకు ఎటువంటి పాస్‌పోర్టు అవసరం లేకుండానే ప్రయాణించేందుకు వీలవుతుంది. ఈ పరిణామంతో 17 ఏళ్ల క్రితం ఈయూలో చేరిన ఈ రెండు దేశాలకు పూర్తి స్థాయి సభ్యత్వం వచ్చినట్లయింది. ఈ రెండు దేశాలకు చెందిన సముద్ర, విమాన ప్రయాణాలు చేసే వారికి మార్చిలోనే సరిహద్దు ఆంక్షలు తొలగించారు. అయితే, ట్రక్కులకు మాత్రం సరిహద్దుల వద్ద తనిఖీలు యథా ప్రకారం కొనసాగుతాయి. యూరప్ దేశాలకు అక్రమ వలసల బెడద ఎక్కువైన నేపథ్యంలో సరిహద్దుల వద్ద తాత్కాలిక నియంత్రణలు కొనసాగుతున్నాయి. 1985లో అమల్లోకి వచ్చిన షెన్‌జెన్ జోన్ నిబంధనలతో చాలా వరకు యూరప్‌తోపాటు ఈయూయేతర దేశాలైన నార్వే, స్విట్జర్లాండ్ దేశాల్లోనూ స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశముంది. షెన్‌జెన్‌లో యూకేకు సభ్యత్వం లేదు. ఆదేశ ప్రయాణికులు ప్రతి 180 రోజుల్లో 90 రోజులపాటు వీసా లేకుండానే ప్రయాణించే సౌలభ్యం మాత్రం ఉంది.

వాయుయాన్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: దేశంలో విమానాల డిజైన్, తయారీని సులభతరం చేయడానికి ఉద్దేశించిన భారతీయ వాయుయాన్ విధేయక్(బీవీవీ) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం లభించింది. 90 ఏళ్ల క్రితం1934 నాటి చట్టం స్థానంలో తీసుకువచ్చిన బీవీవీ బిల్లుకు డిసెంబర్ 11న పార్లమెంట్ ఆమోదం తెలిపింది. తాజా బిల్లులో విమానాల డిజైన్, ఉత్పత్తి, నిర్వహణ, విక్రయం, ఎగుమతి దిగుమతులు సంబంధించిన అన్ని విషయాలపైనా పూర్తి స్థాయిలో స్పష్టతనిచ్చే నిబంధలను పొందుపరిచినట్లు న్యాయ శాఖ నోటిఫికేషన్ పేర్కొంది.



అహ్మదాబాద్‌లో గురువారం 'శ్రామిక్ అన్నపూర్ణ కేంద్ర'ను ప్రారంభించిన సందర్భంగా అర్హులకు స్వయంగా భోజనం వడ్డిస్తున్న గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్

హాల్‌తో రక్షణ శాఖ భారీ డీల్

న్యూఢిల్లీ: కేంద్ర రక్షణ శాఖ ప్రభుత్వ రంగ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్)తో భారీ ఒప్పందం కుదుర్చుకుంది. వాయుసేనకు అవసరమైన 12 సుఖోయ్‌ల కోసం రూ.13,500 కోట్ల డీల్‌పై సంతకాలు చేసింది. రష్యాలో రూపకల్పన చేసిన ఈ టూ-సీటర్ మల్టీ-రోల్ లాంగ్ -రేంజ్ యుద్ధ విమానం విమానాల్లో 62.6 శాతం దేశీయ సామగ్రినే వినియోగిస్తారు. రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం వీటిని హాల్ ఉత్పత్తి చేసి రక్షణ శాఖకు అందజేయనుంది. ఆత్మనిర్భర్ భారత్‌కు ప్రోత్సాహంగా ఎస్‌యూ-30 ఎంకేఐ యుద్ధ విమానాల తయారీకి హాల్‌తో ఒప్పందం చేసుకున్నట్లు రక్షణ శాఖ తెలిపింది.

టెక్ దిగ్గజాలపై ఆస్ట్రేలియా కొరడా

- వార్తా సంస్థలతో ఒప్పందాలు చేసుకోవాలంటూ హుకుం
- లేకుంటే భారీగా పన్ను భారం
- ససేమిరా అంటున్న మెటా

కాన్‌బెర్రా: టెక్ దిగ్గజాలపై కొరడా ఝళిపించేందుకు ఆస్ట్రేలియా సిద్ధమైంది. వార్తలు ప్రచురించినందుకు స్థానిక మీడియాకు చెల్లింపులు చేసేందుకు ఉద్దేశించిన కఠిన చట్టం త్వరలో అమలవనుందని ప్రభుత్వం గురువారం తెలిపింది. 2025 జనవరి నుంచి ఇది అమలవుతుందని, ఫిబ్రవరిలో పార్లమెంట్ ఆమోదం తెలుపుతుందని పేర్కొంది. మెటా, గూగుల్ వంటి బడా కంపెనీలు తమ వేదికలపై ప్రచురించే వార్తలకుగాను ఫీజు చెల్లించాలంటూ 2021లో ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఒక చట్టం తీసుకువచ్చింది. తాజా నిర్ణయం ఈ చట్టానికి కొనసాగింపేనని చెబుతున్నారు. అయితే, ఆస్ట్రేలియా వార్తా సంస్థలతో ఉన్న చెల్లింపు ఒప్పందాలను పునరుద్ధరించబోమని ఇటీవల ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌ల యాజమాన్య సంస్థ మెటా చేసిన ప్రకటన ఆస్ట్రేలియా పార్లమెంట్‌తో ప్రతిష్టంభనకు కారణమైంది. గురువారం ఆస్ట్రేలియా ప్రభుత్వం 'న్యూస్ బార్గెనింగ్ ఇన్సెంటివ్'పేరుతో ప్రకటించిన నూతన నిబంధనల ప్రకారం వార్షికాదాయం రూ.1,350 కోట్లు కలిగిన టెక్ కంపెనీలు మీడియా సంస్థలతో ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే భారీగా పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. ఒక పరిశ్రమకు సబ్సిడీ ఇచ్చేందుకు మరో పరిశ్రమపై భారం మోపుతోందని మెటా దీనిపై వ్యాఖ్యానించింది. 'డిజిటల్ వేదికలు ఆస్ట్రేలియా నుంచి భారీగా ఆర్థిక లబ్ధి పొందుతున్నాయి. ఇదే సమయంలో ఆస్ట్రేలియాలో నాణ్యమైన జర్నలిజం సేవలను పొందుతున్నందుకు తోడ్పాటు నివ్వాల్సిన సామాజిక, ఆర్థిక బాధ్యత వాటిపై ఉంది'అని ప్రభుత్వం అంటోంది. డిజిటల్ వేదికలు పెరిగిపోవడంతో సంప్రదాయ మీడియా సంస్థలు నష్టపోతున్నాయని, ఈ నేపథ్యంలోనే పబ్లిషర్లు, టెక్ కంపెనీల మధ్య సమతూకం పాటించేందుకు నిబంధనలు తెచ్చినట్లు అప్పట్లో ప్రభుత్వం తెలిపింది. ఆ మేరకు మెటా తదితర కంపెనీలు ఆస్ట్రేలియా మీడియా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఆ ఒప్పందాల గడువు పూర్తి కావొచ్చింది. ఫేస్‌బుక్ కంటెంట్‌లో వార్తలు, రాజకీయ సంబంధ అంశాల వాటా 3 శాతం కంటే తక్కువగా ఉంటుందని మెటా అంటోంది. అందుకే, తిరిగి ఒప్పందాలను కుదుర్చుకోబోమని, బదులుగా వార్తల ట్యాబ్‌లను తొలగిస్తామని చెబుతోంది. ఈ చర్యతో ఆస్ట్రేలియా మీడియా సంస్థలు సుమారు రూ.1,700 కోట్ల మేర నష్టపోయే అవకాశముంది. దీనిపై ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్ తీవ్రంగా స్పందించారు. ఆస్ట్రేలియా వినియోగదారుల పట్ల మెటా ప్రాథమిక బాధ్యతలను సైతం విస్మరిస్తోందంటూ మండిపడ్డారు. ఈ నిబంధనలన్నీ కేవలం ఆస్ట్రేలియా జర్నలిజానికి సాయం పడేందుకే తప్ప తాము ఆదా యం పెంచుకునేందుకు కాదని పేర్కొన్నారు.

మహిళల సాయం రూ. 2,100కు పెంపు

ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఎన్నికల హామీ

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న అధికార ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) మరో కీలక వాగ్దానం చేసింది. 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన'కింద 18 ఏళ్లు నిండిన మహిళలకు ప్రస్తుతమిస్తున్న ఆర్థిక సాయం రూ.1,000ని మళ్లీ అధికారంలోకి వస్తే రూ.2,100కు పెంచుతామని ఆ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. మరో 10, 15 రోజుల్లో ఎన్నికల ప్రకటన వెలువడే అవకాశమున్నందున, ఈ సమయంలో మహిళల అకౌంట్లలోకి పెంచిన మొత్తాన్ని జమ చేయడం సాధ్యం కాదని, అధికారం చేపట్టాక పెంచిన మొత్తం అందజేస్తామని ఆయన తెలిపారు. గురువారం ఆయన పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ప్రకటన చేశారు. ఢిల్లీలో నివాసం ఉంటూ, ఓటర్ ఐడీ కార్డు కలిగిన 38 లక్షల మంది అర్హులున్నట్లు అంచనా.

19 ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు

న్యూఢిల్లీ: పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసేత జైషే మొహమ్మద్ దేశంలో ఉగ్రదాడులకు కుట్ర పన్నుతోందనే సమాచారం మేరకు జాతీయ దర్యాప్తు విభాగం (ఎన్ఐఏ) గురువారం దేశవ్యాప్తంగా ఉన్న 19 ప్రాంతాల్లో దాడులు చేపట్టింది. జమ్మూకశ్మీర్‌తోపాటు యూపీ, అసోం, మహారాష్ట్ర, బిహార్, బెంగాల్, రాజస్తాన్, గుజరాత్‌లలో సోదాలు జరిపినట్లు తెలిపింది. తనిఖీల సందర్భంగా పలు పత్రాలు, సెల్‌ఫోన్లు, పెన్‌డ్రైవ్‌లు, సీడీలు, హార్డ్‌డిస్క్‌ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను సీజ్ చేశామంది. భారత్‌లో జైషే కార్యకలాపాలకు సూత్రధారిగా భావిస్తున్న షేక్ సుల్తాన్ సలాహుద్దీన్ ఆయూబీకు, అతడి అనుయాయులకు చెందిన ప్రాంతాల్లో సోదాలు జరిపామంది. ఆయూబీని అక్టోబర్‌లోనే ఎన్ఐఏ అరెస్ట్ చేసింది.

క్రయోజనిక్ ఇంజిన్ 20 పరీక్ష సక్సెస్

సూళ్లూరుపేట: సీఈ20 క్రయోజనిక్ ఇంజన్‌లో సంక్లిష్టమైన ప్రక్రియను దాటడం ద్వారా మళ్లీ స్టార్ట్ చేయడానికి వీలుండే వ్యవస్థల అభివృద్ధిలో మరో ముందడుగు వేశామని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) గురువారం ప్రకటించింది. భవిష్యత్తు ప్రయోగాలకు ఈ పరీక్ష ఎంతగానో దోహదపడుతుందని ఇస్రో పేర్కొంది. నాజిల్ ఏరియా నిష్పత్తి 100 శాతం ఉండేలా సముద్ర ఉపరితల స్థాయిలో హాట్ టెస్ట్‌లో సీఈ20 క్రయోజనిక్ ఇంజన్‌ను నవంబర్ 29న విజయవంతంగా పరీక్షించామని ఇస్రో గురువారం వెల్లడించింది. తమిళనాడులోని మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో వారి ప్రొపల్షన్ కాంప్లెక్స్ ఈ పరీక్షకు వేదికైంది. ఎల్వీఎం మార్క్-3 రకం రాకెట్‌లో పైభాగానికి తగు శక్తిని అందివ్వడంలో సీఈ20 ఇంజన్ సాయపడుతుంది. 19 టన్నుల థ్రస్ట్‌ను అందించే పరీక్షలో ఈ ఇంజన్ నెగ్గింది. ఇప్పటికే ఎల్‌వీఎం2 ఆరు ప్రయోగాల్లో ఈ ఇంజన్ అద్భుతంగా పనిచేసింది. ''గగన్‌యాన్ మిషన్‌కు కావాల్సిన 20 టన్నుల థ్రస్ట్ స్థాయిని అందించేందుకు ఈ ఇంజన్ అర్హత సాధించింది. భవిష్యత్తులో సీ32 స్టేజ్‌లో పేలోడ్ పరిమాణాన్ని పెంచేందుకు ఉపయోగపడే 22 టన్నుల థ్రస్ట్‌ను అందించే కార్యక్రమాల్లోనూ ఈ ఇంజన్‌ను ప్రయోగాత్మకంగా వాడొచ్చు''అని ఇస్రో పేర్కొంది. మళ్లీ ఇంజన్‌ను రీస్టార్ట్ చేసేందుకు అవసరమయ్యే బహుళధాతు ఇగ్నైటర్ సామర్థ్యాన్నీ విజయవంతంగా పరీక్షించారు. ''సముద్రమట్టం స్థాయిలో సీ20 ఇంజన్‌కు సవాళ్లు ఎదురవుతాయి. నాజిల్ పెద్దదిగా ఉండటంతో 50 ఎంబార్ స్థాయిలో విపరీతమైన శక్తి బయటకు వెలువడుతుంది. దీంతో ఇంజన్ సమీపంలో అత్యంత ఉష్ణం జనించడంతోపాటు పెద్దస్థాయిలో కంపనాలు మొదలై ఆ నాజిల్ దెబ్బతినే ప్రమాదముంటుంది. ఈ సమస్యను అధిగమించేందుకు వినూత్న 'నాజిల్ ప్రొటెక్షన్ సిస్టమ్'ను ఉపయోగించాం''అని ఇస్రో పేర్కొంది.



తమిళనాడులోని మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో క్రయోజనిక్ ఇంజిన్ పరీక్ష దృశ్యం

కేంద్ర మంత్రి రిజిజుపై సభా హక్కుల నోటీస్

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి కిరెన్ రిజిజుపై టీఎంసీ రాజ్యసభ ఎంపీ సాగరికా ఘోష్ గురువారం సభా హక్కుల నోటీసు అందజేశారు. ఈ నోటీసుపై ప్రతిపక్ష పార్టీలకు చెందిన 60 మంది నేతలు సంతకాలు చేశారు. ఎగువ సభలో ప్రతిపక్ష నేతలపై రిజిజు అభ్యంతర వ్యాఖ్యలు చేశారని అందులో ఆరోపించారు. 'మీరంతా సభలో ఉండటం ఏమాత్రం ప్రయోజనం కాదని బుధవారం సభలో ప్రతిపక్షాలనుద్దేశించి మంత్రి రిజిజు అన్నారు. కార్యకలాపాలను సజావుగా సాగేలా చేయడానికి బదులుగా ప్రతిపక్షాన్ని ఆయన పార్లమెంట్ లోపల, వెలుపల పదేపదే అవమానించారు'అని ఎంపీ సాగరిక మీడియాకు తెలిపారు. ఇలా చేయడం అధికారాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని ఆమె ఆరోపించారు.

ఢిల్లీ ఎన్నికలు.. 21 మందితో కాంగ్రెస్ మొదటి జాబితా

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీకి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే ఎన్నికలకు గాను కాంగ్రెస్ పార్టీ గురువారం 21 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితా విడుదల చేసింది. ఇందులో ఢిల్లీ విభాగం చీఫ్ దేవేందర్ యాదవ్‌కు బాద్లి సీటును, మాజీ ఎంపీ సందీప్ దీక్షిత్‌కు న్యూఢిల్లీ సీటును కేటాయించింది. న్యూఢిల్లీ స్థానం సిట్టింగ్ ఎమ్మెల్యే ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ కావడం గమనార్హం. అదేవిధంగా, ఢిల్లీ మాజీ మంత్రి హరూన్ యుసుఫ్‌కు బల్లిమారన్, ఢిల్లీ కాంగ్రెస్ మాజీ చీఫ్ చౌదరి అనిల్ కుమార్‌కు పట్‌పర్‌గంజ్, జాతీయ ప్రతినిధి రాగిణి నాయక్‌కు వజీర్‌పూర్, ఆదర్శ్ శాస్త్రికి ద్వారకా సీటును కేటాయించింది.

నియమితులయ్యే గవర్నర్ల పద్ధతిని సూచించినవారు?



కేంద్రంలో, రాష్ట్రంలో పార్లమెంటరీ పద్ధతిలో పరిపాలన ఉంది. రాష్ట్రంలో రాజ్యాంగ పరమైన అధిపతి గవర్నర్. అతను ముఖ్య కార్య నిర్వాహకుడిగా, ముఖ్యమంత్రితో కూడిన మంత్రి మండలి సలహా మేరకు తన విధులను, అధికారాలను నిర్వహిస్తారు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ



రాష్ట్ర ప్రభుత్వం (గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రి మండలి)

భారత రాజ్యాంగంలోని 6వ భాగంలో ప్రకరణ 152 నుంచి 213 వరకు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి సమగ్ర అంశాలను పేర్కొన్నారు. గతంలో 6వ భాగం జమ్ము-కశ్మీర్ రాష్ట్రానికి మినహా అన్ని రాష్ట్రాలకు వర్తించేది. జమ్ము- కశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగం ఉండేది. 2019 నుంచి రద్దయింది.

రాష్ట్ర గవర్నర్

ప్రకరణ 153 నుంచి 167 వరకు గవర్నర్ పదవి, నియామకం, అర్హతలు, తొలగింపు, అధికార విధుల గురించి వివరిస్తాయి.

గవర్నరు– నియామకం:
ప్రకరణ 153 ప్రకారం ప్రతి రాష్ట్రానికి ఒక గవర్నర్ ఉండాలి. అయితే 1956లో ఏడో రాజ్యాంగ సవరణ ద్వారా రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు ఉమ్మడి గవర్నర్లను నియమించే అవకాశం కల్పించారు. ప్రకరణ 155 ప్రకారం గవర్నరును రాష్ట్రపతి నియమిస్తారు.

ముసాయిదా రాజ్యాంగంలో గవర్నర్లను ఎన్నుకోవాలని ప్రతిపాదించారు. నియమితులయ్యే గవర్నర్‌ల పద్ధతిని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగ పరిషత్‌లో సూచించారు. అయితే గవర్నర్‌లను ఎన్నుకునే పద్ధతిని డాక్టర్ బి.ఎన్.రావు సూచించారు.

నియమితులయ్యే గవర్నర్ల పద్ధతి – కారణాలు
పార్లమెంటరీ వ్యవస్థలో కేంద్ర, రాష్ట్రస్థాయిలో ఒకే విధమైన ప్రభుత్వ వ్యవస్థలు ఏర్పర్చారు. రాష్ట్ర గవర్నర్ రాజ్యాంగపరమైన అధిపతిగా, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరిస్తారు. ముఖ్యమంత్రి ఆ రాష్ట్ర ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తారు.

ప్రజలు ఎన్నుకున్న ఇద్దరు అధిపతులు ఒకే చోట పనిచేయడం కొన్ని సమస్యలకు దారి తీస్తుంది. ఎన్నికల్లో వ్యక్తిగత, ఇతర అంశాలు ప్రభావాన్ని చూపుతాయి. కాబట్టి గవర్నర్ రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలంటే 'నియమితమయ్యే పద్ధతే' ఉత్తమమైంది.

కెనడా తరహాలోనే భారత్‌లోనూ నియమితమయ్యే గవర్నర్ల పద్ధతిని కొనసాగించారు. అమెరికాలో గవర్నర్లను ఓటర్లే నేరుగా ఎన్నుకుంటారు.

అర్హతలు:
ప్రకరణ 157 ప్రకారం గవర్నర్‌గా నియమితమయ్యే వ్యక్తికి కింది అర్హతలుండాలి.
- భారతీయ పౌరుడై ఉండాలి.
- లాభదాయక పదవిలో ఉండకూడదు.
- నేరారోపణ రుజువై ఉండకూడదు.
- 35 ఏళ్లు నిండాలి.

షరతులు:
ప్రకరణ 158 ప్రకారం గవర్నర్‌గా నియమితమయ్యే వ్యక్తి పార్లమెంటులోగానీ, రాష్ట్ర శాసన సభలోగానీ సభ్యుడై ఉండొద్దు. ఒకవేళ సభ్యుడై ఉంటే గవర్నర్‌గా నియమితులైన వెంటనే సభ్యత్వం రద్దవుతుంది. గవర్నర్‌గా పదవి చేపట్టిన తర్వాత ప్రభుత్వంలో ఎలాంటి లాభదాయక పదవులు చేపట్టొద్దు.

నియామకం, కొన్ని సంప్రదాయాలు

ఆర్.ఎస్.సర్కారియా కమిషన్ గవర్నర్ నియామకంలో కొన్ని సూచనలను, సంప్రదాయాలను సూచించింది. వీటిని పాటించవచ్చు, పాటించక పోవచ్చు.

సంప్రదాయాలు:
- గవర్నర్‌గా నియమితమయ్యే వ్యక్తి ఏదో ఒక రంగంలో నిష్ణాతులై ఉండాలి.
- సొంత రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించకూడదు.
- గవర్నర్‌గా నియమితులయ్యేనాటికి కనీసం రెండేళ్ల ముందు వరకు క్రియాశీల రాజకీయాల్లో ఉండొద్దు.
- గవర్నర్‌ను నియమించే సమయంలో సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించాలి.

పదవీకాలం- అభీష్ట సూత్రం

ప్రకరణ 156(1) ప్రకారం గవర్నర్ ఐదేళ్ల కాలానికి నియమితులైనప్పటికీ పదవీ కాలం రాష్ట్రపతి విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం మారినప్పుడు గత ప్రభుత్వం నియమించిన గవర్నర్లను ఒక్కోసారి రాజీనామా చేయాలని అడుగుతారు లేదా వారిని తొలగిస్తారు. దీనికి కారణం గవర్నర్లకు పదవీకాల భద్రత లేకపోవడమే. 'రాష్ట్రపతి విశ్వాసమున్నంత వరకే గవర్నర్ అధికారంలో ఉంటారు' అని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే సరైన కారణాలు లేకుండా వారిని తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని 2010లో బి.పి.సింగాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

మారిన ప్రభుత్వ విధానాలు, సిద్ధాంతాలతో గవర్నర్లు ఇమడలేనప్పుడు వారిని పదవి నుంచి తప్పుకోవాలని కోరవచ్చు. కానీ అక్రమంగా విచక్షణా రాహిత్యంగా తొలగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.

గవర్నర్ తొలగింపు:
ప్రకరణ 156(1) ప్రకారం గవర్నర్‌ను రాష్ట్రపతి తొలగించవచ్చు. దీనికి ప్రత్యేక కారణాలు రాజ్యాంగంలో ప్రస్తావించలేదు. రాష్ట్రపతి ఒక ఆదేశం ద్వారా గవర్నర్‌ను తొలగిస్తారు. దీనిలో అభిశంసన అనే ప్రక్రియ ఉండదు. రాష్ట్రపతి విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది. అలాగే గవర్నర్‌ను రాష్ట్రపతి ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయవచ్చు.

గవర్నర్లపై అవిశ్వాస తీర్మానం లేదా అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడానికి అవకాశం లేదు. కేవలం రాష్ట్రపతి ఆదేశం ద్వారా మాత్రమే తొలగించవచ్చు.

పదవీ ప్రమాణ స్వీకారం:
ప్రకరణ 159 ప్రకారం గవర్నర్‌గా నియమితులైన వ్యక్తి పదవీ ప్రమాణ స్వీకారం చేయాలి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (ప్రధాన న్యాయమూర్తి లేనట్లయితే హైకోర్టు న్యాయమూర్తి) సమక్షంలో పదవీ ప్రమాణ స్వీకారం చేస్తారు. గవర్నర్ తన రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతికి సమర్పిస్తాడు.

జీతభత్యాలు
ప్రకరణ 158 ప్రకారం గవర్నర్ జీతభత్యాలను పార్లమెంటు ఒక చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. వీటిని రెండో షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

ప్రాక్టీస్ బిట్స్

1. కింది వారిలో ఎవరిని భారత ప్రభుత్వ సివిల్ సర్వీస్ ముఖ్య అధికారిగా భావించవచ్చు?
   ఎ) హోం శాఖ కార్యదర్శి
   బి) కేబినెట్ కార్యదర్శి
   సి) సిబ్బంది శాఖా కార్యదర్శి
   డి) ప్రధానమంత్రి కార్యదర్శి
2. భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాలనా సంస్కరణల కమిషన్ మొదటి అధ్యక్షుడు?
   ఎ) గుల్జారీలాల్ నందా
   బి) టి.టి.కృష్ణమాచారి
   సి) మొరార్జీ దేశాయ్
   డి) ఇందిరా గాంధీ
3. కింది వాటిలో దేనిపై ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకరణ 311 కింద ఇచ్చిన సంరక్షణ వర్తించదు?
   ఎ) సస్పెండ్ చేసేటప్పుడు
   బి) హోదా తగ్గించినప్పుడు
   సి) తొలగించినప్పుడు
   డి) బర్తరఫ్ చేసినప్పుడు
4. కేంద్ర, రాష్ట్ర సంబంధాల అధ్యయనం కోసం కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిషన్ అధ్యక్షుడు?
   ఎ) జస్టిస్ ఎం.ఎం.పూంచి
   బి) వి.కె.దుగ్గల్ సి) ధీరేంద్ర సింగ్
   డి) మాధవీ మీనన్
5. జంతు హింస నిషేధం రాజ్యాంగంలోని ఏ జాబితాలో ఉంది?
   ఎ) యూనియన్ జాబితా
   బి) రాష్ట్ర జాబితా సి) ఉమ్మడి జాబితా
   డి) ఏదీకాదు
6. భారత సమాఖ్య విధానాన్ని ఏకకేంద్ర విధానంగా ఎప్పుడు మార్చొచ్చు?
   ఎ) పార్లమెంటు నిశ్చయించినపుడు
   బి) రాష్ట్ర శాసనసభ తీర్మానం రూపొందించినప్పుడు
   సి) సాధారణ ఎన్నికల సమయంలో
   డి) జాతీయ అత్యవసర పరిస్థితిలో
7. అఖిల భారత సర్వీసులను ముఖ్యంగా ఐఏఎస్, ఐపీఎస్‌లను రద్దు చేయాలని సిఫార్సు చేసిన కమిటీ?
   ఎ) కాకా కలేల్కర్ కమిషన్
   బి) ఖేర్ కమిషన్
   సి) రాజమన్నార్ కమిషన్
   డి) సర్కారియా కమిషన్

సమాధానాలు

1) బి; 2) సి; 3) ఎ; 4) ఎ; 5) బి; 6) డి; 7) సి.

'అనుమకొండ' శాసనం వేయించింది ఎవరు?

మధ్యయుగ ఆంధ్రదేశ చరిత్రలో కాకతీయుల యుగానికి ప్రత్యేక స్థానం ఉంది. వీరు చిన్నాభిన్నమైన ఆంధ్రజాతిని ఏకం చేసి ప్రజల్లో జాతీయ భావాలను పెంపొందించారు. రాజరిక వ్యవస్థనే సామాజిక వ్యవస్థగా రూపొందించారు. ఆంధ్ర భాషా- సాహిత్యాలు, సంగీత, నృత్య, వాస్తు, శిల్పాలు, చిత్రలేఖనాలకు జీవం పోశారు. రైతుల క్షేమాన్ని గుర్తించి చెరువుల ద్వారా నీటి పారుదల సౌకర్యాలు కల్పించారు. కాకతీయుల పాలనా ముద్ర నేటికీ తెలుగువారి సామాజిక జీవన విధానంలో సజీవంగా ఉంది. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం మధ్య భాగంలో కనిపించే కాకతీయుల స్వాగత తోరణం వారి ప్రజారంజక పాలనను సగర్వంగా చాటుతోంది. ఈ ప్రాంతంలోని అనేక శిలలు, సుందరమైన దేవాలయాలు, వైవిధ్యభరితమైన కళలు కాకతీయుల కళా నైపుణ్యాన్ని దశదిశలా చాటుతున్నాయి. నేటికీ ఎందరో కవుల రచనలు, కళాకారుల గళాల ద్వారా ఏకశిలా నగర నిర్మాతల పాలనా వైభవం కీర్తి పొందుతూనే ఉంది.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలంగాణ చరిత్ర



కాకతీయుల చరిత్ర

మధ్యయుగ భారతదేశ చరిత్రలో ఢిల్లీ సుల్తానులు ఉత్తర భారతదేశాన్ని పాలిస్తున్నప్పుడు దక్షిణాపథంలో యాదవ, కాకతీయ, పాండ్య, హోయసాల రాజ్యాలు వర్ధిల్లాయి. ఢిల్లీ సుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీ దక్షిణాపథ రాజ్యాలను జయించాలని భావించాడు. కాకతీయులు కొంతకాలం రాష్ట్రకూటులు, తూర్పు, పశ్చిమ చాళుక్యులకు సామంత సేనా నాయకులుగా ఉన్నారు. వీరు తెలంగాణ ప్రాంతంలో రాజ్యం స్థాపించి, నిస్సారంగా ఉన్న భూ ప్రాంతాలను బహుముఖంగా అభివృద్ధి చేసి ప్రత్యేకతను చాటుకున్నారు. వీరు మొదట సబ్బినాడు, అనుమకొండ, కొలనుపాక, పిల్లలమర్రి, సతనాటి సీమ (మధిర ప్రాంతం), కొరవి సీమ (వరంగల్–మానుకోట) ప్రాంతాల్లో పాలించారు. తర్వాత స్వతంత్రులై క్రీ.శ. 1000 – క్రీ.శ. 1323 వరకు తెలంగాణా ప్రాంతమంతటా రాజ్యాన్ని స్థాపించి, సుమారు 300 ఏళ్లు ఓరుగల్లు (వరంగల్)ను రాజధానిగా చేసుకొని అఖిలాంధ్రదేశాన్ని పాలించారు. మధ్యయుగాలనాటి సామాజిక, సాంస్కృతిక రంగాలకు గట్టి పునాది వేసి తర్వాత వచ్చిన రెడ్డి, విజయనగర రాజులకు మార్గదర్శకులయ్యారు.

పుట్టు పూర్వోత్తరాలు, శాసన ఆధారాలు:

కాకతీయుల వంశం, కులం, పుట్టు పూర్వోత్తరాల గురించి చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. వీరు మొదట ఆంధ్ర దేశానికి పశ్చిమ సరిహద్దులోని 'కాకతీ' గ్రామం నుంచి వచ్చి తూర్పు చాళుక్యుల కొలువులో ఉంటూ ఆంధ్రులయ్యారని మారేమండ రామారావు అభిప్రాయం. క్రీ.శ. 956 నాటి తూర్పు చాళుక్య రాజు దానార్ణవుడు వేయించిన మాంగల్లు శాసనం ఆధారంగా ఈ వంశంలోని కాకర్త్య గుండయ పూర్వీకుల పేర్లకు చివర రాష్ట్రకూట అనే పదం ఉండటం వల్ల (ఉదా: గుండియ రాష్ట్రకూట, ఎరియ రాష్ట్రకూట) వీరు రాష్ట్రకూటులని ఆచార్య పి.వి. పరబ్రహ్మశాస్త్రి పేర్కొన్నారు. అందువల్ల కాకతీయ రాజ్య మూల పురుషుడు కాకర్త్య గుండయగా నిర్ధారించారు.

1220లో కాకతీయ గణపతి దేవుని సోదరి 'మైలాంబ' బయ్యారం అనే గ్రామంలో ఆమె తల్లి పేరుతో గొప్ప తటాకం (చెరువు) నిర్మించి, అక్కడ శాసనాన్ని వేయించింది. ఈ శాసనం ప్రకారం కాకతీయ వంశ మూల పురుషుడు వెన్నమ నాయకుడు. కాకతిపురమనే స్థలం నుంచి వారి పూర్వీకులు పాలించినట్లు ఇది విశదీకరిస్తోంది. 1163లో కాకతీయ రుద్రదేవుడు అనుమకొండ శాసనం వేయించాడు. ఇందులో రెండో ప్రోలరాజు, అతడి కుమారుడు రుద్రదేవుడి విజయాల వర్ణన ఉంది. ఈ శాసనాన్ని 1882లో జె.ఎఫ్.ప్లేట్ అనే ఆంగ్లేయుడు పరిశోధించి వెలుగులోకి తెచ్చాడు. కాకతీయ చరిత్రకు మాంగల్లు, అనుమకొండ, బయ్యారం శాసనాలు ప్రధానాధారాలు.

వాఙ్మయ ఆధారాలు:
కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థానకవి విద్యానాథుడు. ఇతడు 'ప్రతాపరుద్ర యశోభూషణం' అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని సంస్కృతంలో రచించాడు. ఇందులో ప్రతాపరుద్రునికి చెందిన చారిత్రక అంశాలున్నాయి. దీని ప్రకారం కాకతీ అనే దుర్గాశక్తి ఏకశిలానగరవాసులకు (ఓరుగల్లు) కులదేవత అని, ఆమెను ఆరాధించడం వల్ల కాకతీయులుగా పేరు వచ్చిందని పేర్కొన్నాడు.

రావిపాటి త్రిపురాంతకుడు సంస్కృతంలో 'ప్రేమాభిరామం' నాటకం రాశాడు. దీని ఆధారంగా వినుకొండ వల్లభరాయుడు తెలుగులో 'క్రీడాభిరామం' రాశాడు. పాల్కురికి సోమనాథుడు రచించిన 'పండితారాధ్య చరిత్ర', 'బసవ పురాణం', కొలని గణపతిదేవుడి 'శివయోగసారం', కాకతీ రుద్రదేవుడి 'నీతిసారం', మడికి సింగన 'సకల నీతిసమ్మతం', తెలుగు చోడబద్దెన 'నీతిసార ముక్తావళి', శ్రీనాథుడి 'పల్నాటి వీర చరిత్ర', జాయపసేనాని– 'నృత్తరత్నావళి', ఏకామ్రనాథుడి 'ప్రతాపరుద్ర చరిత్ర' తదితర గ్రంథాలు కాకతీయుల చరిత్రకు ప్రధాన మూలాధారాలు. కాకతీయులు మొదట జైన మతాన్ని ఆరాధించారు. జైనమత కుష్మాండిని పూజించి, తర్వాత కాలంలో కాకతమ్మ (దుర్గ) ను పూజించినట్లు తెలుస్తోంది. కాకతీ అంటే కుష్మాండం (గుమ్మడి కాయ) అని అర్థం. కాకతీ అనే పురం నుంచి పాలించడం వల్ల కాకతీయులు అయ్యారని శాసనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ కాకతీపురం ఎక్కడుందనే అంశాన్ని ఇప్పటికీ గుర్తించలేదు. కాకతీయులు ఏ కులానికి చెందినవారనే విషయం కూడా వివాదాస్పదమే. వీరు క్షత్రియులు లేదా చతుర్థ కులజులని చరిత్రకారుల అభిప్రాయం. గణపతిదేవుని మోటుపల్లి, పాకాల, కాంచీపుర శాసనాలు వీరిని క్షత్రియులుగా, సూర్యవంశీయులుగా వర్ణించాయి. వీరు జన్మతా క్షత్రియులు కారని, చతుర్థాన్వయ సంజాతులేనని, వీరి సన్నిహిత బంధువులందరూ చతుర్థ కులస్థులేనని మరికొందరి చరిత్రకారుల అభిప్రాయం. రాజ్యం చేపట్టిన తర్వాత వీరు క్షత్రియత్వాన్ని ఆపాదించుకొని ఉండొచ్చునని వీరు భావించారు.

కాకతీయ మొదటి రాజులు

మొదటి బేతరాజు; మొదటి, రెండో ప్రోల రాజులు; రెండో బేతరాజు; దుర్గరాజు పశ్చిమ చాళుక్యులకు సామంతులుగా ఉండేవారు. ఖాజీపేట శాసనం ప్రకారం మొదటి బేతరాజుకు 'కాకతీ పురాధినేత', 'అరిగజకేసరి', 'కాకతీ వల్లభ' అనే బిరుదులున్నాయి. మొదటి బేతరాజు ఓరుగల్లు సమీపంలో కేసరి సముద్రం(చెరువు) తవ్వించాడు. బేతరాజు కాలం 1000–1052. రెండో బేతరాజుకు 'త్రిభువన మల్ల', 'విక్రమచక్రి', 'చలమర్తి గండడు', 'మహామండలేశ్వరుడు'అనే బిరుదులున్నాయి. ఇతడి గురువు శైవ కాలముఖ శాఖకు చెందిన రామేశ్వర పండితుడు. రెండో బేతరాజు రాజధాని అనుమకొండ.

రెండో ప్రోలరాజు (1117– 1158)
ఇతడు కాకతీయ రాజుల్లో మొదటి స్వతంత్ర రాజు. కళ్యాణి చాళుక్య రాజు సోమేశ్వరుడి మరణానంతరం ఇతడు స్వతంత్ర రాజ్యాన్ని ప్రకటించుకున్నాడు.

రుద్రదేవుడు (1158–1195):
రెండో ప్రోలరాజు అనంతరం రుద్రదేవుడు(మొదటి ప్రతాపరుద్రుడు) అధికారంలోకి వచ్చాడు. అచితేంద్రుడు వేయించిన అనుమకొండ శాసనం రుద్రదేవుడి ప్రతిభ, విజయాలు రాజ్య నిర్మాణ దక్షత గురించి వివరిస్తుంది. ఇతడు రాజ్యాన్ని తూర్పున బంగాళాఖాతం నుంచి దక్షిణాన శ్రీశైలం, పశ్చిమాన కళ్యాణి, ఉత్తరాన గోదావరి నదీతీరం వరకు విస్తరించాడు. కాకతీ రుద్రదేవుడు 1182లో జరిగిన పల్నాటి యుద్ధంలో నలగామ రాజుకు సైన్యాన్ని పంపి, సహాయపడ్డాడు. ఇతడి సామ్రాజ్య విస్తరణలో నతనాట, కోట, విప్పర్ల సామంతనాయకులు సహాయపడ్డారు. రుద్రదేవుడికి 'వినయ విద్యాభూషణుడు' అనే బిరుదు ఉంది.

రుద్రదేవుడు సంస్కృతంలో 'నీతిసారం' అనే గ్రంథాన్ని రాశాడు. అనుమకొండ వద్ద గంగచియ తటాకాన్ని తవ్వించాడు. అనుమకొండలో వేయిస్తంభాల గుడి, ఓరుగల్లు దుర్గం, ఏకశిలా నగరాలకు పునాది వేశాడు. 1196లో దేవగిరి యాదవ రాజు జైతుగి చేతిలో రుద్రదేవుడు మరణించాడు. అనంతరం రాజ్యాధికారాన్ని చేపట్టిన రుద్రదేవుడి సోదరుడు మహాదేవుడు యాదవులపై దాడిచేసి, ఆ యుద్ధంలో మరణించాడు. యాదవరాజైన జైతుగి (జైత్రపాలుడు) యువరాజైన గణపతిదేవుడిని బందీగా పట్టుకున్నాడు. గణపతిదేవుని గుణగణాలను మెచ్చుకొని కాకతీయ సింహాసనంపై కూర్చోబెట్టాడు.

గణపతిదేవుడు (1199–1259):
ఇతడు మహాదేవుడి కుమారుడు. కాకతీయరాజుల్లో అగ్రగణ్యుడు, పరిపాలనాదక్షుడు, రాజనీతిజ్ఞుడు. నెల్లూరు, కంచి, కళింగ, వెలనాటి, చోళ రాజ్యాలను జయించాడు. 'రాయగజకేసరి' బిరుదు పొందాడు. 60 ఏళ్లకు పైగా రాజ్యపాలన చేశాడు. ఓరుగల్లు కోట నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఓరుగల్లులోని స్వయంభూ దేవాలయానికి నాలుగు దిక్కులా కాకతీయ తోరణాలను రాతితో నిర్మించాడు. ములుగు సమీపంలో ఘనపురం గ్రామంలో అనేక దేవాలయాలు నిర్మించాడు. పాలంపేట గ్రామంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రామప్ప దేవాలయంతో పాటు పిల్లలమర్రి, పానగల్లు, నాగులపాడు ఆలయాలు ఇతడి కాలంలో నిర్మించినవే. గణపతిదేవుడి సేనాధిపతి రేచర్ల రుద్రుడు. ఇతడు రాజ్య విస్తరణలో విశేష సేవలందించాడు. గణపతి దేవుడి కాలంలోనే రేచర్ల రుద్రుడు రామప్పగుడిని నిర్మించాడు. గణపతిదేవుడు రామప్ప, పాకాల, లక్కవరం చెరువులను తవ్వించాడు. అనమకొండ నుంచి రాజధానిని ఓరుగల్లుకు మార్చాడు. కాకతీయుల కాలంలో మోటుపల్లి రేవు ద్వారా విదేశీ వర్తకం జరిగేది. ఈ రేవుకు 'దేశీయ కొండ పట్టణం' అనే పేరు కూడా ఉంది. విదేశీ వర్తకులను రేవు దొంగల నుంచి రక్షించడం, అధిక సుంకాలు నియంత్రించడానికి గణపతి దేవుడు మోటుపల్లి అభయశాసనం వేయించాడు. రేచర్ల రుద్రుడిని 'కాకతీయ రాజ్యభారధారేయుడు' బిరుదుతో గణపతి దేవుడు సత్కరించాడు. దివిసీమ, పినచోడ సామంతరాజు కుమార్తెలైన నారమ్మ (నారాంబ), పేరాంబను వివాహమాడాడు. బావ మరిది జాయపసేనానిని గజసాహితిగా నియమించాడు. జాయపసేనాని నృత్తరత్నావళి, గీత రత్నావళి, వాద్య రత్నావళి అనే గ్రంథాలను సంస్కృతంలో రాశాడు. గణపతి దేవుడికి రుద్రాంబ (రుద్రమదేవి), గణపాంబ అనే ఇద్దరు కుమార్తెలున్నారు. రుద్రమదేవిని వీరభద్రుడికి ఇచ్చి వివాహం చేశాడు. ఈమెకు పురుష వేశం వేయించి రుద్రదేవమహారాజు పేరుతో 1259లో యువరాజుగా పట్టాభిషేకం చేశాడు.

కడప ప్రాంతాన్ని పాలించిన తెలుగు చోడుల రాజ్యాన్ని కాకతీయ రాజ్యంలో గణపతిదేవుడు విలీనం చేశాడు. ఇతడు అనేక దిగ్విజయ యాత్రలతో ఆంధ్రదేశాన్ని ఏకం చేసి 'ఆంధ్రదేశాధీశ్వరుడు'గా ఖ్యాతిగాంచాడు. ఈయన శైవ భక్తుడు. ఇతడి శివదీక్షా గురువు విశ్వేశ్వర శివదేశికుడు. శివదేశికుడు అనేక గోళకీ మఠాలు స్థాపించాడు. గణపతిదేవుడు నెల్లూరు ప్రాంతాన్ని పాలించిన రెండో మనుమసిద్ధికి యుద్ధంలో సహాయపడ్డాడు. మనుమసిద్ధి ఆస్థానంలోని కవి తిక్కన సోమయాజి. ఇతడికి 'కవి బ్రహ్మ', 'ఉభయ కవిమిత్రుడు' అనే బిరుదులు ఉన్నాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

నిట్ వరంగల్‌లో 56 నాన్ టీచింగ్ పోస్టులు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) డైరెక్ట్/డిప్యూటేషన్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 56.
- » **పోస్టుల వివరాలు:**
- » **గ్రూప్–ఎ:** ప్రిన్సిపల్ సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్–03, ప్రిన్సిపల్ స్టూడెంట్స్ యాక్టివిటీ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్(ఎస్ఏఎస్)–01, డిప్యూటీ రిజిస్ట్రార్–01, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్–01, అసిస్టెంట్ రిజిస్ట్రార్–01.
- » **గ్రూప్–బి:** అసిస్టెంట్ ఇంజనీర్–03, సూపరింటెండెంట్–05, జూనియర్ ఇంజనీర్–03, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–01, స్టూడెంట్స్ యాక్టివిటీ అండ్ స్పోర్ట్స్ అసిస్టెంట్(ఎస్ఏఎస్)–01.
- » **గ్రూప్–సి:** సీనియర్ అసిస్టెంట్–08, జూనియర్ అసిస్టెంట్–05, ఆఫీస్ అటెండెంట్–10, ల్యాబ్ అసిస్టెంట్–13.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్, ఎంఎస్సీ, ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 56 ఏళ్లు మించకూడదు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.01.2025.
- » **వెబ్‌సైట్:** https://careers.nitw.ac.in/

రైట్స్ లిమిటెడ్, గుడ్‌గావ్‌లో అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

గుడ్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్) రెగ్యులర్/ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణులవ్వాలి లేదా తత్సమాన విద్యార్హతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.01.2025
- » **రాతపరీక్ష తేది:** 19.01.2025.
- » **వెబ్‌సైట్:** https://www.rites.com

ఎన్ఎల్‌సీలో 588 అప్రెంటిస్‌లు

తమిళనాడులోని నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్(ఎన్ఎల్‌సీ) గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్ ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 588.
- » **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీ–336, టెక్నీషియన్ అప్రెంటిస్ ట్రైనీ–252.
- » **విభాగాలు:** మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, నర్సింగ్.
- » **అర్హత:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్ ట్రైనీ పోస్టులకు ఇంజనీరింగ్/టెక్నాలజీలో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. టెక్నీషియన్ పోస్టులకు ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. నర్సింగ్ పోస్టులకు డిప్లొమా/బీఎస్సీ నర్సింగ్ చేసి ఉండాలి.
- » **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీ పోస్టులకు రూ.15,028, టెక్నీషియన్ అప్రెంటిస్ ట్రైనీ పోస్టులకు రూ.12,524, నర్సింగ్ పోస్టుకు రూ.12,524.
- » **ఎంపిక విధానం:** డిగ్రీ, డిప్లొమాలో పొందిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది జనరల్ మేనేజర్, లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, బ్లాక్–20, ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్, నైవేలీ చిరునామకు పంపించాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 09.12.2024.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.12.2024
- » **వెబ్‌సైట్:** https://www.nlcindia.in/.



కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

దేశంలో అత్యధిక దూరం ప్రయాణించే రైలు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

భారతదేశంలో రవాణా

భారతదేశంలోని రవాణా రంగంలో రైల్వేలు, విమానయాన రంగం ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

రైల్వే రవాణా

దేశంలో పెద్ద ఎత్తున సరకును, ప్యాసింజర్లను సుదూర ప్రాంతాలకు తరలించడంలో రైల్వేలు కీలకపాత్ర వహిస్తున్నాయి. దేశవ్యాప్తంగా సుమారు 65 వేల కి.మీ. రైల్వే రూటు మార్గం, 1,14,500 కి.మీ. పొడవైన రైలు పట్టాలు, 8 వేలకు పైగా రైల్వేస్టేషన్లు ఉన్నాయి. దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారతీయ రైల్వేలో రోజూ 19 వేల రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో 12 వేల రైళ్లు ప్రయాణీకులకు సేవలందిస్తుండగా, 7 వేల రైళ్లు సరకు రవాణా సాగిస్తున్నాయి.

రెండు రైలు పట్టాల మధ్య ఉన్న దూరం ఆధారంగా రైల్వే లైన్లను అయిదు గేజ్‌లుగా విభజించారు.

అవి:

- బ్రాడ్ గేజ్ – 1.676 మీటర్లు
- మీటర్ గేజ్ – 1 మీ.
- న్యారోగేజ్ – 0.762 మీ.
- లైట్ న్యారోగేజ్ – 0.610 మీ.
- స్టాండర్డ్ గేజ్ – 1.500 మీ. (దీన్ని మెట్రో మార్గాల్లో ఉపయోగిస్తున్నారు)

దేశంలో రైల్వేల అభివృద్ధి ఎక్కువగా గంగా–సింధూ మైదాన ప్రాంతంలో ఉంది. ఈ ప్రాంతంలో వీటికి ఎక్కువ అనుకూలతలు ఉన్నాయి. ఈశాన్య ప్రాంతాల్లో రైల్వేల అభివృద్ధి అతి తక్కువగా ఉంది.

దీనికి కారణాలు:

1) అల్ప జన సాంద్రత ఉండటం
2) అల్ప ఆర్థిక వ్యవస్థ
3) విసిరేసినవిధంగా ఉన్న మానవ నివాసాలు
4) ఎగుడు, దిగుడు భూ స్థలాకృతి

దేశంలో పొడవైన రైలు మార్గాలు ఉన్న రాష్ట్రాల్లో మొదటి 4 స్థానాల్లో వరుసగా ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్ ఉన్నాయి. దేశంలో రైల్వేలైన్లు లేని రాష్ట్రాలు మేఘాలయ, సిక్కిం. అసోం మినహా మిగిలిన ఈశాన్య రాష్ట్రాల్లో (అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్, త్రిపుర, మిజోరాం) రైల్వే టెర్మినళ్లు మాత్రమే ఉన్నాయి.

కొంకణ్ రైల్వే ప్రాజెక్ట్: దేశంలో మొదటిసారిగా 1998 జనవరి 26న ప్రైవేట్ రంగంలో రైల్వే మార్గాన్ని నిర్మించారు. ఇది మహారాష్ట్రలోని 'రోహా'తో కర్ణాటకలోని 'మంగళూరు'ను కలుపుతుంది. దీని పొడవు 700 కి.మీ. ఈ మార్గంలో అతి పొడవైన (6.5 కి.మీ.) సొరంగ మార్గం ఉంది. దీన్ని 'కార్బూద్ టన్నెల్'గా పేర్కొంటారు. కేరళ, కర్ణాటక, గోవా, మహారాష్ట్ర రాష్ట్రాలు కొంకణ్ రైల్వే ప్రాజెక్ట్‌లో భాగంగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టు కేంద్ర కార్యాలయం నవీ ముంబయిలో ఉంది.

దేశాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం మొత్తం 17 రైల్వే మండలాలుగా విభజించారు. వీటిలో 'కేంద్ర రైల్వే మండలం' దేశంలోనే మొదటిది కాగా, అతి పెద్ద రైల్వే మండలం న్యూఢిల్లీ కేంద్రంగా ఉన్న 'ఉత్తర రైల్వే మండలం'.

వాయు రవాణా

రవాణా మార్గాలన్నింటిలోకెల్లా అతి ఎక్కువ ఖర్చుతో కూడుకొని ఉన్న రవాణా ఇదే. దేశంలో పౌర విమాన సర్వీసులను అందజేయడంలో ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్, వాయుదూత్, పవన్‌హన్స్ లిమిటెడ్ తదితర సంస్థల పాత్ర ఉంది. వీటితో పాటు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఏఏఐ), నేషనల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ (ఎన్ఏఏ) సంస్థలు ప్రాథమిక సదుపాయాల కల్పనకు సంబంధించి కీలకపాత్ర పోషిస్తున్నాయి.

పౌర విమానయానానికి సంబంధించి జాతీయ విధానాలు, నిబంధనలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, విమానాశ్రయాల ఏర్పాటు, వైమానిక రవాణా క్రమబద్ధీకరణ, పౌర విమాన రవాణా విస్తరణకు అమలు చేయదగిన కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. దేశంలో విమానయానం 1911లో మొట్టమొదటిసారిగా అలహాబాద్ – నైనిటాల్ మధ్య ప్రారంభమైంది. పోస్టల్ సర్వీస్‌ను బట్వాడా చేయడం ద్వారా దీన్ని ప్రారంభించారు. 1953 వరకు దేశంలో విమానయానాన్ని ప్రైవేట్ రంగంలో నిర్వహించారు. 1950లో ఏర్పాటు చేసిన రాజ్ అధ్యక్ష కమిటీ సూచనల మేరకు 1953లో ప్రైవేట్ రంగంలో నిర్వహిస్తున్న విమానయాన సంస్థలన్నింటినీ జాతీయం చేస్తూ రెండు ప్రధాన ప్రభుత్వ రంగ కార్పొరేషన్‌లుగా విభజించారు. **అవి:**



ఎ. ఎయిర్ ఇండియా: ఇది దేశాన్ని ఆనుకొని ఉన్న చిన్న చిన్న పొరుగు దేశాలు మినహా ఇతర దేశాలకు ఖండాంతర విమాన సర్వీసులను నడుపుతోంది.

బి. ఇండియన్ ఎయిర్ లైన్స్: ఇది దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య, దేశాన్ని ఆనుకొని ఉన్న చిన్న చిన్న పొరుగు దేశాలకు విమాన సర్వీసులను నిర్వహిస్తోంది. 2005 డిసెంబరు 8న ఇండియన్ ఎయిర్ లైన్స్ పేరును 'ఇండియన్'గా మార్చారు. దీని మస్కట్ 'కోణార్క్ సూర్య దేవాలయంలోని రథ చక్రం'.2007లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌ను, ఎయిర్ ఇండియాతో కలిపి ఏవియేషన్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. దీని మస్కట్ 'ఎగిరే హంసతో కూడిన కోణార్క్ చిత్రం'.

1990లో విమానయానంలో ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడానికి ఓపెన్ స్కై పాలసీని ప్రవేశపెట్టారు. దీంతో మొత్తం ఎనిమిది ప్యాసింజర్ ఎయిర్‌వేస్, రెండు కార్గో ఎయిర్ వేస్ ప్రారంభమయ్యాయి.

అవి:

1) జెట్ ఎయిర్‌వేస్
2) కింగ్‌ఫిషర్ ఎయిర్ లైన్స్
3) ఇండిగో ఎయిర్‌వేస్
4) స్పైస్‌జెట్
5) జెట్‌లైట్
6) గో ఎయిర్‌వేస్
7) పారామౌంట్ ఎయిర్ వేస్
8) దక్కన్ ఏవియేషన్

వీటితోపాటు దక్కన్ కార్గో ఎక్స్‌ప్రెస్ లాజిస్టిక్ ప్రైవేట్ లిమిటెడ్, బ్లూ డార్ట్ ఏవియేషన్ కార్గో ఎయిర్‌వేస్‌ను కూడా ప్రారంభించారు.

1981లో సరకు రవాణా, విమాన సేవలు లేని ఈశాన్య ప్రాంతాలకు విమాన సర్వీసులు కల్పించే ఉద్దేశంతో 'వాయుదూత్' సర్వీసులను ప్రారంభించారు. ఓఎన్‌జీసీ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలకు సహాయం అందించడానికి 1985లో 'పవన్‌హన్స్' లిమిటెడ్ లాంటి సంస్థలను ఏర్పాటు చేశారు.

యునెస్కో జాబితాలో చోటు దక్కించుకున్న భారతీయ రైల్వేలు

రైల్వే లైను	గుర్తించిన సంవత్సరం
డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే	(పశ్చిమ బెంగాల్) - 1999
ఛత్రపతి శివాజీ టెర్మినల్	(ముంబయి) - 2004
నీలగిరి పర్వత రైల్వే	(తమిళనాడు)- 2005
కల్క - సిమ్లా రైల్వే	(హిమాలయాలు) - 2008
మాతరన్ రైల్వే	(మహారాష్ట్ర) - 2014

మాదిరి ప్రశ్నలు

1. దక్షిణ భారతదేశంలో మెట్రోరైల్‌ను ప్రారంభించిన మొదటి రాష్ట్రం ఏది?
ఎ) కేరళ బి) తెలంగాణ
సి) తమిళనాడు డి) కర్ణాటక

2. ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్‌ను జాతీయం చేసిన సంవత్సరం?
ఎ) 1950 బి) 1951
సి) 1952 డి) 1953

3. ముంబయి – ఠానే (థానే) మధ్య మొదటి ప్రయాణీకుల రైలు సేవలను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1853 బి) 1874 సి) 1891 డి) 1847

4. భారతదేశంలో అత్యంత విలాసవంతమైన రైలు ఏది?
ఎ) విలేజ్ ఆన్ వీల్స్
బి) గోల్డెన్ చారియేట్
సి) రెడ్ రిబ్బన్ ఎక్స్‌ప్రెస్
డి) ప్యాలెస్ ఆన్ వీల్స్

5. ఎయిడ్స్‌పై చైతన్యం కలిగించడానికి ప్రారంభించిన రైలు ఏది?
ఎ) సైన్స్ ఎక్స్‌ప్రెస్
బి) రెడ్ రిబ్బన్ ఎక్స్‌ప్రెస్
సి) చేతక్ ఎక్స్‌ప్రెస్
డి) గోల్డెన్ చారియేట్

6. దేశంలో అత్యంత వేగంతో ప్రయాణించే రైలు ఏది?
ఎ) హిమసాగర్ బి) శతాబ్ది
సి) నవయుగ డి) పెరల్‌సిటీ

7. కిందివాటిలో యునెస్కో జాబితాలో చోటు సంపాదించని భారతీయ రైల్వే ఏది?
ఎ) డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే
బి) నీలగిరి పర్వత రైల్వే
సి) సిక్కిం రైల్వే
డి) కల్క – సిమ్లా రైల్వే

8. దేశంలో రైల్వే లైన్లు లేని రాష్ట్రాలు ఏవి?
ఎ) మేఘాలయ, త్రిపుర
బి) సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్
సి) మేఘాలయ, సిక్కిం
డి) నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్

9. కొంకణ్ రైల్వే నిర్మాణంలో భాగం కాని రాష్ట్రం ఏది?
ఎ) మహారాష్ట్ర బి) గోవా
సి) తమిళనాడు డి) కేరళ

10. పొడవైన రైలు మార్గాలున్న రాష్ట్రం ఏది?
ఎ) రాజస్థాన్ బి) ఉత్తరప్రదేశ్
సి) మధ్యప్రదేశ్ డి) గుజరాత్

11. దేశంలో అత్యధిక దూరం ప్రయాణించే రైలు ఏది?
ఎ) హిమసాగర్ బి) వివేక్
సి) జమ్ముతావి డి) గౌహతి

12. ప్రపంచంలో అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జిని ఏ నదిపై నిర్మిస్తున్నారు?
ఎ) జీలం బి) బియాస్
సి) చినాబ్ డి) సింధూ

13. దేశంలో మొదటిసారిగా రైల్వే బడ్జెట్‌ను ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టారు?
ఎ) 1921 బి) 1922
సి) 1923 డి) 1924

14. రోగులకు ఔషధాలు ఇవ్వడానికి ప్రారంభించిన ప్రత్యేక రైలు ఏది?
ఎ) సైన్స్ ఎక్స్‌ప్రెస్ బి) ధన్వంతరి
సి) చేతక్ డి) గరీబ్‌రథ్

15. భారత్‌లో ఎత్తైన విమానాశ్రయాన్ని ఎక్కడ నిర్మించారు?
ఎ) డార్జిలింగ్ బి) గిల్‌గిట్
సి) లే డి) సిమ్లా

16. కింద పేర్కొన్న వాటిలో భారతదేశంలో 'గ్రీన్ ఫీల్డ్' విమానాశ్రయం కానిది ఏది?
ఎ) కొచ్చిన్ విమానాశ్రయం
బి) రాజీవ్‌గాంధీ విమానాశ్రయం
సి) బెంగళూరు విమానాశ్రయం
డి) అమృత్‌సర్ విమానాశ్రయం

17. భారత ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ఇండియన్ ఎయిర్ లైన్స్‌ను ఎయిర్ ఇండియాతో విలీనం చేశారు. దీనికి పెట్టిన పేరేమిటి?
ఎ) ఇంటర్నేషనల్ ఏవియేషన్ కంపెనీ ఆఫ్ ఇండియా
బి) నేషనల్ ఏవియేషన్ కంపెనీ ఆఫ్ ఇండియా
సి) ఏవియేషన్ కంపెనీ ఆఫ్ ఇండియా
డి) ఏవియేషన్ హోల్డింగ్ కంపెనీ ఆఫ్ ఇండియా

18. సరకు రవాణా కోసం ప్రారంభించిన వాయు సర్వీసు ఏది?
ఎ) పవన్‌హన్స్ బి) వాయుదూత్
సి) జెట్ ఎయిర్‌వేస్
డి) ఇండియన్ ఎయిర్ లైన్స్

19. ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ ఎక్కడ ఉంది?
ఎ) ఢిల్లీ బి) ఝాన్సీ
సి) హాల్దియా డి) ఫుర్సత్‌గంజ్

20. కొంకణ్ రైల్వే ప్రాజెక్ట్‌ను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1998 బి) 1996
సి) 1997 డి) 1999

సమాధానాలు

1) డి; 2) డి; 3) ఎ; 4) డి; 5) బి; 6) బి; 7) సి; 8) సి; 9) సి; 10) బి; 11) బి; 12) సి; 13) డి; 14) బి; 15) సి; 16) డి; 17) సి; 18) బి; 19) డి; 20) బి.

Currency Notes are printed at?



1. Who is the Chairman of NABARD (National Bank for Agriculture and Rural Development)?
a) Shaji K V
b) Mrs V.R.Iyer c) HR Kamath
d) B Bhattacharya
e) R Rajendran

2. For recovery of NPA from the defaulted borrowers, SARFAESI Act 2002, is implemented. What does the letter 'S' stands for in SARFAESI
a) Social b) Security
c) Seasonal d) Stamp
e) Systematic

3. Bank holidays under Sec.25 of N.I. Act are declared by
a) RBI
b) State govt. for the respect state
c) Central govt.
d) LHO e) Prime Minister

4. One rupee coin issued under _____ Act
a) Coinage Act 1906
b) RBI c) BR
d) All the above
e) None of these

5. Clean Note policy has been introduced as per
a) Banking Regulation Act
b) RBI Act c) SBI Act
d) PNB Act e) None of these

6. Under prevention of Money laundering Act 2002, the financial transaction records have to be preserved for _____ years.
a) 5 b) 10 c) 20 d) 40
e) None of these

7. Under prevention of Money laundering Act 2002, banks have to report suspicious transaction to _____
a) RBI b) CBI c) FIU-IND
d) LHO e) Central Govt.

8. RBI Has relaxed KYC norms for small account holders who do not intend to make deposits over Rs.50,000/- and total credits in the account in a year is limited to Rs. 1 lakh. Total withdrawls/ Transfer in a month does not exceed Rs. _____
a) 10,000 b) 20,000
c) 50,000 d) 60,000
e) None of these

9. When form15-H has been received, the bank shall forward the same to I.T. Department on or before ____ day of next month.
a) 3rd b) 5th c) 7th
d) 15th e) 17th

10. In which of the following transaction PAN should be quoted?
a) A time deposit exceeding Rs.50,000
b) Payment in cash to purchase bank draft or banker's cheque for an amount aggregating Rs.50,000 or more during any one day
c) Deposit cash aggregating Rs. 50,000 or more during any one day
d) All the above e) None of these

11. Currency Notes are printed at:
a) Nasik b) Dewas c) Mysore
d) Salboni e) All of these

12. If the customer does not cooperate for making their accounts KYC compliant, despite repeated communication/contacts, their accounts should be _____.
a) Frozen b) Closed
c) Close the account only after compliance of KYC
d) a or c e) a & b

13. As per KYC Norms / AML measures risk categorization of all customer accounts should be done and review of risk categorization should be cared out at ____ months intervals every year.
a) 3 b) 6 c) 9
d) 12 e) 15

14. SLR has to be maintained by banks under _______
a) Sec. 24 of BR Act
b) Sec. 24 of RBI Act
c) Sec. 42 of RBI Act
d) Sec. 42 of BR Act
e) None of these

15. Who is the Chairman of IRDA?
a) Debasish Panda
b) Dr. Rangarajan c) M.V.Nair
d) J.S. Bhatnagar e) HR Khan

16. Who is the authority for referring appeals against the award of banking ombudsman?
a) Deputy Governor, RBI
b) RBI Governor
c) CMD of concerned bank
d) Group of CMDs formed by RBI
e) None of the above

17. The sponsoring bank's share in RBIs is:
a) 50% b) 35% c) 15%
d) 75% e) None of these

18. Can a HUF join as a partner in a partnership firm?
a) Can be included
b) Can be included with company
c) Cannot join
d) Can join subject to the approval of CMD
e) None of the above

19. Bank's Lien is:
a) General lien b) Particular lien
c) Contingent lien
d) b & c e) None of these

20. Within how many days the CPIO (Central Public Information Officer) has to provide information under RTI Act?
a) 30 days b) 15 days
c) 45 days d) 10 days
e) 60 hours

21. Which of the following is not a negotiable instrument as per N.I. Act?
a) Promissory note b) Draft
c) TDR (Term Deposit Receipt)
d) Cheque
e) None of the above

22. Which of the following is not correct in respect of issue of CP:
a) It can now be issued as a standalone facility
b) Minimum issue is Rs. 5 lakh
c) CPs can be underwritten by a bank
d) Minimum Tangible net worth of the Corporate should be Rs. 4 crore
e) All the above

23. The maximum period for which a CD can be issued is _____
a) 1 month b) 3 months
c) 180 days d) 1 year
e) None of these

24. What is not true about CDs?
a) It is transferable from the data issues
b) It can be issued for a minimum period of 7 days
c) It is not all transferable
d) It can be issued in demat form only
e) None of these

25. Gilt edged securities refer to ____
a) Govt. securities
b) Shares of first class companies
c) Securities issued by first class companies
d) Duplicate securities
e) Securities issued by RBI Identified Companies

26. The standard rate at which the RBI is prepared to buy or rediscount export bills or other commercial paper eligible for purchase from banks under the RBI Act is known as _____
a) Bank rate b) Repo Rate
c) Card rate d) PLR
e) Base Rate

27. The result of increase in SLR by RBI is
a) Decrease in lendable resources of banks
b) Increase in loadable resources of banks
c) There will not be any change in loan able resources of banks
d) Only b and c
e) None of these

28. Blue chip securities mean ____
a) Shares of progressive, well managed companies with excellent record of payment of dividends.
b) The shares which are in blue ink
c) Securities issued by Chip Manufacturing companies
d) Securities identified by the concerned state governments
e) None of the above

29. Cash kept in the currency chest is owned by
a) Currency Chest Branch Bank
b) Central Government
c) Reserve Bank of India
d) State Bank of India
e) None of the above

30. Bank can't proceed against the borrower under SARFAESI Act where:
a) Security is agricultural land
b) Liability is less than Rs.1 lakh
c) Liability is less than 20% of the principal
d) Pledge of movables
e) All the above

31. The minimum capital required to start a new private sector bank is_________
a) 100 crore b) 200 crore
c) 300 crore d) 400 crore
e) 500 crore

32. RBI injects liquidity through
a) Increase Bank Rate
b) Reduction of Repo Rate
c) Reduction of Reverse Repo
d) Increase CRR
e) Increase SLR

33. A customer requested to include his wife and daughter as nominees after one year of opening of the account. Will it be accepted?
a) It can be accepted since the nominees are the family members of the depositor
b) Cannot be considered since the request is not received at the time of opening of account
c) Can be considered with 50% share each
d) Nomination should be made only in favor of single name. Hence can't be considered
e) None of the above

KEY

1) a; 2) b; 3) b; 4) a; 5) a; 6) b; 7) c; 8) a; 9) c; 10) d; 11) e; 12) b; 13) b; 14) a; 15) a; 16) a; 17) b; 18) c; 19) a; 20) a; 21) c; 22) c; 23) d; 24) e; 25) a; 26) a; 27) a; 28) a; 29) c; 30) e; 31) e; 32) b; 33) d.